సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 310

శనివారం 31-1-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'

'ఎలిమినేటర్'కు గుజరాత్

ముంబై ఇండియన్స్‌ను 11 పరుగులతో ఓడించి జెయింట్స్ ముందంజ - 15లో

మెటల్స్ క్రాష్

స్పాట్ మార్కెట్లో రూ.20 వేలు పతనమైన వెండి.. రూ 14,000 తగ్గిన గోల్డ్ -15లో



గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

జీవీఎంసీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విశాఖ పరువును మంట గలుపుతూ తమ కుటుంబానికి చెందిన సంస్థకు భూములను కట్టబెట్టేందుకు సాక్షాత్తు కౌన్సిల్ హాలులోనే కార్పొరేటర్లపై దాడికి దిగే స్థాయికి చంద్రబాబు ప్రభుత్వం దిగజారిపోయింది. 'గీతం' సంస్థ కబ్జా చేసిన ఎండాడలోని రూ.5 వేల కోట్ల విలువైన 54.79 ఎకరాల భూమి కౌన్సిల్ హాలులో చిందిన కార్పొరేటర్ల రక్తం సాక్షిగా చంద్రబాబు కుటుంబం వశమైపోయింది.

జీవీఎంసీలో రౌడీ రాజ్యం

కబ్జాకు పచ్చ జెండా

కనీస చర్చ లేకుండానే 'గీతం' కబ్జా భూముల క్రమబద్ధీకరణకు ఆమోదం

విశాఖ నడిబొడ్డున రూ.5 వేల కోట్ల విలువైన భూమిని తన బంధువుకు కట్టబెట్టేందుకు చంద్రబాబు బరితెగింపు

రెచ్చిపోయిన కూటమి పార్టీల కార్పొరేటర్లు

- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లపై దాడి.. పలువురికి తీవ్ర గాయాలు
- వెళ్లిపోండంటూ బెదిరింపులు.. మెడపట్టి తోసివేతలు
- మహిళా కార్పొరేటర్లపైనా రెచ్చిపోయిన పచ్చ మూకలు
- సీపీఎం, సీపీఐ సభ్యులపైనా దౌర్జన్యం
- నేరుగా దాడికి తెగబడ్డ మేయర్, కూటమి కార్పొరేటర్లు
- మీడియాకు నో ఎంట్రీ.. నిబంధనలకు విరుద్ధంగా పోలీసుల రంగ ప్రవేశం
- తానే అజెండా అంశాలను చదివి ఆమోదించినట్టు మేయర్ ప్రకటన
- విశాఖ నగర పాలక సంస్థ సమావేశంలో నిబంధనలకు చరమ 'గీతం'
- చివరి కౌన్సిల్ భేటీలో లోకేశ్ తోడల్లుడు, ఎంపీ భరత్‌కు భూముల పందేరం
- రూ.5 వేల కోట్ల విలువైన 54.79 ఎకరాల కబ్జా భూమి గీతం పరం

పోలీస్ పహారాను దాటుకొని జీవీఎంసీలోకి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు

3లో

విశాఖ భూ దోపిడీపై వైఎస్సార్‌సీపీ పోరాటం

- బంధువుకు భూ దోపిడీని అడ్డుకునే ప్రతి కార్యక్రమం చేస్తాం
- నిబంధనలకు విరుద్ధంగా తీర్మానం చేస్తే చెల్లదు
- గాంధీ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ దీక్ష.. హాజరైన మండలి విపక్ష నేత బొత్స, రీజినల్ కో-ఆర్డినేటర్ కన్నబాబు

3లో

చంద్రబాబుదే మహాపాపం..

రాజకీయ పాతకం!

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై విషం చిమ్మిన చంద్రబాబు

జంతు కొవ్వు కుట్ర బెడిసికొట్టడం.. దేశవ్యాప్తంగా బాబు క్షమాపణలు చెప్పాలని వెల్లువెత్తుతున్న డిమాండ్లతో సరికొత్త కుతంత్రం

శ్రీవారి ఆలయ పవిత్రతకు భంగం కలిగించేందుకు పక్కా పన్నాగం

సీఎం హోదాలో దుష్ప్రచార కుట్రకు బాబు నేతృత్వం



- టీటీడీ ప్రధాన కార్యాలయం కేంద్రంగానే కుట్రరచన...అమలు.. ఆ పాపపు పనిలో పవన్‌కళ్యాణ్ కూడా పాత్రధారే
- లడ్డూ ప్రసాదానికి కళంకం తీసుకు వచ్చేందుకు 'ప్రాయశ్చిత్తం' హైడ్రామా
- ఆ కుతంత్రానికి ఎల్లో మీడియా వత్తాసు
- చంద్రబాబు దుష్ప్రచార కుట్రను ఇప్పటికే తిప్పికొట్టిన ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్ఐ..
- లడ్డూ ప్రసాదం నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదని నిర్ధారణ
- తాజాగా చార్జిషీట్‌లో అదే విషయాన్ని స్పష్టం చేసిన సీబీఐ.. కుట్రలు పారకపోవడంతో ఇతర అంశాలను వక్రీకరిస్తూ చంద్రబాబు బృందం తాజా పన్నాగం
- చిన్నఅప్పన్న వైవీ సుబ్బారెడ్డి పీఏ అంటూ వక్రీకరణ.. ఆయన టీడీపీ ఎంపీ వేమిరెడ్డి పీఏగా పని చేశారు
- ఆనాటి టీటీడీ కొనుగోలు కమిటీ సభ్యులు.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో మంత్రి, ఎమ్మెల్యేలే.. భోలే బాబా డెయిరీని తెచ్చింది చంద్రబాబు ప్రభుత్వమే
- 2018లోనే నిబంధనలకు విరుద్ధంగా నెయ్యి కాంట్రాక్టు.. చార్జిషీట్‌లో పేర్కొన్న సీబీఐ
- నెయ్యి కొనుగోలుకు టీటీడీలో దశాబ్దాలుగా పటిష్ట వ్యవస్థ
- అయినా దుష్ప్రచారానికి చంద్రబాబు ముఠా బరితెగింపు.. శ్రీవారి సొమ్ములు దుర్వినియోగం చరిత్ర బాబుదే..!
- తిరుపతిలో ఫ్లైఓవర్ నిర్మాణం నుంచి ప్రైవేట్ బ్యాంకులో శ్రీవారి సొమ్ములు డిపాజిట్ దాకా అదే తీరు

5లో

న్యూస్‌రీల్

గ్రూప్-1 ఫలితాలు విడుదల

13లో

గ్రూప్-1 ఫలితాలు విడుదలయ్యాయి. 89 పోస్టులకు పరీక్షలు జరగ్గా.. 87 పోస్టుల తుది ఫలితాలను సర్వీస్ కమిషన్ వెల్లడించింది. హైకోర్టు ఆదేశాల మేరకు 2 పోస్టుల ఫలితాలను పెండింగ్‌లో పెట్టింది.

మాజీ మంత్రి రజినిపై దాడికి యత్నం

10లో

తిరుమల లడ్డూపై అసత్య ప్రచారం చేస్తున్న కూటమి నేతలకు మంచి బుద్ధిని ప్రసాదించాలని బోయపాలెం వెంకన్న సన్నిధిలో పూజలు నిర్వహించిన మాజీ మంత్రి రజినిపై టీడీపీ మూకలు దాడికి యత్నించాయి.

అప్పుల బాబు బరితెగింపు..

వర్సిటీల నిధులు దారి మళ్లించేందుకు చంద్రబాబు స్కెచ్

తొలి విడతలో రూ.1,200 కోట్లు లాక్కునేందుకు టార్గెట్

- బ్యాంకుల్లోని డిపాజిట్లు రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్‌కు బదిలీ చేసేలా తీవ్ర ఒత్తిడి
- సీఎంవో, విద్యా శాఖ అధికారుల తిట్లదండకంతో హడలిపోతున్న ఉన్నత విద్యామండలి, వర్సిటీ వర్గాలు.. ఒత్తిడి భరించలేక చాలా వర్సిటీల నుంచి నిధుల బదిలీ ప్రారంభం
- ఇప్పటికే రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేసిన చంద్రబాబు.. 20 నెలల్లో రూ.3.11 లక్షల కోట్లు అప్పు చేసినా రాష్ట్రాన్ని నడపలేని దుస్థితి
- ఈ పరిస్థితుల్లో వర్సిటీల నిధులు మళ్లీ వెనక్కు ఇచ్చే పరిస్థితి లేదంటున్న విద్యావేత్తలు
- రూ.7,800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులే చెల్లించని బాబు సర్కార్
- వర్సిటీలకు నిధులివ్వకపోగా వాటి డబ్బులే పక్కదారి పట్టిస్తున్న ప్రభుత్వం

10లో

ఏ యాక్షన్ తీసుకోకపోతే జనమే మనవాళ్ల బట్టలిప్పేట్టున్నార్సార్!!

అజెండాపై తకరారు!

- పోలవరం–బనకచర్ల లింక్ ప్రాజెక్టును అజెండాలో చేర్చాలన్న ఏపీ
- ఈ లింక్ ప్రాజెక్టు వల్ల తమ ప్రయోజనాలు దెబ్బతింటాయన్న తెలంగాణ.. శ్రీశైలం, సాగర్‌లలో చెరిసగం వాటాకు నో చెప్పిన ఏపీ
- అజెండా అంశాలను వారంలోగా ఇవ్వాలని సీడబ్ల్యూసీ చైర్మన్ ఆదేశం
- 14 రోజుల్లో తదుపరి సమావేశం నిర్వహిస్తామని వెల్లడి

3లో

ఇలా ఉన్నాం.. ఇలా చేయాలి

ఆర్థిక సర్వే అంటే అంకెల విశ్వరూపం మాత్రమే కాదు. 'ఫలానా విషయంలో మనం ఇలా ఉన్నాం.. ఒకప్పుడు అలా ఉన్నాం' అని గత, వర్తమానాలను కలుపుతూ విశ్లేషిస్తుంది. డిజిటల్ వ్యసనం నుంచి ఊబకాయ సమస్య వరకు, స్క్రీన్ టైమ్ నుంచి మహిళా శ్రామిక శక్తి వరకు ఎన్నో అంశాలను విశ్లేషించి సూచనలిచ్చింది కేంద్ర ఆర్థిక సర్వే.

14లో

KISNA
DIAMOND & GOLD JEWELLERY
BY HARI KRISHNA GROUP
ఆనందపు ప్రతి క్షణానికి KISNA
UP TO ₹5000 తగ్గింపు 5 గ్రాముకు
డైమండ్ & బంగారు ఆభరణాల తయారీ ఛార్జీలపై*
UP TO ₹1000 తగ్గింపు గ్రాముకు
డైమండ్ & బంగారు ఆభరణాల తయారీ ఛార్జీలపై*
డైమండ్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో గ్లోబల్ లీడర్ నుండి
90%* బైబ్యాక్ | 95%* ఎక్స్చేంజ్
వజ్రాల నగలపై తయారీ ఛార్జీలతో సహా
మా ప్రస్తుత ప్రత్యేక షోరూమ్‌లు: తెలంగాణ, హైదరాబాద్ - శరత్ సిటీ మాల్ | ఇనార్బిట్ మాల్ – సైబరాబాద్ | సోమాజిగూడ | ఎ. ఎస్. రావు నగర్ | కూకట్‌పల్లి | కరీంనగర్
ఆంధ్రప్రదేశ్ - విజయవాడ | విశాఖపట్నం - గాజువాక, సంపత్ వినాయక దేవాలయం ఎదురుగా | శ్రీకాకుళం
రాబోయే షోరూమ్‌లు: తెలంగాణ, హైదరాబాద్ - హిమాయత్‌నగర్ | చందా నగర్ | ఆంధ్రప్రదేశ్ – గుంటూరు | విశాఖపట్నం – ఇనార్బిట్ మాల్ | మధురవాడ
ICICI Bank | 5% Instant Discount*
KISNA ఇప్పుడు భారతదేశం అంతటా 130 ప్రత్యేక షోరూమ్‌లు మరియు 1,500 కంటే ఎక్కువ షాప్-ఇన్-షాప్ అవుట్‌లెట్‌లలో అందుబాటులో ఉంది | www.kisna.com
SCAN HERE

క్లుప్తంగా...

సత్యం ఎప్పటికీ ఓడదు

మహాత్మా గాంధీకి వైఎస్ జగన్ నివాళులు

సాక్షి, అమరావతి: జాతిపిత మహాత్మా గాంధీకి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. 'సత్యం తాత్కాలికంగా ఓడినట్టుగా కనిపించవచ్చు.. కానీ ఎప్పటికీ ఓడదు.. అని చెప్పడమే కాక, తన చివరి శ్వాస వరకు సత్యానికే అంకితమై జీవితాన్ని గడిపిన మహనీయుడు మహాత్మా గాంధీ. నేడు జాతిపిత వర్ధంతి సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా నివాళులు' అంటూ శుక్రవారం వైఎస్ జగన్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

తప్పుడు కేసులపై ఆందోళనొద్దు

- చట్టపరంగా ఎదుర్కొందాం
- మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డికి వైఎస్ జగన్ భరోసా

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని నివాసంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కలిశారు. అన్యాయంగా ఇరికించిన మద్యం అక్రమ కేసులో సుదీర్ఘ కాలం పాటు రిమాండ్‌లో ఉన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గురువారం బెయిల్ పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్ జగన్‌ను కలిసి తనపై టీడీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు, తన కుమారులను, కుటుంబ సభ్యులను కేసులతో వేధిస్తున్న తీరును వివరించారు. తప్పుడు కేసులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చట్టపరంగా ఎదుర్కొందామని ఆయనకు వైఎస్ జగన్ భరోసానిచ్చారు. ప్రజల పక్షాన, ప్రజల తరఫున చేస్తున్న పోరాటంలో ఎదురయ్యే ఆటంకాలు, వేధింపులను దీటుగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలుద్దామని, పార్టీ నాయకులు, క్యాడర్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు ఆయన కుమారులు మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డి కూడా జగన్‌ను కలిశారు.

మళ్లీ రూ.3,300 కోట్ల అప్పు

సాక్షి, అమరావతి: అప్పులు చేయడంలో చంద్రబాబు సర్కారు దూసుకుపోతోంది. వచ్చే మంగళవారం బాబు సర్కారు మళ్లీ రూ.3,300 కోట్లు అప్పు చేయనుంది. భారతీయ రిజర్వు బ్యాంక్ రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలను వేలం వేయడం ద్వారా ఈ అప్పును సమీకరించి చంద్రబాబు సర్కారుకు ఇవ్వనుంది. ఈ మేరకు ఆర్‌బీఐ శుక్రవారం నోటిఫై చేసింది. ఈ నెల 27వ తేదీ గత మంగళవారం నాడే చంద్రబాబు సర్కారు రూ.2,500 కోట్లు అప్పు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 6న మరో రూ.6,500 కోట్లు అప్పు చేసింది. వచ్చే మంగళవారం చేసే అప్పుతో నెల వ్యవధిలోనే బాబు సర్కారు ఏకంగా రూ.12,300 కోట్లు అప్పు చేసినట్లు అవుతుంది.

11 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

సాక్షి, అమరావతి: 2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 11 నుంచి జరగనున్నాయి. 11న ఉదయం 10 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగంతో సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై బిజినెస్ అడ్వైజరీ కమిటీలో నిర్ణయం తీసుకుంటారు.

3న కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఫిబ్రవరి 3న ఉదయం 10.30 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది.ఈ మేరకు సీఎస్ కె.విజయానంద్ అన్ని శాఖలకు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

జీవీఎంసీలో రౌడీ రాజ్యం..

కబ్జాకు పచ్చ జెండా

కనీస చర్చ లేకుండానే 'గీతం' కబ్జా భూముల క్రమబద్ధీకరణకు ఆమోదం

విశాఖ నడిబొడ్డున రూ.5 వేల కోట్ల విలువైన భూమిని తన బంధువుకు కట్టబెట్టేందుకు చంద్రబాబు బరితెగింపు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: తెలుగుదేశం పార్టీ విశాఖపట్నం ఎంపీ, బాలకృష్ణ అల్లుడు, లోకేశ్ తోడల్లుడు భరత్‌కు చెందిన గీతం విద్యా సంస్థ విశాఖ నడిబొడ్డున కబ్జా చేసిన రూ.5 వేల కోట్ల విలువ చేసే 54.79 ఎకరాల భూములను క్రమబద్ధీకరించుకునేందుకు చంద్రబాబు ప్రభుత్వం అన్ని విధాలుగా బరితెగించింది. ఆ భూములను తమ కుటుంబపరం చేసుకునే తీర్మానం చేయించుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసులను కౌన్సిల్ హాలులోకి పిలిపించింది. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లపై దాడులకు దిగి పక్కా రౌడీ ప్రభుత్వంలా వ్యవహరించింది. సమావేశం వివరాలు బయటకు పొక్కకుండా ఉండేందుకు మీడియాపై నిషేధం విధించింది. ఇలా అన్ని విధాలుగా బరి తెగింపు చర్యలకు పూనుకుంది. చివరకు అజెండాలోని అంశాలను సెక్రటరీ విభాగానికి చెందిన అధికారులు కాకుండా స్వయంగా మేయర్ చదివి మరీ అన్నీ ఆమోదించినట్టు ప్రకటించేశారు. సమావేశం ప్రారంభం నుంచి ప్రభుత్వ భూములను కబ్జాదారులపరం చేయవద్దంటూ.. విలువైన ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టకూడదంటూ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో పాటు కమ్యూనిస్టు పార్టీలకు చెందిన కార్పొరేటర్లు శాంతియుతంగా నిరసనకు దిగారు. మేయర్ పోడియాన్ని చుట్టుముట్టి, నేలపై పడుకుని మరీ నిరసన తెలిపారు. ఎలాగైనా సరే తమ కుటుంబ సంస్థ కబ్జా చేసిన భూములను కైవశం చేసుకోవాలన్న కుట్రతో చంద్రబాబు ప్రభుత్వం గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పాలకవర్గ గడువు నెలలో ముగియనున్న నేపథ్యంలో శుక్రవారం చివరి సమావేశం ఏర్పాటు చేసింది. ప్రతిపక్షం గొంతు నొక్కి మరీ తను అనుకున్నది సాధించుకుంది. ఈ క్రమంలో 'ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించకూడదు.. కబ్జా చేసిన భూమిని దోచి పెడతారా?' అంటూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లపై విచక్షణా రహితంగా అధికార కూటమి పార్టీల కార్పొరేటర్లు దాడులకు దిగారు. కొందరిని మెడ పట్టుకుని నులిమారు. మరికొందరి ఛాతీపై బలంగా కొట్టారు. మహిళా కార్పొరేటర్లు అని కూడా చూడకుండా తోసివేశారు. ఇలా అన్ని విధాలుగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి మరీ అన్ని అంశాలకు ఆమోద ముద్ర వేసినట్టు ప్రకటించి సమావేశాన్ని అర్ధంతరంగా ముగించేశారు.

పోడియం వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్‌ను నెట్టివేస్తున్న మేయర్, కూటమి కార్పొరేటర్లు

> 'ఏయ్.. ఏం మాట్లాడుతున్నారు.. నోరు మూసుకుని బయటకు వెళ్లిపోండి.. లేదంటే ఇబ్బంది పడతారు..' అంటూ అధికార కూటమి పార్టీల కార్పొరేటర్లు బరితెగించి బెదిరింపులు.. మెడ పట్టుకుని తోసేయడాలు.. స్వయానా మేయర్ రౌడీ అవతారం ఎత్తి దౌర్జన్యం చేయడం.. ఆయనే అజెండాలోని అంశాలు చదివి.. ఆయనే ఆమోదించడం.. అందరూ ఆమోదించారని ఏకపక్షంగా ప్రకటించడం.. మొత్తంగా జీవీఎంసీలో నిబంధనలకు చరమ 'గీతం' పాడటం విస్తుగొలుపుతోంది.

రౌడీలా ప్రవర్తించిన మేయర్!

ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు ఎలా కట్టబెడతారని, కబ్జా చేసిన వారికే భూమిని అప్పగిస్తారా.. అంటూ న్యాయమైన డిమాండుతో కౌన్సిల్ సమావేశంలో నిలదీసేందుకు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో పాటు సీపీఎం, సీపీఐ కార్పొరేటర్లు కూడా నిరసనకు దిగారు. మేయర్ పోడియాన్ని చుట్టుముట్టి నినాదాలు చేశారు. కింద బైఠాయించి నిరసనకు దిగారు. ఈ సమయంలో అజెండా నుంచి గీతం భూ కబ్జాలను సక్రమం చేసేలా పొందుపరిచిన 15వ అంశాన్ని తొలగించాలంటూ మేయర్‌కు వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడరు బాణాల శ్రీనివాసు విన్నవించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో మేయర్ రెచ్చిపోయి రౌడీలా ప్రవర్తించారు. రెండు చేతులతో బలంగా శ్రీనివాసు ఛాతీని నెట్టారు. సభను హుందాగా నడపాల్సిన మేయర్ స్థానంలో ఉన్న వ్యక్తి పక్కా రౌడీలా ప్రవర్తించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మహిళా కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి కిందపడిపోయారు. మేయర్ కనుసైగతో మిగిలిన కూటమి కార్పొరేటర్లు కూడా వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లపై దాడులకు దిగారు. ఇష్టారీతిలో తోసివేయడంతో పలువురి కాళ్లకు, మోచేతులకు గాయాలయ్యాయి. ముందుగానే పక్కా ప్లాన్‌తో మీడియాను అనుమతించకుండా రౌడీయిజంతో అన్ని అంశాలను ఆమోదించినట్లు ప్రకటించుకున్నారు.

పక్కా ప్లానింగ్‌తో దౌర్జన్యం

వాస్తవానికి అజెండాలో పొందు పరిచిన గీతం భూ కబ్జాలను క్రమబద్ధీకరించే అంశాన్ని తొలగించాలంటూ ఇప్పటికే వైఎస్సార్‌సీపీతో పాటు కమ్యూనిస్టు పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వ భూములను కబ్జాలో ఉన్న వ్యక్తికే ఎలా కట్టబెడతారని నిలదీస్తున్నాయి. సమావేశంలో ఈ అంశంపై నిలదీయాలని ఆ పార్టీలు నిర్ణయించుకున్నాయి. ఈ నేపథ్యంలో పక్కా ప్లానింగ్‌తో అధికార పార్టీ సిద్ధమైంది. ప్రత్యేకంగా తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెందిన కుటుంబ సభ్యుల వ్యవహారం కావడంతో రౌడీయిజం చేసి, మరీ ఈ అంశాన్ని ఆమోదించేందుకు సిద్ధమైంది. రౌడీయిజం బయటకు పొక్కకుండా ఉండేందుకు మీడియాను అనుమతించకూడదని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూ లేని విధంగా కౌన్సిల్ సమావేశానికి మీడియాకు అనుమతి లేదంటూ శుక్రవారం ఉదయం సమావేశం ప్రారంభమయ్యే ముందుగా జీవీఎంసీ ప్రకటన జారీ చేసింది. దీనిపై మీడియా ప్రతినిధులు మేయర్‌తో మాట్లాడటానికి ప్రయత్నిస్తుండగా, వెలగపూడి తన మార్క్ రౌడీయిజాన్ని ప్రదర్శించారు. ఎవ్వడికీ అనుమతించేది లేదంటూ దురుసుగా మాట్లాడారు.

నిబంధనలకు విరుద్ధంగా పోలీసుల ప్రవేశం

జీవీఎంసీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నేరుగా కౌన్సిల్ హాలులోకి పోలీసులు రంగ ప్రవేశం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కౌన్సిల్ సమావేశం నుంచి ఎవరినైనా బయటకు పంపేందుకు మేయర్ నిర్ణయిస్తే, మార్షల్స్ ద్వారా వారిని సమావేశం హాలు నుంచి బయటకు పంపడం ఆనవాయితీ. అసెంబ్లీ, మండలి సమావేశాల తరహాలోనే మార్షల్స్‌కు మాత్రమే హాలులోకి అనుమతి ఉంటుంది. ఎట్టిపరిస్థితుల్లోనూ పోలీసులను హాలులోకి అనుమతించకూడదు. అయితే, గీతం భూముల వ్యవహారం కావడంతో నేరుగా పోలీసులు రంగ ప్రవేశం చేయడం గమనార్హం. సమావేశంలో గందరగోళం ఏర్పడిన తరుణంలో మేయర్ రెండు దఫాలు తన రూంలోకి వెళ్లి.. టీడీపీ పెద్దలతో చర్చించినట్టు తెలుస్తోంది. అనంతరం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ స్వయంగా మార్షల్స్‌కు బదులుగా పోలీసులను కౌన్సిల్ సమావేశంలోకి పిలిచారు. ఇందుకు మేయర్ అనుమతివ్వడం నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని పలువురు కార్పొరేటర్లు మండిపడుతున్నారు. జీవీఎంసీ చరిత్రలో ఇదో చీకటి అధ్యాయంగా మిగిలిపోనుంది. సాధారణంగా సెక్రటరీ విభాగానికి చెందిన ఒక ఉద్యోగి.. అజెండాలోని అంశాలను వరుస సంఖ్యలో చదివి వినిపిస్తారు. కానీ, ఇందుకు భిన్నంగా అజెండాలోని అంశాలను తానే స్వయంగా చదవడంతో పాటు వెంటనే ఆమోదించినట్టు కూడా మేయర్ ప్రకటించారు. ఆ సమయంలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు వెలగపూడి, పల్లా, మరికొందరు కార్పొరేటర్లు అక్కడ లేకపోయినా ఆమోదించడం గమనార్హం.

మెడ పట్టుకుని తోసేస్తూ కార్పొరేటర్లపై దాడులు

గీతం కబ్జా భూముల క్రమబద్ధీకరణ విషయంలో అధికార టీడీపీ పూర్తి స్థాయిలో రౌడీయిజానికి దిగింది. కార్పొరేటర్లపై దాడులు చేయడంతో పాటు ఏకంగా గొంతు పట్టుకుని బెదిరింపులకు దిగింది. వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావును స్వయంగా మేయర్.. మెడ పట్టుకుని తోసివేశారు. అధికార పార్టీ కార్పొరేటర్లు చేసిన దాడిలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ బల్లా లక్ష్మణ రావు కాలికి గాయాలయ్యాయి. డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్‌పై టీడీపీ కార్పొరేటర్ గంధం శ్రీనివాస్ దౌర్జన్యానికి దిగారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు రేయి వెంకటరమణ, చెన్నా జానకీరామ్, సాడి పద్మారెడ్డి, పీవీ సురేష్, కోరుకొండ స్వాతిదాస్‌లపై కూడా టీడీపీ, జనసేన కార్పొరేటర్లు దాడులకు దిగారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్ మెడను కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు గట్టిగా పట్టేసుకున్నాడు. వైఎస్సార్‌సీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడరు అల్లు శంకర్‌రావు మోచేతికి బలంగా గాయాలయ్యాయి.

విశాఖ భూ దోపిడీపై వైఎస్సార్‌సీపీ పోరాటం

- బంధువుకు భూదోపిడీని అడ్డుకునే ప్రతి కార్యక్రమం చేస్తాం
- ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచిన చంద్రబాబు ప్రభుత్వం
- గీతం భూకబ్జా, కౌన్సిల్‌లో చంద్రబాబు ప్రభుత్వ తీరును వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్తాం
- భూదోపిడీపై వైఎస్ జగన్ నేతృత్వంలో పోరాటానికి భవిష్యత్తు కార్యాచరణ
- జీవీఎంసీ ఎదుట గాంధీ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ శాంతియుత దీక్ష
- హాజరైన శాసనమండలి విపక్ష నేత బొత్స, రీజినల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు

వైఎస్సార్‌సీపీ నిరసనదీక్షలో మాట్లాడుతున్న శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ
చిత్రంలో కురసాల కన్నబాబు, కేకే రాజు, గుడివాడ అమర్‌నాథ్ తదితర వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, విశాఖపట్నం: గీతం విద్యాసంస్థల భూ దోపిడీపై వైఎస్సార్‌సీపీ పోరాటం ఆగదని, బంధువుకు భూదోపిడీని అడ్డుకునే ప్రతి కార్యక్రమం చేస్తామని, భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణపై మరోసారి తమ అధినేత వైఎస్ జగన్‌తో చర్చిస్తామని శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు చెప్పారు. శుక్రవారం గీతం వర్సిటీ ఆక్రమించిన ప్రభుత్వ భూమిని వర్సిటీకే కేటాయించడాన్ని నిరసిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నిరసన దీక్ష చేపట్టింది. పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆధ్వర్యంలో శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంబా రవిబాబు, కార్పొరేటర్లు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన దీక్షను ప్రారంభించారు. అనంతరం గాంధీజీ విగ్రహం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు ర్యాలీగా కౌన్సిల్ సమావేశానికి వెళ్లారు. జీవీఎంసీలో కౌన్సిల్ సమావేశం జరుగుతుండగానే.. జీవీఎంసీ ఎదుట గాంధీ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నేతలు శాంతియుత నిరసన దీక్ష చేశారు. కౌన్సిల్ సమావేశం పూర్తయిన తరువాత శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ, నాయకులు మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్ గణేష్, కంబాల జోగులు, తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకటరామయ్య, నియోజకవర్గ సమన్వయకర్తలు మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పి.రవీంద్రబాబు, జడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, మళ్ల విజయప్రసాద్, తిప్పల దేవన్‌రెడ్డి, మొల్లి అప్పారావు, మలసాల భరత్, మాజీ మేయర్ హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్ కె.సతీష్, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ చరిత్రలో ఇది ఒక బ్లాక్ డే: బొత్స

జీవీఎంసీ చరిత్రలో ఈ రోజు ఒక బ్లాక్ డేగా నిలిచిపోతుంది. అధికార మదంతో కూటమి కార్పొరేటర్లు రౌడీల్లా వ్యవహరించారు. మా పార్టీ కార్పొరేటర్లపై దాడి చేశారు. డిప్యూటీ మేయర్ సతీష్, ఫ్లోర్‌లీడర్ శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శంకర్‌రావు, పలువురు కార్పొరేటర్లకు గాయాలయ్యాయి. మేయర్ ఒక్కరే వేలంపాట లాగా చదివేస్తే అయిపోతుందా? చర్చ లేకుండా.. ఆమోదం లేకుండా ఏ నిర్ణయం చెల్లదు. చంద్రబాబు కుటుంబం దోచుకుంటున్న రూ.ఐదు వేల కోట్ల భూదోపిడీ చరిత్రలోనే ఎప్పుడూ జరగనిది. దీనిపై పోరాటం చేస్తాం. మా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మరోసారి తీసుకెళ్లి.. భవిష్యత్తు కార్యాచరణపై చర్చిస్తాం. మా కార్పొరేటర్ల రాజీలేని పోరాటాన్ని అభినందిస్తున్నా.

బాబు, లోకేశ్ సొంత ఆస్తులేమీ కాదు: కన్నబాబు

గీతం విద్యాసంస్థలకు రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు ధారాదత్తం చేయడానికి బాబు, లోకేశ్ సొంత ఆస్తులేమీ కాదు. గీతంకు కట్టబెట్టే 54.79 ఎకరాల భూమిని వేలం వేస్తే 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను నిర్మించవచ్చు. రూ.5 వేల కోట్ల భూములపై వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తోంది. కౌన్సిల్‌లో కూటమి గూండాయిజాన్ని ఖండిస్తున్నాం.

మహిళా కార్పొరేటర్లపై దాడి: కేకే రాజు

కౌన్సిల్‌లో కూటమి కార్పొరేటర్లు పాశవికంగా వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ మహిళా కార్పొరేటర్లపై భౌతికంగా దాడి చేశారు. టీడీపీ మేయర్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని కౌన్సిల్‌లో కూడా అమలు చేస్తున్నారు.

సూట్‌కేస్ కంపెనీలకు ధారాదత్తం: అమర్‌నాథ్

కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి విశాఖలోని విలువైన భూములను సూట్‌కేస్ కంపెనీలకు ధారాదత్తం చేస్తోంది. ఇప్పుడు నేరుగా చంద్రబాబు కుటుంబానికి చెందిన గీతం యూనివర్సిటీకి రూ.5 వేల కోట్ల విలువైన 54.79 ఎకరాల భూములు కట్టబెడుతున్నారు.

'గీతం'కు జీ హుజూర్‌పై జనాగ్రహం

ప్రభుత్వ భూములు దొడ్డి దారిన రెగ్యులరైజేషన్‌పై మండిపాటు!

తక్షణమే 54.79 ఎకరాలు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్

దోపిడీని అడ్డుకుంటామంటున్న వామపక్ష, ప్రజాసంఘాలు

విశాఖ సిటీ, డాబా గార్డెన్స్: ప్రభుత్వ భూములు కబ్జా చేసిన గీతం యాజమాన్యంపై కేసులు నమోదు చేయాల్సిన చంద్రబాబు ప్రభుత్వం.. దొడ్డి దారిన అప్పగించడానికి జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని వేదిక చేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ భూముల్లో పేదలు గుడిసెలు వేసుకుంటే వారిపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు పెడుతున్న అధికారులు.. విశాఖ ఎంపీ శ్రీభరత్ 20 ఏళ్లుగా 54.79 ఎకరాలు ఆక్రమించి అనుభవించినా ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ భూములను ఇలా దొడ్డి దారిన కట్టబెట్టడడం సమంజసమా చంద్రబాబూ అని నిలదీస్తున్నారు. తక్షణమే ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజోపయోగానికి వినియోగించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాస్వామ్యంలో చీకటి రోజు

గీతం ఆక్రమించిన భూములను రెగ్యులరైజ్ చేసేందుకు జీవీఎంసీ కౌన్సిల్ అజెండాలో చేర్చి.. సమావేశ మందిరానికి గడియలు పెట్టి ఆమోదించడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజుగా ప్రతిపక్ష, వామపక్ష సభ్యులు అభివర్ణిస్తున్నారు. ప్రభుత్వ భూములను గీతంకు కట్టబెట్టకూడదని రిటైర్డ్ ఐఏఎస్ ఈఏఎస్ శర్మ ప్రభుత్వానికి లేఖ రాసినా పట్టించుకోలేదని మండిపడుతున్నారు. ఇది ముమ్మాటికీ భూదోపిడీ అని ప్రజాసంఘాల నేతలు దుమ్మెత్తిపోస్తున్నారు. ఆక్రమిత భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని వామపక్షాల నేతలు ఆందోళన చేపట్టారు. జీవీఎంసీ ప్రధాన ద్వారం ముందు బైఠాయించి కూటమి ప్రభుత్వ నిరంకుశ ధోరణిని నిరసించారు.

గీతం చెరలో ఉన్న భూములు స్వాధీనం చేసుకోవాలి

గీతం వర్సిటీ కబ్జాలో ఉన్న 54.79 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి. ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

– **తెడ్డు శంకరరావు,** మత్స్యకారులు యువజన సంక్షేమ సంఘం ప్రతినిధి

కబ్జాలు చేయడానికి భరత్‌ను ఎంపీని చేయలేదు

ప్రభుత్వ భూములను కబ్జా చేయడానికి విశాఖ ప్రజలు శ్రీభరత్‌ను పార్లమెంట్‌కు పంపలేదు. బాబు ప్రభుత్వం గీతం కబ్జా చేసిన భూములను వాటిని క్రమబద్ధీకరించేందుకు కౌన్సిల్‌లో ఆమోదించడం దుర్మార్గం. ప్రజల ఆస్తులను రక్షించాల్సిన ప్రజాప్రతినిధులు భక్షిస్తే చూస్తూ ఊరుకునేది లేదు.

– **కె.లోకనాథం,** కేంద్ర కమిటీ సభ్యుడు, సీపీఎం

అజెండాపై తకరారు!

- పోలవరం–బనకచర్ల లింక్ ప్రాజెక్టును అజెండాలో చేర్చాలన్న ఏపీ
- ఈ లింక్ ప్రాజెక్టు వల్ల తమ ప్రయోజనాలు దెబ్బతింటాయన్న తెలంగాణ

సాక్షి, అమరావతి: ఏపీ, తెలంగాణ మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారానికి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ తొలి సమావేశం శుక్రవారం ఢిల్లీలో వాడివేడిగా జరిగింది. అజెండా ఖరారు కోసం నిర్వహించిన ఈ సమావేశంలో రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. పోలవరం–బనకచర్ల లింక్ ప్రాజెక్టును అజెండాలో చేర్చాలని ఏపీ అధికారులు ప్రతిపాదిస్తే.. తెలంగాణ అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ ప్రాజెక్టును అజెండాలో చేర్చడానికి వీల్లేదని స్పష్టం చేశారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు వెలువడి, అమల్లోకి వచ్చే వరకు ఉమ్మడి ప్రాజెక్టుల్లో కృష్ణా జలాలను చెరి సగం పంపిణీ చేసే అంశాన్ని అజెండాలో చేర్చాలని తెలంగాణ అధికారులు చేసిన ప్రతిపాదనపై ఏపీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అది ట్రిబ్యునల్, అపెక్స్ కౌన్సిల్ నిర్ణయాలకు వ్యతిరేకమన్నారు. వారంలోగా అజెండాను పంపాలని, వాటిపై ఇరు పక్షాల అభిప్రాయాలను తీసుకుని, రెండు వారాల్లోగా తదుపరి సమావేశం నిర్వహిస్తామని రెండు రాష్ట్రాల అధికారులకు సీడబ్ల్యూసీ చైర్మన్ సూచించారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఉత్పన్నమైన జల వివాదాలపై కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ గతేడాది జూలై 16న ఢిల్లీలో రెండు రాష్ట్రాల సీఎంలతో సమావేశమయ్యారు. కమిటీ ఏర్పాటు చేసి, సంప్రదింపుల ద్వారా జల వివాదాలను పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. ఆ మేరకు అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ శుక్రవారం ఢిల్లీలో తొలిసారిగా సమావేశమైంది. రెండు రాష్ట్రాల మధ్య తలెత్తుతున్న జల వివాదాలపై కృష్ణా బోర్డు చైర్మన్ ఎస్.బి శ్వాస్, గోదావరి బోర్డు చైర్మన్ బీపీ పాండే వేర్వేరుగా ప్రజెంటేషన్ ఇచ్చారు. రెండు బోర్డుల పరిధిని నిర్దేశిస్తూ 2021 జూలై 1న కేంద్ర జల్ శక్తి శాఖ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లు ఇప్పటి వరకు అమలు చేయలేని పరిస్థితిని వివరించారు.

దుష్ప్రచారం చేస్తూ ఫ్లెక్సీలు పెట్టిన వారిపై

కఠిన చర్యలు తీసుకోండి

- అలాంటి వాటిపై నిషేధాజ్ఞలు జారీ చేయండి
- డీజీపీకి వైఎస్సార్‌సీపీ లేఖ

సాక్షి, అమరావతి: తిరుమల లడ్డూ ప్రసాదంలో వినియోగించిన నెయ్యి వివాదంపై దర్యాప్తు చేసిన సీబీఐ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చార్జ్‌షీట్ నేపథ్యంలో తమ పార్టీ, నాయకులను నిందిస్తూ రాష్ట్రంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీని వైఎస్సార్‌సీపీ కోరింది. ఈ మేరకు డీజీపీకి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి శుక్రవారం లేఖ రాశారు. సీబీఐ సిట్ చార్జ్‌షీట్‌లోని అంశాలను తప్పుదోవ పట్టిస్తూ, తమ పార్టీని నిందిస్తూ గుంటూరు, పిడుగురాళ్ల, వినుకొండ, దర్శితోపాటు రాష్ట్రంలో పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని అప్పిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేయడంతోపాటు నాయకుల పరువుకు భంగం కలిగించే విధంగా ఆ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారని వెల్లడించారు. నిజానికి సిట్ చార్జ్‌షీట్‌లో వైఎస్సార్‌సీపీ నేతలు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డిపై ఎలాంటి నేరారోపణలు చేయలేదని, అయినా ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తూ, వారి ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా, వారి ఫొటోలతో సహా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని వివరించారు. అందుకే వాటిని ఏర్పాటు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు, భవిష్యత్‌లో మళ్లీ అలాంటి పనులు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తూ, పరువుకు నష్టం కలిగించేలా ఆ ఫ్లెక్సీలు డిజైన్ చేసిన, ప్రింట్ చేసిన, వాటికి నిధులు సమకూర్చిన, రవాణా చేసిన వారితోపాటు, అవి ఏర్పాటు చేసిన వారిపైనా వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా రాష్ట్రవ్యాప్తంగా అలాంటి ఫ్లెక్సీల ఏర్పాటుకు ప్లాన్ చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం ఉందని, కాబట్టి శాంతికి విఘాతం కలిగించే ఆ చర్యలను నిరోధించేలా వెంటనే నిషేధాజ్ఞలు జారీ చేయాలని లేళ్ల అప్పిరెడ్డి ఆ లేఖలో డీజీపీని కోరారు.



> దేవాదిదేవుని యందు అచంచలమైన భక్తి గలవాడు దేవతల సద్గుణములను కలిగియుండును. అట్లుకాక భగవానుని పట్ల భక్తి లేనివాడు అల్పమైనట్టి లౌకిక గుణములు మాత్రమే కలిగి ఉండును.
>
> – హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 31 జనవరి 2026

బాబు కుట్రకు శిక్ష ఉండొద్దా?

‘ఆత్రగాడికి బుద్ధి మట్టు...’ అనే నానుడి ఉత్తపుణ్యాన రాలేదు. ప్రత్యర్థులపై బురద జల్లడం కోసం, వారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడం కోసం ఎంతకైనా దిగజారే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్మాదం ఆవహించిన చందాన 2024 సెప్టెంబర్‌లో ఒక మహాపరాధానికి పాల్పడ్డారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందంటూ తప్పుడు ఆరోపణకు సాహసించి ప్రపంచవ్యాప్తంగావున్న కోట్లాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతీశారు. నిజం నిలకడ మీద తేలుతుందన్నట్టు ఇన్ని నెలల తర్వాత ఇదంతా పచ్చి బూటకమని సీబీఐ దర్యాప్తు నిగ్గుతేల్చింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో సీబీఐ ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి లడ్డూకు వాడిన నెయ్యిలో పంది, చేప తదితర జీవుల కొవ్వు కలిసిందన్న ఆరోపణలో ఆవగింజంతైనా నిజం లేదని నిర్ధారించింది. హరియాణాలోని ఐసీఏఆర్–నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, గుజరాత్‌లోని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్‌డీడీబీ)లు వేర్వేరుగా ఆ నెయ్యి నమూనాలను పరీక్షించి వెల్లడించాయని సీబీఐ తన చార్జిషీటులో తెలియజేసింది. ఈ నమూనాలు నాలుగు వేర్వేరు ట్యాంకర్ల నుంచి సేకరించామని వివరించింది. చిత్రమేమంటే తమ కుట్ర భళ్లున బద్దలైనా టీడీపీ నాయకులకూ, వారి వందిమాగధ మీడియాకూ బుద్ధి రాలేదు. కిందపడ్డా తమదే పైచేయి అని చెప్పటానికి నానా తంటాలూ పడుతున్నారు. ఒక అబద్ధాన్ని నిజం చేయడానికి మరిన్ని వేల అబద్ధాలు వల్లెవేస్తున్నారు.

ఇలాంటి వంచకులను ఆ భగవంతుడు క్షమిస్తాడా? ప్రత్యర్థులపై పైచేయి సాధించటానికి ఎత్తులు, పైయెత్తులేయటం... ఎలాగైనా గెలిచితీరాలని ఆత్రపడటం రాజకీయాల్లో సర్వసాధారణం. కానీ మనిషి జన్మ ఎత్తినందుకు కనీసంగానైనా ఇంగితం ఉండొద్దా? అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి ప్రసాదంపైనే నదురూ బెదురూ లేకుండా విషం చిమ్మటం మహాపచారమన్న స్పృహ ఉండనవసరం లేదా? ఈ కుట్ర వెనక అసలు కారణాలు వేరే ఉన్నాయి. అప్పటికి ఎడతెరిపి లేని వానలతో పొంగి ప్రవహిస్తున్న బుడమేరును కనీస ముందస్తు హెచ్చరిక లేకుండా, చడీచప్పుడూ కాకుండా వదలటం వల్ల విజయవాడ లోతట్టు ప్రాంతాలు మునిగాయి. 50 మందికి పైగా దుర్మరణం పాలయ్యారు. అది సర్కారీ జలప్రళయమని అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. చంద్రబాబు తన కొంప కాపాడుకునేందుకే ఇలా చేయించారన్న విమర్శలూ వచ్చాయి. అంతేకాక ఎన్నికల సంఘం ఎంతో తాత్సారం చేసి, నిబంధనలు కాలరాసి ఏపీలో ఎన్నికలు జరిగిన 108 రోజుల తర్వాత బూత్‌ల వారీగా ఎవరికెన్ని ఓట్లు వచ్చాయన్న వివరాలతో కూడిన ఫామ్–20ని సెప్టెంబర్ 19న ఆన్‌లైన్‌లో పెట్టడానికి నిర్ణయించుకుంది. సరిగ్గా ఈ రెండు ఉపద్రవాలనుంచీ కాపాడుకోవటం కోసం అర్జెంట్‌గా జనం దృష్టిని మళ్లించాలన్న ఆత్రుతలో శ్రీవారి లడ్డూ ప్రసాదంపై తప్పుడు కూతలు మొదలయ్యాయి. ఇందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పక్కతాళం వేశారు. అయోధ్యకు జంతువుల కొవ్వు కలిసిన లక్ష లడ్డూలు వెళ్లాయంటూ వదిరారు. ఇరు పార్టీలూ ఇలా దుష్ప్రచారం చేస్తున్నా, అదే కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీ గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయింది. సొంత మనుషులతో సిట్ వేసే ప్రయత్నం టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌తో బెడిసికొట్టింది.

అవకాశం దొరికినప్పుడల్లా ‘నీతిబద్ధ రాజకీయాలకు నిలువెత్తు నిఘంటువున’ని స్వోత్కర్షలకు పోయే చంద్రబాబుకు వాస్తవంగా అలవాటైన ఏకైక విద్య అబద్ధాలాడటం. దాని సాయంతోనే తన మామ ఎన్టీఆర్ నుంచి కుట్రపూరితంగా అధికారాన్ని చేజిక్కించుకున్నారు. అంతకు ముందూ తర్వాతా కూడా తన ఎదుగుదల కోసం ఆయన చేయని పాపమంటూ లేదు. వీటన్నిటికీ పరాకాష్ఠ లడ్డూ ప్రసాదంపై సాగించిన దుష్ప్రచారం. ఇదే నేరాన్ని మరెవరైనా చేసివుంటే వ్యవస్థలు ఊరుకుంటాయా? కేసులు, శిక్షలూ లేకుండా వదులుతాయా? అందలాలెక్కినవారికి మాత్రం ఎందుకు మినహాయింపులుండాలి? ఇన్నేళ్ల పాపాలను ఈ అవసాన దశలోనైనా కడిగేసుకుందామనీ, ఇక బుద్ధెరిగి ప్రవర్తిద్దామనీ చంద్రబాబు అనుకోకపోవటం తెలుగు ప్రజల దురదృష్టం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** శు.త్రయోదశి ఉ.7.48 వరకు, తదుపరి చతుర్దశి తె.5.47 వరకు (తెల్లవారితే ఆదివారం), **నక్షత్రం:** పునర్వసు రా.1.42 వరకు తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ప.2.21 నుండి 3.52 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.38 నుండి 8.08 వరకు, **అమృత ఘడియలు:** రా.11.30 నుండి 1.02 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.50
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

మీరు మీరే!

మీరు మీరుగా ఉండటమే మీ ప్రత్యేకతకు ఏకైక మార్గం. ఎవర్నీ అనుసరించకండి. మీకు మీరే అతిపెద్ద అభిమానిగా ఉండండి. మీ మీద మీకు నమ్మకం ఉంటేనే ఆ అభిమానం ఏర్పడుతుంది. మీపై మీకే నమ్మకం లేకుంటే ప్రపంచానికి ఎలా ఉంటుంది?

– ప్రీతీ జింటా, నటి

గాసిప్‌లు

నేను ఖడ్గమృగంలా మారిపోయాను. చర్మం మొద్దుబారిపోయింది. నా గురించి వినిపించే గాసిప్‌లు నన్నిక బాధించవు. నేను అంటున్నది ఏమిటంటే, మనం ప్రజల్లో ఉన్నప్పుడు అందరూ ప్రేమించే వారే ఉండరు. బాధించేవారూ ఉంటారు. తేలిగ్గా తీసుకోండి.

– అమీ జాక్సన్, నటి

వద్దు

ఏ కళాకారుని బాటలోనూ మీరు నడవకండి. జనాదరణ పొందిన కళాకారులను కళ్లు మూసుకుని అనుకరించకండి. ప్రజాదరణను ఉత్తమమైన దానిగా తీసుకోకండి. సాధనతో మాత్రమే మీరొక ప్రత్యేకమైన కళాకారునిగా తర్ఫీదు పొందుతారు.

– డా॥ రాజశ్రీ వారియర్, నృత్యకారిణి

స్టార్



విజేతలైన చాలా మంది వ్యక్తులు తమ 30 లేదా 40 ఏళ్ల చివరిలో విజయం సాధించినవారే. కనుక మీరు మీ 25 ఏళ్ల వయసులో సూపర్ స్టార్ కాకపోయినా చింతించకండి. విజయం అంటే పురోగతి సాధించటం. పరిపూర్ణత సిద్ధించటం కాదు.

– డేవిడ్ రూబెన్‌స్టెయిన్, కార్లైల్ గ్రూప్ కో–ఫౌండర్

తెలుసా?



నైపుణ్యం అంటే ఎలా చేయాలో తెలిసి ఉండటం కాదు. ఎలా చేయకూడదో చెప్పగలిగి ఉండటం. మల్టీటాస్కింగ్ చేయనిదే ఒకే సారి అనేక విజయాలను సాధించలేం. ప్రపంచంలోని అతి పెద్ద సమస్యలే ప్రపంచంలోని అతి పెద్ద వ్యాపార అవకాశాలు.

– పీటర్ హెచ్. డయామండిస్, ఎక్స్‌ప్రైజ్ ఫౌండేషన్ ఛైర్మన్

భయం

నా దృష్టిలో నిర్భయంగా ఉండటం అంటే, భయం కలిగి ఉండటం. సందేహాలు కలిగి ఉండటం. మిమ్మల్ని భయపెట్టే విషయాలతో కలిసి జీవించటం. భయం లేనప్పుడు ధైర్యానికి తక్కువ చోటు ఉంటుంది. భయం ఉంటేనే ధైర్యంగా ఉంటాం.

– టేలర్ స్విఫ్ట్, గాయని, గేయ రచయిత్రి

పరిశ్రమలకు మేలు చేసే ఒప్పందం

విశ్లేషణ

చంద్రజిత్ బెనర్జీ

భారత్–యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం సుదీర్ఘమైన, క్లిష్టమైన చర్చల అనంతరం ఒక కొలిక్కి వచ్చినది మాత్రమే కాదు; మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ తన స్థానాన్ని పదిలం చేసుకుంటున్న తీరుకు అది ప్రతీకగా నిలుస్తోంది. పైగా ఇచ్చిపుచ్చుకోవడంలో పరస్పర ప్రయోజనాలున్న రెండు పెద్ద ఆర్థిక వ్యవస్థలను అది కలుపుతోంది. ఈ రెండింటి వాటా ప్రపంచ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో నాల్గవ వంతుగా ఉంది. భవిష్యత్తులో కూడా ఆర్థిక బంధం స్థిరంగా కొనసాగేందుకు అది పునాది వేసింది.

ఇది తాత్కాలిక బేరసారాల ప్రయోజనాల చుట్టూ అల్లుకున్నది కాకపోవడం వల్లనే ‘అన్ని భాగస్వామ్యాలకు మాతృక’ లాంటిది అనే పేరు తెచ్చుకుంది. ఇది దీర్ఘకాలిక ఆశయంతో సమగ్రంగా రూపుదిద్దుకున్న ఒప్పందం. వస్తు వాణిజ్యం, సేవలతోపాటు ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ ట్రేడ్, సతత వికాసం, రాకపోకలు, సాంకేతిక పరిజ్ఞాన సహకారాన్ని కూడా జోడించుకోవడం వల్ల ఇదేదో కేవలం సుంకాలలో వెసులుబాటు కల్పించుకున్నదిగా కాక, రెండు పక్షాలకు ప్రయోజనదాయకమైన ఆర్థిక చట్రాన్ని రూపొందించుకోగలిగింది. భారతీయ పారిశ్రామిక రంగానికి ఇది చాలా అవసరం. ఎందుకంటే, పోటీ సామర్థ్యం ప్రస్తుతం మార్కెట్ల సౌలభ్యానికి మాత్రమే పరిమితమైనదిగా లేదు. దానికి ఒక స్థిరమైన, నమ్మకమైన, స్థితిస్థాపక సామర్థ్యమున్న వాతావరణం అవసరమవుతోంది.

స్థిరమైన మార్కెట్

ఐరోపా వంటి విస్తృత, నియమ–ఆధారిత మార్కెట్ వల్ల ఒక లాభం ఉంది. వివిధ సంస్థలు స్వల్పకాలిక లాభాలకు అతీతంగా, పెట్టుబడులు, ఎగుమతులు, ఉత్పాదక సామర్థ్యం, భాగస్వామ్యాలపై దీర్ఘకాలిక నిర్ణయాలు తీసుకునేందుకు వీలుంటుంది. వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు, తోలు వస్తువులు, పాదరక్షలు, ఎలక్ట్రికల్ యంత్ర పరికరాలు, రసాయనాలు, మోటారు వాహనాల విడి భాగాల వంటి ఎక్కువ మంది శ్రమ అవసరమైన రంగాలకు అది మరీ అవసరం. ఎక్కువ మందికి ఉపాధి కల్పించగల శక్తి కూడా ఆ రంగాలకు ఉంది. ఆ యా రంగాలకు యూరోపియన్ మార్కెట్లు మునుపటికన్నా మెరుగ్గా అందుబాటులోకి వస్తే గణనీయమైన లాభం చేకూరుతుంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలతో సహా

యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, భారత ప్రధాని నరేంద్ర మోదీ, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్

> ◆ ఐరోపా వంటి విస్తృత, నియమ–ఆధారిత మార్కెట్ వల్ల ఒక లాభం ఉంది. స్వల్పకాలిక లాభాలకు అతీతంగా, పెట్టుబడులు, ఎగుమతులు, భాగస్వామ్యాలపై దీర్ఘకాలిక నిర్ణయాలు తీసుకునేందుకు వీలుంటుంది.

భారతీయ సంస్థలకు మరో మహత్తర అవకాశం లభిస్తోంది. అవి కేవలం ధర విషయంలో పోటీపడటం కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్లుగా మరింత మన్నికైన, విలువ ఆధారిత వస్తువుల ఉత్పత్తికి, విక్రయానికి యూరోపియన్ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం తేలికవుతుంది.

కేవలం కొన్ని దేశాలపైనే ఆధారపడటం వల్ల రిస్కులుంటాయి. వాటిని తగ్గించుకునేందుకు, ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకునేందుకు భారత్–యూరప్ కంపెనీలు రెండూ సప్లై చైన్లను చురుకుగా విస్తరించుకుంటున్నాయి. స్థాయి, సమరశీల సంస్కరణల అజెండా, మెరుగుపడిన పారిశ్రామిక మౌలిక వసతులతో యూరప్‌కు ఇండియా నమ్మదగిన ఉత్పత్తి కేంద్రంగా, నవీకరణ భాగస్వామిగా ఆవిర్భవించగల స్థితిలో ఉంది.

ఆ రకమైన మార్పునకు చాలా వరకు టెక్నాలజీ సహకారం పునాదిని అందిస్తుంది. కాలుష్య రహిత టెక్నాలజీలు, డిజిటల్ మౌలిక వసతులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీ కండక్టర్లు, అగ్రికల్చర్ టెక్నాలజీ, అడ్వాన్స్డ్ ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో బలమైన సహకారాన్ని పాదుకొల్పుకునేందుకు తగిన పరిస్థితులను ఈ ఒప్పందం సృష్టిస్తోంది. నవీకరణలో ఐరోపాకున్న బలం, భారీ స్థాయిలో ఉత్పత్తి చేపట్టగల భారత్ సామర్థ్యం ఈ విషయంలో సహజసిద్ధమైన పరస్పర ప్రయోజనదాయకమైన అంశాలుగా పరిణమిస్తాయి. అధునాతన టెక్నాలజీలను అనుసరించడంలోనేకాదు, వాటి సహ అభివృద్ధిలో, స్థానికీకరణలో, నియోగించడంలో పాలు పంచుకునే అవకాశం భారత్ పరిశ్రమలకు లభిస్తుంది. ఫలితంగా, హెచ్చు విలువ కలిగిన వస్తూత్పత్తి, టెక్నాలజీ సునిశిత రంగాల్లోకి భారత్ పయనం వేగవంతమవుతుంది.

పరస్పర తోడ్పాటు

సేవలు, మానవ మూలధనంపై ఈ ఒప్పందం చూపగల ప్రభావం కూడా తక్కువదేమీ కాదు. జనాభా వర్గాలలో భారత దేశానికి ఉన్న సానుకూలాంశం వ్యూహాత్మక ఆస్తిగా పరిణమిస్తుంది. ప్రపంచంలోని పెద్ద యువ ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఇండియా, టెక్నాలజీ, ఇంజినీరింగ్, పరిశోధన, ఆరోగ్య రక్షణ, వ్యాపార సేవలు వంటి వివిధ విభాగాల్లోకి వృత్తినిపుణులను తీసుకురాగలదు. యూరప్‌లో వయసు మీదపడుతున్నవారి సంఖ్య పెరుగుతూ ఉండవచ్చు. కానీ, వాటి ఆర్థిక వ్యవస్థలు నవీకరణతో నడుస్తున్నాయి. వాటికి సేవలను, మొబిలిటీని అందుబాటులోకి తెచ్చేందుకు యూరప్‌తో సంబంధాలు నెరపడంలో భారత నిపుణులకున్న సామర్థ్యాన్ని ఈ ఒప్పందం మెరుగుపరుస్తుంది.

భద్రత–రక్షణ రంగాల్లో కూడా ఉభయ పక్షాల ప్రయోజనాలు సమ్మిళితం కావడం ఈ ఒప్పందంలో మరో ముఖ్యాంశం. అధునాతన రక్షణ పరికరాలు, ద్వంద్వ వినియోగ టెక్నాలజీ ఆవరణ వ్యవస్థలలో తోడ్పాటుకు భారతీయ పరిశ్రమలకు ఈ ఒప్పందం ద్వారాలు తెరుస్తోంది. క్రమేపీ సమస్యాత్మకంగా మారుతున్న ప్రపంచ వాతావరణంలో బలహీనతలను తగ్గించుకుంటూ, దేశీయ పారిశ్రామిక సామర్థ్యాలను పటిష్టపరచుకునేందుకు కూడా వీలుంది.

మరో రకంగా కూడా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం గణనీయమైనదే. సమ్మిళితం ద్వారా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని భారతదేశం పెట్టుకున్న లక్ష్యాన్ని సాధించడంలో ఈ ఒప్పందం ఎంతగానో అవసరమవుతుంది. దేశీయ ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా నిష్ఠగా ఈ ఒప్పందాన్ని అమలు జరిపితే, భారతదేశపు పారిశ్రామిక పథం రూపురేఖలు కొన్ని దశాబ్దాలపాటు కొత్త అంచులను తాకుతూ ముందుకు సాగుతాయి. ప్రపంచ వాణిజ్యంలో భారత పారిశ్రామిక రంగ స్థితి ఎక్కడో అంచుల లోకాక, కేంద్ర స్థానాన్ని సుస్థిరంగా ఆక్రమించుకోగలుగుతుంది.

వ్యాసకర్త భారతీయ పరిశ్రమల సంఘాల సమాఖ్య (సీఐఐ) డైరెక్టర్ జనరల్ (‘ద హిందూస్థాన్ టైమ్స్’ సౌజన్యంతో)

పన్ను శ్లాబులు మూడింటికి తగ్గాలి!

వ్యూ పాయింట్:

పాడ్‌కాస్ట్: మనీకంట్రోల్

అతిథి: నితిన్ బైజల్, ‘డెలాయిట్’ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

హోస్ట్: టీనా కౌశల్, మనీకంట్రోల్ పర్సనల్ ఫైనాన్స్ ఎడిటర్

కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో రేపు (ఫిబ్రవరి 1) ప్రవేశపెట్టనున్న బడ్జెట్ అంచనాల గురించి టీనా కౌశల్, నితిన్ బైజల్ మధ్య జరిగిన సంభాషణలో... మధ్య తరగతి పన్ను చెల్లింపుదారులకు ఉపయోగపడేలా, వాస్తవానికి దగ్గరగా ఉండే అంశాలను బైజల్ ప్రస్తావించారు. ముఖ్యాంశాలు :

టీనా కౌశల్

నితిన్ బైజల్

శ్లాబులను 3కు కుదించాలి!

‘‘ప్రస్తుతం ఉన్న కొత్త పన్ను విధానంలో ఐదు రకాల రేట్లు (5, 10, 15, 20, 30 శాతాలు) ఉన్నాయి. ఒక సామాన్యుడికి ఇన్ని రకాల లెక్కలు చూస్తుంటే గందరగోళంగా ఉంటుంది. నా ఉద్దేశం ప్రకారం, ఈ విధానాన్ని మునుపు ఉన్నట్లుగానే 10–20–30 శ్లాబ్ మోడల్‌లో సింపుల్‌గా మార్చాలి. ఇలా కుదించటం వల్ల, తక్కువ ఆదాయం ఉన్నవారికి పన్ను మినహాయింపు పరిమితి పెరుగుతుంది.

స్టాండర్డ్ డిడక్షన్ పెరగాలి!

‘‘చాలా కాలంగా ‘స్టాండర్డ్ డిడక్షన్’ (జీతం, పింఛను ఆదాయంలో పన్ను పడకుండా మినహాయింపు కలిగిన మొత్తం) పెరగలేదు. కానీ, ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు, ఆసుపత్రి ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. కనుక ఇప్పుడున్న రూ. 75,000 మినహాయింపును రూ. 1,50,000 వరకు పెంచడం ఎంతైనా అవసరమని నేను భావిస్తున్నాను. ముఖ్యంగా ఇది సీనియర్ సిటిజెన్‌లకు ఎంతో మేలు చేస్తుంది. ఎందుకంటే, కొత్త పన్ను విధానంలో ఆరోగ్య బీమా ప్రీమియంపై సెక్షన్ 80–డి కింద మినహాయింపులు ఉండవు. ఆసుపత్రి ఖర్చులతో ఇబ్బంది పడే వృద్ధులకు, ఈ స్టాండర్డ్ డిడక్షన్ పెంచితే అది వారికి ఊరటనిస్తుంది.

లాభాల పన్ను విధానం మారాలి!

‘‘ప్రస్తుతం మన దేశంలో ఆస్తుల అమ్మకం ద్వారా వచ్చే మూలధన లాభాల (క్యాపిటల్ గెయిన్స్)పై వేసే పన్నుల విధానం ఒక చిక్కుముడిలా ఉంది. ఉదాహరణకు, మీరు ఏదైనా స్థలం లేదా ఇల్లు అమ్మితే, రెండేళ్ల తర్వాత దానిపై సుమారు 12.5 శాతం పన్ను కట్టాలి. (అదే, షేర్ల విషయానికి వస్తే, ఏడాది తర్వాత అమ్మినప్పుడు 12.5 శాతం పన్ను చెల్లించాల్సిందే). ఇలా ఒక్కో రకమైన పెట్టుబడికి (ఇల్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్) ఒక్కో రకమైన కాల పరిమితి (హోల్డింగ్ పీరియడ్), ఒక్కో రకమైన పన్ను రేట్లు ఉండటం అయోమయానికి గురి చేసే విషయం. అందుకే నేను ఏమంటానంటే, అన్ని రకాల పెట్టుబడులకు ఒకే రకమైన నిబంధనలు ఉండాలి. పన్ను రేట్లు, కాల పరిమితి అన్నిటికీ సమానంగా ఉంటేనే, ఒక ‘ఆమ్ ఆద్మీ’ తన పెట్టుబడులపై ఎంత పన్ను పడుతుందో సులభంగా అర్థం చేసుకోగలడు.

నగరాలకు తగ్గట్టుగా హెచ్.ఆర్.ఎ.

‘‘మన ‘ఆదాయపు పన్ను చట్టం’ ప్రకారం... కేవలం ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై నగరాల్లో ఉండేవారికి మాత్రమే 50 శాతం వరకు హెచ్.ఆర్.ఎ.పై పన్ను మినహాయింపు లభిస్తుంది. బెంగళూరు, గురుగ్రామ్ వంటి పెద్ద నగరాల్లో ఉండేవారికి కేవలం 40 శాతం మాత్రమే మినహాయింపు ఇస్తున్నారు. ఇప్పుడు బెంగళూరు లేదా గురుగ్రామ్ వంటి నగరాల్లో ఇళ్ల అద్దెలు ప్రధాన మెట్రో నగరాలతో సమానంగా పెరిగిపోయాయి. అందుకే, ఈ 50 శాతం హెచ్.ఆర్.ఎ. ప్రయోజనాన్ని దేశవ్యాప్తంగా లేదా అన్ని ప్రముఖ నగరాలకు వర్తింపజేయవలసిన అవసరం ఉంది.

ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ నియంత్రణ

‘‘ఈ మధ్య కాలంలో సాధారణ జనం కూడా స్టాక్ మార్కెట్‌లోని ‘ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్’ (ఎఫ్ అండ్ ఓ) వైపు మొగ్గు చూపడం గమనిస్తున్నాను. ఇది ఒక రకమైన ‘జూదం’ లాంటిదే. ప్రస్తుతం దీనిని ‘బిజినెస్ ఆదాయం’గా పరిగణిస్తున్నారు, కానీ ప్రభుత్వం దీనిని ‘ఊహాజనిత ఆదాయం’ (స్పెక్యులేటివ్ ఆదాయం) కిందకు మార్చాలి. అప్పుడు ఒకవేళ నష్టం వస్తే, ఆ నష్టాన్ని కేవలం తదుపరి 4 ఆర్థిక సంవత్సరాల వరకే ముందుకు తీసుకెళ్లడానికి (ముందు వచ్చే లాభాల్లో సర్దుబాటు చేయడానికి) అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఆ పరిమితి 8 ఏళ్ల వరకు ఉంది; ఈ నష్టాలను కేవలం ఇలాంటి రిస్క్‌తో కూడిన లాభాలతో మాత్రమే సర్దుబాటు చేయవలసి ఉంటుంది. సామాన్యులు ఏమీ తెలియకుండా ఈ రిస్క్ మార్కెట్లో అడుగుపెట్టి సర్వం కోల్పోకుండా ఉండాలనేదే నా ఉద్దేశం.

❑ ఎడిటోరియల్ టీమ్

పాటను ఆయుధంగా మలిచి...

గుమ్మడి విఠల్‌రావుగా జన్మించి, పీడిత ప్రజల గొంతుకగా మారిన ‘గద్దర్’ ప్రస్థానం తెలుగు సాంస్కృతిక, రాజకీయ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం. 1949 జనవరి 31న మెదక్ జిల్లా తూప్రాన్ గ్రామంలోని పేద దళిత కుటుంబంలో జన్మించారు. ఇంజినీరింగ్ చదువును మధ్యలోనే వదిలి, ఆకలి, పేదరికం, దోపిడీ లేని సమసమాజం కోసం తన జీవితాన్ని ప్రజా పాటగా మలిచారు.



గద్దర్

తొలినాళ్లలో గాంధేయవాదం పట్ల ఆకర్షితులైన గద్దర్ బుర్రకథ కళారూపం ద్వారా ప్రభుత్వ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కుటుంబ నియంత్రణ, అల్లూరి సీతారామరాజు వంటి అంశాలపై ప్రదర్శనలు ఇస్తూ జీవితం సాగించారు. అయితే, 1970 లలో బి. నర్సింగరావు పరిచయం ఆయన ఆలోచనా విధానాన్ని మలుపు తిప్పింది. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడిన పంజాబ్ ‘గదర్ పార్టీ’ స్ఫూర్తితో తన పేరును ‘గద్దర్’గా మార్చుకున్నారు. ‘జననాట్యమండలి’ ద్వారా విప్లవ భావజాలాన్ని పల్లెపల్లెకూ చేరవేశారు. సాధారణ ప్రజలకు అర్థమయ్యేలా జానపద కళారూపాలను విప్లవ బాట పట్టించడం గద్దర్ ప్రత్యేకత. బుర్రకథ, ఒగ్గుకథ, జముకుల కథల్లో వర్గ పోరాటం, ప్రతిఘటన వంటి అంశాలను నింపి సామాన్యులను చైతన్య పరిచారు. ‘భారతదేశం భాగ్యసీమరా’ వంటి పాటలు దేశ సంపద దోపిడీని ఎండగడితే, ‘ఊరు మనదిరా’ శ్రమజీవుల హక్కులను చాటి చెప్పింది. సినిమాల్లో ఆయన రాసిన పాటలకు ప్రతిష్ఠాత్మక ‘నంది’ అవార్డులు వరించినా, ప్రజా పోరాటాల ముందు అవి తృణప్రాయమని తిరస్కరించారు.

ఎలక్ట్రానిక్ మీడియా, సినిమాల ఆధిపత్యం పెరుగుతున్న కాలంలో డప్పు, ఢోలక్ వంటి ప్రజా వాయిద్యాలతో గద్దర్ ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించారు. ఒంటిపై చొక్కా లేకుండా, నల్ల గొంగడి, గోచి కట్టు పంచె, కాళ్లకు గజ్జెలు, చేతిలో ఎర్ర కర్చీఫ్‌తో వేదికపై ఆయన చేసే నృత్యం ప్రేక్షకులను ఉర్రూతలూగించేది. ఆ ఎర్ర కర్చీఫ్ ఒక్కో సందర్భంలో తల్లి ప్రేమగా, మరో సారి విప్లవ పతాకంగా సాక్షాత్కరించేది. కారంచేడు, చుండూరు దళిత మారణ కాండలు; రైతు ఆత్మహత్యలు, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వంటి అంశాలపై ఆయన ఎన్నో పాటలు రచించారు.

విప్లవ రచయితల సంఘం (విరసం) మేధావులకే పరిమితమైందని భావించిన గద్దర్, జన నాట్య మండలి ద్వారా కళను నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. తన జీవిత చరమాంకంలో సామాజిక సమగ్రత కోసం కాంగ్రెస్ పార్టీకి చేరువయ్యారు. 2023 ఆగస్టు 6న ఆయన భౌతికంగా దూరమైనప్పటికీ, ఆయన గొంతుక, పోరాట స్ఫూర్తి ప్రజల మధ్య సజీవంగానే ఉన్నాయి.

– డా॥ వెన్నెల గద్దర్ । ‘తెలంగాణ సాంస్కృతిక సారథి’ చైర్ పర్సన్

(నేడు గద్దర్ జయంతి)

డేటా పాయింట్

పల్లెల్లో తిండి ఖర్చు ఇలా...

దేశంలో ఒక్కో కుటుంబం తమ నెలవారీ ఆదాయాలను ఎలా వెచ్చిస్తున్నాయో తెలుసుకోవడానికి కేంద్ర ప్రభుత్వ గణాంక శాఖ సర్వేలు నిర్వహిస్తుంటుంది. 2022–23, 2023–24 సంవత్సరాలకు వరుసగా జరిగిన ఈ సర్వేల ప్రకారం గ్రామీణ కుటుంబాలు తమ ఆదాయాల్లో సుమారు 53 శాతం ఆహారేతర అవసరాలకు వెచ్చిస్తున్నాయి.

నూరు రూపాయల్లో ఆహారానికి వెచ్చించే మొత్తం (సుమారు 47 శాతం) ఇలా:

	2022-23	2023-24
పానీయాలు, ప్రాసెస్డ్ ఫుడ్	9.62	9.84
పాలు, పాల పదార్థాలు	8.33	8.44
కూరగాయలు	5.38	6.03
గుడ్లు, చేపలు, మాంసం	4.91	4.92
పప్పు దినుసులు	4.91	4.99
వంట నూనెలు	3.59	2.77
పళ్లు	3.71	3.85
ఇతర ఆహార పదార్థాలు	5.92	6.20

సర్వాపహారి

జ్యోతిర్మయం

‘పాల సంద్రము లోన పవ్వళించెడి వాడు, గొల్ల యిళ్ళ పాలు కోరనేల?’ అని ప్రశ్నిస్తాడు ఒక కవి. సమాధానంగా తనే, ‘ఎదుటి వారి సొమ్ము ఎల్లవారికి తీపి!’ అనే సాధారణమైన లోకం పోకడను ఉటంకిస్తాడు. కానీ శ్రీకృష్ణుడిది సాధారణమైన చోరత్వం కాదు. అంతటి మాయావిత్వం మరెక్కడా చూడలేం. అది లోకాతీతం. పసితనంలోనే ఆయన పక్కిళ్ళలో పాలు పెరుగులు బతకనిచ్చేవాడు కాదని భాగవతం ఘోషిస్తుంది. కొంత వయసు వచ్చిన తరువాత దధి నవనీత చోరుడు కాస్తా తరుణీ మానస చోరుడయ్యాడు. అన్నెం పున్నెం ఎరగని అమాయక గోపకాంతలను, వెర్రివాళ్ళలా పుట్టల వెంటా, గుట్టల వెంటా తిరుగుతూ... ‘నల్లని వాడు, పద్మ నయనమ్ముల వాడు... నవ్వు రాజిల్లెడి మోము వాడొకడు, చెల్వల మాన ధనంబు...’ దొంగిలించుకొని పారి పోయాడు. మీ చాటున గానీ దాక్కోలేదు గదా? అని మల్లెపొదలతో, మామిడి చెట్లతో, పున్నాగలతో, పొగడలతో మాట్లాడే స్థితికి తెచ్చాడు.

పోయిన కొద్దీ ఆయన నేరాల జాబితా పొడుగయిపోతూ వెళ్ళింది. ఆయనకు పరమ భక్తుడైన లీలాశుకుడే ఆయన మీద, మహేంద్ర జన మానస తాపహారి అనీ, మద వ్రజ వధూ వస్త్రాపహారి అనీ, తృతీయ భువనేశ్వర దర్పహారి అనీ (తృతీయ భువనం స్వర్గలోకం, దాని ఈశ్వరుడు దేవేంద్రుడు), మదీయ హృదయాంబురుహ అపహారీ అని నాలుగు పెద్ద ఆరోపణలు చేశాడు. ఏది దొరికితే అది అపహరించటమే నన్ను మాట– చీరలూ, ‘గిర’లూ, తాపాలూ, పాపాలూ, మానాలూ, మానసాలూ, భాగ్యాలూ, భయాలూ, శోకాలూ... అన్నీ!

పట్టించుకొనే నాథుడెవరు? నిషధయోగ్యుడైన పోతన్నగారు కూడా ఈ ఘన చౌర్యాలను గర్హించలేదు. పైపెచ్చు, తను అంత గొప్పగా అనువదించిన ఆంధ్ర భాగవతాన్ని అంకితం ఇచ్చింది ఎవరికో తెలుసా? **హారికి, నంద గోకుల విహారికి, చక్ర సమీర దైత్య సం/హారికి, భక్త దుఃఖ పరిహారికి, గోప నితంబినీ మనో/హారికి, దుష్ట సంపదప హారికి, ఘోష కుటీ పయో ఘృతా/ హారికి, బాలక గ్రహ మహా సుర దుర్వనితా ప్రహారికిన్!** ఎవరెన్ని ఆరోపణలు చేసినా, భాగ్యలక్ష్మి తోడుగా ఉన్నవాడి దొరతనానికి ఏ లోటూ ఏర్పడదు!

– ఎం. మారుతి శాస్త్రి

చంద్రబాబుదే మహాపాపం...
రాజకీయ పాతకం!

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై విషం చిమ్మిన చంద్రబాబు
జంతు కొవ్వు కుట్ర బెడిసికొట్టడం.. దేశవ్యాప్తంగా బాబు క్షమాపణలు చెప్పాలని వెల్లువెత్తుతున్న డిమాండ్లతో సరికొత్త కుతంత్రం

'తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించిన నెయ్యిలో ఎటువంటి జంతువుల కొవ్వు కలవలేదు. పంది, చేప తదితర జీవుల కొవ్వు ఆ నెయ్యిలో కలవనే లేదు. హర్యానాలోని 'ఐసీఏఆర్- నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్', గుజరాత్‌లోని 'నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్‌డీడీబీ) ఆ నెయ్యి శాంపిల్స్‌ను పరీక్షించి ఆ వాస్తవాన్ని నిర్ధారించాయి. నాలుగు నెయ్యి నమూనాలను 'ట్రై గ్లిసరైడ్ ప్రొఫైల్' పరీక్షించి మరీ నిర్ధారించాయి..'

- నెల్లూరు న్యాయస్థానంలో తాజాగా చార్జ్‌షీట్ దాఖలు చేసిన సీబీఐ


TTD Board Resolution dated 26th June, 2018

Item No : 192
Page No : 232

MARKETING DEPARTMENT (PROCUREMENT WING)

Sub: TTD – Marketing department – Tirupati – Procurement of 73,000 Kgs of Cow Ghee with Agmark Special Grade through tins for a period of six months – e-tenders invited – supply order placed on L-1 tenderer pending approval of TTD Board – Matter placed before the TTD Board for approval and ratification – Regarding.

Ref: e-Tender dated 01-05-2018 (Tech. Bid) & 29-05-2018 (Fin. Bid).

NOTE:

1. This is with regard to procurement of 73,000 Kgs of Cow Ghee with Agmark Special Grade through tins (15 Kgs per each tin) for use in TTD Temples for preparation of Prasadams and also in MTVAC Anna prasadams complex, Tirumala for a period of six months.

1	Name of the product	Cow Ghee with Agmark Special Grade through tins
2	Requirement	72,860 Kgs (rounded to 73,000 KGs) for 6 months
3	Consumption during last six months	68,300 Kgs approx. (Tins)

5. As per procedure in vogue, the technical team have inspected the plants M/s Harsh Fresh Dairy Products Pvt. Ltd, Uttarakhand and M/s Farmgate Agro Milch Pvt. Ltd., New Delhi on 27.06.2018 and 28.06.2018 respectively and submitted the reports duly stating that both the dairies M/s Farmgate Agro Milch Pvt., Ltd., New Delhi and M/s Harsh Fresh Dairy Products Pvt., Ltd.,Uttarakhand were qualified technically.

Note -
Harsh Fresh Dairy Products Pvt. Ltd, was the former name of Bhole Baba Organic Dairy Milk Pvt. Ltd, and the same was deemed technically qualified to supply milk by the TTD during May 2018.

టీటీడీకి పాల ఉత్పత్తులు సరఫరా చేసేందుకు భోలేబాబాకు చెందిన హర్ష్ ఫ్రెష్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ 2018లోనే సాంకేతిక అర్హత సాధించిందంటూ 26-6-2018న టీటీడీ బోర్డు చేసిన తీర్మానం కాపీ ఇది..

తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు వాడారని దుష్ప్రచారం చేసిన చంద్రబాబు (ఫైల్)

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉంటూ రాజకీయ కుట్రలతో ఎంతకైనా దిగజారుతానని చంద్రబాబు మరోసారి నిరూపించుకున్నారు! తిరుమల లడ్డూ ప్రసాదంలో పంది కొవ్వు, గొడ్డు కొవ్వు, చేప కొవ్వు కలిసిందన్న తన నిరాధార ఆరోపణలు బెడిసికొట్టడం.. ముఖ్యమంత్రి హోదాలో మహాపచారానికి పాల్పడటంపై జాతీయ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతుండటం, దారుణమైన అబద్ధాలాడిన చంద్రబాబు క్షమాపణలు చెప్పాలని భక్తులు డిమాండ్ చేస్తుండటంతో సరికొత్త కుతంత్రాలకు పదును పెడుతున్నారు. లడ్డూ ప్రసాదం కోసం వినియోగించిన నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదని ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్ఐ ల్యాబొరేటరీలు శాస్త్రీయంగా నిర్ధారించగా.. అదే విషయాన్ని సీబీఐ సైతం తాజాగా చార్జ్‌షీట్‌లో స్పష్టం చేయడం తెలిసిందే. దీంతో తన పాచిక పారకపోవడంతో ఇతర అంశాలను వక్రీకరిస్తూ చంద్రబాబు బృందం మరో పన్నాగం పన్నింది. గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా నెయ్యి కాంట్రాక్టులు కేటాయించారని.. చిన్నప్పన్నను వైవీ సుబ్బారెడ్డి పీఏ అంటూ వక్రీకరణలకు పాల్పడుతోంది.

కట్టబెట్టింది టీడీపీ హయాంలోనే.. చార్జ్‌షీట్‌లో వెల్లడించిన సీబీఐ

టీటీడీకి నెయ్యి సరఫరా చేసిన భోలేబాబా డెయిరీ వ్యవహారాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఆపాదించేందుకు చంద్రబాబు బృందం పడరాని పాట్లు పడుతోంది. అసలు వాస్తవం ఏమిటంటే.. భోలే బాబా డెయిరీకి టీటీడీ నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఇచ్చింది గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే. భోలే బాబా కంపెనీకి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అడ్డగోలుగా నెయ్యి సరఫరా కాంట్రాక్టు కట్టబెట్టారని సీబీఐ చార్జ్‌షీట్‌లో వెల్లడించడం గమనార్హం. ఇక తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించిన నెయ్యిలో ఎటువంటి జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ తాజాగా దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో పేర్కొంది. 'లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించిన నెయ్యిలో పంది, చేప తదితర జీవుల కొవ్వు కలవనే లేదు. హర్యానాలోని 'ఐసీఏఆర్- నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్', గుజరాత్‌లోని 'నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్‌డీడీబీ) ఆ నెయ్యి శాంపిల్స్‌ను పరీక్షించి ఆ వాస్తవాన్ని నిర్ధారించాయి. నాలుగు నెయ్యి నమూనాలను 'ట్రై గ్లిసరైడ్ ప్రొఫైల్' పరీక్షించి మరీ నిర్ధారించాయి..' అని సీబీఐ చార్జ్‌షీట్‌లో తెలిపింది.

ఆ శాంపిల్స్.. బాబు సీఎం అయ్యాక తీసినవే

ఇక ప్రస్తుతం కల్తీ అంటూ చేస్తున్న రాద్ధాంతానికి కేంద్ర బిందువుగా ఉన్న నెయ్యి శాంపిల్స్ ఎప్పుడు తీసుకున్నవో తెలుసా..? చంద్రబాబు సీఎంగా ప్రమాణం చేశాక తీసిన శాంపిల్స్ అవి! ఆ నెయ్యి శాంపిల్స్ టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో తీసినవే. మూడు టెస్టుల నివేదికల్లో నెయ్యి తగిన నాణ్యతతో లేదని తేలడంతో ఆ శాంపిల్స్‌ను జూలై 17న ఎన్డీడీబీ బోర్డుకు పంపారు. ఎన్డీడీబీ బోర్డు 2024 జూలై 23న నివేదిక ఇచ్చింది. అంటే మొత్తం వ్యవహారం అంతా టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలోనే సాగింది. మరి ఆ నెయ్యిలో కల్తీ ఉంటే అందుకు బాధ్యత టీడీపీ కూటమి ప్రభుత్వానిదేనన్నది సుస్పష్టం.

కొనుగోలు కమిటీలో కొలుసు, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

చంద్రబాబు, ఎల్లో మీడియా ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్న మరో విషయం ఏమిటంటే... వైఎస్సార్‌సీపీ హయాంలో నెయ్యి సరఫరా కాంట్రాక్టును ఆమోదించిన ఆనాటి టీటీడీ బోర్డులో ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కొలుసు పార్థసారథి, టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి సభ్యులుగా ఉన్నారు. నాడు టీటీడీ పర్చేజ్ కమిటీలో సభ్యులుగా నెయ్యి సరఫరా కాంట్రాక్టుపై నిర్ణయాన్ని బోర్డుకు సిఫార్సు చేసింది కూడా వారే కావడం గమనార్హం.

అదంతా కల్తీయేనా బాబూ?

2014–19 మధ్య చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు టీటీడీకి నెయ్యి కిలో రూ.276 – రూ.314 మధ్య కొనుగోలు చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో కొనుగోలు చేసిన ధరతో పోలిస్తే అది తక్కువే. మరి దాన్ని బట్టి బాబు సర్కారు కొన్న నెయ్యి అంతా కల్తీయేనని భావించాలా?

శ్రీవారి సొమ్ములు దుర్వినియోగం చరిత్ర బాబుదే..!

తిరుమల శ్రీవారి నిధుల వినియోగంలో యథేచ్ఛగా అవినీతికి పాల్పడిన చరిత్ర చంద్రబాబు ప్రభుత్వానిదే. అందుకు టీటీడీ తిరుపతిలో నిర్మించిన ఫ్లై ఓవరే నిదర్శనం. 2014–19 మధ్య టీడీపీ హయాంలో ఫ్లై ఓవర్ నిర్మాణ వ్యయం రూ.684 కోట్లలో టీటీడీ 67 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 33 శాతం వెచ్చించాలని చంద్రబాబు నిర్ణయించారు. కానీ కనీసం టీటీడీ బోర్డు అనుమతి లేకుండానే ఏకపక్షంగా వ్యవహరించారు. ఇది టీటీడీ నిబంధనలకు విరుద్ధమని వారించినా లెక్క చేయలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫ్లై ఓవర్ నిర్మాణానికి టీటీడీ పాలకమండలిలో తీర్మానం చేసింది. అంతేకాదు.. నిర్మాణ వ్యయాన్ని రూ.40 కోట్లు తగ్గించి శ్రీవారి నిధులను ఆదా చేసింది. ఇక టీడీపీ హయాంలో టీటీడీ నిధులు రూ.1,300 కోట్లు ప్రైవేట్ రంగంలోని ఎస్ బ్యాంకులో డిపాజిట్ చేశారు. కమీషన్లకు కక్కుర్తి పడి నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు బ్యాంకులో డిపాజిట్ చేయడంపై తీవ్ర విమర్శలు రేగినా చంద్రబాబు పట్టించుకోలేదు. అనంతరం వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేట్ బ్యాంకులో ఉన్న టీటీడీ డిపాజిట్లను ఉపసంహరించి... ప్రభుత్వ రంగంలోని జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేయించింది.

తప్పుడు నివేదిక బాబు హయాంలోనే..

గతంలో భోలే బాబా డెయిరీ పేరు హర్ష్ ఫ్రెష్ డెయిరీ'. ఆ పేరుతోనే 2018 మేలో తొలిసారి టీటీడీకి నెయ్యి సరఫరా కాంట్రాక్టును దక్కించుకుంది. లీటరు నెయ్యి కేవలం రూ.290కే సరఫరా చేస్తామని టెండరు వేస్తే టీటీడీ సమ్మతించి కాంట్రాక్టు కట్టబెట్టింది. అప్పుడు అధికారంలో ఉన్నది చంద్రబాబు ప్రభుత్వమే. హర్ష్ డెయిరీని తనిఖీ చేసేందుకు 2018 ఏప్రిల్ 17న అప్పటి టీటీడీ ఈవో నిపుణుల కమిటీని పంపారు. కానీ ఆ కమిటీ తప్పుడు నివేదిక ఇచ్చి మోసగించింది. హర్ష్ డెయిరీ రోజుకు 1,33,500 లీటర్ల ఆవు పాలు సేకరిస్తోందని... రోజుకు 4 టన్నుల నెయ్యి ఉత్పత్తి చేస్తోందని తప్పుడు నివేదిక ఇచ్చింది. ఆ విధంగా తప్పుడు నివేదిక ఇచ్చింది చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే కావడం గమనార్హం. 2019 ఫిబ్రవరి 18న 82 వేల కిలోల ఆవునెయ్యి కొనుగోలుకు టీటీడీ పిలిచిన టెండర్లలో హర్ష్ డెయిరీ మళ్లీ పాల్గొని టెండరు దక్కించుకుంది.

వైవీ సుబ్బారెడ్డి పీఏ కాదు... ఏపీ భవన్ ఉద్యోగి

తిరుమల లడ్డూ ప్రసాదం ముసుగులో రాజకీయ కుట్ర కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తోంది. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో చిరుద్యోగి అయిన చిన్న అప్పన్నను టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ అంటూ దుష్ప్రచారం చేస్తోంది. ఈ కేసులో అరెస్టు అయిన ఆయన్ను వైవీ సుబ్బారెడ్డి పీఏగా దుష్ప్రచారం చేయడం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లాలన్నదే కూటమి ప్రభుత్వ కుట్ర. ఏపీ భవన్‌లో చిరుద్యోగి అయిన చిన్న అప్పన్న గతంలో ప్రస్తుత టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పీఏగా పని చేశారు. ఆ వాస్తవాన్ని మాత్రం టీడీపీ కూటమి ప్రభుత్వం కప్పిపుచ్చేందుకు యత్నిస్తుండటం గమనార్హం. తిరుమల లడ్డూపై దుష్ప్రచారం ఆపాలని, నిజాలు బయటకు తీయాలని సుప్రీంకోర్టుకు వెళ్లింది వైవీ సుబ్బారెడ్డే. అంతేగానీ టీడీపీ నేతలు కాదు. ఇక సీబీఐ తాజాగా దాఖలు చేసిన చార్జిషీట్‌లో వైఎస్సార్ సీపీ నేతలు సహా గత ప్రభుత్వంలో ఉన్నవారి పేర్లు ఏ ఒక్కరివీ లేవు.

రాజకీయ కుట్రతో ఇంతటి బరితెగింపా బాబూ...!

కేవలం రాజకీయ స్వార్థం కోసమే తిరుమల లడ్డూ ప్రసాదం ప్రాశస్త్యం దెబ్బతీసే కుట్రకు చంద్రబాబు తెగబడ్డారు. సీఎం హోదాలో దుష్ప్రచార కుట్రకు బాబు నేతృత్వం వహించగా టీటీడీ ప్రధాన కార్యాలయం కేంద్రంగానే కుట్ర రచన సాగించి అమలు చేశారు. విజయవాడ వరదల్లో సహాయ, పునరావాస చర్యల్లో తన ఘోర వైఫల్యం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాల కోసమే ఈ మహా పాపానికి ఒడిగట్టారు. వైఎస్సార్‌సీపీ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం కోసం వినియోగించిన నెయ్యిలో పంది, చేప కొవ్వులు కలిపారంటూ చంద్రబాబు దారుణమైన ఆరోపణలు చేశారు. ఏమాత్రం పాపభీతి లేకుండా శ్రీవారి ఆలయ పవిత్రతకు కళంకం తీసుకువచ్చేందుకు.. కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బ తీసేందుకు కుతంత్రం పన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం..' అనే పేరుతో 2024 సెప్టెంబరు 20న ఒంగోలులో నిర్వహించిన ప్రభుత్వ కార్యక్రమాన్ని దీనికి వేదికగా చేసుకోవడం గమనార్హం. ప్రభుత్వ కార్యక్రమంలో మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారి ఆలయ పవిత్రతను దెబ్బతీసే కుట్రకు పాల్పడ్డారు. ఇక నారా లోకేశ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదంలో పంది కొవ్వు, చేప కొవ్వు కలిపి అపవిత్రం చేశారని దారుణమైన ఆరోపణలు చేశారు. మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. లడ్డూ ప్రసాదం కోసం వినియోగించిన నెయ్యిలో పంది కొవ్వు, ఆవు కొవ్వు, చేప కొవ్వు కలిపినట్లు ఎన్‌డీడీబీ పరీక్షల్లో వెల్లడైందని పేర్కొనడం గమనార్హం. అసలు విషయం ఏమిటంటే... తిరుమల లడ్డూ ప్రసాదం కోసం ఉపయోగించిన నెయ్యిలో జంతు కొవ్వు కలిసినట్లు ఎన్‌డీడీబీ పరీక్షల్లో వెల్లడి కాలేదు. కేవలం రాజకీయ కుట్ర కోసమే చంద్రబాబు, ఆయన ముఠా ఎల్లో మీడియా సహకారంతో ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు పక్కా పన్నాగం పన్నింది. ఇదిగో.. పంది కొవ్వు ఇంత శాతం..! ఆవు కొవ్వు ఇంత శాతం..! చేప కొవ్వు ఇంత శాతం..! అంటూ ఈనాడు, ఇతర ఎల్లో మీడియా పేజీలకు పేజీలు అవాస్తవ కథనాలతో దుష్ప్రచారం చేశాయి. లడ్డూ ప్రసాదం ప్రాశస్త్యానికి కళంకం తెచ్చే కుట్రలో పాత్రధారిగా మారిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏకంగా ప్రాయశ్చిత్తం డ్రామాకు తెరతీశారు. మీడియా కెమెరాల ముందు విజయవాడ ఇంద్రకీలాద్రి మెట్లు కడిగి హైడ్రామాను రక్తి కట్టించారు. గుంటూరు జిల్లా నంబూరులోని దశావతారం ఆలయంలో ప్రాయశ్చిత్త దీక్ష పేరుతో ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించారు.

లడ్డూ ప్రసాదం నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదు.. సీబీఐ దర్యాప్తులో వెల్లడి.. చార్జ్‌షీట్‌లో స్పష్టీకరణ

తిరుమల లడ్డూ ప్రసాదానికి కళంకం తెచ్చేందుకు చంద్రబాబు పన్నిన కుట్ర బెడిసికొట్టింది. 'తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించిన నెయ్యిలో ఎటువంటి జంతువుల కొవ్వు కలవలేదు..' అని సీబీఐ స్పష్టం చేసింది. 'పంది, చేప తదితర జీవుల కొవ్వు ఆ నెయ్యిలో కలవనే లేదు..' అని తేల్చి చెప్పింది. హర్యానాలోని 'ఐసీఏఆర్- నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌డీఆర్ఐ), గుజరాత్‌లోని 'నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) ఆ నెయ్యి శాంపిల్స్‌ను పరీక్షించి ఆ వాస్తవాన్ని నిర్ధారించాయని పేర్కొంది. ఈమేరకు నెల్లూరులోని న్యాయస్థానంలో దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో సీబీఐ ఆ విషయాన్ని స్పష్టం చేసింది. దాంతో శ్రీవారి లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు దుష్ప్రచార కుట్రలు బెడిసికొట్టాయి. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు చేసిన నిరాధార ఆరోపణలను అప్పటి టీటీడీ ఈవో శ్యామలరావు వెంటనే ఖండించారు. ఎటువంటి కల్తీ నెయ్యిని లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించలేదని తేల్చి చెప్పారు. దీంతో ఆయన్ను ప్రభుత్వ పెద్దలు అమరావతికి పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తరువాతే ఆయన్ను బదిలీ చేయడం గమనార్హం. లడ్డూ ప్రసాదం కోసం ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని తాజాగా సీబీఐ నివేదిక వెల్లడించింది. దాంతో చంద్రబాబు కుట్ర బెడిసికొట్టింది.

శాస్త్రీయంగా విశ్లేషణ... సాధికారికంగా నిర్ధారణ... టీటీడీ నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ దర్యాప్తులో నిర్ధారించింది. ఆ విషయాన్ని సీబీఐ తన చార్జ్‌షీట్‌లో స్పష్టంగా పేర్కొంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నాలుగు వేర్వేరు ట్యాంకర్ల నుంచి తీసిన నెయ్యి శాంపిల్స్‌ను హర్యానాలోని 'ఐసీఏఆర్- నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్', గుజరాత్‌లోని 'నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్(ఎన్‌డీడీబీ)లకు పంపించి పరీక్షలు నిర్వహించినట్టు సీబీఐ తెలిపింది. టీటీడీ నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని వెల్లడైందని ఆ ల్యాబొరేటరీలు 2025 మార్చి 27, 2025 మే 16న రెండు వేర్వేరు నివేదికల్లో నిర్ధారించాయని సీబీఐ తన చార్జ్‌షీట్‌లో పేర్కొంది. నాలుగు నెయ్యి నమూనాలను 'ట్రై గ్లిసరైడ్ ప్రొఫైల్' పరీక్షించి మరీ నిర్ధారించాయని తెలిపింది. నెయ్యి నాణ్యతను విశ్లేషించి నివేదికను ఇంగ్లీష్ అక్షర క్రమంలో పాయింట్ల వారీగా వివరించింది. అందులో ఏడో పాయింట్ (జి) లో సీబీఐ పేర్కొన్న విషయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో కొలెస్ట్రాల్ లేదని పరీక్షల్లో వెల్లడైందని తెలిపింది. జంతువుల కొవ్వులోనే కొలెస్ట్రాల్ ఉంటుంది. కొలెస్ట్రాల్ లేదని అంటే... జంతువుల కొవ్వు కలవలేదని స్పష్టం చేసినట్లేనని ఆహార నిపుణులు తేల్చి చెబుతున్నారు. తాము పరీక్షించిన నాలుగు నమూనాల్లోనూ పంది, చేప వంటి జీవుల కొవ్వు లేనే లేదని సీబీఐ నివేదిక స్పష్టం చేసింది.

నెయ్యి కొనుగోలుకు టీటీడీలో పటిష్ట వ్యవస్థ

రాజకీయ ప్రయోజనాల కోసం లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేయాలనే కుట్రతో చంద్రబాబు వాస్తవాలను వక్రీకరిస్తున్నారు. నెయ్యి, ఇతర సరుకులు కొనుగోలుకు టీటీడీలో దశాబ్దాలుగా పటిష్ట వ్యవస్థ ఉందనే వాస్తవాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారు. టీటీడీ అనుసరించే పటిష్ట విధానం ఇదీ...

- లడ్డూ ప్రసాదం, ఇతర అవసరాల కోసం టీటీడీ ప్రతి ఆరు నెలలకోసారి టెండర్లు పిలుస్తుంది. టెండర్లు కోట్ చేసిన వాటిలో ఎల్ 1గా వచ్చిన డెయిరీని టీటీడీ బోర్డు ఆమోదిస్తుంది. దశాబ్దాలుగా అమలులో ఉన్న ఈ నియమ నిబంధనలను ఎవరూ మార్చేందుకు ఏమాత్రం అవకాశమే లేదు.

ఎన్ఏబీఎల్ సర్టిఫికెట్

లడ్డూ తయారీకి నెయ్యి ఎవరు సరఫరా చేసినా.. వారు పంపించిన నెయ్యి ట్యాంకర్‌తో పాటు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఆఫ్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ ల్యాబరేటరీస్ (ఎన్ఏబీఎల్) గుర్తించిన ల్యాబ్ నుంచి క్వాలిటీ సర్టిఫికెట్‌ను కూడా సమర్పించాలి.

- అలా ట్యాంకర్ నుంచి తిరుపతిలోనే మూడు శాంపిల్స్ తీసి మూడు టెస్టులు చేస్తారు. అవన్నీ పాస్ అయితేనే ఆ నెయ్యిని టీటీడీ లడ్డూ ప్రసాదం, ఇతర అవసరాల కోసం వినియోగించేందుకు అనుమతిస్తారు. శాంపిల్స్ పరీక్షల్లో నాణ్యత లేదని తేలితే వెంటనే ఆ ట్యాంకర్లను తిరుపతిలోని అలిపిరి నుంచే వెనక్కి పంపుతారు. తిరుమల కొండ కూడా ఎక్కనివ్వరు.
- తగిన నాణ్యతతో లేని నెయ్యిని చాలాసార్లు వెనక్కి పంపారు. 2014–19లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో 15 సార్లు, 2019–24లో వైఎస్సార్‌సీపీ హయాంలో 18 సార్లు నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపారని టీటీడీ రికార్డులే వెల్లడిస్తున్న వాస్తవాలు.


TEST REPORT

Issued to: Water and Food Analysis Laboratory TTD, Marketing Godown, Tirumala, Andhra Pradesh, Tirupati-517504
Email: sreenivasa981@gmail.com
Kind Attention: Shri Shreenivasa Swamy

Lab Ref. No.: AB023655
Booking ID : BID-011161
Report number : NCL-026173
Report issue date : 23-07-2024
ULR No. : TC1151624000010522F
Customer Request ref.:

3	Milk fat (%)	%	As Such Basis	99.618	99.500 (Min.)	-	Clause 4 of IS 3509 : 1966

ఓ ట్యాంకర్ నెయ్యి శాంపిల్‌లో 99.618 శాతం మిల్క్ ఫ్యాట్ ఉందని తేల్చుతూ ఎన్‌డీడీబీ కాల్ఫ్ 2024 జూలై 23న ఇచ్చిన టెస్ట్ రిపోర్టు


for saponification value (Table -2). The presence of β-sitosterol (plant sterol) in the supplied consignment in the supplied ghee indicates that the ghee is adulterated with the fat of vegetable origin. Moreover, the fatty acid profile and the triglyceride composition pattern also do not comply with that of milk fat and indicate the presence of foreign fat (Table -2 and Annexure-1). The identification of β-sitosterol do not

ఎన్‌డీడీబీ టెస్ట్ రిపోర్టు ఆధారంగా నెయ్యిలో వెజిటబుల్ ఆయిల్ కలిసిందని.. ఫారిన్ ఫ్యాట్ కలిసి ఉండొచ్చునని ఏఆర్ డెయిరీ ఫుడ్స్‌కు 2024 జూలై 27న ఇచ్చిన షోకాజ్ నోటీసులో పేర్కొన్న టీటీడీ మార్కెటింగ్ విభాగం జనరల్ మేనేజర్ మురళీకృష్ణ


were confirmed to be adulterated. The presence of high levels (range: 156.917 - 208.851 mg/kg of the sample) of β-Sitosterol (plant sterol) in the supplied consignments of ghee indicates that the ghee is adulterated with the fat of vegetable origin. The FSSAI specification for ghee is absence of β-Sitosterol. Presence of such high levels of β-Sitosterol, which is a marker for the presence of vegetable oil, clearly indicates that the consignments of ghee supplied by the company were highly adulterated. Moreover, the fatty acid composition also did not comply with that of ghee, which indicates the presence of foreign fat (Table -2, 3, 4

ఎన్‌డీడీబీ టెస్ట్ రిపోర్టు ఆధారంగా కేజీ నెయ్యిలో 208.851 మిల్లీ గ్రాముల వెజిటబుల్ ఆయిల్ కలిసిందని.. ఫారిన్ ఫ్యాట్ కూడా కలిసి ఉండే అవకాశం ఉందని 2024 జూలై 28న ఏఆర్ డెయిరీ ఫుడ్స్‌కు ఇచ్చిన రిజాయిండర్ షోకాజ్ నోటీసులో స్పష్టం చేసిన టీటీడీ మార్కెటింగ్ విభాగం జనరల్ మేనేజర్


14. As per the report of the NDDB it is concluded that all the samples have vegetable and animal fat based adulterants including LARD. The reports NDDB lab are enclosed for perusal as A2a, A2b, A2c and A2d.

ఎన్‌డీడీబీ టెస్ట్ రిపోర్టు ఆధారంగా ఏఆర్ డెయిరీ ఫుడ్స్ 2024 జూలై 6, జూలై 15న సరఫరా చేసిన 4 ట్యాంకర్ల నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందంటూ అదే నెల 22న సీఎంకు ఇచ్చిన నివేదికలో పేర్కొన్న టీటీడీ అప్పటి ఈవో శ్యామలరావు (ఈయనే నెయ్యిలో జూలై 23న వనస్పతి డాల్డా వంటి వెజిటబుల్ ఆయిల్ కలిసిందని తిరుమలలో ఏడుకొండలస్వామి సాక్షిగా మీడియాకు చెప్పారు)


ICAR-National Dairy Research Institute (ICAR-NDRI,Karnal),Haryana:

During the investigation, four sealed ghee samples drawn by TTD from four tankers of M/s A R Dairy Food Private Limited (A-1) on 06.07.2024 and 12.07.2024 at TTD Warehouse, Godown-IV, Tirumala, were sent through this Hon'ble Court to ICAR-NDRI, Karnal, Haryana, to test for the presence of lard and other animal fats. NDRI, Karnal, in its report dated 16.05.2025, stated that all four samples were analyzed using a PCR-based method (Ref. No NDRI/DC/VS/SOP-I), Limit of detection (LOD):>10%, but not detected LARD in any of the four samples.

తిరుమల లడ్డూల తయారీకి ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు ఆనవాళ్లు కనిపించలేదని సీబీఐ సిట్ ఇచ్చిన నివేదికలోని భాగం

బాబు దుష్ప్రచారంపై జాతీయ మీడియాలో విమర్శల వెల్లువ

తిరుమల లడ్డూ ప్రసాదం పవిత్రతకు భంగం కలిగించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా కుట్ర పన్నడంపై జాతీయ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీవారి లడ్డూ తయారీకి ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ చార్జ్‌షీట్‌లో పేర్కొనడాన్ని జాతీయ పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. జాతీయ టీవీ చానళ్లు, డిజిటల్ మీడియా కూడా దీనికి అత్యధిక ప్రాధాన్యమిచ్చాయి. జంతువుల కొవ్వు కలిసింది అంటూ నిరాధార ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు క్షమాపణలు చెప్పాలంటూ శ్రీవారి భక్తులు, వివిధ రంగాల ప్రముఖులు డిమాండ్ చేయడాన్ని జాతీయ మీడియా ప్రస్తావించింది.

వేద మంత్రాలతో.. హోరెత్తిన
నిందా పరిహార హోమం

తిరుమల లడ్డూపై చంద్రబాబు ప్రభుత్వ అపచారానికి పరిహారంగా ప్రాయశ్చిత్తం

- భూమన నివాస ప్రాంతంలో మార్మోగిన వేదఘోష
- భక్తి శ్రద్ధలతో పాల్గొన్న భూమన దంపతులు

తిరుపతి సిటీ/సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుమల శ్రీవారి లడ్డూ వ్యవహారంపై చంద్రబాబు ప్రభుత్వం చేసిన అపచారానికి పరిహారంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం నిందాపరిహార హోమాన్ని నిర్వహించింది. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో ఎలాంటి జంతు కొవ్వు కలవలేదని సిట్ నివేదికతో స్పష్టమవడంతో ఇప్పటి వరకు ప్రసాదంపై జరిగిన దుష్ప్రచారంతో దెబ్బతిన్న శ్రీవారి పవిత్రతకు, ప్రతిష్టకు ప్రాయశ్చిత్తంగా తిరుపతి పద్మావతిపురంలోని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి నివాసంలో శుక్రవారం శ్రీనివాస ప్రసాద నిందా పరిహార హోమం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో భూమన దంపతులు పాల్గొన్న ఈ కార్యక్రమం వేదమంత్రాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

శ్రీనివాస ప్రసాద నిందా పరిహార హోమం నిర్వహిస్తున్న భూమన కరుణాకరరెడ్డి దంపతులు

శ్రీవారి ప్రసాదంపై రాజకీయ నిందలా?

'సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ శ్రీవారి లడ్డూ ప్రసాదంపై నీచపు అపనిందలు మోపారు. ఆ ఇద్దరూ కుమ్మక్కై దారుణమైన ఆరోపణలు చేశారు. పవన్‌కళ్యాణ్ అయితే దుర్గా మాత గుడి మెట్లు కడిగి అత్యంత నీచంగా ఆరోపణలు చేశారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా దెబ్బతీయాలనే కుట్రతో విష ప్రచారానికి తెగబడ్డారు. హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామిని కూడా రాజకీయాల్లోకి లాగుతూ లడ్డూ ప్రసాదం తయారీలో ఆవు కొవ్వు, పంది కొవ్వు, చేప కొవ్వు కలిసిందంటూ తప్పుడు ప్రచారం చేశారు. ఈ ఆరోపణలతో కోట్లాది మంది హిందువుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నిందలకు పరిహారంగా శ్రీనివాస ప్రసాదం నిందా పరిహార హోమం నిర్వహిస్తున్నాం. దీనిద్వారా అపవాదులు తొలగిపోతాయని విశ్వసిస్తున్నాం. అయితే, లడ్డూ ప్రసాదంలో ఎక్కడా జంతు కొవ్వు కలవలేదని, ఈ వ్యవహారంలో రాజకీయ ప్రమేయం లేదని సీబీఐ తన నివేదికలో చాలా స్పష్టంగా పేర్కొంది. ఇది చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు చెంపపెట్టుగా మారింది. దీనిని వారు జీర్ణించుకోలేక అనుకూల పత్రికలు, ఛానళ్ల ద్వారా ఇంకా తప్పుడు ప్రచారాన్ని కొనసాగించడం దారుణం' అని భూమన అన్నారు.

హోమం భగ్నానికి యత్నం

శ్రీనివాస ప్రసాదం నిందా పరిహార హోమాన్ని ఎలాగైనా భగ్నం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నింది. దీంతో కూటమి పార్టీలకు చెందిన గూండాలు ఒక్కసారిగా భూమన నివాసానికి వందల సంఖ్యలో చేరుకున్నారు. హోమం సమీపంలో నానాయాగీ చేస్తూ అరుపులు, కేకలతో గందరగోళం సృష్టించారు. ఫలితంగా స్థానికులు, హోమానికి హాజరైన వేద పండితులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. తమ దుష్ప్రచారాలు ప్రజల్లో బట్టబయలవుతాయన్న భయంతో కూటమి నేతలు హోమాన్ని అడ్డుకునేందుకు రౌడీమూకలను దింపారని భూమన ఆరోపించారు. టీడీపీకి చెందిన రాక్షస శక్తులు హోమం జరుగుతున్న తమ ఇంటిపై దాడికి ప్రయత్నించాయని, 100 మందికి పైగా రౌడీమూకలు అన్నమయ్య భవన్ సమీపంలో వీరంగం సృష్టించారని ఆయన తెలిపారు. పవిత్రమైన తిరుపతి పుణ్యక్షేత్రానికి విష సంస్కృతిని తీసుకొచ్చింది కూటమి పార్టీల పెద్దలేనని, తిరుపతి వంటి పవిత్ర క్షేత్రాన్ని రౌడీల నగరంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. దేవాలయాల పవిత్రతను కాపాడాల్సిన నేతలే ఇలాంటి అరాచక రాజకీయాలకు పాల్పడడం దురదృష్టకరమన్నారు.

సోషల్ మీడియాలో మార్ఫింగ్ చిత్రాలు

ఇక తిరుమల లడ్డూ వ్యవహారంపై సీబీఐ నివేదికతో కూటమి పార్టీలు అడ్డంగా దొరికిపోయినప్పటికీ, టీడీపీకి చెందిన కొందరు ఇప్పటికీ ప్రసాదంపై విషప్రచారం చేస్తున్నారని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపిస్తున్నారు. లడ్డూతో వేంకటేశ్వరస్వామి ఫొటోలను ఏఐ సాయంతో ఎడిట్ చేస్తూ, మార్ఫింగ్ చిత్రాలను సోషల్ మీడియాలో పోస్టులు.. వివిధ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో కూడా శ్రీ వేంకటేశ్వర స్వామి చిత్రాలను మార్ఫింగ్ చేసిన పోస్టులు కనిపిస్తున్నాయని, శ్రీవారిని అవహేళన చేసేలా క్యారికేచర్ పోస్టులు పెడుతున్నారని వారు ఆరోపించారు.



మార్స్‌పై భారీ గొయ్యి

వాటికన్ సిటీ అంత సైజు

ఇదేమిటో తెలుసా? అరుణ గ్రహమైన అంగారకుని (మార్స్) ఉపరితలంపై ఏర్పడ్డ భారీ గొయ్యి. పరిమాణం ముప్పావు కిలోమీటర్ కంటే కాస్త ఎక్కువ. దాదాపుగా వాటికన్ సిటీ అంత ఉంటుంది. అత్యంత స్పష్టతతో కూడిన ఈ ఫొటోను నాసా తాజాగా విడుదల చేసింది. మార్స్ ఉపరితలంపై ఓ భారీ గొయ్యిని ఇంత స్పష్టతతో ఒడిసిపట్టడం ఇదే తొలిసారి. మార్స్‌పై పరిశోధన నిమిత్తం నాసా పంపిన మార్స్ రికనైజాన్స్ ఆర్బిటర్ (ఎంఆర్‌ఓ)కు చెందిన అత్యంత శక్తిమంతమైన హైరైజ్ కెమెరా ఈ ఫొటోలను తీసి పంపింది. ఇవి మార్స్‌కు దాదాపు 300 కి.మీ. ఎత్తు నుంచి తీసిన ఇమేజీలు. గొయ్యి అంచులు, ఒక పక్కగా ఉబ్బెత్తు ప్రాంతం, గొయ్యి మధ్యలో నీలిరంగుతో కూడిన భాగం కూడా అత్యంత స్పష్టంగా కన్పిస్తుండటం విశేషం. మార్స్‌పై చోటుచేసుకుంటున్న మార్పులను మరింత కచ్చితత్వంతో గుర్తించేందుకు ఈ ఫొటో దోహదపడగలదని భావిస్తున్నారు. అంతేగాక భావి మార్స్ మిషన్‌లకు అక్కడ వనరుల లభ్యత తదితరాలపై కూడా ఇంకాస్త స్పష్టమైన అంచనాకు వచ్చే వీలుందంటున్నారు. ఈ గొయ్యి మార్స్‌పై అసిడాలియా ప్లాంటియా ప్రాంతంలో ఏర్పడింది. ఇది బహుశా కొద్దికాలం క్రితమే ఏర్పడి ఉంటుందని నాసా సైంటిస్టులు భావిస్తున్నారు. బహుశా ఏదో గ్రహశకలం వంటిది ఢీకొనడం వల్ల ఈ గొయ్యి పుట్టుకొచ్చిందని వారు చెబుతున్నారు. అసిడాలియా ప్లాంటియా అనేది మార్స్‌పై ఉత్తర దిశలో ఉన్న లోతట్టు ప్రాంతం. అక్కడ కచ్చితంగా పురాతన సముద్రాల్లో, లోపలి పొరల్లో కూరుకుపోయిన మంచు గుట్టలో ఉండి ఉంటాయన్నది సైంటిస్టుల నమ్మకం. ఎంఆర్‌ఓను నాసా 2005 ఆగస్టులో ప్రయోగించింది. మార్స్‌పై నీటి ఆనవాళ్లను గుర్తించడం ద్వారా అది సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు.

- సాక్షి, నేషనల్ డెస్క్

గ్రీన్‌లాండ్‌కు పాచి పడుతోంది!

- మరింత వేడిమిని గ్రహిస్తున్న మంచు
- శరవేగంగా కరిగిపోతున్న వైనం
- విపరిణామాలు ఖాయం: సైంటిస్టులు
- సముద్రమట్టాలు పెరుగుతాయి
- తీర పట్టణాలు, ప్రాంతాలకు ముప్పు

ప్రపంచంలోనే అతి పెద్దవైన గ్రీన్‌లాండ్ దీవులకు పెను ముప్పు పొంచి ఉంది. అయితే అది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొద్ది నెలలుగా బెదిరిస్తూ వస్తున్న ఆక్రమణ ముప్పు కాదు. పాచి ముప్పు! అవును. అపారమైన మంచుకు నిలయమైన గ్రీన్‌లాండ్ దీవులు నానాటికీ విపరీతంగా పాచిపట్టిపోతున్నాయి! దాంతో అక్కడ మంచు కరుగుదల రేటు చూస్తుండగానే మరింత ప్రమాదకర స్థాయికి పెరిగిపోతోంది. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే గ్రీన్‌లాండ్‌కే కాక ప్రపంచమంతటికీ త్వరలో పెను ముప్పు తప్పదని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా పలు తీర నగరాలు, ప్రాంతాలు అనుకున్న దానికంటే చాలా ముందుగానే సముద్రంలో మునిగిపోతాయని అంచనా వేస్తున్నారు. దుమ్ము తదితరాల వల్ల హిమానీనదాల్లో పాచి పరిమాణం క్రమంగా పెరిగిపోతోంది. దీనివల్ల మంచు కూడా స్వచ్ఛని తెలుపు రంగు కోల్పోయి మకిలిపడుతుంది. ఫలితంగా మంచు వేడిని ఎక్కువగా పీల్చుకుంటుంది. దాంతో అది కరిగే వేగం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతుంది. ఇప్పుడు గ్రీన్‌లాండ్ దీవుల్లో అదే జరుగుతోంది. తాజా అధ్యయనం ఒకటి ఈ మేరకు తేల్చింది. ఈ దెబ్బకు సముద్రమట్టం కూడా వేగంగా పెరుగుతోందని నిర్ధారించింది. ఈ అధ్యయనం వెల్లడించింది. దుమ్మూధూళి, ఖనిజాల తాలూకు సూక్ష్మకణాలు గాలితో పాటుగా గ్రీన్‌లాండ్ మంచుపై భారీ పరిమాణంలో వచ్చిపడుతున్నాయట. ''వాటివల్ల మంచుపై నాచు పొర ఏర్పడుతోంది. దాంతో తెల్లని మంచు కాస్తా రంగు మారి వెలిసిపోతోంది. అలా అది సూర్యరశ్మిని మరింత ఎక్కువగా గ్రహిస్తోంది'' అని అధ్యయన బృంద సారథి ప్రొఫెసర్ జెనిన్ మెక్‌కచోన్ వివరించారు. ''ఫలితంగా మంచు మరింతగా కరిగిపోతోంది. ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఈ వెచ్చని ఉపరితలం మరింత నాచు ఏర్పడటానికి, దుమ్ము పేరుకోవడానికి కారణమవుతుంది. తద్వారా గ్రీన్‌లాండ్ మంచు తెలుపును కోల్పోయి నానాటికీ మరింతగా ముదురు రంగులోకి మారుతుంది. దాంతోపాటే అది సూర్యరశ్మిని మరింతగా గ్రహిస్తుంది. అలా అక్రమంగా ఇదో విషవలయంగా మారుతుంది'' అని ఆయన హెచ్చరించారు. గ్రీన్‌లాండ్‌లోని మంచు పూర్తిగా కరిగితే ప్రపంచవ్యాప్తంగా సముద్రమట్టం ఏకంగా 7 మీటర్లు పెరుగుతుంది! లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న కోట్లాది మంది నిర్వాసితులుగా మారిపోతారు. వారి జీవనోపాధికి గండి పడుతుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

రుతుక్రమ ఆరోగ్యం ప్రాథమిక హక్కు

జీవించే, విద్యా హక్కుల్లో భాగమే: సుప్రీంకోర్టు

- స్కూళ్లలో ఉచితంగా అందుబాటులో శానిటరీ ప్యాడ్లు
- బాలబాలికలకు, దివ్యాంగులకు వేర్వేరు టాయిలెట్లు
- అమలు చేయని స్కూళ్ల గుర్తింపు రద్దు, కఠిన చర్యలు
- ఈ ఆదేశాలన్నీ మూడు నెలల్లోగా అమలు కావాలి
- కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలితక ప్రాంతాలకు నిర్దేశాలు

న్యూఢిల్లీ: రుతుక్రమ ఆరోగ్యాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని జీవించే హక్కుతో పాటు విద్యా హక్కులో కూడా రుతుక్రమ ఆరోగ్యం భాగమని స్పష్టం చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. బాలికల కోసం ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లన్నింటిలోనూ బయో డిగ్రేడబుల్ శానిటరీ నాప్కిన్స్ ఉచితంగా అందుబాటులో ఉంచాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. బాల బాలికలకు, దివ్యాంగులకు విడి టాయ్‌లెట్లు ఉండాల్సిందేనని కూడా స్పష్టం చేసింది. వీటిని అమలు చేయని ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని, సర్కారీ స్కూళ్లయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొంది. సదరు సౌకర్యాలన్నీ అమలవుతున్నదీ లేనిదీ జిల్లా విద్యాధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించింది. నిష్పాక్షిక సర్వేల ద్వారా కూడా వాస్తవ స్థితిగతులను ఎప్పటికప్పుడు వారు తెలుసుకుంటూ ఉండాలని పేర్కొంది. విద్యా హక్కు చట్టంలోని సెక్షన్–19 ప్రకారం అన్ని పాఠశాలలూ ఈ నిబంధనలను, ప్రమాణాలను పాటించడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. లింగ సమానత్వం, విద్యాపరమైన సమానత్వాన్ని సాధించడమే లక్ష్యం కావాలని ఈ సందర్భంగా ధర్మాసనం ఆకాంక్షించింది. నెలసరి ఆరోగ్యంపై బాలికలకు సరైన శిక్షణ, అవగాహన కల్పించాలని కోరింది. విద్యా ప్రణాళికలో ఆ అంశాలను కూడా భాగం చేయాలని ఎన్‌సీఈఆర్‌టీ, రాష్ట్ర విద్యా మండళ్లు, సంబంధిత విద్యా విభాగాలకు సూచించింది. విద్యార్థినుల ఆరోగ్యం కోసం దేశవ్యాప్తంగా రుతుక్రమ పరిశుభ్రత విధానం అమలు చేయాలంటూ జయా ఠాకూర్ సుప్రీంకోర్టు పిటిషన్ వేశారు. దాని 2024 డిసెంబర్ 10వ తేదీన వాదనలు ముగించిన ధర్మాసనం తాజాగా తీర్పు వెలువరించింది.

సమస్యల లేమి చేదు వాస్తవం

ధర్మాసనం తరఫున 126 పేజీల తీర్పును జస్టిస్ పార్దివాలా రాశారు. రుతుక్రమం బాలికల విద్యకు ముగింపు కారాదన్న ప్రఖ్యాత అమెరికా విద్యావేత్త, సామాజిక కార్యకర్త మెలిసా మెర్టన్ కొటేషన్‌తో తీర్పును మొదలుపెట్టారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా బాలికల విద్య విషయంలో ఒకప్పటి సవాళ్లే ఇప్పటికీ పెను సమస్యలుగా నిలిచి ఉన్నాయన్నది ఒప్పుకోక తప్పని చేదు నిజమంటూ ఆవేదన వెలిబుచ్చారు. ''రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కులో భాగమే రుతుక్రమ ఆరోగ్యం. చదువుకోవడానికి ఆటంకంగా నిలిచే ప్రతి అడ్డంకిని తొలగించడమూ విద్యా హక్కులో భాగమే. సౌకర్యాల లేమితో బాలికలు స్కూలుకు వెళ్లలేకపోతే ఇతర ప్రాథమిక హక్కులకూ దూరమవుతారు. బాలికలకు సురక్షితమైన, గౌరవప్రదమైన విద్యా వాతావరణం కల్పించడం రాజ్యాంగ బాధ్యత'' అని ధర్మాసనం నొక్కిచెప్పింది. ''రుతుక్రమం వల్ల శరీరం అపవిత్రమైందనే భావనతో ఏ బాలికైనా చదువుకు దూరమైతే మేం చెప్పదలచింది ఒక్కటే. అది నీ తప్పు కాదు. సమాచార లోపం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మౌనమే అందుకు కారణం'' అని పేర్కొంది.

స్కూళ్లలో పరిశుభ్రత విభాగం

విద్యార్థినుల నెలసరి శుభ్రత గురించి వెలువరించిన తీర్పులో ధర్మాసనం జారీ చేసిన ముఖ్య ఆదేశాలు...

- నెలసరి ఆరోగ్యంపై బాలికలకు సరైన శిక్షణ, అవగాహన కల్పించాలి.
- ఎన్‌సీఈఆర్‌టీ, రాష్ట్ర విద్యా మండళ్లు, సంబంధిత విద్యా విభాగాలు దీన్ని విద్యా ప్రణాళికలో భాగం చేయాలి.
- ఏఎస్‌టీఎం డి–6954 నాణ్యత ప్రమాణాలతో కూడిన ఆక్సో–బయో డిగ్రేడబుల్ శానిటరీ నాప్కిన్స్‌ను గ్రామీణ, పట్టణ అనే తారతమ్యాలకు అతీతంగా అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ స్కూళ్లలోనూ ఉచితంగా అందుబాటులో ఉంచాలి.
- నాప్కిన్లు విద్యార్థినుల టాయిలెట్ల సమీపంలో వెండింగ్ మెషీన్ల ద్వారా లేదా పాఠశాలలోని నిర్ణీత అధికారి వద్ద అందుబాటులో ఉండేలా చూడాలి.
- నాప్కిన్లను పడేసేందుకు టాయ్‌లెట్ల పక్కనే మూతతో కూడిన వేస్ట్‌బిన్ విధిగా ఉండాలి. దాన్ని ఎప్పటికప్పుడు శుభ్రపరచేలా యాజమాన్యాలు శ్రద్ధ వహించాలి.
- బాలబాలికలకు వేర్వేరు టాయిలెట్లు ఉండాలి. అవి చక్కగా పని చేసే స్థితిలో ఉండాలి.
- టాయ్‌లెట్లలో నిరంతర నీటి వసతితో పాటు సబ్బు, వాష్‌బేసిన్, ఇతర కనీస సదుపాయాలు అందుబాటులో ఉండాలి.
- ప్రతి స్కూలులోనూ నెలసరి పరిశుభ్రత విభాగం ఏర్పాటు చేయాలి. అందులో శానిటరీ ప్యాడ్లతో పాటు లో దుస్తులు, అదనపు యూనిఫాం, డిస్పోజబుల్ బ్యాగులు ఉంచాలి.
- వాడేసిన శానిటరీ నాప్కిన్లను సురక్షితంగా, పర్యావరణహితంగా పారవేసే ఏర్పాట్లు ప్రతి స్కూల్లోనూ ఉండాలి.
- వ్యర్థాలను పారవేసే విషయంలో ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలి.
- టాయిలెట్లు విద్యార్థినుల గోప్యతను కాపాడేలా ఉండాలి.
- దివ్యాంగ విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా విడిగా టాయిలెట్లను నిర్మించాలి
- నెలసరి శుభ్రత, దానికి సంబంధించిన అన్ని అంశాలపైనా ఉపాధ్యాయులందరికీ సమగ్ర శిక్షణ ఇవ్వాలి. నెలసరిలో ఉన్న పిల్లలకు ఎలా సాయపడాలో వారికి పూర్తిగా తెలిసుండాలి.
- జన్ ఔషధీ సువిధా ఆక్సో బయో డిగ్రేడబుల్ శానిటరీ నాప్కిన్లు ఎక్కడెక్కడ అందుబాటులో ఉన్నదీ సోషల్ మీడియా, ప్రింట్ మీడియాతో పాటు రేడియో, టీవీ, సినిమా హాళ్లలో, బస్సులు, ఆటోలపై, గోడలపై ప్రకటనల రూపంలో విస్తృతంగా ప్రచారం చేయాలి.
- నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ ఏర్పాటు చేసిన చైల్డ్ హెల్ప్‌లైన్ గురించి కూడా విస్తృతంగా ప్రచారం చేయాలి.

విద్యా హక్కుకు తూట్లు

సురక్షితమైన, ప్రభావవంతమైన నెలసరి శుభ్రత చర్యలు విద్యార్థినుల్లో అత్యున్నత ప్రమాణాలతో కూడిన లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యానికి దోహదపడతాయని ధర్మాసనం అభిప్రాయపడింది. ''లైంగిక ఆరోగ్యానికి సంబంధించిన విద్య, సమాచారాన్ని పొందే హక్కు ఆరోగ్యకరమైన పునరుత్పత్తి జీవన హక్కులో విడదీయలేని భాగం. స్కూళ్లలో నెలసరి శుభ్రత నిర్వహణ సదుపాయాలు, సౌకర్యాల లేమి విద్యార్థినుల ఆత్మగౌరవాన్నే దారుణంగా దెబ్బతీస్తుంది. విద్య, సంబంధిత అంశాల్లో ఇతర విద్యార్థులతో సమానంగా పోటీ పడే హక్కుకు భంగం కలిగిస్తుంది'' అని అభిప్రాయపడింది. ''జీవించే హక్కు, ఆత్మ గౌరవం అనే విస్తృత చట్రంలో విద్యా హక్కు భాగం. విద్య అందుబాటులో లేకుండా అవి అసాధ్యం'' అని పేర్కొంది.

క్యూబాకు చమురు అమ్మితే సుంకాలే

ప్రపంచ దేశాలకు ట్రంప్ హెచ్చరికలు

వాషింగ్టన్: క్యూబాపై ముప్పేట దాడిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరింత తీవ్రతరం చేస్తున్నారు. ఆ దేశానికి చమురు అమ్మిన దేశాలపై మరిన్ని టారిఫ్‌లు విధిస్తానని ప్రకటించారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుపై గురువారం ట్రంప్ సంతకం కూడా చేశారు. క్యూబాకు చమురు సరఫరా చేస్తున్న మెక్సికోను లక్ష్యంగా చేసుకునే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. క్యూబాకు చమురు సరఫరాలను తాత్కాలికంగా నిలిపేసినట్టు మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ ఇటీవలే ప్రకటించడం తెలిసిందే.

ఏడు జిల్లాల్లో చొరబాటుదార్లదే మెజార్టీ

- కాంగ్రెస్ నిర్వాకాల వల్ల అస్సాం జనాభా స్థితిగతుల్లో మార్పులు
- చొరబాటుదార్ల సంఖ్య ఏకంగా 64 లక్షలకు చేరుకుంది
- వారి నుంచి విముక్తి లభించాలంటే బీజేపీని గెలిపించాలి
- అస్సాం బహిరంగ సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపు



గౌహతి: అస్సాంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చొరబాటుదార్లు విచ్చలవిడిగా ప్రవేశించారని, రాష్ట్రంలో జనాభా స్థితిగతుల్లో ప్రతికూల మార్పులు వచ్చాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆరోపించారు. అస్సాం నుంచి చొరబాటుదార్లను బయటకు పంపించి, స్థానికులను రక్షించడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. శుక్రవారం అస్సాం రాష్ట్రం ధెమాజీ జిల్లాలో మిసింగ్ తెగ ప్రజల యువజన వేడుక ముగింపు కార్యక్రమానికి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం దిబ్రూగఢ్‌లో పర్యటించారు. రూ.1,715 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ప్రసంగించారు. చొరబాటుదార్ల నుంచి రాష్ట్రానికి పూర్తిస్థాయిలో విముక్తి లభించాలంటే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకాల వల్ల ఇక్కడ చొరబాటుదార్ల సంఖ్య ఏకంగా 64 లక్షలకు చేరుకుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఏడు జిల్లాల్లో వారే మెజార్టీగా ఉన్నారని చెప్పారు. ఈ ధోరణి మారాలంటే బీజేపీని గెలిపించాలని స్పష్టంచేశారు. అస్సాంలో జనాభా స్థితిగతులను పూర్వస్థితికి తీసుకురావాలన్నదే మోదీ ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. చొరబాటుదార్ల నుంచి విముక్తి కల్పించడం బీజేపీతోనే సాధ్యమని వ్యాఖ్యానించారు.

ముఖ్యమంత్రికి మరింత బలం ఇవ్వాలి

''చొరబాట్లు ఆగాలని ప్రజలు నిజంగా కోరుకుంటే మళ్లీ బీజేపీ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి. చొరబాట్లకు వ్యతిరేకంగా పోరాడేందుకు ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మకు మరింత బలం ఇవ్వాలి. రాష్ట్రంలో బీజేపీ రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. 1.26 లక్షల ఎకరాల భూములను చొరబాటుదార్ల నుంచి కాపాడింది. మిసింగ్ తెగ ప్రజలు కష్టజీవులు. శ్రమించడం వారి సంస్కృతిలోనే ఉంది. ఎగువ అస్సాంలోకి చొరబాటుదార్లు ప్రవేశించకుండా అడ్డుకుంటున్నారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉంది. బ్రహ్మపుత్ర నదిపై బోగిబీల్ వంతెనను నిర్మించింది. దీనివల్ల దిబ్రూగఢ్, ధెమాజీ మధ్య అనుసంధానం పెరిగింది. భారతదేశ ప్రగతికి ఈ వంతెన ఒక ప్రతీకగా నిలుస్తోంది. దివంగత ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అస్సాం నుంచి రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. కానీ, బోగిబీల్ వంతెన నిర్మాణం పూర్తిచేయలేదు. నరేంద్ర మోదీ పట్ల రాష్ట్ర ప్రజలు విశ్వాసం కనబర్చారు. అందుకే వంతెన నిర్మాణం నాలుగేళ్లలో విజయవంతంగా పూర్తయ్యింది'' అన్నారు.

రాహుల్ అవమానించడం దారుణం

ఈశాన్య రాష్ట్రాలను కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అవమానించడం దారుణం. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగిన 'ఎట్‌హోం' కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అందజేసిన 'గమోసా'ను ధరించడానికి రాహుల్ నిరాకరించారు. దేశ విదేశీ ప్రముఖులు ఆ కండువాను గౌరవపూర్వకంగా ధరిస్తే రాహుల్ మాత్రం ధరించకుండా అగౌరవపర్చారు. ఈశాన్య రాష్ట్రాల సంస్కృతిని కించపరిస్తే బీజేపీ ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోదు. అస్సాం అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదు. తుపాకులు, తూటాలు, ఘర్షణలు, మరణాలు తప్ప అస్సాంకు కాంగ్రెస్ ఇచ్చిందేమిటో చెప్పాలి. ఆ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేసింది. అందుకోసం చొరబాట్లను ఆయుధంగా ఉపయోగించుకుంది. బీజేపీ అధికారంలోకి వచ్చాక చొరబాట్లకు అడ్డుకట్ట పడింది. చట్టవిరుద్ధంగా మనదేశంలోకి ప్రవేశించినవారిని గుర్తించి, కచ్చితంగా వెనక్కి పంపిస్తాం. రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోంది. యూరోపియన్ యూనియన్‌తో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో అస్సాం తేయాకు పరిశ్రమకు, కార్మికులకు లబ్ధి చేకూరుతుంది. ఇక్కడ నుంచి యూరప్ దేశాలకు తేయాకు ఎగుమతులు పెరుగుతాయి. అభివృద్ధి, శాంతి, రక్షణ, పారిశ్రామిక, వ్యవసాయ ప్రగతి కావాలంటే మరోసారి బీజేపీకి పట్టం కట్టాలి. చొరబాట్లు, వరదల నుంచి అస్సాంను కాపాడే సత్తా బీజేపీకి మాత్రమే ఉంది'' అని అమిత్ షా తేల్చిచెప్పారు.

అన్ని సంస్కృతులు, సంప్రదాయాలు, భాషలు సమానమే

''కాంగ్రెస్ పాలనలో గిరిజన తెగలు అస్థిత్వ సమస్యను ఎదుర్కొన్నారు. సొంత గుర్తింపును కాపాడుకొనేందుకు పోరాడాల్సి వచ్చింది. బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే వారికి భద్రత లభిస్తోంది. పారామిలటరీ దళాల్లో నియామకాల విషయంలో గిరిజన యువతకు ప్రాధాన్యమిస్తాం. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, భాషలకు మరింత గుర్తింపు దక్కాల్సి ఉంది. వేర్వేరు సంస్కృతుల సమ్మేళనం వల్లనే భారతదేశ సంస్కృతి మరింత వికసిస్తుంది. దేశంలో అన్ని రకాల సంస్కృతులు, సంప్రదాయాలు, భాషలకు సమాన హక్కులున్నాయి. అవన్నీ సమానమే'' అని అమిత్ షా చెప్పారు.

మహా ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర పవార్

నేడు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం

ముంబై: మహారాష్ట్ర నూతన ఉప ముఖ్యమంత్రిగా దివంగత నేత అజిత్ పవార్ భార్య, రాజ్యసభ సభ్యురాలు సునేత్ర పవార్ బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఆమె శనివారమే ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్లు ఎన్సీపీ(అజిత్ పవార్) వర్గాలు వెల్లడించాయి. మహారాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర పవార్ రికార్డు సృష్టించబోతున్నారు. ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ బుధవారం విమాన ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. భర్త స్థానంలో సునేత్ర పవార్ బాధ్యతలు స్వీకరించాలని పార్టీ వర్గాలు కోరడంతో ఆమె అంగీకరించినట్లు సమాచారం. శనివారం ఉదయం ముంబైలో తమ పార్టీ సమావేశం జరుగుతుందని, సునేత్ర పవార్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకుంటామని ఎన్సీపీ(అజిత్ పవార్) వర్గాలు తెలియజేశాయి. సాయంత్రం డిప్యూటీ సీఎంగా ఆమె ప్రమాణం చేస్తారని పేర్కొన్నాయి. సునేత్ర పవార్‌కు రాజకీయాలతో అనుబంధం ఉంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బారామతి స్థానం నుంచి ఎన్సీపీ(అజిత్ పవార్) అభ్యర్థిగా పోటీ చేశారు. కానీ, ఎన్సీపీ(శరద్ పవార్) అభ్యర్థి సుప్రియా సూలే చేతిలో ఓడిపోయారు. అనంతరం సునేత్ర రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆమె మహారాష్ట్ర అసెంబ్లీలో సభ్యురాలు కాదు. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపడితే ఆరు నెలల్లోగా ఎమ్మెల్యేగా ఎన్నికల కావాల్సి ఉంది. తన భర్త మరణంతో ఖాళీ అయిన బారామతి నుంచి ఆమె పోటీ చేస్తారని ప్రచారం సాగుతోంది. మరోవైపు ఉభయ ఎన్సీపీలు ఏకం కాబోతున్నాయని, దీనిపై త్వరలో చర్చలు ప్రారంభమవుతాయని చెబుతున్నారు.

'నరేగా చోర్ గద్దీ చోడ్'

- ఢిల్లీలో కాంగ్రెస్ నరేగా బచావో సంగ్రామ్ యాత్ర
- ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయడంపై మండిపాటు
- గాంధీజీ పేరిట పథకం కొనసాగడం మోదీకి ఇష్టం లేదని ఆగ్రహం

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం రద్దు చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. మహాత్మాగాంధీ పేరుతో ముడిపడి ఉన్న చట్టం ఎక్కువ కాలం కొనసాగడం, ప్రజల ఉపాధి హామీకి చట్టబద్ధమైన హక్కు కల్పించడం మోదీకి ఎంతమాత్రం ఇష్టం లేదని విమర్శించింది. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద 'నరేగా బచావో సంగ్రామ్ యాత్ర' నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు, కార్యకర్తలు ఈ యాత్రలో పాల్గొన్నారు. ప్రజలకు కల్పించిన రాజ్యాంగ హక్కును మోదీ ప్రభుత్వం కాలరాసిందని వారు మండిపడ్డారు. ఉపాధి హామీ చట్టంలోని అసలైన స్ఫూర్తి వీబీ–జీ రామ్ జీ చట్టంలో లేదని తేల్చిచెప్పారు. 'నరేగా చోర్ గద్దీ చోడ్' అంటూ బిగ్గరగా నినదించారు. ప్రధాని మోదీ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్‌చేశారు. గాంధీ స్మృతి వరకు యాత్రను తలపెట్టగా పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ప్రసంగించారు. ఉపాధి హామీ చట్టంపై మోదీ సర్కార్ బుల్డోజర్ ప్రయోగించిందని ధ్వజమెత్తారు. నిజానికి ఇది చరిత్రాత్మక, విప్లవాత్మక చట్టమని పేర్కొన్నారు. 2005 సెప్టెంబర్‌లో ఎంపీలు ఏకగ్రీవంగా ఆమోదించడంతో చట్టం అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. ఉపాధి హామీ చట్టం రావడం వెనుక మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ, రాహుల్ గాంధీల కృషి ఎంతో ఉందని వివరించారు. ప్రజలకు పని విషయంలో రాజ్యాంగ హక్కు, చట్టపరమైన గ్యారంటీ లభించిందని అన్నారు. పంచాయతీలు సైతం బలోపేతం అయ్యాయని తెలిపారు. తొలిసారిగా ప్రజలకు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా వేతనాలు అందాయని పేర్కొన్నారు. గొప్ప చట్టాన్ని ఏకపక్షంగా రద్దు చేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సీనియర్‌నేత పవన్ ఖేరా మాట్లాడుతూ... ఉపాధి హామీ చట్టంపై మోదీ ప్రభుత్వ వైఖరిని కచ్చితంగా అడ్డుకుంటామని తేల్చిచెప్పారు. రైతులు, కూలీలు, యువతను ప్రభుత్వం కించపర్చిందని మండిపడ్డారు. ఇందుకు మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు.

కెనడా విమానాలపై 50% టారిఫ్‌లు

ట్రంప్ తాజా బెదిరింపులు



వాషింగ్టన్: కెనడాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి టారిఫ్‌ల బాంబు పేల్చారు. అమెరికాలో విక్రయించే కెనడా విమానాలపై ఏకంగా 50 శాతం సుంకాలు బాదుతానని ప్రకటించారు. తన సోషల్ మీడియా వేదిక ట్రూత్‌సోషల్ పోస్టులో ఈ మేరకు పేర్కొన్నారు. జార్జియాకు చెందిన అమెరికా కంపెనీ గల్ఫ్‌స్ట్రీమ్ ఏరోస్పేస్‌కు చెందిన జెట్ విమానాలను సర్టిఫై చేసేందుకు కెనడా నిరాకరించిందంటూ ఆయన ఈ మేరకు బెదిరింపులకు దిగారు. కెనడా నిర్ణయానికి ప్రతిచర్యగా బొంబార్డియర్‌తో పాటు ఆ దేశానికి చెందిన అన్ని కంపెనీల విమానాలనూ తాము కూడా డీసర్టిఫై చేస్తామని హెచ్చరించారు. బొంబార్డియర్ విమానాల గుర్తింపు రద్దు తక్షణం అమల్లోకి వస్తుందని కూడా ప్రకటించారు. బొంబార్డియర్, గల్ఫ్‌స్ట్రీమ్ ఒకరకంగా ఆగర్భ శత్రువులు. ట్రంప్ ప్రకటనపై మాంట్రియల్‌కు చెందిన బొంబార్డియర్ కంపెనీ వెంటనే స్పందించింది. ఆయన హెచ్చరికలపై కెనడా ప్రభుత్వంతో చర్చిస్తున్నట్టు చెప్పింది.

కెనడాపై కత్తులు

కెనడాపై కొంతకాలంగా ట్రంప్ కత్తులు నూరుతున్నారు. ముఖ్యంగా కెనడా ప్రధాని మార్క్ కార్నీకి, ఆయనకు నడుమ సంబంధాలు బాగా బెడిసికొట్టాయి. కార్నీని ట్రంప్ తరచూ 'కెనడా గవర్నర్' అని సంబోధిస్తూ హేళన చేస్తున్నారు. పెద్ద దేశాల ఒంటెత్తు పోకడల వల్ల అంతర్జాతీయ ఒప్పందాలకు విలువే లేకుండా పోతోందంటూ ట్రంప్ తీరును దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం వేదిక నుంచే కార్నీ తూర్పారబట్టారు. అప్పటినుంచీ వారి నడుమ మాటల యుద్ధం కొనసాగుతోంది. చైనాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటే కెనడాపై టారిఫ్‌లను ఏకంగా 100 శాతానికి పెంచుతానని ఇటీవలే ట్రంప్ బెదిరించడం తెలిసిందే. అయినా కార్నీ చైనాలో పర్యటించడమే గాక ఆ దేశంతో ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు.

ప్రధాని మోదీకి రోడ్రిగ్జ్ ఫోన్

న్యూఢిల్లీ: వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్‌లో సంభాషించారు. ద్వైపాక్షిక బంధాన్ని బలోపేతం చేసుకుందామని ప్రతిపాదించారు. అన్ని రంగాల్లోనూ ఇరు దేశాల సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లాలని ఇరువురు నేతలు ఈ సందర్భంగా నిర్ణయించారు. వెనెజువెలాపై అమెరికా దాడి చేసి అధ్యక్షుడు నికొలస్ మదురో దంపతులను నిర్బంధంలోకి తీసుకోవడం, అనంతరం దేశ పగ్గాలను రోడ్రిగ్జ్ తాత్కాలికంగా చేపట్టడం తెలిసిందే. ఆ తర్వాత ఆమె మోదీతో ఫోన్లో సంభాషించడం ఇదే తొలిసారి. రోడ్రిగ్జ్‌తో చర్చలు ఫలప్రదంగా సాగినట్టు మోదీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

ఆర్టెమిస్ ప్రయోగం ఆలస్యం

కేప్ కనవెరాల్: అమెరికా అంతరిక్ష సంస్థ నాసా చంద్రుడిపైకి తలపెట్టిన ఆర్టెమిస్ ప్రయోగం ఆలస్యమయ్యే సూచనలు కన్పిస్తున్నాయి. అమెరికా వ్యాప్తంగా నెలకొన్న అతిశీతల వాతావరణ పరిస్థితులే ఇందుకు కారణం. ప్రయోగం చేపట్టే కెన్నడీ స్పేస్ సెంటర్‌లో మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఫిబ్రవరి 8వ తేదీ కంటే ముందుగానే ఈ యాత్రను చేపట్టాలని నాసా ప్రణాళికలు సిద్ధం చేసింది. శనివారం 98 మీటర్ల ఎత్తయిన రాకెట్ ఫ్యూయలింగ్ టెస్ట్ చేపట్టాలని నాసా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకుంది. తీవ్ర శీతల పరిస్థితులు నెలకొనడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. అదేవిధంగా, వ్యోమగాముల డ్రెస్ రిహార్సల్స్ కూడా వాయిదా పడింది.

సాక్షి గుంటూరు

శనివారం। 31। జనవరి। 2026

అమ్మవారికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):పొన్నెకల్లుకు చెందిన ఎనకొల్లు శివాజీ కుటుంబం విజయవాడలోని కనకదుర్గమ్మ అమ్మవారి నిత్యాన్నదానానికి రూ.1,11,111 విరాళాన్ని అందజేశారు



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 2900 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి నిల్వ 36.8230 టీఎంసీలు.



నిమ్మకాయల ధరలు

తెనాలి:తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3200, గరిష్ట ధర రూ.3800, మోడల్ ధర రూ.3400 వరకు పలికింది.

న్యూస్‌రీల్

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

13వ అదనపు జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తి కె.శ్యాంబాబు

నరసరావుపేట టౌన్ : జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని 13వ అదనపు జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తి కె.శ్యామ్‌బాబు తెలిపారు. మార్చి 14న నిర్వహించే అదాలత్‌ను పురస్కరించుకొని శుక్రవారం స్థానిక న్యాయాధికారులతో కోర్టు హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సివిల్ వివాదాలు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, ఫైనాన్స్ రికవరీ కేసులు, చెక్కు బౌన్స్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే దిశగా కృషి చేయాలన్నారు. కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై న్యాయమూర్తులకు దిశానిర్దేశం చేశారు. వీలైనంత ఎక్కువ మంది కక్షిదారులకు లబ్ధి చేకూర్చేలా చొరవ చూపాలని కోరారు. కోర్టుల చుట్టూ తిరిగి డబ్బు, సమయం వృధా కాకుండా ఉభయ పక్షాల అంగీకారంతో వివాదాలను సామరస్యంగా ముగించుకోవడానికి ఈ లోక్ అదాలత్ ఒక చక్కటి వేదిక అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయాధికారులు కె.మధుస్వామి, ఆశీర్వాదం పాల్, ఏ.సలోమి తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు

తెనాలిటౌన్: పట్టణ షరాఫ్‌బజార్‌లోని శ్రీ సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం స్వామివారిని సూర్యప్రభ వాహనంపై, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో హరి ప్రసాద్ మాట్లాడుతూ 28వ తేదీ ప్రారంభమైన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 3వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్‌లు మాట్లాడుతూ ఉత్సవాల్లో 31వ తేదీ రాత్రి సువర్చలా హనుమత్ కళ్యాణం, ఫిబ్రవరి 1వ తేదీ రాత్రి రథోత్సవం, 2వ తేదీ ఉదయం చక్రస్నానం, పూర్ణాహుతి, 3వ తేదీ పుష్పోత్సవం, 4వ తేదీ తిరుప్పావడ సేవ, తదితర కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

లక్ష్మీ తిరుపతమ్మ తల్లి కల్యాణ మహోత్సవం

దాచేపల్లి: లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం జరిగింది. స్థానిక చాపలగడ్డ బజారులో జరిగిన అమ్మవారి కల్యాణ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అభిషేకాలు చేసి అమ్మవారి గీతాలను మాలధారులు ఆలపించారు. అమ్మవారి కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు భక్తులు, మాలధారులకు అందించారు. కార్యక్రమంలో అమ్మవారి మాలధారణ ప్రచార సమితి రాష్ట్ర అధ్యక్షుడు అన్నం సైదులు, గురుస్వామి బ్రహ్మయ్య, మౌలాలీ, గోపి తదితరులు పాల్గొన్నారు.

రేపు స్వామివారి తెప్పోత్సవం

మంగళగిరి టౌన్ : మంగళగిరి పట్టణంలో వేంచేసి యున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో ఆదివారం స్వామివారి తెప్పోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాఘ పౌర్ణమి ఆదివారం ఫిబ్రవరి 1వ తేదీ ఉదయం 6 గంటలకు స్వామివారి దేవస్థానం నుంచి బయలు దేరి సీతానగరం ఆంజనేయస్వామి వారి దేవస్థానం వద్దకు ఉదయం 9 గంటలకు చేరుకుని, శ్రీ స్వామి వారి అమ్మవార్ల తిరుమంజనం అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు కృష్ణా నదిలో తెప్పోత్సం జరుగుతుందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏమార్చి.. ఎడాపెడా దోచి..

- సీటింగ్ చలానాతో స్లీపర్ లాభాలు
- రవాణా శాఖ ఆదాయానికి గండి
- అమలు కాని నిబంధనలు
- కనీసం పట్టించుకోని అధికారులు

జిల్లాలో ప్రైవేట్ బస్సుల ఇష్టారాజ్యం

స్లీపర్ బస్సు లోపలి చిత్రం

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): జిల్లాలో ప్రైవేట్ బస్సుల యాజమాన్యాల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. 36 సీట్ల సీటింగ్ అనుమతులతో బస్సులు నమోదు చేసుకుని, నిబంధనలకు విరుద్ధంగా స్లీపర్‌లుగా మార్చి నడుపుతున్నా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారులు కనీస చర్యలకు కూడా ఉపక్రమించకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది. దీని వలన ప్రయాణికుల భద్రత, ప్రభుత్వ ఆదాయం రెండూ ప్రమాదంలో పడుతున్నాయి. రవాణా శాఖ అంచనాల ప్రకారం జిల్లాలో సుమారు 350 నుంచి 400 వరకు ప్రైవేట్ బస్సులు, వివిధ అంతర్‌జిల్లాల రూట్లలో నడుస్తున్నాయి. వీటిలో 100కు పైగా స్లీపర్ బస్సులు ఉన్నట్టు తెలుస్తోంది. సీటింగ్ పర్మిట్లతోనే బస్సులు నడుపుతూ లోపల స్లీపర్ సేవలు అందిస్తూ అక్రమ లాభాలు ఆర్జిస్తున్నట్లు తెలుస్తోంది.

అనుమతి ఒకటి... వాహనం మరొకటి

సీటింగ్ బస్సుగా నమోదు చేసిన వాహనంలో సీట్లు తొలగించడం, ఇనుప ఫ్రేమ్‌లతో స్లీపర్ బెర్త్‌లు అమర్చడం, ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లను మూసివేయడం, అదనపు ప్రయాణికులను ఎక్కించడం అన్నీ ఆర్టీఏ అనుమతి లేకుండా జరుగుతున్న మార్పు లేనని తెలుస్తోంది. ఆర్టీఏ చట్టం ప్రకారం కంపెనీ నుంచి వచ్చిన ఏ బస్సుకు కనీసం హెవీ లైట్లు కూడా మార్చే అవకాశం లేదు. అయినా ప్రైవేట్ బస్సుల యజమానులు ఇవేమీ పట్టించుకోకపోవడం వెనుక అర్థం తెలియంది కాదు.

చట్టం స్పష్టం .. అమలు శూన్యం

మోటార్ వెహికల్ యాక్ట్ – 1988 సెక్షన్ 52 ప్రకారం అనుమతి లేకుండా వాహన నిర్మాణంలో మార్పులు నేరం. ఉల్లంఘనకు పర్మిట్ రద్దు లేక సస్పెన్షన్ చేసే అవకాశం ఉంది.

సెక్షన్ 56 ద్వారా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రద్దు చేసే అధికారం, సెక్షన్ 190(2) అక్రమ మార్పులకు జరిమానా, వాహన స్వాధీనం వంటివి ఉన్నప్పటికీ ఆ చట్టాలన్నీ కేవలం వినడానికి పరిమితమైపోతున్నాయి.

ప్రయాణికుల భద్రతకు ముప్పు

సీటింగ్ బస్సుల చాసిస్‌పై స్లీపర్ నిర్మాణాలు చేయడం వల్ల వాహన బరువు సమతుల్యం ఉండదు. బ్రేక్, టైర్లపై అధిక ఒత్తిడి, ప్రమాద సమయంలో బెర్త్‌ల్లో ఇరుక్కునే పరిస్థితి, అగ్ని ప్రమాదమైతే బయటపడే మార్గాలు లేకపోవడం వంటి ప్రమాదాలు ఉన్నాయని రవాణా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

స్పందించని అధికారులు...

ఇటీవల కాలంలో గుంటూరు జిల్లా ఆర్టీఏ అధికారిగా ఎవరు బాధ్యతలు తీసుకున్నా, ఏదైనా ఆరోపణలపై వివరణ కోరితే 'నన్ను అడగద్దు ప్లీజ్' అంటూ కప్పదాటు ధోరణితో వ్యవహరిస్తున్నారు.

ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు..

బస్సులను సీటింగ్ పరంగా చూపించి, తక్కువ పన్ను, ఫీజులు చెల్లించి స్లీపర్‌లుగా నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్లీపర్ బస్సులుగా నడిపించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం జరుగుతోంది. అదే సమయంలో ట్రావెల్స్ యాజమాన్యాలు అధిక చార్జీలు వసూలు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. 36 సీట్ల బస్సు రోడ్ ట్యాక్స్ త్రైమాసిక పన్ను రూ 25,000 నుంచి రూ 35,000 వరకు ఉంటుంది. ఫిటినెస్ చార్జీలు గతంలో రూ. 700 నుంచి రూ. 900 వరకు ఉండగా ప్రస్తుతం రూ.1400 ఉందని తెలుస్తోంది. అదే విధంగా స్లీపర్ బస్సుల నియామవళి ప్రకారం రోడ్ ట్యాక్స్ త్రైమాసికానికి రూ. 70 వేల నుంచి రూ.లక్ష వరకు ఉండే అవకాశం ఉంది. స్లీపర్‌కు ప్రత్యేక పర్మిట్ అవసరం. ఫైర్ సేఫ్టీ, ఎమర్జెన్సీ ఎగ్జిట్ తప్పనిసరి కానీ అవి మచ్చుకైనా కనపడటం లేదు.

టీటీడీపై టీడీపీది అసత్యప్రచారం

24 గంటల్లోగా ఫ్లెక్సీ తొలగించాలి.. లేకుంటే మేమే తొలగిస్తాం

- ఒకసారి తిరుమల లడ్డూపై అసత్య ప్రచారం చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన టీడీపీ
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- చిల్లీస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అసత్య ప్రచార ఫ్లెక్సీ వద్ద నిరసన

చిల్లీస్ సెంటర్‌లో టీడీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

గుంటూరు రూరల్: గతంలో అధికారం కోసం, నేడు అధికార మదంతో తెలుగుదేశం పార్టీ తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూపై అసత్య ప్రచారం చేస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. తెలుగు దేశం పార్టీ నీచ రాజకీయాలు చేస్తూ నగరంలోని అమరావతిరోడ్డు చిల్లిస్ సెంటర్‌లో 'ఇది నెయ్యే కాదంటూ' అబద్ధాలతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేయటంతో విషయం తెలిసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు శుక్రవారం అక్కడకు చేరుకుని నిరసన తెలిపారు. అంబటి మాట్లాడుతూ చంద్రబాబు ఆదేశాలతోనే తెలుగుదేశం నాయకులు ఇలా బరితెగించి విష ప్రచారం చేస్తున్నారన్నారు. తిరుమల లడ్డూలో పంది కొవ్వు కలవలేదని సీబీఐ చెప్పిన తర్వాత కూడా తెలుగుదేశం నాయకులు ఇలా దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. 24 గంటల్లో ఫ్లెక్సీలు తొలగించాలని, లేకపోతే మేమే ఆ ఫ్లెక్సీలు తొలగిస్తామని హెచ్చరించారు. తిరుమల లడ్డూను రాజకీయాలకు వాడుకున్న చంద్రబాబునాయుడు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారం చేసి ఆంధ్ర రాష్ట్ర పరువు తీయటంతోపాటు భక్తుల మనోభావాలను చంద్రబాబు ప్రభుత్వం దెబ్బతీసిందన్నారు. ప్రజల్లో చంద్రబాబు ప్రభుత్వానికి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక చంద్రబాబు అండ్‌కో వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం చేస్తుందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు మా పార్టీ నాయకులు పైన తప్పుడు ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోమని, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లను ఆ దేవుడు కూడా క్షమించడన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కొండవీడు ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

పల్నాడు జిల్లా ఎస్పీ బి కృష్ణారావు

యడ్లపాడు: ప్రజల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని పల్నాడు జిల్లా ఎస్పీ బి కృష్ణారావు చెప్పారు. ఫిబ్రవరి 7, 8 తేదీల్లో జరిగే ఉత్సవాల నేపథ్యంలో బందోబస్తు విషయంపై శుక్రవారం చిలకలూరిపేట రూరల్ సీఐ బి సుబ్బానాయుడు, యడ్లపాడు ఎస్ఐ టి శివరామకృష్ణలతో కలిసి క్షేత్రస్థాయి సందర్శన చేశారు. కోటలోని చారిత్రక కట్టడాలు, చెరువులు, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం కొండవీడు సమీప ప్రాంతాల నుంచి ప్రజలు రాకపోకలు సాగించే మార్గాలను తనిఖీ చేశారు. రద్దీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. సందర్శకుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు ఏర్పాట్లపై అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ కొండవీడు ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్‌శాఖ సిద్ధంగా ఉందన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. వాహనాల రద్దీ పెరగకుండా ముందస్తు ప్రణాళికతో ట్రాఫిక్ నియంత్రించి, పార్కింగ్ ప్రదేశాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

మట్టి మాఫియాలో ఆధిపత్య పోరు

- కృష్ణాయపాలెంలో లారీ యజమానుల మధ్య రచ్చ
- పారిపోయిన ఓ యువకుడు
- మల్కాపురం వెళ్లి లారీ యజమాని భార్యకు బెదిరింపులు
- తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన యువకుడు

తాడేపల్లి రూరల్: రాజధాని ప్రాంతం తుళ్ళూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల పరిధిలో రాత్రి వేళ మట్టి మాఫియా రెచ్చిపోతోంది. సక్రమ తవ్వకాల మధ్య అక్రమ రవాణా చేస్తూ జేబులు నింపుకొంటోంది. ఈ క్రమంలో మట్టి మాఫియా, లారీ యజమానుల మధ్య ఆధిపత్య పోరు పెరగడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటూ ఇళ్లలో ఉన్న మహిళలను కూడా బెదిరించేంత వరకు వెళ్లిన సంఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం... తుళ్ళూరు మండలం మల్కాపురానికి చెందిన ఓ యువకుడు ఈ మట్టి మాఫియాకు గతంలో డాన్‌గా వ్యవహరిస్తూ అక్రమ తవ్వకాలు నిర్వహించే సమయంలో ఒక లారీ నల్లమట్టి లోడ్ చేసేందుకు రూ.వెయ్యి నుంచి రూ.1200 వసూలు చేశాడు.

ముగ్గురు కలిసి...

తాడేపల్లి మండల పరిధిలోని మహానాడుకు చెందిన ఓ రౌడీషీటర్ కొంతకాలం డబ్బులు ఇచ్చి అతని నుంచి మట్టి పోయించుకున్నాడు. తరువాత అతనికి డబ్బులు ఇవ్వడం ఏంటంటూ ఉండవల్లికి చెందిన ఓ టీడీపీ నాయకుడు మిగిలిన లారీ యజమానులతో జతకట్టి అక్రమ రవాణాకు తెరలేపాడు. దీనికి వత్తాసుగా మహానాడుకు చెందిన టీడీపీ కార్యకర్త, రౌడీషీటర్, చిర్రావూరుకు చెందిన జనసేన నాయకుడు ముందుకు వచ్చారు. వీరు మల్కాపురానికి చెందిన వ్యక్తితో పలుమార్లు గొడవపడ్డారు. గురువారం రాత్రి ఈ గొడవ తీవ్ర స్థాయికి చేరడంతో మల్కాపురానికి చెందిన వ్యక్తి మంగళగిరి రూరల్ కృష్ణాయపాలెం నుంచి తుళ్లూరు వెళ్తుండగా మార్గం మధ్యలో కాపుకాసి దాడికి పాల్పడ్డారు. భయంతో ఆ యువకుడు వాహనంలో పరారయ్యాడు. అయినా వారు మల్కాపురంలో నివాసం ఉండే సదరు వ్యక్తి ఇంటికి రెండు కార్లలో వెళ్లారు. ఇంట్లో ఉన్న అతడి భార్యను బెదిరించి ఆ ప్రాంతంలో భయభ్రాంతులు సృష్టించారు.

గతంలోనూ అరాచకం...

మహానాడుకు చెందిన రౌడీషీటర్ గతంలో కూడా యర్రబాలెంకు చెందిన ఒక యువకుడ్ని గుండిమెడ, రామచంద్రాపురం మధ్య చితకబాది వార్నింగ్ ఇచ్చాడు. అప్పట్లో మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఈ సంఘటనపై కేసు కూడా నమోదు అయ్యింది. ప్రస్తుతం ఈ రౌడీషీటర్‌కు అధికార పార్టీలో కొంతమంది ఆశీస్సులు ఉండడంతో మరింత రెచ్చిపోతున్నాడు. జరిగిన దాడి సంఘటనపై మల్కాపురానికి చెందిన బాధితుడు పొన్నం సురేష్ మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో శ్రీ ఎలైట్ అనే కంపెనీలో తన లారీ తిప్పుతున్నానని చెప్పారు. రాత్రి 8 గంటల సమయంలో రాయపూడి కిరణ్, ఎలిశెట్టి రామకృష్ణ, రౌడీ షీటర్ పల్లెపు హరికృష్ణ తనపై దాడి చేశారని ఆరోపించారు. తాను అక్రమ మట్టి తోలడం లేదని, కొంతమంది విలేకరులకు వీడియో ద్వారా సమాచారం ఇచ్చానని తెలిపారు. సురేష్ కూడా మట్టి మాఫియాకు నాయకత్వం వహిస్తున్నట్లు రాజధాని రైతులు తెలియజేశారు.

జింకానా సేవలు చరిత్రలో నిలిచిపోతాయి

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని
- ఎంసీహెచ్ భవనాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు

సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న డాక్టర్ యశశ్వీరమణ, పక్కన జింకానా సభ్యులు

గుంటూరు మెడికల్: అమెరికాలో న్యాయబద్ధంగా పన్ను చెల్లించి మాతృభూమిని మరువకుండా గుంటూరు జీజీహెచ్‌లో కానూరి–జింకానా ఎంసీహెచ్ భవన నిర్మాణం కోసం రూ.100 కోట్లు విరాళంగా అందజేసిన జింకానా సోదరులు చరిత్రలో నిలిచిపోతారని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఎంసీహెచ్ భవన ప్రారంభం అనంతరం మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ జీజీహెచ్‌లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం సాయం అందిస్తున్న జింకానా వారికి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. ఎంసీహెచ్ సెంటర్‌ను ఇంటర్నేషనల్ స్థాయిలో నిర్మించారని కితాబునిచ్చారు. గత ప్రభుత్వంలో ఎంసీహెచ్ నిర్మాణం కోసం కేవలం రూ.6 కోట్లు ఇచ్చారన్నారు. పారిశ్రామికవేత్త, తులసి సీడ్స్ అధినేత తులసి రామచంద్ర ప్రభు జీజీహెచ్‌లో ఆగిపోయిన భవన నిర్మాణం కోసం రూ.10 కోట్లు విరాళంగా ఇచ్చారని చెప్పారు. డెక్కన్ టుబాకో కంపెనీ వారు ట్రామా సెంటర్ కోసం రూ.10 కోట్లు అందించారని వెల్లడించారు. మాజీ ఎంపీ గల్లా జయదేవ్ రూ.80 లక్షలు ఆగిపోయిన బిల్డింగ్ నిర్మాణం కోసం అందించారన్నారు. తాను కూడా సీఎస్ఆర్ నిధులు తీసుకొచ్చి గుంటూరు హాస్పిటల్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు పెమ్మసాని వెల్లడించారు.

జింకానా ఆదర్శంగా ఉంది

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం జింకానా సభ్యులు చేస్తున్న సాయం, దాతృత్వం చాలా గొప్పదని కొనియాడారు. మాతృ సంస్థ పట్ల, సమాజం పట్ల, ప్రజల ఆరోగ్యం పట్ల జింకానా సభ్యులకు ఉన్న చిత్తశుద్ధికి చేతులెత్తి నమస్కరించారు. అమెరికాలో ఉన్నప్పటికీ భారతదేశానికి గర్వకారణంగా జింకానా సభ్యులు ఉన్నారని, భావితరాలకు రోల్ మోడల్‌గా జింకానా వైద్యులు ఉన్నారని కొనియాడారు. మాతృ మరణాలు, శిశు మరణాలు తగ్గింపే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. స్వర్ణాంధ్ర, ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా 20 నెలల్లో అనేక మార్పులు వైద్య రంగంలో తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఆసుపత్రుల్లో ఓపీలు, ఐపీలు, సర్జరీలు, ప్రసవాలు పెరిగాయన్నారు. రానున్న కాలంలో మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవ స్థానంలో యూనివర్సల్ హెల్త్ కార్యక్రమం

ఏప్రిల్ 1 నుంచి ఎన్టీఆర్ వైద్య సేవ స్థానంలో యూనివర్సల్ హెల్త్ కార్యక్రమం తీసుకొస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1.43 కోట్ల మందికి హెల్త్ ఇన్స్యూరెన్సు ఉంటుందన్నారు. రూ.25 లక్షల వరకు ఉచితంగా చికిత్స అందిస్తామన్నారు. వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో ఇస్తామని ప్రభుత్వం చెప్పడంపై వైఎస్సార్ సీపీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని, పీపీపీకి, ప్రైవేటుకు వారికి తేడా తెలియడం లేదని అన్నారు. నీతి ఆయోగ్ పీపీపీని తెచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును జింకానా ప్రతినిధులు సన్మానించారు. జింకానా సభ్యులను ముఖ్యమంత్రి అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, చదలవాడ అరవింద్‌బాబు, డాక్టర్ కామినేని శ్రీనివాస్, కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి, హెల్త్ సెక్రటరీ సౌరబ్ గౌర్, జింకానా ప్రెసిడెంట్ డాక్టర్ కోయ రామకోటేశ్వరరావు, ఎంసీహెచ్ బిల్డింగ్ కో ఆర్డినేటర్ డాక్టర్ బాబురెడ్డి సాగిరెడ్డి, జింకానా స్థానిక కో ఆర్డినేటర్లు డాక్టర్ వెనిగళ్ల బాలభాస్కరరావు, డాక్టర్ పి.వి.హనుమంతరావు, డాక్టర్ సూరత్ అమర్‌నాథ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రామన్ తదితరులు పాల్గొన్నారు.

198 కిలోల గంజాయి స్వాధీనం

గంజాయి, నిందితులను చూపుతున్న జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్

బాపట్ల టౌన్: బాపట్ల జిల్లాలోని బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద పోలీసులు శుక్రవారం రూ.25 లక్షల విలువైన 198 కిలోల గంజాయిను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ శుక్రవారం సాయంత్రం వెల్లడించారు. కాకినాడ జిల్లా తుని పరిసర ప్రాంతాల నుంచి తమిళనాడు రాష్ట్రానికి తరలివెళ్తున్న గంజాయిను మార్టూరు సమీపంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. కర్ణాటక రాష్ట్రం చామరాజ నగర్ జిల్లా కొల్లగల మండలం చంగవాడి గ్రామానికి చెందిన మంజునాథ ఈరప్ప హోల్డింగ్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన కార్తీక్ హానూర్ రాజప్ప తాపీ పనిచేస్తుంటాడు. ఇద్దరు బంధువులు పైగా స్నేహితులు. వీరికి తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి ఫోన్‌లో పరిచయం అయ్యారు. అతని నిర్ణయం మేరకు ఈ ఇద్దరు ఈనెల 29న తుని పరిసర ప్రాంతాలకు చేరుకున్నారు. అక్కడ ఓ వ్యక్తికి మధ్యవర్తిత్వం చేసుకొని అతనికి వాహనం, నగదు అందజేశారు. ఆ వ్యక్తి వీరు ఇచ్చిన వాహనంలో ఒక్కో ప్యాకెట్ రెండు కిలోల చొప్పున 198 కిలోల గంజాయిను 99 ప్యాకెట్లుగా తయారుచేసి వెంట తీసుకెళ్ళిన లోడ్‌చేసి వాహనాన్ని కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తులకు అప్పగించారు. జిల్లా ఎస్పీకి అందిన సమాచారం మేరకు మార్టూరు సీఐ ఆధ్వర్యంలో పోలీసులు, ఈగల్ టీం సిబ్బంది బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద గంజాయి ఉన్న వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు కర్ణాటకకు చెందిన ఇరువురు వ్యక్తులను అరెస్ట్ చేశామన్నారు.

ఆటో బోల్తా.. 12 మందికి గాయాలు

చౌడేపల్లె: ఆటో బోల్తాపడిన ప్రమాదంలో 12మందికి గాయాలైన ఘటన అన్నమయ్య జిల్లా బోయకొండ గంగాపురం వద్ద ఉన్న చెక్‌పోస్టు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. బాపట్ల జిల్లా రేపల్లె, భట్టిప్రోలు మండలం పల్లెకోన నుంచి వచ్చిన వలస కూలీలు అన్నమయ్య జిల్లా సోమల మండలం కందూరు సమీపంలో కొటగుండ్లపల్లెకు చెందిన ఓ రైతు వద్ద పనులు చేస్తున్నారు. శుక్రవారం పనులకు విరామం ఇవ్వడంతో పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె మండలం బోయకొండ గంగమ్మను దర్శించుకునేందుకు వీరు ఆటోలో బయలుదేరారు. మళ్లీ అదే ఆటోలో తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఆటోలోని 12 మంది గాయపడ్డారు. వీరిలో ఏడుకొండలు(45), వెంకటేశ్వరమ్మ(38), విజయ్(40), అనితమ్మ(55), వీరమ్మ(55), మాధవి(38), శివరామకృష్ణ(45)లకు తీవ్రగాయాలయ్యాయి. మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈఓ ఏకాంబరం ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించి 108 సహాయంతో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ నాగేశ్వరరావు స్థలాన్ని పరిశీలించారు.

నేను బతికే ఉన్నానండీ..

- వంగర హనుమంతు సుబ్రహ్మణ్య శాస్త్రి
- తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో, ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- తనకు తెలియకుండా ఆన్‌లైన్‌లో పొలం మార్పుపై విస్మయం
- బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని వినతి

మాట్లాడుతున్న వంగర హనుమంతు సుబ్రహ్మణ్య శాస్త్రి

తాడికొండ: నేను బతికే ఉన్నానని...చనిపోయినట్లు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ఆన్‌లైన్‌లో భూమి వివరాలు తొలగించిన వ్యక్తులెవరో గుర్తించి చర్యలు తీసుకోవాలంటూ వంగర హనుమంతు సుబ్రహ్మణ్య శాస్త్రి కోరారు. ఆయన శుక్రవారం తాడికొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 21న సాక్షిలో 'బతికుండగానే చంపేశారు' పేరిట ప్రచురితమైన కథనానికి రాజధాని సాక్షిగా జరిగిన రెవెన్యూ మాయాజాలం వ్యవహారం బయటకు పొక్కింది. దీంతో అమెరికాలో నివసిస్తున్న 80 సంవత్సరాల వృద్ధుడు హనుమంతు సుబ్రహ్మణ్య శాస్త్రి హుటాహుటిన బయలుదేరి వచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తాను మెయిల్స్ ద్వారా సీఎస్‌తోపాటు రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని, జిల్లా కలెక్టర్, ఆర్డీవో, డీఎస్పీ, సీఐ ఇతర అధికారులను కూడా కలిసినట్లు తెలిపారు. తనకు సర్వే నెంబర్ 1051లో 1.70 ఎకరాలు, సర్వే నెంబర్ 1150లో 8.32 ఎకరాలు కలిపి మొత్తం 10.02 ఎకరాల భూమి ఉందన్నారు. పత్రికలలో వచ్చిన కథనాలను సోషల్ మీడియా ద్వారా తెలుసుకొని ఆన్‌లైన్‌లో చూస్తే కానీ తమకు విషయం బయటపడలేదని అన్నారు. తనకు వారసులు లేరని, తాను ఎవరికీ వీలునామా రాయడం కానీ, బదిలీ చేయడం కానీ జరగలేదన్నారు. తప్పుడు పత్రాలతో తాను మరణించినట్లు చూపించి భూమి బదలాయింపు వెనుక ఉన్న వ్యక్తులెవరో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటివి భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

పసుపు ధరలు

శుక్రవారం యార్డుకు వచ్చిన బస్తాలు : 584

కొమ్ములు : 481 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
11,900	13,775	13,750

కాయలు : 103 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
11,900	13,775	13,750

మొత్తం అమ్మకాలు : 438 క్వింటాళ్లు -దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	78,473
అమ్మకాలు	85,852
నిల్వ	13,078

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500-23,000
నంబరు-5	13,500-22,000
341	14,000-25,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500 – 21,000
నంబరు-5	13,500 – 21,500
341	13,000 – 22,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000 – 19,000
బాడిగ-355	13,500 – 23,000
దేవనూరు డీలక్స్	15,000 – 22,500
ఆర్మూర్	12,000 – 17,000
తాలుకాయలు	8,000 – 10,200

-కొరిటెపాడు (గుంటూరు)

మహాత్ముడికి వైఎస్సార్ సీపీ నివాళులు

నివాళులు అర్పిస్తున్న అంబటి రాంబాబు, అంబటి మురళీకృష్ణ, బాలవజ్రబాబు, పార్టీ నేతలు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్) : జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ శ్రేణులు నివాళులు అర్పించారు. గుంటూరులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, తాడికొండ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, పార్టీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో కలిసి నివాళులు అర్పించారు.

● అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు నివాళులు అర్పించి, ఆయన సేవలను స్మరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. బాపూజీ మద్యానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తే, నేటి టీడీపీ ప్రభుత్వం మద్యాన్ని ఏరులై పారిస్తోందని మండిపడ్డారు. టీడీపీ పాలనలో ఆంధ్ర రాష్ట్రం మద్యం మాఫియాగా మారిందని దుయ్యబట్టారు. మహాత్ముని సిద్ధాంతాలు ఏపీలో ఏమాత్రం ఆచరణకు నోచుకోవటం లేదన్నారు. మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ సచివాలయాలను తీసుకువచ్చి, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారని తెలిపారు. చంద్రబాబు సర్కార్ అధికారంలోకి రాగానే సచివాలయాల ప్రాధాన్యత తగ్గించి, వలంటీర్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయటం సిగ్గుచేటన్నారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, మహాత్ముడు ప్రతి కలను సాకారం చేసే దిశగా ముందుకు సాగుతామన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అమెరికాకు మోదీ లొంగుబాటు

- ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ ధావలే
- లోకేష్ జైలు ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుంది
- వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

మాట్లాడుతున్న ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు అశోక్ ధావలే, వేదికపై వడ్డే తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికా సామ్రాజ్యవాదానికి లొంగిపోయారని, త్వరలో మరో ఒప్పందానికి సిద్ధపడుతున్నారని, అదే జరిగితే వ్యవసాయ రంగంపై ఆధారపడిన కోట్లాది మంది రైతులకు అన్యాయం జరగడంతో పాటు దేశం తీవ్ర ఇబ్బందుల్లోకి వెళ్తుందని అఖిల భారత కిసాన్‌సభ అధ్యక్షులు అశోక్ ధావలే అన్నారు. ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా గుంటూరులో శుక్రవారం సాయంత్రం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 'అమెరికా సుంకాలు, వ్యవసాయంపై ప్రభావం, ఎన్‌డీఏ వైఖరి' అనే అంశంపై జరిగిన సదస్సులో ధావలే మాట్లాడారు. దేశంలో పండే అనేక ఉత్పత్తులకు టారిఫ్‌లు తగ్గించి కోట్ల టన్నుల పత్తి, గోధుమ, సోయాబీన్ వంటివి దిగుమతి చేసుకుంటున్నారని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో అనేక అభ్యుదయ ఉద్యమాలు విజయవంతంగా జరిగిన చరిత్ర ఉందని, ఫిబ్రవరి 12వ తేదీన జాతీయ సమ్మెను జయప్రదం చేసేలా అందరూ కలిసి రావాలని ధావలే కోరారు.

భూ సంతర్పణ సరైన పద్ధతి కాదు..

● 'నిర్బంధ భూ సేకరణ-ప్రజా ఉద్యమాలపై నిర్బంధం' అనే అంశంపై ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ దేశంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబునాయుడు అనుసరిస్తున్న విధానాల వల్ల వ్యవసాయ రంగానికి గడ్డు పరిస్థితులు వస్తున్నాయని అన్నారు. దిగుమతులకు అనుమతులు ఇస్తుండటంతో దేశంలో పండిన పంటను కొనే పరిస్థితి లేకుండా పోయిందని పేర్కొన్నారు. భూమికి రక్షణ కల్పించే విధంగా 2013లో తీసుకొచ్చిన భూసేకరణ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా కొత్త కొత్త చట్టాలు తీసుకొస్తూ బడా సంస్థలకు భూ సంతర్పణ చేస్తున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వంలో ఇండోసోల్ కంపెనీ 24 వేల కోట్లు దోచుకుందని చంద్రబాబు విమర్శలు చేశారని, అదే కంపెనీకి అధికారంలోకి రాగానే రూ.14 వేల కోట్ల సబ్సిడీలు ఇస్తున్నారని తెలిపారు. పైగా కడపలో అత్యంత విలువైన భూములను కట్టబెడుతున్నారని విమర్శించారు. పాలకులు భూముల రక్షణలను మాత్రమే ఈ దొంగలను సుప్రీం కోర్టు చెబితే, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మాత్రం తాము 99 పైసలకే భూములు ఇస్తున్నారని, ఇదే సరైన పద్ధతి కాదని హితవు పలికారు. గతంలో లేని ధోరణిని అమలు చేస్తున్నారని, ఇదే పద్ధతి కొనసాగితే చట్టపరంగా ఇబ్బందులు ఎదుర్కోవడంతోపాటు, జైలు ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. గిరిజనులకు సంపూర్ణ హక్కులు కలిగిన భూములను గిరిజనేతరులకు కేటాయిస్తున్నారని మండిపడ్డారు. ముందుగా ప్రజాశక్తి బుక్‌హౌస్ ముద్రించిన లౌకిక భారతం కోసం గాంధీ అనే పుస్తకాన్ని అశోక్‌ధావలే ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రచించిన భారత రాజ్యాంగంలో ముఖ్యాంశాలు అనే పుస్తకాన్ని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆవిష్కరించారు.

ప్రమోషన్ ఇచ్చి బేసిక్ పే పెంచాలి

విలేజ్ సర్వేయర్ల అసోసియేషన్ డిమాండ్

మంగళగిరి టౌన్ : గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థలో తమతో పాటు రిక్రూట్ అయిన ఇతర విభాగాల ఉద్యోగుల మాదిరిగానే సమాన పే స్కేల్‌తో కనీస వేతనం రూ.32 వేలు మంజూరు చేసి గ్రేడ్ 1 ప్రమోషన్ ఇవ్వాలని విలేజ్ సర్వేయర్ల అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళగిరి ఏపీఐఐసీ కార్యాలయంలో సర్వే అండ్ లాండ్ రికార్డ్ డైరెక్టర్‌ను, మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను శుక్రవారం విలేజ్ సర్వేయర్లు కలిశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. భూ రీ సర్వేలో భాగంగా సాంకేతిక పనులు చేస్తున్నందున టెక్నికల్ పే అలవెన్స్ ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా 4,727 మంది గ్రామ సర్వేయర్లను మిగిలిన ఖాళీల్లో విలీనం చేయాలని పేర్కొన్నారు. భూ రీ సర్వే కోసం ల్యాప్‌టాప్‌లు, రోలర్లు, స్టేషనరీని సరఫరా చేయాలని విన్నవించారు. పెండింగ్ టీఏ, డీఎలు వెంటనే చెల్లించాలన్నారు. ఉద్యోగులకు జారీ చేసిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని, సస్పెన్షన్లను ఎత్తివేయాలని కోరారు.

దీనిపై ఫిబ్రవరి 15 లోగా డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు విలేజ్ సర్వేయర్లు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మధుబాబు, ప్రధాన కార్యదర్శి మహేష్‌నాయుడు, ఉమెన్ వింగ్ సెక్రటరీ సౌందర్య లక్ష్మి, ఉపాధ్యక్షులు వంశీ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురికి పదవులు

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలో పలువురిని నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. వివరాలు...

● తాడికొండ నియోజకవర్గానికి చెందిన గడ్డం జయరామ్‌ను వైఎస్సార్‌సీపీ లీగల్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా, వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర కార్యదర్శిగా గద్దె రూబెన్, ఎస్సీ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కర్రి రవిపాల్, ఐటీ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా గుంటుపల్లి ప్రదీప్‌కుమార్‌లను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

● ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడిగా గండు నాగరాజు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం మహిళ విభాగం అధ్యక్షురాలిగా ఎస్.వెంకాయమ్మ, మంగళగిరి నియోజకవర్గం పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడిగా ప్రాతూరి లలిత కుమారిలను నియమించారు.

● వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా లంకపోతు పిచ్చిరెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడిగా బందెల ఉదయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆలపాటి రాఘవ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బొమ్ము రామారావు, పెరికల చైతన్య, పబ్లిసిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రేగులగడ్డ రాజేష్, కార్యదర్శిగా మున్నంగి క్రాంతికుమార్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కూచిపూడి నూతన్‌బాబు, బండ్లమూడి చక్రవర్తి, బురదగుంట రవికుమార్, దివ్యాంగుల విభాగం కార్యదర్శిగా మంచాల ఏసు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా భావనాసి జాన్ వెస్లీ, రుద్రపాటి సుబ్బారావులను నియమించారు.

గుంటూరు నగరంలో...

గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి 18వ డివిజన్ అధ్యక్షుడిగా కలపాల సత్యనారాయణ, 19వ డివిజన్ అధ్యక్షుడిగా పల్లపు వెంకటేష్‌బాబు, 20వ డివిజన్ అధ్యక్షుడిగా షేక్ ఖాజా మొహిద్దీన్, 23వ డివిజన్ అధ్యక్షుడిగా యాపర్తి కోటేశ్వరరావు, 42వ డివిజన్ అధ్యక్షుడిగా నల్లమోలు సాంబశివరావు, 52వ డివిజన్ అధ్యక్షుడిగా రెడ్డి కోటేశ్వరరావులను నియమించారు.

● ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి గుంటూరు రూరల్ మండలం బీసీ విభాగం అధ్యక్షుడిగా వేల్పూరి శివయ్య, ప్రత్తిపాడు మండల బీసీ విభాగం అధ్యక్షుడి బి.అప్పారావు, వట్టిచెరుకూరు మండల బీసీ అధ్యక్షుడిగా ఆలా శ్రీనివాసరావు, పెదనందిపాడు మండలం బీసీ అధ్యక్షుడిగా కనుగుల నాగభూషణం, కాకుమాను మండలం బీసీ అధ్యక్షుడిగా ఎర్రాకుల నాగరాజు, గుంటూరు రూరల్ మండలం మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ నబి, ప్రత్తిపాడు మండలం మైనార్టీ అధ్యక్షుడిగా సయ్యద్ ఆలీసాహెబ్, వట్టిచెరుకూరు మండలం మైనార్టీ అధ్యక్షుడిగా సయ్యద్ షమి, పెదనందిపాడు మండలం మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్లా, కాకుమాను మండలం మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా షేక్ మొహమ్మద్, గుంటూరు రూరల్ మండలం దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా బాకి నరసింహారావు, ప్రత్తిపాడు మండల అధ్యక్షుడిగా వి.మరియదాసు, వట్టిచెరుకూరి మండల అధ్యక్షుడిగా రావిపాటి సుబ్బారావు, పెదనందిపాడు మండల అధ్యక్షుడిగా సి.హెచ్.యశోద, కాకుమాను మండలం అధ్యక్షుడిగా కందూరి వెంకటేశ్వరరావులను నియమించారు.

● మంగళగిరి నియోజకవర్గానికి సంబంధించి మంగళగిరి టౌన్ వలంటీర్స్ విభాగం అధ్యక్షుడిగా మేకల రవికాంత్, దివ్యాంగుల విభాగం టౌన్ అధ్యక్షుడిగా ఎ.సురేష్‌కుమార్‌లను నియమించారు.

నేటి నుంచి విజ్ఞాన్ బాల మహోత్సవ్

బాల మహోత్సవ్ ఏర్పాట్లలో కో-ఆర్డినేటర్లు

చేబ్రోలు: చిన్నారులలోని ప్రతిభను వెలికి తీసేందుకు విజ్ఞాన్ యూనివర్సిటీలో రెండో ఎడిషన్ రాష్ట్రస్థాయి కార్యక్రమం 'విజ్ఞాన్ బాల మహోత్సవ్-2కే26 'ను నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ కేవీ క్రిష్ణకిషోర్ శుక్రవారం తెలిపారు. శనివారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాల్తేరు డివిజన్ ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ భవ్య వట్టికూటి హాజరవుతారని తెలిపారు. ఫిబ్రవరి 2న జరిగే ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లవరపు సూర్యతేజ హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా కేవీ క్రిష్ణకిషోర్ మాట్లాడుతూ చిన్నారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారికి సరైన వేదిక కల్పించడమే ఈ బాల మహోత్సవ్ ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు నిర్వహిస్తున్న ఈ బాల మహోత్సవ్‌లో జూనియర్స్ విభాగం, సీనియర్స్ విభాగం విద్యార్థుల కోసం మొత్తం 50కు పైగా పోటీ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

మహిళ కోసం మైనర్ల మధ్య రచ్చ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో సలాం హోటల్ సెంటర్‌లో వివాహమై నలుగురు సంతానం ఉండి, భర్తను వదిలేసిన మహిళ కోసం ఇద్దరు మైనర్‌ల మధ్య గొడవ జరిగింది. శుక్రవారం రాత్రి ఒక బాలుడు కత్తితో మరో బాలుడిపై దాడికి యత్నించాడు. అరగంట పాటు ఇద్దరి మధ్య వివాదం జరిగింది. పొడిచేందుకు పలు మార్లు ప్రయత్నించగా, స్థానికంగా ఉన్న కొంత మంది అడ్డుకునప్పటికీ దాడి ఆపలేదు. స్థానికులు తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. సదరు మహిళ వల్ల గతంలో కూడా ఇలాంటి గొడవలు జరిగాయి. వారం రోజుగుల క్రితం మైనర్లు ఇద్దరు గొడవపడడంతో పోలీసులు ఇరువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళను ఇక్కడి నుంచి పంపించారు. సదరు మహిళ ఇద్దరితో ఫోన్‌లో మాట్లాడుతూ ఉండటంతోనే ఈసంఘటన జరిగింది. ఆ మహిళ తన నలుగురు పిల్లలతో ఒక బాలికను వేరే వారికి విక్రయించినట్లు స్థానికులు తెలిపారు. బాలురను ట్రాప్ చేసిన మహిళపై కేసు నమోదు చేయాలని కోరుతున్నారు.

యానాదులపై అధికార పార్టీ నేత అరాచకం

సిమెంట్ బ్రిక్స్‌లో పనిచేసే కార్మికులపై బలప్రయోగం

చేబ్రోలు పోలీసు స్టేషన్ వద్ద ఫిర్యాదు చేయటానికి వచ్చిన యానాది, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు, బాధితులు

చేబ్రోలు: సిమెంట్ బ్రిక్స్‌లో పనిచేసే కూలీలను అధికార పార్టీకి చెందిన నాయకుడు భయపెట్టడం, బెదిరించి దాడి చేయటంపై యానాది గిరిజన సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం రాత్రి చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యానాది, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపట్ల బ్రహ్మయ్య, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తుపాకుల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పొన్నూరు అంకమ్మరావు, బాపట్ల జిల్లా అధ్యక్షుడు సిరిమెళ్ల శ్రీను, ఉన్నం దుర్గారావు, నక్కా చంద్రయ్య తదితరులు చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. చేబ్రోలు మెయిన్ రోడ్డులో అప్పాపురం చానల్ సమీపంలో ఉన్న సిమెంట్ బ్రిక్స్ కంపెనీలో గత ఐదు సంవత్సరాలుగా బాపట్ల జిల్లా కొంగట్టు అడ్డరోడ్డు గాదె వెంకటరెడ్డి కాలనీకి చెందిన ఎమినిది యానాది కుటుంబాల వారు కార్మికులుగా పనిచేస్తున్నారు. రోజుకు రూ.150 చొప్పున కూలికి పనిచేస్తున్నారు. 20 మంది ఉన్నా పది రోజులే పని ఉంటోంది. బ్రిక్స్ యజమాని అధికార టీడీపీ నేత షేక్ హర్షద్‌బాషా సక్రమంగా డబ్బులు ఇవ్వకుండా కులం పేరుతో దూషిస్తూ, బెదిరిస్తూ, దాడి చేస్తున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. గదిలోకి తీసుకువెళ్లి తమను అకారణంగా హింసిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పనులు లేకపోవటంతో మిరప, మినుము పీకుడు పనులకు వెళితే కూలి ఆరువందల వరకు వస్తుందని వెళితే అక్కడకు వచ్చి బెదిరించి దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం మందపాడు మిరపకాయల కూలీలకు వెళ్లగా అక్కడకు కారులో మద్యం తాగిన నలుగురు వచ్చి బలవంతంగా తీసుకువచ్చారన్నారు. ఇక్కడకు తీసుకువచ్చి తమపై దాడి చేసినట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు.

బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి బాధితులకు రక్షణ కల్పించాలని యానాది, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు కలిసి చేబ్రోలు ఎస్ఐ పి. వీరనారాయణకు ఫిర్యాదు చేశారు. సిమెంట్ బ్రిక్స్‌లో కూలీలుగా పనిచేసే చేగోరు సుబ్బారావు, చేగూరు రాంబాబు, బాపట్ల రాఘవులు, చూటూరి దుర్గారావు, పత్తి వెంకటేశ్వర్లు, టి. సాంబయ్య, సి. చంద్రయ్య, సీహెచ్ బాలులకు చెందిన కుటుంబసభ్యులతో పాటు యానాదికాలనీకి చెందిన బాధిత కుటుంబాలకు చెందిన బంధువులు, నాయకులు పాల్గొన్నారు. కేసును పక్కదారి పట్టించి బ్రిక్స్ కంపెనీ యజమానిని కాపాడటానికి అధికార పార్టీ నేతలు పోలీసులపై ఒత్తిడి చేస్తున్నట్లు యానాది గిరిజన సంక్షేమ సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు.

నర్సింగ్ విద్యార్థినులకు అస్వస్థత

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని ఇమ్మి బీఎస్సీ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు ఇద్దరు స్పృహతప్పి పడిపోవడంతో కళాశాల యాజమాన్యం వారిని చికిత్సకోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాలప్రకారం కళాశాలలో ఏఎన్‌ఎం మూడో సంవత్సరం చదువుతున్న అంజలిబాయ్ తరగతి గదిలో పాఠాలు వింటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో బీఎస్సీ నర్సింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న రజని అది చూసి తను పడిపోవడంతో సిబ్బంది గమనించి యాజమాన్యానికి తెలియజేశారు. దీంతో కరస్పాండెంట్ ఇమ్మానియేల్ ప్రకాష్ స్పందించి తన కారులో వారిని గుంటూరు జీజీహెచ్‌కు చికిత్సకోసం తరలించారు. దీనిపై కళాశాల కరస్పాండెంట్ ఇమ్మానియేల్ ప్రకాష్‌ను వివరణకోరగా అంజలీబాయ్‌కి జ్వరం తగలడంతో ఉదయం ఆహారం తీసుకోకుండా జ్వరం మాత్ర వేసుకోవడంతో నీరసంతో పడిపోయిందని, ఆమెను చూసిన స్నేహితురాలు రజని పడిపోయినట్లు తెలిపారు. వారిని గుంటూరుకు చికిత్సకోసం తీసుకువెళ్లి తగ్గిన తరువాత తీసుకువచ్చానని తెలిపారు.

అమరావతి రైతుల సమస్యలపై చర్చలు

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

తాడికొండ: అమరావతి రైతుల సమస్యలపై వరుసగా త్రీమెన్ కమిటీ సమావేశంలో చర్చలు జరుగుతున్నాయని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం రాజధాని నిర్మాణ ఏర్పాట్లు, సౌకర్యాలపై కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తో కలిసి రాయపూడిలోని సీఆర్డీఏ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పెమ్మసాని మాట్లాడుతూ అమరావతి రైతుల సమస్యలపై వరసగా త్రీమెన్ కమిటీ సమావేశంలో చర్చ జరుగుతోందని, ఇప్పటికే వీధి పోటు సమస్యలపై ఉత్తర్వులు వెలుపడ్డాయి, జరీబు భూముల సమస్య మాత్రమే మిగిలి ఉందన్నారు. 1500 ప్లాట్లకు గాను 500 ప్లాట్ల సమస్యలను పరిష్కరించామన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ 29వేలకు పైగా రైతులకు 69,421 ప్లాట్లు ఉన్నాయని, అందులో 7,273 ప్లాట్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ లైబ్రరీకి వేటూరి పుస్తకాలు బహూకరణ



వేటూరి సాహిత్య పుస్తకాలు బహూకరిస్తున్న వేటూరి రవిప్రకాష్, చంద్రశేఖరరావులు

ఏఎన్‌యూ (పెదకాకాని): సినీ సినీయేతర సాహిత్య రచయిత వేటూరి సుందరరామ్మూర్తి సాహిత్య పుస్తకాలను ఆయన కుమారులు శనివారం వర్సిటీలోని గ్రంథాలయానికి బహూకరించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ఆవిష్కరించిన వేటూరి సుందర రామమూర్తి రచించిన సాహిత్య పుస్తకాలు దొరకునా ఇటువంటి సేవ, మానసవీణ మధుగీతం, నవమి నాటి వెన్నెల, ఎడారిలో కోయిల, ఝుమ్మంది నాదం, ఎరక్కపోయి వచ్చాను వంటి పుస్తకాలను వేటూరి కుమారులు వేటూరి రవి ప్రకాష్, వేటూరి చంద్రశేఖరరావులు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ లైబ్రరీకి స్వయంగా విచ్చేసి బహూకరించారు. గ్రంథాలయ అధికారి ప్రొఫెసర్ కోడెల వెంకట్రావు నేటి యువతకు ఈ సాహిత్య పుస్తకాలు, సాహిత్య పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

Indian Bank – పొన్నూరు బ్రాంచి
రింగ్ రోడ్డు,వార్డు నెం.16, పొన్నూరు, గుంటూరు జిల్లా.
ఫోన్: 0864-3242036,9346805953, ఇ-మెయిల్: ponnur@indianbank.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన
"APPENDIX - IV-A" [See proviso to rule 8(6) / 9(1)]

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)/9(1) తో చదువుకునే నిబంధన క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన. ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)ల చేత సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ బ్యాంక్, పొన్నూరు బ్రాంచికి తనఖా/చార్జ్‌గా ఉంచిన దిగువ పేర్కొన్న స్థిరాస్తులను, బకాయిసొమ్ము ది.30-01-2026 నాటికి రూ.44,21,215/- (అక్షరాల నలభైనాలుగు లక్షల ఇరవైఒక్క వేల రెండు వందల పదిహేను రూపాయలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఛార్జీలు, ఖర్చులు మొ॥ వసూలు నిమిత్తం ఇండియన్ బ్యాంక్, పొన్నూరు బ్రాంచి యొక్క అధీకృత అధికారి దిగువ పేర్కొన్న ఆస్తిని భౌతిక స్వాధీనం చేసుకున్నారు. మరియు సదరు ఆస్తిని ది.18-02-2026 తేదీన "ఎక్కడ ఉన్నది అలాగే" "ఎక్కడ ఏది ఉన్నదో అది" మరియు "ఉన్నది ఉన్నట్లుగా" పద్ధతిపై సెక్యూర్డ్ క్రెడిటార్‌చే విక్రయించబడును [illegible]

స్థిరాస్తుల వివరములు

ఆస్తి నెం.1: ఐటమ్ నెం.1: దస్తావేజు నెం.5496/2015 ప్రకారం: గుంటూరు జిల్లా, తెనాలి రిజిస్ట్రేషన్ జిల్లా, పొన్నూరు సబ్ జిల్లా, పొన్నూరు గ్రామం, సర్వే నెం.406/9ఎ నందలి 201.25 చ॥గ॥లు లేదా 169.06 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం అందులోని 1420 చ॥అ॥ల విస్తీర్ణంలో డోర్ నెం.17-6-29, అసెస్‌మెంట్ నెం.1025000145, [illegible] దీనికి హద్దులు: తూర్పు: షేక్ జానీ యొక్క స్థలం- 43-9 అ॥లు, దక్షిణం: [illegible] యొక్క స్థలం మరియు ఇల్లు-42 అ॥లు, పడమర: సయ్యద్ సిలేమాన్ [illegible] స్థలం-42.6 అ॥లు, ఉత్తరం: మునిసిపల్ రోడ్డు-42 అ॥లు.

ఆస్తిపై ఎన్‌కంబరెన్స్	బ్యాంక్‌కు తెలిసినంత వరకు ఏమి లేవు
రిజర్వు ధర	రూ.42,16,000/-
ధరావత్తు సొమ్ము	రూ.4,21,600/-
బిడ్ పెంపుదల మొత్తం	రూ.10,000/-
ఇ-వేలం యొక్క తేదీ మరియు సమయం	తేది: 18-02-2026 ఉ॥10.00 గం॥ల నుండి సా॥04.00 గం॥ల వరకు
ఆస్తి ఐడి నెం.	IDIB6687427562

[illegible] PSB Alliance ప్రైవేట్ లిమిటెడ్ వెబ్‌సైట్ (https://baanknet.com) ను సందర్శించవలసి సూచించడమైనది. సాంకేతిక సహాయం కోసం దయచేసి PSB Alliance ప్రైవేట్ లిమిటెడ్ హెల్ప్‌డెస్క్ నెంబర్ 8291220220కు మరియు [illegible] PSB Alliance ప్రైవేట్ లిమిటెడ్‌తో రిజిస్ట్రేషన్ స్థితి కోసం దయచేసి support.baanknet@psballiance.com ను మరియు [illegible] కోసం support.baanknet@psballiance.com ను సంప్రదించండి. ఆస్తి వివరాలు మరియు ఆస్తి ఛాయాచిత్రం కోసం మరియు వేలం యొక్క నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి https://baanknet.com ను సంప్రదించండి. ఈ పోర్టల్‌కు సంబంధించిన స్పష్టీకరణల కోసం, దయచేసి హెల్ప్‌లైన్ నెంబర్: 8291220220 ను సంప్రదించండి. https://baanknet.com వెబ్‌సైట్లో ఆస్తి కోసం పైన పేర్కొన్న ఆస్తి ఐడి ఉపయోగించి [illegible]
గమనిక: ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంప్ డ్యూటీ, ఐటిటి ఛార్జీలు, ఫీజు వగైరాలు మరియు [illegible] బకాయిలు, పన్నులు, రేట్లు, [illegible] ఛార్జీలు, ఫీజులు వగైరాలు కొనుగోలుదారే భరించవలెను.
స్థలం: పొన్నూరు, సం/- అధీకృత అధికారి,
తేది: 30-01-2026 ఇండియన్ బ్యాంక్, పొన్నూరు బ్రాంచి, గుంటూరు జిల్లా.

Bank of Baroda – గుంటూరు మెయిన్ బ్రాంచి
[illegible] గుంటూరు-522004.
ఫోన్: 0863-2224775, ఈమెయిల్: guntur@bankofbaroda.bank.in

అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన
SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8(6) ప్రకారం జారీ చేయడమైనది.

[illegible]

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLAT FOR SALE
■ గుంటూరు, నల్లపాడు రోడ్డులోని సీతారామ టౌన్‌షిప్‌లో తూర్పు ముఖంగా కొన్ని లగ్జరీ ఫ్లాట్‌లు అమ్మకానికి కలవు. సంప్రదించండి. 7893817275, 9849115045

HOUSE FOR SALE
■ చీరాల కొత్తపేట RTC కాలనీలో 9సెంట్లు విస్తీర్ణములో కల 2 అంతస్తుల డాబా ఇల్లు సౌత్(ఈస్ట్‌రోడ్) అమ్మకానికి కలదు. వివరాలకు సం॥ 91776 44898, 70933 21399.

LAND FOR SALE
■ 80 అ॥రోడ్డుని ఆనుకుని 4 ఎకరాలు. గన్నవరం ఎయిర్‌పోర్ట్‌నుండి 12 కి.మీ. ఇండస్ట్రియల్ జోన్ వీరపనేని గూడెంకి 1 కి.మీ. 4 ఎకరాలు. రూ: 5 కోట్లు 83175 28192

SERVICES

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

వధువు కావలెను
■ రజక కన్వర్ట్ క్రిస్టియన్, బి.టెక్ సాఫ్ట్‌వేర్ జాబ్, 25సం., 5'.5", వరుడికి రజక కన్వర్ట్ క్రిస్టియన్ అమ్మాయి కావలెను. సంప్ర. 86394 58719

WANTED
■ బిజినెస్ మేనేజర్స్ / బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, ఫ్రెషర్స్, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న 30 సం॥లలోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.
■ గుంటూరులో గల నర్సింగ్ కాలేజి నందు పని చేయుటకు ఆటో, కారు నడుపుటకు డ్రైవర్ కావలెను. ఆకర్షణీయమైన జీతము ఇవ్వబడును. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8122461164
■ గుంటూరు స్తంబాలగరువు ప్రఖ్యాత సింధూరి దివ్యాంగుల సంస్థ నందు పనిచేయుటకు 40సం॥ లోపు పనిమనిషి కావలెను. సంప్ర॥ 9666589589
■ ఫ్రీ కంప్యూటర్ స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్ కోర్సు 3నెలల శిక్షణఇచ్చి జాబ్ చూపబడును. ఫ్రీ భోజనం & హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ. వ:18-28 సం॥లోపు ✆ 9133444985 / 89
■ తెనాలి, మంగళగిరి ఏరియాలో పురుగు మందు కంపెనీలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అ:డిగ్రీ, జీ: 15000+3000. సంప్ర: 91214 69383
■ తెనాలి రేపల్లె గుంటూరులో పని చేయుటకు ఆయాలు నర్సులు కేర్ టేకర్స్ (M/F) కావలెను. జీతం: 18000/-. సం॥ 799123705, 7893145549
■ గుంటూరు నారాకోడూరు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు, సెక్యూరిటీ ఫీల్డ్ ఆఫీసర్స్, అనుభవం కలిగిన పేషంట్ కేర్ టేకర్స్‌కావలెను.9542018425, 0863-2222237
■ తుమ్మలపాలెం ప్రముఖ కంపెనీలో ASO లుగా పనిచేయుటకు Ex సర్వీస్‌మెన్‌లు కావలెను. మంచి జీతం PF / ESI Q:12th, 26రో 8గం॥వ.48 లోపు ✆944185 3786
■ Hydలోపెద్దవారికి సేవచేయుటకు టేబీకేర్,ఇంటి /వంటపనికి హెల్పర్స్,ఆయాలు, కేర్‌టేకర్స్ స్త్రీ /పు కావలెను.జీతం:18,000 to 30,000/ రూం + మీల్స్ ఫ్రీ. 8977182524, 9347335969

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు
7075167663
7075167541

గమనిక [illegible]

బాపూజీ మార్గం అనుసరణీయం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గాంధీ వర్ధంతి

గాంధీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త వేమారెడ్డి, నాయకులు

మంగళగిరి టౌన్: అహింసా మార్గంతో భారతదేశానికి స్వాతంత్య్రం సాధించిన మహాత్మా గాంధీ మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. మంగళగిరి పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త వేమారెడ్డి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్రం కోసం తన జీవితాన్ని, ప్రాణాన్ని త్యాగం చేసిన మహానుభావుడు గాంధీ అని కొనియాడారు. గాంధీ కలలుగన్న స్వరాజ్య పాలన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమైందని అన్నారు. గ్రామ సచివాలయం ఏర్పాటు చేసి స్వగ్రామ పాలన చేసి చూపించి కొత్త వ్యవస్థకు నాంది పలికిన వ్యక్తి వైఎస్ జగన్ అని పేర్కొన్నారు.

తిరుమల లడ్డూపై బాబు విషప్రచారం..

తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు ప్రభుత్వంలోనే తమ పార్టీ నాయకులు విషప్రచారం చేస్తున్నారని మురుగుడు, వేమారెడ్డి విమర్శించారు. సుప్రీం కోర్టు లడ్డూ విషయంలో అటువంటిదేమీ జరగలేదని తీర్పు ఇచ్చినా, నేటికీ విష ప్రచారం చేస్తూనే ఉన్నారని మండిపడ్డారు. ఇలాంటి విష ప్రచారాలు, అబద్ధపు మాటలు పచ్చ పత్రికల్లో ఎంత ఊదరగొట్టినా ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, రాష్ట్ర జాయింట్ సెక్రటరి మేకా అంజిరెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ సంయుక్త కార్యదర్శి ఈపూరి ఆదాం, కార్యదర్శి ఫిరోజ్, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షులు శరన్‌కుమార్ రెడ్డి, జిల్లా దివ్యాంగుల విభాగ అధ్యక్షులు బొక్కా అగస్టీన్, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, పట్టణ మహిళా విభాగ అధ్యక్షురాలు సంకె సునీత, పట్టణ విద్యార్థి విభాగ అధ్యక్షులు ప్రదీప్, మండల ప్రధాన కార్యదర్శి చిన్నారి యాదవ్, పట్టణ యువజన విభాగ ఉపాధ్యక్షులు హర్ష, విద్యార్థి విభాగ ఉపాధ్యక్షులు వినయ్, మండల వలంటీర్ విభాగ అధ్యక్షులు నీలిమ, మండల ఎస్టీసెల్ అధ్యక్షులు దుర్గా నాయక్, మండల కార్యదర్శి షేక్ బాజీ సైదా, నూతక్కి కిరణ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆన్‌కాల్ డ్రైవర్లకు దరఖాస్తులు

మంగళగిరి టౌన్: మంగళగిరి ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేయడానికి ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని మంగళగిరి డిపో మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల దరఖాస్తు దారులు డిపో మేనేజర్ కార్యాలయంలో ఫిబ్రవరి 2వ తేదీ నుంచి తమ దరఖాస్తులను అందజేయాలని కోరారు. వయస్సు 21 నుంచి 60 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొంది 18 నెలలు పూర్తయిన వారు అర్హులని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కమిటీల నియామకం

మంగళగిరి టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండల, పట్టణాల్లో వివిధ హోదాలకు నాయకులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. మంగళగిరి నియోజకవర్గ పంచాయతీరాజ్ వింగ్ ప్రెసిడెంట్‌గా ప్రాతూరి లలితకుమారి నియమితులయ్యారు. మంగళగిరి టౌన్ వలంటరీ వింగ్ ప్రెసిడెంట్‌గా మేకల రవికాంత్, దివ్యాంగుల విభాగం ప్రెసిడెంట్‌గా సురేష్‌కుమార్ నియమితులయ్యారు. మంగళగిరి మండల మైనార్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ జబీర్, జనరల్ సెక్రటరీలుగా షేక్ బాబి, షేక్ యూసఫ్ బాషా, బాజీ, సెక్రటరీలుగా షేక్ బాజీ, షేక్ ఖాసిం, సయ్యద్ సుభాని, షేక్ రబ్బాని, షేక్ గల్షిద్, షేక్ జిలాని, దుగ్గిరాల మండలం ఎస్టీసెల్ ప్రెసిడెంట్‌గా హరిప్రసాద్, వైస్ ప్రెసిడెంట్లుగా రామునాయక్, శ్రీను, జనరల్ సెక్రటరీలుగా శ్రీకాంత్, సాయిబాబా, రాజేష్, సెక్రటరీలుగా చెంచయ్య, రమేష్, వినయ నాయక, వెంకటేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నరేంద్రబాబు, రామచంద్రయ్య, నాగేశ్వరరావు, శివశంకర్, తాడేపల్లి మండలం స్టూడెంట్ వింగ్ వైస్ ప్రెసిడెంట్లుగా వరప్రకాష్, సందీప్, జనరల్ సెక్రటరీలుగా నవీన్, రాకేష్ రెడ్డి, అఖిల్, సెక్రటరీలుగా వంశీ, విష్ణు, శ్రీనివాస్, రాహుల్, రాకేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా దిలీప్, సంతోష్‌బాబు, వంశీ, హరీష్ రెడ్డి, ప్రదీప్ కుమార్, ప్రేమ్ కుమార్, ఇబ్రహీం, షేక్ నానా సాహెబ్, సుబ్బారెడ్డిలు నియమితులయ్యారు.

విష ప్రచారంపై మీడియా సమావేశం నేడు

మంగళగిరి టౌన్: తిరుమల లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు సర్కార్ చేస్తున్న విష ప్రచారంపై శనివారం మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన వెలువడింది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 9 గంటలకు మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఘాట్ రోడ్ వద్ద గల శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మీడియా సమావేశం జరుగుతుందని.. కార్యక్రమానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆ ప్రకటనలో కోరారు.

కూటమి నేతలకు మంచి బుద్ధి ప్రసాదించాలని పూజలు..

తాడికొండ: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కూటమి నేతలకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ శనివారం తాడికొండలోని శ్రీ రాముల వారి ఆలయంలో పూజలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు తెలిపారు. తిరుమల లడ్డూపై చంద్రబాబు, ఆయన నేతలు చేసిన దుష్ప్రచారం కారణంగా భక్తుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. బాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి అందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పాఠశాలల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్

మంగళగిరి టౌన్: సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'బడుల్లో గుక్కెడు నీటికి కటకటే' శీర్షిక కథనానికి గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీమ్ బాషా సదరు విషయంపై మండల విద్యాశాఖ అధికారి నుంచి నివేదిక తెప్పించారు. మంగళగిరి మండల విద్యాశాఖ అధికారి బాబు శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన ఆయా పాఠశాలలకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. అక్కడ గల వాటర్ ప్లాంట్లను తనిఖీ చేసి నివేదిక పంపినట్లు తెలిపారు. పని చేయని పలు ఆర్వో ప్లాంట్లకు త్వరలో మరమ్మతులు చేయించనున్నట్లు మంగళగిరి ఎంఈవో తెలియజేశారని సలీమ్‌బాషా పేర్కొన్నారు.

■ విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్, వేములూరిపాడు గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

■ బాధితులకు పరామర్శ

తాడేపల్లి రూరల్: స్థానిక సీనియర్ నాయకులు కొమ్మరబత్తిన ఆంథోని అన్నయ్య చంద్రబాబు(53) శుక్రవారం మృతిచెందారు. దీంతో తాడేపల్లి వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి పార్టీ నాయకులతో ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రకటన

మహారాజశ్రీ గుంటూరు 1వ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.A. No. 138/2025 in E.P. No. 182/2016
In O.S.No. 166/1992
Between:

Union Bank of India — తుళ్ళూరు బ్రాంచి (25651)
రాయపూడి లిఫ్ట్ ఇరిగేషన్ సొసైటి భవనము, 10వ వార్డు, తుళ్ళూరు పోస్టు & మండలం, గుంటూరు జిల్లా, ఏ.పి.-622237, ఫోన్: 08645 - 244767 ఇ-మెయిల్: ubin0825654@unionbankofindia.bank.in

ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇ-వేలం తేది మరియు సమయం : 13-03-2026 ఉ॥ 12.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ లు
(10 ని॥ల అపరిమిత స్వీయ పొడిగింపుతో)

ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-ఋణదారు(లు): 1. శ్రీ పలపర్తి సాంబశివరావు, తండ్రి: సుబ్బారావు, చిరునామా: డి.నెం.2-100/1, శాఖమూరు గ్రామం, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522237, 2. శ్రీ మారేళ్ళ శంకరరావు, తండ్రి: రాజారావు, చిరునామా: డి.నెం.2-78, శాఖమూరు గ్రామం, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522237.

బకాయి మొత్తం: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి చెల్లించవలసిన బకాయిసొమ్ము ది.31-12-2025 నాటికి రూ.9,18,217.17 మరియు కాంట్రాక్టు రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

ఆస్తి వివరములు: గుంటూరు జిల్లా, తాడికొండ యస్ఆర్ఓ, తుళ్ళూరు మండలం, శాఖమూరు గ్రామము, సర్వే నెం.87, డోరు నెం.1-100 లోని 150 చ॥గ॥లు లేదా 125.41 చ॥మీ॥ల విస్తీర్ణముగల భూమి మరియు అందులోని బిల్డింగ్‌కు సంబంధించిన యావదాస్తి. ఆస్తికి హద్దులు (దస్తావేజు ప్రకారం) : తూర్పు : పలపర్తి బాబూరావు యొక్క ఆస్తి-52 అ॥, దక్షిణం : పలపర్తి భాగ్యం యొక్క ఆస్తి-26 అ॥, పడమర : పంచాయతీ రోడ్డు-52 అ॥, ఉత్తరం : పలపర్తి వెంకటేశ్వర్లు యొక్క ఆస్తి-26 అ॥.

రిజర్వు ధర: రూ.16,95,000/- ధరావత్తు: రిజర్వు ధరలో 10% బిడ్ పెంపుదల మొత్తం: రూ.20,000/-

విక్రయమునకు సంబంధించిన నియమ నిబంధనల వివరములకు దయచేసి బ్యాంక్ సంబంధించిన లింక్ https://www.unionbankofindia.bank.in/auction-property/viewauction-property.aspx or https://baanknet.com ను దర్శించగలరు.
ప్రదేశం : గుంటూరు, తేది : 29-01-2026 సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తుళ్ళూరు బ్రాంచ్, గుంటూరు జిల్లా.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda — బ్యాంక్ ఆఫ్ బరోడా
కుంచనపల్లి బ్రాంచి
గుంటూరు జిల్లా, ఏపి-522501. ఫోన్: 8977513968.

స్థిరాస్తుల విక్రయం కొరకు అమ్మకం నోటీసు అనుబంధం-IV-ఎ (రూల్ 8(2) & 8(6) చూడవలెను)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 6 (2) & 8(6)లోని నిబంధనలతో చదువుతూ సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఈ-వేలం అమ్మకం ప్రకటన)
ప్రదేశం: గుంటూరు, తేది: 30.01.2026 అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
RACPC మంగళగిరి బ్రాంచ్, 1వ అంతస్తు, CA-5, CFC ఏరియా, హోండా షోరూమ్ వెనుక, ఆటోనగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503.

రూల్-8(1) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 (2002 నందు నెం.3) యొక్క 3తో చదువుకోవలసిన సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు నోటీసులు అందిన తేది నుండి 60 రోజులలోపు ఆ నోటీసులలో పేర్కొనబడిన మొత్తములను మరియు వాటిపై వడ్డీతో తిరిగి చెల్లించవలసిందిగా క్రింద పేర్కొనబడిన ఋణగ్రహీతలను & హామీదారులను కోరుతూ డిమాండ్ నోటీసులను జారీచేయడమైనది.

ఋణగ్రహీతలు, బకాయి, డిమాండ్ నోటీసు & స్వాధీనత నోటీసు తేదీలు మరియు ఆస్తుల వివరాలు

1. ఋణగ్రహీత పేరు & చిరునామా : శ్రీమతి ఆరేపల్లి మరియమ్మ, భర్త : సాంబశివరావు, హెచ్.నెం.11-439, యర్రబాలెం మంగళగిరి, గుంటూరు జిల్లా-522503. హోమ్ లోన్ అకౌంట్ నెం.41761038046
చెల్లించవలసిన మొత్తం బకాయి : తేది.22.08.2025 నాటికి రూ.4,47,669/- + తేది.23.08.2025 నుండి భవిష్య వడ్డీ, ఖర్చులు, కాస్ట్స్, ఇతర ఛార్జీలు మొ॥వి. డిమాండ్ నోటీసు తేది : 28.08.2025, స్వాధీనత నోటీసు తేది : 28.01.2026
స్థిరాస్తుల వివరములు : షెడ్యూల్-ఎ : గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, మంగళగిరి సబ్-రిజిస్ట్రేషన్, అమరావతి క్యాపిటల్ సిటీ నిడమూరు పరిధి, సర్వే నెం. 217 & 218 లో మొత్తం విస్తీర్ణం ఎ. 3.95 సెంట్లులోని భూమి. షెడ్యూల్-బి : అమరావతి, నిడమూరు, PMAY (U)-వైఎస్ఆర్ జగనన్న నగర్, సర్వే నెం. 217 & 218 లో ... బ్లాక్ నెం.B5 లోని ఫ్లాట్ నెం.SF-2 తో ఉన్న ఒక ఫ్లాట్.

తేది: 28.01.2026 & 29.01.2026, ప్రదేశం : మంగళగిరి సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మల్లన్న సేవలో డయ్యూ డామన్ లెఫ్టినెంట్ గవర్నర్

గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న పాపిరెడ్డి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దాద్రా నగర్ హవేళి, డయ్యూ డామన్ లెఫ్ట్‌నెంట్ గవర్నర్ ప్రఫుల్ పటేల్ శుక్రవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మల్లికార్జున స్వామికి అభిషేకం, భ్రమరాంబ దేవికి కుంకుమార్చన నిర్వహించారు. వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, దేవస్థాన అధికారులు స్వామి శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు, జ్ఞాపికను అందించి సత్కరించారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

నాగులుప్పలపాడు: బిట్రగుంట నుంచి విజయవాడ వెళ్తున్న గూడ్స్ రైలు ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలు–రాపర్ల మధ్య పట్టాలు తప్పింది. శుక్రవారం విజయవాడ వెళ్తున్న గూడ్స్ రైలు చక్రాలు విరిగిపోవడంతో అమ్మనబ్రోలు సమీపంలో పట్టాలు తప్పిందని అమ్మనబ్రోలు స్టేషన్ మాస్టర్ తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదని, గూడ్స్ వ్యాగన్ ఇనుప చక్రాలు ఊడిపోవడంతో వ్యాగన్‌లు పక్కనే ఉన్న ట్రాక్ పై పడిపోయాయన్నారు. వెంటనే స్పందించిన రైల్వే ఉన్నతాధికారులు క్రేన్ సహాయంతో వ్యాగన్‌లను తొలగించారన్నారు. ఈ ఘటన వల్ల ఐదు గంటల పాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అప్పుల బాబు బరితెగింపు

వర్సిటీల నిధులు దారి మళ్లించేందుకు చంద్రబాబు స్కెచ్

తొలి విడతలో రూ.1200 కోట్లు లాక్కునేందుకు టార్గెట్

- బ్యాంకుల్లోని డిపాజిట్లు రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్‌కు బదిలీ చేసేలా తీవ్ర ఒత్తిడి
- సీఎంవో, విద్యాశాఖ అధికారుల తిట్లదండకంతో హడలిపోతున్న ఉన్నత విద్యామండలి, వర్సిటీ వర్గాలు
- ఒత్తిడి భరించలేక చాలా వర్సిటీల నుంచి నిధుల బదిలీ ప్రారంభం
- రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేసిన బాబు
- 20 నెలల్లో రూ.3.11 లక్షల కోట్లు అప్పు చేసినా రాష్ట్రాన్ని నడపలేని దుస్థితి
- ఈ పరిస్థితుల్లో వర్సిటీల నిధులు మళ్లీ వెనక్కు ఇచ్చే పరిస్థితి లేదంటున్న విద్యావేత్తలు
- రూ.7800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులే చెల్లించని బాబు సర్కార్
- వర్సిటీలకు నిధులివ్వకపోగా వాటి డబ్బులే పక్కదారి పట్టిస్తున్న ప్రభుత్వం



సాక్షి, అమరావతి: అప్పుల బాబు బరితెగించేసి వర్సిటీల నిధులపై కన్నేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దొరికినచోటల్లా రుణాలు తీసుకున్న చంద్రబాబు ఇప్పటికే రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసి దివాళా అంచున నెలబెట్టేశారు. ఇరవై నెలల్లో రూ.3.11 లక్షల కోట్లు మేర అప్పులు చేసినా ప్రభుత్వాన్ని నడిపే పరిస్థితి లేకపోవడంతో ఇప్పుడు యూనివర్సిటీ నిధులపై కన్నేశారు. తొలివిడతలో ఉన్నత విద్యా మండలితోపాటు వర్సిటీల నిధులు సుమారు రూ.1200 కోట్లు లాక్కునేందుకు బెదిరింపులకు పాల్పడుతున్నారు. వీటిని వర్సిటీల నుంచి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్‌కు బదిలీ చేయించి ఇష్టారీతిన ఖర్చు చేసుకునేందుకు స్కెచ్ వేశారు.

డిపాజిట్లు దారి మళ్లించేందుకు కుట్ర

దశాబ్దాలుగా విద్యార్థులు చెల్లిస్తున్న ఫీజులతో వర్సిటీలు ఆర్థికంగా బలోపేతమయ్యాయి. ప్రభుత్వాల సాయం కోసం ఎదురు చూడకుండా ఆ నగదును జాతీయ బ్యాంకుల్లో ఫిక్సిడ్ డిపాజిట్ల రూపంలో భద్రపరుచుకున్నాయి. ఇప్పుడు ఆ డిపాజిట్లనే బయటకు తీయించి దారి మళ్లించేందుకు చంద్రబాబు సర్కార్ ఒత్తిడి చేస్తోంది. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ వర్సిటీలకు నష్టమే జరుగుతోందని, ఈ సారి ఏకంగా ప్రభుత్వ వర్సిటీలను ఆర్థికంగా కుదేలు చేసి శాశ్వతంగా మూసేసే కుట్రకు పాల్పడుతున్నారని విద్యావేత్తలు మండిపడుతున్నారు. డిపాజిట్లను బయటకు తీసి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్‌లో జమ చేయాలని తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మౌఖిక ఆదేశాలతోనే వర్సిటీలపై ఒత్తిడి

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని విషయాల్లోనూ నిబంధనలు తుంగలో తొక్కేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం ప్రస్తుతం వర్సిటీల నిధుల మళ్లింపు విషయంలోనూ అదే పంథా కొనసాగిస్తోంది. నిధుల బదిలీకి సంబంధించి ప్రభుత్వం తరఫున ఎక్కడా దరఖాస్తు చేయకుండా మౌఖిక ఆదేశాలతోనే బెదిరిస్తూ పాశవికంగా వ్యవహరిస్తోంది. కొద్ది రోజులుగా ముఖ్యనేత కార్యాలయంలోని ఓ కీలక అధికారితోపాటు, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి ఓఎస్‌డీ కలిసి ఉన్నత విద్యా మండలి, వర్సిటీల వర్గాలకు పదేపదే ఫోన్లు చేసి అమానవీయ రీతిలో తిడుతూ ఆందోళనకు గురిచేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో చేసేది లేక కొన్ని వర్సిటీల్లో డిపాజిట్ల బదిలీ ప్రక్రియ ప్రారంభించేశారు.

చంద్రబాబును నమ్మితే అసలుకే ఎసరు..!

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చంద్రబాబు సర్కారు అప్పుల కోసం ఏ వ్యవస్థనూ వదలడం లేదు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్‌ను అడ్డం పెట్టుకుని ప్రభుత్వ సంస్థల నుంచి నిధులను లాగేస్తోంది. వాస్తవానికి జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్లకు గ్యారెంటీ ఉంటుంది. నిత్యం చెల్లింపులు, ఉపసంహరణలకు అవకాశం ఉంటుంది. కానీ చంద్రబాబు ట్రాక్ రికార్డు చూస్తే వర్సిటీలు, ఉన్నత విద్యా మండలి నిధులను తిరిగిచ్చే అవకాశమే ఉండదని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. కేవలం ఒక శాతం అధిక వడ్డీకి ఆశపడి జాతీయ బ్యాంకుల్లోని డిపాజిట్లను తీసుకొచ్చి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థల్లో పెట్టడం మంచిదికాదని మండిపడుతున్నారు. పైగా ప్రభుత్వమే ఎడా పెడా అప్పులు చేస్తుంటే.. వర్సిటీలకు తిరిగి చంద్రబాబు నిధులు చెల్లిస్తారనుకోవడం భ్రమేనని తెగేసి చెబుతున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమరావతి జపం చేస్తున్న చంద్రబాబు అభివృద్ధిని, పేదల సంక్షేమాన్ని పూర్తిగా అటకెక్కించేశారని, ఉద్యోగులకు 10వ తేదీ వచ్చినా జీతాలు చెల్లించడం లేదని గుర్తు చేస్తున్నారు.

బాబు జమానాలో వర్సిటీలకు గడ్డుకాలమే

అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఏనాడూ విద్యారంగాన్ని, వర్సిటీలను పట్టించుకోలేదు. అటువంటి బాబు ప్రస్తుతం కూటమిగా అధికారంలోకి వచ్చాక ఉన్నత విద్యా మండలి ఖజానాలోని రూ.10 కోట్లను వాడేసుకోవడం గమనార్హం. ముఖ్యంగా చినబాబు లోకేశ్ ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా ఏకంగా రూ.3.60 కోట్లు ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డుకు మళ్లించేశారు. మరోవైపు శతాబ్ది ఉత్సవాలతో కళకళాడాల్సిన ఆంధ్ర విశ్వవిద్యాలయం సైతం కళావిహీనంగా మారిపోయింది. వర్సిటీ కనీసం ప్రశ్నాపత్రాల ముద్రణకు కూడా నోచుకోవట్లేదు. ఇటీవల ఏయూ దూరవిద్య పరీక్షల నిర్వహణలో బయటపడిన డొల్లతనమే ఇందుకు నిదర్శనం. అత్యంత ప్రతిష్టాత్మకంగా సాగాల్సిన దూర విద్య పరీక్షలను ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఫలితంగా మాస్ కాపీయింగ్, ప్రశ్నాపత్రాలను ఈ మెయిల్‌లో పంపించడం, చేతిరాతతో ఉన్న ప్రశ్నాపత్రాన్ని జిరాక్స్ తీసి అప్పటికప్పుడు విద్యార్థులకు అందించే దుస్థితికి దిగజారింది. ఇదంతా విశాఖ తీరంలోని ఓ కార్పొరేట్ వర్సిటీకి లబ్ధి చేకూర్చేందుకు చేస్తున్నట్టు వినికిడి. అందుకే ప్రభుత్వ వర్సిటీకి రావాల్సిన ఎన్నో విలువైన ప్రాజెక్టులు సైతం ఆ కార్పొరేట్ వర్సిటీకి తరలిపోయాయి. ఇది ఒక్క ఏయూనే కాదు.. అమరావతికి కూతవేటు దూరంలోని ఆచార్య నాగార్జున వర్సిటీ, సాక్షాత్తూ కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి పాదాల చెంత ఉన్న శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూలనూ పట్టిపీడిస్తున్న సమస్య.

కొండలా పేరుకుపోయిన బకాయిలు

చంద్రబాబు ఏలుబడిలో ఉన్నత విద్య అంతకంతకూ దిగజారిపోతోంది. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలతో పాటు, ప్రైవేటు సంస్థలు సైతం తాము విద్యాలయాలను నడపలేమనే స్థాయికి వచ్చేశాయి. వీటన్నింటికీ ముఖ్య కారణం 'ఫీజు రీయింబర్స్‌మెంట్' చెల్లింపుల్లో ప్రభుత్వం ప్రదర్శిస్తున్న అత్యంత దుర్మార్గపు, నిర్లక్ష్యపు వైఖరేనని స్పష్టంగా తెలుస్తోంది. దాదాపు రూ.5,600 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, రూ.2,200 కోట్ల వసతి దీవెన బకాయిలు కొండలా పేరుకుపోవడం ప్రభుత్వ ఆర్థిక అనిశ్చితిని బట్టబయలు చేస్తోంది. ఇలాంటి తరుణంలో చంద్రబాబు సర్కార్ ప్రభుత్వ విశ్వవిద్యాలయాల నిధులను బలవంతంగా లాక్కోవడం వర్సిటీల మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తోంది.

దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

నార్సింగి పోలీసులకు వైఎస్ సోదరి విమలారెడ్డి ఫిర్యాదు

తనను లక్ష్యంగా చేసుకుని యూట్యూబ్ చానళ్లు, సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని వెల్లడి

అబద్ధాల వ్యాప్తితో మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన

విమలారెడ్డి

మణికొండ (హైదరాబాద్): తనను లక్ష్యంగా చేసుకుని కొన్ని యూట్యూబ్ చానళ్లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో ఉద్దేశపూర్వకంగా దుర్మార్గపు దుష్ప్రచారం చేస్తున్న సంస్థలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరి వైఎస్ విమలారెడ్డి శుక్రవారం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2004లో తాను సెయింట్ లూక్స్ మైనారిటీ ఇనిస్టిట్యూషన్ పేరుతో ఆసుపత్రి నిర్మాణానికి భూమిని కోరుతూ అప్పటి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నట్టుగా వాటిల్లో పేర్కొనడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. 2009లో విశాఖపట్నం జిల్లా ఎండాడలోని సర్వే నంబర్ 16బీ 1లో ప్రభుత్వం 7.35 ఎకరాలను కేటాయించిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అదే క్రమంలో సదరు భూమిలో ఆసుపత్రికి బదులుగా చర్చిని నిర్మించానంటూ దుష్ప్రచారం చేస్తున్నారని విమలారెడ్డి పేర్కొన్నారు. తన వ్యక్తిగత ప్రతిష్టకు నష్టం కలిగేలా అబద్ధాలను వ్యాప్తి చేయటంతో పాటు మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

'థింక్ ఆంధ్రా', ఇతర సంస్థలు, వ్యక్తులపై చర్యలకు వినతి

'థింక్ ఆంధ్రా' అనే యూట్యూబ్ చానల్ సమాజంలో ద్వేషాన్ని రెచ్చగొట్టే విధంగా దుర్మార్గపు ప్రచారాన్ని నిర్వహిస్తోందని విమలారెడ్డి పోలీసుల దృష్టికి తెచ్చారు. ఆ చానల్‌తో పాటు సదరు కంటెంట్‌ను షేర్ చేస్తున్న ఇతర సంస్థలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపారని ఆమె వెల్లడించారు.

మాజీ మంత్రి రజినిపై దాడికి యత్నం

- బోయపాలెం వెంకన్న సన్నిధిలో ఉద్రిక్తత
- ఆమె కారును చుట్టుముట్టిన టీడీపీ మూకలు
- దీటుగా తిప్పికొట్టిన వైఎస్సార్‌సీపీ
- నియోజకవర్గంలోనే ఉంటా.. మీ అవినీతిని ఎండగడతానంటూ విడదల రజిని ఫైర్

రజిని కారుపై దాడికి పాల్పడుతున్న టీడీపీ వర్గీయులు

యడ్లపాడు (పల్నాడు జిల్లా): తిరుమల లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు చేస్తున్న అసత్య ప్రచారాలను నిరసిస్తూ, టీడీపీ కూటమి నాయకులకు మంచి బుద్ధిని ప్రసాదించాలని వేడుకుంటూ పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామికి శుక్రవారం పూజలు చేసిన మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ నేత విడదల రజినిపై టీడీపీ మూకలు దాడికి యత్నించాయి. బీసీ నేత, మహిళ అని కూడా చూడకుండా పచ్చ గుండాలు చేసిన దుశ్చర్య తీవ్ర కలకలం రేపింది. అయితే, టీడీపీ శ్రేణుల గూండాగిరిని వైఎస్సార్‌సీపీ శ్రేణులు దీటుగా ఎదుర్కొన్నాయి. వివరాలివీ.. వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు ఆలయానికి చేరుకున్న రజిని, పూజ అనంతరం బయటకు రాగానే... పక్కాప్లాన్‌తో అప్పటికే అక్కడకు చేరుకున్న టీడీపీ మూకలు 'జై పుల్లారావు, గోబ్యాక్ రజిని' అంటూ నినాదాలు చేస్తూ రెచ్చిపోయారు. రజిని కారు ఎక్కుతున్న సమయంలో ఆమెపైకి దూసుకొచ్చారు. కారును ముందుకు కదలనీయకుండా కారుపై చేతులతో గుద్దుతూ ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. అయితే, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా టీడీపీ రౌడీయిజాన్ని అడ్డుకున్నారు. తోపులాటలు, వాగ్వాదాల మధ్య వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కవచంలా నిలబడి రజినిని సురక్షితంగా అక్కడి నుంచి పంపించారు.

పదవుల కోసం మహిళపై దాడి చేస్తారా?

అనంతరం.. విడదల రజిని మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ తీరుపై నిప్పులు చెరిగారు. ఒక బీసీ నేత అని కూడా చూడకుండా, నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ ఎమ్మెల్యే, మాజీమంత్రి అని కూడా గౌరవించకుండా, కనీసం మహిళ అనే విచక్షణ లేకుండా దాడికి యత్నించడం దారుణమని మండిపడ్డారు. టీడీపీలో పదవుల కోసమే కొంతమంది ఇలా దాడికి యత్నించారని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అక్రమ కేసులు, వేధింపులు ఎక్కువయ్యాయని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తమ పార్టీ చేపట్టే కార్యక్రమాలకు ప్రజల నుంచి వస్తున్న మద్దతు చూసి తట్టుకోలేకే టీడీపీ మూకలు ఇలాంటి దాడులకు తెగబడుతున్నాయని విడదల రజిని ఆరోపించారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేదిలేదన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ అవినీతి, అక్రమాలను బట్టబయలు చేసేవరకు విశ్రమించబోనని రజిని హెచ్చరించారు.

చంద్రబాబూ.. హిందూ దేవాలయాలపై ఎందుకు కక్ష?

నోటీసులు ఇవ్వకుండా అన్నదాన సత్రం గోడలు కూలుస్తారా

బ్రాహ్మణులంటే గౌరవం లేదా

వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా

బొమ్మలసత్రం: ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీశైలంలో బ్రాహ్మణుల అన్నదాన సత్రం గోడలను ఆలయ అధికారులు కూల్చడం సమంజసం కాదని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారం చేపట్టిన తర్వాత హిందూ ఆలయాలను కూలుస్తున్నారని, సంప్రదాయాలను తుంగలోకి తొక్కి హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. శుక్రవారం నంద్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హిందూ సంప్రదాయంలో భగవంతుని తర్వాత బ్రాహ్మణులకు నమస్కరించడం సంస్కారమన్నారు. అలాంటి బ్రాహ్మణులకు చెందిన కరివేన అన్నదాన సత్రానికి సంబంధించిన ప్రహరీని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూలచ్చడం చంద్రబాబు ప్రభుత్వం దౌర్జన్యానికి అద్దం పడుతోందన్నారు.

మెట్లు కడిగి పవన్ ప్రాయశ్చిత్తం కోరాలి

చంద్రబాబు ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి హిందూ దేవాలయాలపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని వారు ఆగ్రహం వ్యక్త చేశారు. తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపారని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆరోపించటం సిగ్గుచేటన్నారు. ప్రసాదంలో ఎలాంటి జంతు కొవ్వులు వాడలేదని సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన సిట్ నివేదిక ఇవ్వడంతో వారి కుటిల బుద్ధి బయటపడిందన్నారు. గతంలో ఆలయాల మెట్లు శుభ్రం చేసిన పవన్‌కళ్యాణ్ ఇప్పుడు తిరుమల మెట్లను శుభ్రం చేసి ప్రాయశ్చిత్తం కోరుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక చేనేత కార్మికుడు ఆత్మహత్య

ఎమ్మిగనూరు రూరల్: చేసిన అప్పులు తీర్చలేక చేనేత మగ్గానికే ఉరేసుకొని ఓ చేనేత కార్మికుడి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులోని శివన్ననగర్‌కు చెందిన చేనేత కార్మికుడు యువరాజు(43)కు భార్య ఉషారాణి, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. చేనేత మగ్గం నేసుకొని జీవనం సాగిస్తున్నాడు. కొత్త ఇంటి నిర్మాణానికి బయట అప్పులు చేశాడు. మరోపక్క చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోకుండా మొండిచేయిచూపింది. ఈ క్రమంలో ఒత్తిళ్లు అధికం కావడంతో తాళలేకపోయాడు. శుక్రవారం సాయంత్రం భార్య ఉషారాణి లక్ష్మీపేటలోని కొత్త ఇంటి దగ్గరకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవటంతో మగ్గం పనిచేస్తున్న యువరాజు అదే మగ్గానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి ఇంటికి వచ్చిన భార్య ఉషారాణి విగతజీవిగా వేలాడుతున్న భర్తను చూసి కుప్పకూలింది. ఇంటి పక్కవారు, బంధువులు వచ్చి యువరాజు మృతదేహాన్ని కిందకు దించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

కుప్పం చేరుకున్న సీఎం చంద్రబాబు

కుప్పం: సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం కుప్పం చేరుకున్నారు. గుంటూరు నుంచి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా గుడుపల్లె మండలం, అగస్త్య ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్ ఆవరణలోని హెలిప్యాడ్‌కు సాయంత్రం 4.10 గంటలకు చేరుకున్నారు. రూ.3 కోట్లతో ఏర్పాటు చేసిన టీచర్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించి, రూ.10 కోట్లతో నిర్మించనున్న లెర్నర్స్ అకాడమీ ఫెసిలిటీ నిర్మాణానికి, రూ.2 కోట్లతో నిర్మించనున్న ఒబెరాయ్ విజిటర్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం కుప్పం చెరువుల్లో కృష్ణా జలాలకు హారతి ఇచ్చారు. అలాగే, ఆదిత్య బిర్లా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, పున్నమి రిసార్ట్‌లను ప్రారంభించారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన కుప్పం మండలం, కంగుంది చేరుకుని, హెరిటేజ్ విలేజ్ బౌల్డరింగ్ పార్కు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. డిస్కవర్ కుప్పం టూరిజం వెబ్‌సైట్‌ను లాంచ్ చేశారు.

అలుగు పట్టివేత.. ఆరుగురు అరెస్ట్

రాపూరు: అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న అలుగు(పాంగోలియన్)ను గురువారం రాత్రి స్వాధీనం చేసుకుని ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్టు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు అటవీ రేంజ్ అధికారి మాల్యాద్రి శుక్రవారం తెలిపారు. ఇంటెలిజెన్స్ అధికారుల సమాచారం మేరకు రాపూరు సమీపంలో ఈ ముఠాను పట్టుకున్నట్లు చెప్పారు. నిందితులు రాపూరు మండలం తెగచర్లకు చెందిన లింగయ్య, వెంకటేశులు, డక్కిలి మండలం పాతనాల్లపాడుకు చెందిన శీనయ్య, దగదర్తి మండలం పెద్దపుత్తేడుకు చెందిన వెంకటరమణయ్య, కడపకు చెందిన రాజు, అనంత సాగరం మండలం మంగుపల్లికి చెందిన పెంచలయ్యను అరెస్టు చేసి వెంకటగిరి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

యూరియా కోసం ఆందోళన

తెర్లాం: అధికార పార్టీ నేతలు తమకు నచ్చినవారికే యూరియా ఇప్పిస్తున్నారని, సామాన్య రైతులకూ తక్షణమే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ విజయనగరం జిల్లా తెర్లాం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద విజయరాంపురం గ్రామానికి చెందిన రైతులు ప్లకార్డులతో శుక్రవారం ధర్నా చేశారు. సర్పంచ్ బూరి మధుసూదనరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో పలువురు రైతులు మాట్లాడుతూ పంటకు అవసరమైన యూరియా పంపిణీ చేయడం లేదన్నారు. ఈ పంపిణీలో కూడా రాజకీయ వివక్ష తగదని కోరారు. అనంతరం తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

జింకానా.. అందరికీ ఆదర్శం

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

మాతా శిశు సంరక్షణ కేంద్రం ప్రారంభిస్తున్న సీఎం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రూ.100 కోట్లు వెచ్చించి కానూరి జింకానా మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని నిర్మించిన గుంటూరు వైద్యకళాశాల పూర్వవిద్యార్థులు అందరికీ ఆదర్శమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. నిర్వహణ కోసం కూడా కొంత డబ్బు డిపాజిట్ చేయడం గుంటూరు మెడికల్ కళాశాల అలుమ్ని ఆఫ్ నార్త్ అమెరికా (జీఎంసీఏఎన్ఏ–జింకానా) గొప్పతనమని ప్రశంసించారు. దీన్లో పరికరాలకు ప్రభుత్వం రూ.27 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జీజీహెచ్‌లో నిర్మించిన ఈ మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల కిందటే విదేశాలకు వెళ్లినవారు 1981లో జింకానా ఏర్పాటు చేసుకుని గుంటూరు జీజీహెచ్‌కు ఇంత పెద్ద సాయం చేశారని చెప్పారు. గుంటూరు మెడికల్ కాలేజీలో చదివినవారిలో 8 మందికి పద్మశ్రీ అవార్డులు వచ్చాయని చెప్పారు.

పదేళ్లలో అమరావతి రూపురేఖలు మారతాయి

పదేళ్లలో గుంటూరు సహా అమరావతి రూపురేఖలు మారిపోతాయని సీఎం చెప్పారు. గుంటూరు, మంగళగిరి, విజయవాడ కార్పొరేషన్లు కలిసిపోతాయని చెప్పారు. గుంటూరుకు 182 కిలోమీటర్ల ఔటర్ రింగ్‌రోడ్డు వస్తుందన్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న సంజీవని ప్రాజెక్టును అన్ని జిల్లాలకు విస్తరిస్తామని, 72 లక్షలమంది రోగుల డేటా తీసుకుంటామని చెప్పారు.

సమాచార లోపం వల్లే కరివెన సత్రం ప్రహరీ కూల్చివేత

శ్రీశైలం ఆలయ చైర్మన్, ఈఓ సంయుక్త ప్రకటన

శ్రీశైలం: శ్రీశైలం క్షేత్రంలోని కరివెన నిత్యాన్నదాన సత్రం ప్రహరీ కూల్చివేత సమాచార, సమన్వయ లోపం వల్లే జరిగిందని ధర్మకర్తల మండలి చైర్మన్ పోతుగుంట రమేష్, ఈఓ శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో దేవస్థానానికి ఎటువంటి దురుద్దేశం లేదని, సామాజిక కోణంలో చూడకూడదని కోరారు. గురువారం రెవెన్యూ సిబ్బంది ఏసీ సత్రం ప్రహరీని తొలగించడం ప్రారంభించగానే సమాచారం తెలుసుకుని కూల్చివేతను నిలిపివేయించామని పేర్కొన్నారు. కరివేన సత్రం వారికి అదనపు స్థలం కేటాయింపు విషయంపై దేవదాయ శాఖ నుంచి వచ్చే ఆదేశాలను అనుసరించి తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

గాంధీజీ చెప్పినట్టు సత్యమే గెలిచింది

- తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలవలేదని తేలిపోయింది
- కూటమి నేతలు చెప్పేవన్నీ అబద్ధాలేనని ప్రజలకు అర్థమైంది
- స్పష్టం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు
- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి
- గాంధీజీ స్ఫూర్తితోనే వైఎస్ జగన్ గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశారని నేతల వెల్లడి

సాక్షి, అమరావతి: సత్యమేవ జయతే అని మహాత్మా గాంధీజీ చెప్పినట్టు తిరుమల లడ్డూ విషయంలో అంతిమంగా నిజం బయటకు వచ్చిందని, జంతువుల కొవ్వు కలవలేదనేది తేలిపోయిందని వైఎస్సార్‌సీపీ నాయకులు చెప్పారు. తిరుమల లడ్డూ విషయంలో చంద్రబాబు, కూటమి నాయకులు చెప్పినవన్నీ అబద్ధాలేనని సీబీఐ సిట్ కోర్టుకు సమర్పించిన చార్జిషీట్ ద్వారా ప్రజలకు తెలిసిపోయిందని స్పష్టం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్ముడు అనుసరించిన అహింసా మార్గంలోనే ప్రతి ఒక్కరూ ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గాంధీజీ స్ఫూర్తితోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశారని, అవినీతి, పక్షపాతానికి తావులేకుండా ప్రజల గడప వద్దకే పాలన అందించారని, గ్రామ స్వరాజ్యం సాకారం చేశారని చెప్పారు. శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం ద్వారా వందేళ్ల తర్వాత సమగ్ర భూ సర్వేను అత్యంత పారదర్శకంగా నిర్వహించి దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించారని గుర్తు చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడం సరికాదన్నారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెన్నపూస రవీంద్రారెడ్డి, మలసాని మనోహర్‌రెడ్డి, నలమారు చంద్రశేఖర్‌రెడ్డి, ఫిరోజ్, అంకంరెడ్డి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

SPORTS AUTHORITY OF ANDHRA PRADESH
IGMC STADIUM, LABBIPET, BANDAR ROAD, VIJAYAWADA

Tenders are hereby invited from reputed and experienced companies for the following tenders.

S. No.	Tender ID	Name of the work	Estimate Contract Value (in Rs.)
1	893617	Completion of Incomplete Kreeda Vikasa Kendram at Kondapi (SC Constituency), Prakasam District (Part-1).	30,51,727/-
2	893618	-DO- (Part-2)	30,53,495/-
3	893620	-DO- (Part-3)	23,79,733/-
4	893624	-DO- (Part-4)	30,66,689/-

Bid Starting Date 30-01-2026. Bid End date: 10-02-2026. Tender documents are available on e-procurement platform tender.**apeprocurement.gov.in.** Tenders will be opened in the presence of company representatives who attend the evaluation. For further details contact: 8501074922.

Sd/- Vice Chairman and Managing Director

DIPR RO No.4779PP/CL/Advt/1/1/2021-22, Dt:30.01.2026

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED
(A State Government Undertaking)
Head Office: 10-152/1, Ashok Nagar, Bandar Road, Kanuru, Vijayawada-520007

TENDER NOTICE

Lr.No.Proc./FRK Tender/Add/Kharif 2025-26 Date: 30-01-2026

APPOINTMENT OF DISTRICT-WISE SUPPLY OF 2,836 MTS OF RAW/BOILED FORTIFIED RICE KERNEL FROM THE FRK MANUFACTURERS LOCATED IN ALL OVER INDIA TO DESIGNATED BUFFER GODOWNS IN THE KONASEEMA, KRISHNA, GUNTUR, ELURU, ANAKAPALLI AND BAPATLA DISTRICTS FOR KHARIF 2025-26 THROUGH NCDEX E MARKETS LIMITED (NEML) AUCTION PLATFORM IN ANDHRA PRADESH. (EXISTING EMPANELLED MANUFACTURERS OF APSCSCL FOR KMS (KHARIF & RABI) 2025-26 TENDERS ARE NOT PERMITTED TO PARTICIPATE).

Interested tenderers may visit website **www.apscscl.in** and also **www.neml.in** to view and download tender documents at free of cost.
Those who are interested to participate in tender should be registered with ncdex e-markets ltd, on their website **www.neml.in** and can contact the customer service group on phone numbers **(+91-22) – 48810500/ 9962059599/ 9032429420** or email: **askus@neml.in.** Last date for online registration and completion of formalities for submission of online tenders is **05.02.2026 (Thursday) by 5.00 PM** IST.

Sd/- VC & Managing Director

What is thermal pollution of water?

CHAPTER - 6
MANUFACTURING INDUSTRIES

KEY POINTS

- Manufacturing: making goods from raw materials.
- Paper is made from wood.
- Sugar is made from sugarcane.
- Iron and steel are made from iron ore.
- Aluminium is made from bauxite
- Workers in factories like steel, textile do secondary activities.
- A country's strength depends on its manufacturing industries.
- Cotton, wool, jute, silk, rubber, sugar, tea, coffee and oil are agrobased industries.
- Iron and steel, cement, aluminium and petrochemicals are mineral based industries.
- Basic industries supply raw materials to other industries.
- Consumer industries make goods used directly by people.
- A small-scale industry can invest up to one crore rupees.
- Public sector industries are owned by government, e.g. BHEL.
- Private sector industries are owned by individuals, like TISCO and Bajaj Auto.
- Joint sector industries are run by both government & private groups.
- Cooperative industries are run by workers or producers, like sugarmills in Maharashtra.
- Iron and steel are examples of heavy industries.
- The textile industry is a self-reliant industry.
- Power looms were used after the 18th century.
- The first successful textile mill started in Mumbai in 1854.
- Cotton industries were mainly in Maharashtra and Gujarat.
- Many workers are involved in plucking, ginning, spinning, weaving and tailoring
- India is the largest producer of raw jute and jute goods.
- India is the second largest exporter of jute after Bangladesh.
- Most jute mills are in West Bengal along the Hugli river.
- The first jute mill started at Rishra near Kolkata in 1855.
- After 1947, all jute mills remained in India.
- Three-fourths of jute-growing land went to Bangladesh.
- India is the second largest sugar producer in the world.
- India is the largest producer of gur and khandsari.
- Industries use minerals & metals are mineral-based industries.
- Iron and steel industry is a basic industry.
- Iron ore, coal and limestone are used in a 4:2:1 ratio.
- Manganese is used to make steel strong.
- Aluminium smelting is an important metallurgical industry.
- Aluminium is used to make aeroplanes, utensils and wires.
- Bauxite is a heavy reddish rock used to make aluminium.
- Organic chemical plants are built near petrochemical areas.
- The chemical industry uses most of its own products.
- Potash is fully imported by India.

1 MARK QUESTIONS

1. What is manufacturing?
A. Production of goods in large quantities after processing from raw materials to more valuable products is called manufacturing.

2. Name the State of Naurora Power Plant.
A. Uttar Pradesh.

3. Name the raw material for Sugar?
A. Sugarcane.

4. From which ore Aluminum is manufactured?
A. Bauxite.

5. Which sector activities manufacture the primary materials into finished goods?
A. Secondary sector.

6. Give examples for the secondary sector activities.
A. The workers employed in steel factories, car, breweries, textile industries, bakeries etc. fall into the secondary activities.

7. Classify the industries on the basis of source of raw materials.
A. 1. Agro based Industries.
2. Mineral based Industries.

8. What are heavy industries?
A. Heavy industries such as iron and steel.

9. Find out not related to agro based industries: A. Sugar industry, B. Rubber Industry, C. Cement industry, D. Coffee industry:
A. C. Cement industry.

10. Which city emerged as the electronic capital city of India?
A. Bengaluru.

11. Name the chemical which has been importing as the country does not have any reserves?
A. Potash.

12. Which industry is its own largest consumer?
A. The chemical industry.

13. What is Water pollution?
A. Water pollution is caused by organic and inorganic industrial wastes and affluents discharged into water.

14. What is thermal pollution of water?
A. Thermal pollution of water occurs when hot water from factories and thermal plants is drained into rivers and ponds before cooling.

15. What are the effects of the thermal pollution of water?
A. Cancers, Birth defects, miscarriages.

16. How the ground water gets contaminated?
A. Rainwater percolates to the soil carrying the pollutants to the ground.

17. Every litre of wastewater discharged by our industry pollutes how many times the quantity of freshwater?
A. Eight times.

18. Expand NTPC.
A. National Thermal Power Corporation.

2 MARKS QUESTIONS

1. Classify the industries according to their main role.
A. 1. Consumer industries.
2. Basic industries.

2. What are Basic industries? Give examples.
A. 1. Supply their products as raw materials to manufacture other goods are called basic industries.
2. Eg: Iron and steel and copper smelting, aluminum smelting.

3. Classify the industries based on capital investment.
1. Small-scale industries.
2. Large-scale industries.

4. What are Consumer industries? Give examples.
1. Produce goods for direct use by consumers are called consumer industries.
2. Eg: Sugar, toothpaste, paper, sewing machines, fans etc.

5. What are called small-scale industries?
A. 1. A small-scale industry is defined with reference to the maximum investment allowed on the assets of a unit.
2. This limit is rupees one crore.

6. Classify the industries based on ownership.
A. 1. Public sector, Private sector, Joint sector.

7. Define the term Public sector
1. Industries owned and operated by government is called Public sector.
2. Ex. BHEL, SAIL etc.

8. Define the term Private sector.
A. 1. Industries owned and operated by individuals are called Private sector.
2. Ex. TISCO, Bajaj Auto, Dabur Industries.

9. Define the term Joint sector
A. 1. Industries which are jointly run by the state and individuals are called Joint sector.
2. Ex. Oil India Ltd. (OIL).

10. Classify the industries based on the bulk and weight of raw material and finished goods.
A. 1. Heavy industries 2. Light industries

11. What are Agro-based Industries? Give examples.
A. 1. Industries that are dependent on agriculture for raw material are known as Agro-based Industries.
2. Ex: Cotton, jute, silk, woollen textiles, sugar and edible oil.

12. Give examples for the Agro based Industries.
A. 1. Cotton industry. 6. Woollen industry.
2. Jute industry. 7. Silk textile industry.
3. Rubber industry. 8. Sugar industry.
4. Tea industry. 9. Coffee industry.
5. Edible oil industry.

13. Which Indian state is famous for silk?
A. Karnataka.

Continued on next page..

14. Which state stands in first place in coffee production?
A. Karnataka.

15. Name the thermal power plant in AP.
A. Vijayawada Thermal Power Station.

16. What is manufacturing?
1. Production of goods in large quantities after processing from raw materials to more valuable products is called manufacturing.
2. Paper is manufactured from wood.
3. Sugar is manufactured from sugarcane.

17. What are basic industries? Give an example.
A. 1. Supply their products as raw materials to manufacture other goods.
2. Eg: Iron and steel and copper smelting, aluminum smelting.

18. How do industries pollute the environment?
A. 1. Industrial pollution has many different causes.
2. Air pollution is caused by smoke from industrial sources.
3. Industrial smoke contain carbon dioxide and carbon monoxide.
4. Water bodies are contaminated by the industries.

19. Discuss the steps to be taken to minimise environmental degradation by industry?
A. 1. Adopting the latest techniques to improve energy efficiency.
2. Careful planning and setting of industries.
3. Better equipment.
4. Proper fuel selection and utilization.
5. Use of oil instead of coal.

20. Sugar Industry is ideally suited to the cooperative sector. Can you explain why this is so?
A. 1. Sugar is a seasonal industry.
2. Labour cannot be employed throughout the year.
3. That is why sugar mills in the co-operative sector.
4. The sugar mills are owned and managed by the farmers.
5. Thus, it is suited to the cooperative sector.

21. Give examples for the Mineral based Industries.
1. Iron and steel. 4. Cement.
2. Aluminium. 5. Machine tools.
3. Petrochemicals.

22. What are the two prime factors for location of the Aluminium smelting industry?
A. 1. Regular supply of electricity.
2. An assured source of raw material at minimum cost.

23. Define the term Cooperative sector
A. 1. Industries owned and operated by the producers and workers are called cooperative sector.
2. They pool in the resources and share the profits or losses.
3. Ex. Sugar industry in Maharashtra, the coir industry in Kerala

24. What are mineral-based Industries?
A. Industries that use minerals and metals as raw materials are called mineral-based industries.

25. Why Chhotanagpur plateau region has the maximum concentration of iron and steel industries?
1. Low cost of iron ore.
2. High grade raw materials. 3. Cheap labour.
4. Vast growth potential in the home market.

26. Write about Chemical Industries.
A. 1. The Chemical industry in India is fast growing.
2. It comprises both large- and small-scale manufacturing units.
3. Rapid growth was recorded in both inorganic and organic sectors.

27. Write about Automobile Industry in India.
A. 1. Automobile industry provides various vehicles.
2. Trucks, buses, cars, motorcycles etc. are manufactured in India.
3. The industry is located around Delhi, Gurugram, Mumbai

28. Write about textile industry in India.
1. Textile industry occupies unique position in our economy.
2. It contributes significantly to foreign exchange earnings.
3. It is self-reliant industry.
4. It is complete in the value chain i.e., from raw material to the highest value-added products.

29. Write about Aluminium Smelting industry in India.
A. 1. Aluminium is resistant to corrosion, a good conductor of heat.
2. It becomes strong when it is mixed with other metals.
3. It is used to manufacture aircraft, utensils and wires.
4. Bauxite is the raw material for the aluminium.
5. Bauxite is a very bulky, dark reddish coloured rock.

30. Where would it be economically viable to set up the cement Bajaj Auto Ltd manufacturing units?
A. 1. Availability for raw materials.
2. Proper supply of electricity.
3. Proper railway and road transport facilities.
4. Availability of cheap labour.
5. Availability of banking facilities.

31. Write about cement industry in India.
1. Cement is essential for construction activity.
2. Cement is using to build houses, factories, bridges, roads etc.
3. Cement industry requires bulky and heavy raw materials.
4. They are limestone, silica, gypsum, coal and electric power.
5. Gujarat has suitable access to the market in the Gulf countries.

32. Write about IT and Electronics Industry in India.
A. 1. The electronics industry covers transistor sets, television, telephones, radars, computers.
2. Bengaluru has emerged as the electronic capital of India.
3. The major industry concentration is at Bengaluru, Noida

33. How can the industrial pollution be reduced?
1. Minimising use of water for processing.
2. Reusing and recycling of water in more stages.
3. Harvesting of rainwater to meet water requirements
4. Treating hot water and effluents before releasing them in water.

34. Write about NTPC.
A. 1. NTPC means National Thermal Power Corporation.
2. NTPC is a major power providing corporation in India.
3. It has ISO certification for EMS 14001.
4. EMS means Environment Management System.
5. NTPC has a proactive approach for preserving the nature.

35. What are the factors that are responsible for their location of Jute Textiles in the Hugli basin?
A. 1. Proximity of the jute producing areas.
2. Inexpensive water transport.
3. Abundant water. 4. Cheap labour.
5. Good network of railways.

36. Write about Sugar Industry in India.
1. India stands second producer of sugar in the world.
2. India stands first in the production of gur and khandsari.
3. During the transport sugarcane's sucrose content reduces.
4. Thu, 60 % mills are in Uttar Pradesh and Bihar.
5. It is also located in Maharashtra and Karnataka.

37. What are the conditions that favour to concentrate the cotton textile industry?
1. The cotton growing belt of Maharashtra and Gujarat.
2. Availability of raw cotton.
3. Availability of market.
4. Availability of labour.
5. Availability of moist climate.

38. Write about the importance of manufacturing sector.
1. The economic strength is measured by the industrial development.
2. Manufacturing sector is the backbone of development.
3. Manufacturing industries help in modernising agriculture.
4. It reduce the heavy dependence of people on agriculture.
5. This sector eradicates unemployment and reduces poverty.

39. Write about Air pollution.
A. 1. Air pollution is caused by the presence of high proportion of undesirable gases.
2. They are Sulphur dioxide and carbon monoxide.
3. Air contain dust, sprays mist and smoke.
4. Smoke is emitted by factories, brick kilns, refineries and smelting plants, and burning of fossil fuels.
5. Toxic gas leaks can be very hazardous.

40. Write about Cotton Textiles in India.
1. Once cloths were produced with handloom only.
2. After the 18th century, power-looms came into use.
3. Our traditional industries suffered during the colonial period.
4. They could not compete with the mill-made cloth.
5. The first textile mill was established in Mumbai in 1854.

Prepared by
K. Suresh,
Subject Expert

Daily Quiz

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. ____ is manufactured from wood.
A. Fan B. Computer
C. Paper D. Phone

2. ___ is manufactured from bauxite.
A. Aluminum
B. Copper
C. Coal
D. Limestone

3. The workers employed in steel factories, car, breweries, textile industries, bakeries etc. fall into the ____ activities.
A. Secondary B. Tertiary
C. Service
D. Primary

4. It is not an agro based Industry:
A. Cotton
B. Silk textile
C. Sugar
D. Cement

5. It is not a mineral based industry:
A. Iron and steel
B. Cement
C. Rubber and sugar
D. Aluminium

క్లుప్తంగా...

ఆర్‌ఎస్‌ఎస్‌తో కలిసి పనిచేసే వారికే సంఘ గొప్పతనం తెలిసేది

సాక్షి, అమరావతి : బయట ఉండి చూస్తే రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) గురించి ఏమీ అర్థం కాదని, సంఘ్‌లో భాగస్వామి అయి పనిచేస్తేనే సంఘ్ గొప్పతనం ఏంటో తెలుస్తుందని చీఫ్ మోహన్‌భగవత్ అన్నారు. విజయవాడలో శుక్రవారం సంఘ్ ప్రతినిధులతో పాటు వివిధ రంగాల ప్రముఖులతో సమావేశమయ్యారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది సంవత్సరంగా భవిష్య భారతం పేరుతో జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా ఆయన గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించారు. తొలిరోజు 45 ఏళ్ల లోపు, రెండో రోజు 45 ఏళ్లకు పైబడిన ప్రతినిధులతో సమావేశమై ఆర్‌ఎస్‌ఎస్ పంచ పరివర్తన అంశాలపై వివరించారు. భారతీయ కుటుంబ వ్యవస్థ తీరు తెన్నులతో పాటు స్వదేశీ, పర్యావరణం, దేశ పౌరునిగా బాధ్యతలు వంటి అంశాలను వివరించి, సభికులు అడిగిన ప్రశ్నలకు జవాబిచ్చారు. ప్రతి జిల్లా నుంచి ఐదు నుంచి పది మంది సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. మీడియాకు దూరంగా మోహన్ భగవత్ కార్యక్రమాలను నిర్వహించారు. కాగా, రాష్ట్ర పర్యటనకు వచ్చిన మోహన్ భగవత్‌తో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

నాపై కేసు కొట్టేయండి

హైకోర్టులో పేర్ని నాని పిటిషన్..

సాక్షి, అమరావతి: తనపై మచిలీపట్నంలోని ఇనగుదురుపేట పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 27న నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోర్టును కోరారు. ఈ నెల 25న ఏలూరు జిల్లా చిన్నంపేట గ్రామంలో పేర్ని నాని మాట్లాడుతూ తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారంటూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తప్పుడు ఆరోపణలు చేశారని విమర్శించారు. నాని వ్యాఖ్యలు తమ పార్టీ శ్రేణుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయంటూ స్థానిక టీడీపీ నాయకుడు పిప్పిళ్ల వెంకట కాంతారావు ఈ నెల 27న ఇనగుదురుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆయనపై అదే రోజు కేసు నమోదు చేశారు. ఆ కేసు కొట్టివేయాలని అభ్యర్థిస్తూ పేర్ని నాని శుక్రవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తనపై పోలీసులు కేసు నమోదు చేశారని నాని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు శనివారం విచారణ జరపనుంది.

భూసమస్యలకు పరిష్కారం చూపిన ఘనత జగన్‌దే

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన సమగ్ర భూసర్వే ద్వారా శతాబ్దాలుగా కొనసాగుతున్న ఎన్నో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్ చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు మేలు జరిగేలా వైఎస్ జగన్ చేసిన ఈ మహాయజ్ఞానికి కేంద్ర ఆర్థికసర్వేలో ప్రశంసలు దక్కాయని గుర్తుచేశారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైఎస్ జగన్ ప్రారంభించిన ఈ యజ్ఞాన్ని రాక్షసుల్లా అడ్డుకోవాలని చూసిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చాక తామే చేశామంటూ క్రెడిట్ చోరీకి పాల్పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ ప్రారంభించిన ఈ సర్వే విధానాలను పరిశీలించాలని గతంలో ప్రధాని మోదీ అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు సూచించారన్నారు. ఎన్నికల ప్రచారంలో భూముల రీసర్వేపై ప్రజలను తప్పుదోవ పట్టించిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత తెగించి జగన్ వ్యక్తిత్వాన్ని హననం చేయడానికి తిరుమల శ్రీవారిని కూడా రాజకీయాలకు వాడుకున్నారని మండిపడ్డారు. తిరుమల లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని దిగజారుడు వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

చార్జిషీట్‌కు, చాట్ జీపీటీకి తేడా తెలుసుకో..

కిరణ్‌రాయల్‌పై నాగార్జున యాదవ్ ఫైర్

సాక్షి,అమరావతి: చార్జిషీట్‌కు, చాట్ జీపీటీకి తేడా తెలియని ఒక 'కొండగొర్రె.. జనసేన నాయకుడు కిరణ్ రాయల్' అని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి వై.నాగార్జునయాదవ్ ఎద్దేవా చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి ఆర్కే రోజాపై కిరణ్ రాయల్ చేసిన అనుచిత వ్యాఖ్యలు దిగజారిన రాజకీయ సంస్కృతికి పరాకాష్ట అని ఆయన మండిపడ్డారు. దేశంలోనే ప్రతిష్టాత్మక సంస్థలైన ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ నివేదికల ఆధారంగా తిరుమలలో వాడిన నెయ్యిపై సీబీఐ సిట్ దాఖలు చేసిన చార్జిషీట్‌పై కనీస అవగాహన లేకుండా జనసేన నాయకుడు.. చాట్ జీపీటీ అంటూ పిచ్చి మాటలు మాట్లాడుతున్నాడన్నారు.

గ్రూప్–1 ఫలితాలు విడుదల

87 పోస్టులకు ఫలితాలు వెల్లడి

హైకోర్టు ఆదేశాల మేరకు రెండు పోస్టుల ఫలితాలు పెండింగ్

సాక్షి, అమరావతి: ఏపీపీఎస్సీ గ్రూప్–1 ఫలితాలను విడుదల చేసింది. 89 పోస్టులకు పరీక్షలు జరగ్గా శుక్రవారం తుది ఫలితాలను సర్వీస్ కమిషన్ వెల్లడించింది. స్పోర్ట్సు కోటాపై హైకోర్టులో ఇంకా కేసు పెండింగ్‌లో ఉండడంతో రెండు పోస్టులు (అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్, డీఎస్పీ సివిల్) పక్కనపెట్టి, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఈనెల 6న ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల మేరకు మిగిలిన 87 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచింది. వైఎస్ జగన్ ప్రభుత్వం 2023 డిసెంబర్‌లో గ్రూప్–1నోటిఫికేషన్ ఇచ్చింది. 2024 మార్చిలో ప్రిలిమ్స్ నిర్వహించారు. అదే ఏడాది మే/జూన్‌లో మెయిన్స్ పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూల్ కూడా ప్రకటించారు. అయితే, ఎన్నికల ముందు ఈ పరీక్షలపై హైకోర్టులో పలు రకాల పిటిషన్లు వేయడంతో మెయిన్స్ పలు మార్లు వాయిదాపడి చివరికి 2025 మే 3 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించారు. అనంతరం మెయిన్స్‌లో 182 మందిని ఇంటర్వ్యూలకు ఎంపిక చేసి జూన్ నెలలో ఓరల్ టెస్ట్ పూర్తి చేశారు. శుక్రవారం ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను పోస్టుల వారీగా విడుదల చేశారు. మొత్తం 15 రకాల పోస్టులకు కేటగిరీల వారీగా ఫలితాలను వెల్లడించారు.

వివిధ కేడర్ల పోస్టులకు ఎంపిక ఇలా..

ఫలితాలు ప్రకటించిన 87 పోస్టుల్లో డిప్యూటీ కలెక్టర్లు 9 మంది, స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్–17, డీఎస్పీ సివిల్–25, జైల్స్ డిప్యూటీ సూపరింటెండెంట్–1, జిల్లా ఫైర్ ఆఫీసర్–2, ఆర్టీవో (మల్టీజోన్–1)–6, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్(మల్టీ జోన్–1)–1, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్(మల్టీ జోన్–1)–3, డిప్యూటీ రిజిస్ట్రార్స్ జోన్–2లో–4, జోన్ 4లో–2, గ్రేడ్–2 మున్సిపల్ కమిషనర్స్(మల్టిజోన్)–3, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (మల్టిజోన్–1)–1, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్–3, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్–4, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్(జోన్–4)–2, ఎంపీడీవో–4 పోస్టులు ఉన్నాయి.

ప్రతిభకు 'సలామ్'

ఆర్టీఓగా కార్పెంటర్ కుమారుడు

నరసరావుపేట ఈస్ట్: సాధారణ కుటుంబం నుంచి గ్రూప్–1 స్థాయి అధికారిగా షేక్ యాసబ్ సలామ్ ఎంపికయ్యారు. పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని వరవకట్టకు చెందిన సలామ్ తండ్రి సుభాని కార్పెంటర్. తల్లి నాసర్‌బీ గృహిణి. ఏపీపీఎస్సీ ప్రకటించిన గ్రూప్–1 ఫలితాల్లో సలామ్ రీజినల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించారు. పాఠశాల, ఇంటర్మీడియెట్ విద్యను పట్టణంలోనే పూర్తిచేసుకున్న సలామ్ బీటెక్, ఎంటెక్ చదివి తన దృష్టి సివిల్స్ వైపు మళ్లించారు. కఠోర శ్రమ చేశారు. సలామ్ తన రెండో ప్రయత్నంలో గ్రూప్–1కు ఎంపికయ్యారు. యూపీఎస్సీ పరీక్ష లక్ష్యంగా తన కృషి కొనసాగిస్తానని తెలిపారు.

'విజయ' పుత్రుడు

తొలియత్నంలో ఏఈఎస్ కొలువు

మార్కాపురం: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన గ్రూప్ వన్ ఫలితాల్లో మార్కాపురం పట్టణానికి చెందిన ఒద్దుల వెంకట సుజిత్ రెడ్డి సత్తాచాటారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పోస్టుకు ఎంపికయ్యారు. 2023లో ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఆయన మొదటిసారిగా గ్రూప్ వన్ పరీక్ష రాసి ఏఈఎస్‌గా ఎంపికయ్యారు. ఆయన తండ్రి వీరారెడ్డి, తల్లి విజయ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా సుజిత్‌ను హెచ్‌ఎం చంద్రశేఖర్ రెడ్డితోపాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

సూపర్ సురేష్.. ప్రతిభలో 'సిద్ధ'హస్తం

డిప్యూటీ కలెక్టర్‌గా కొలువు



పెద్దతిప్పసముద్రం: మొన్న విడుదలైన గ్రూప్–2 ఫలితాల్లో సత్తా చాటిన సురేష్ శుక్రవారం రాత్రి విడుదలైన గ్రూప్–వన్ ఫలితాల్లోనూ విజయకేతనం ఎగురవేశారు. అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం రాపూరివాండ్లపల్లి పంచాయతీ కొత్తపల్లికి చెందిన యదశంద్రం సిద్ధప్ప, సిద్ధమ్మ దంపతుల కుమారుడు సురేష్. ఈయన గత ప్రభుత్వంలో సచివాలయ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఆ ఉద్యోగం చేస్తూనే గ్రూప్ పరీక్షలకు సిద్ధమయ్యారు. తొలుత గ్రూప్–2 పరీక్షలు రాసి డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికయ్యారు. అలాగే గ్రూప్–1 పరీక్షలూ రాసిన సురేష్ విజయం సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు.

ఆర్టీఓగా 'సంతోషి'ంచే

రావికమతం: అనకాపల్లి జిల్లా రావికమతం మండలం దొండపూడి గ్రామానికి చెందిన గ(ట్రె)డ్డి సంతోషి గ్రూప్–1 ఫలితాల్లో సత్తా చాటి ఆర్టీవోగా ఉద్యోగం సాధించారు. సంతోషి ఎంటెక్ చదివారు. ఆమె ప్రస్తుతం మాకవరపాలెం మండల తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తూనే గ్రూప్–1,2 పరీక్షలకు సిద్ధమయ్యారు. మంగళవారం విడుదలైన పలితాల్లో గ్రూప్–2లో విజయం సాధించి, అమరావతిలో అసిస్టెంట్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించారు. శుక్రవారం విడుదలైన గ్రూప్–1 ఫలితాల్లో సత్తాచాటి రీజినల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్(ఆర్‌టీఓ)గా ఉద్యోగం సాధించారు. సంతోషి మాకవరపాలెం మండలం సుబ్బారాయుడు గ్రామానికి చెందిన లగుడు సూర్యనారాయణ (లేటు), సత్యవతి కుమార్తె. తండ్రి సూర్యనారాయణ చిన్నతనంలో మరణించడంతో తల్లి ఆమెను కష్టపడి చదివించారు. ఇదిలా ఉంటే సంతోషి భర్త గోపి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.

'గౌరి'వప్రద విజయం

డీఎస్పీగా శివనాగగౌరి

ఎచ్చెర్ల: గ్రూప్–1 ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలోని ఎస్‌ఎం పురం గ్రామానికి చెందిన సంపతిరావు శివనాగగౌరి సత్తాచాటారు. డీఎస్పీగా ఎంపికయ్యారు. మొత్తం 25 మంది డీఎస్పీలుగా ఎంపిక కాగా శ్రీకాకుళం జిల్లా నుంచి శివనాగగౌరి ఎంపిక కావడం విశేషం. ప్రాథమిక విద్య, పదో తరగతి వరకూ శ్రీకాకుళం నగరంలోని మునసబుపేట వద్ద గల గాయత్రి స్కూల్‌లోనూ, ఇంటర్ విశాఖపట్నంలోని శ్రీచైతన్య విద్యాసంస్థలో చదువుకున్నారు. అనంతరం తమిళనాడులోని వీఐటీలో సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేశారు. ఈమె 2017లో పోలవరం ప్రాజెక్ట్‌లో ఏఈఈగా ఎంపికయ్యారు. డిప్యుటేషన్‌పై ప్రస్తుతం వంశధార ప్రాజెక్టులో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ)గా విధులు నిర్వహిస్తున్నారు. 2017లోనే ఈమె గెయిల్‌లో (గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్) ఇంజినీర్‌గా ఎంపికయ్యారు. ఈమె అత్తమ్మ చౌదరి ధనలక్ష్మి గతంలో జెడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. ఈమె భర్త చౌదరి అవినాష్ ప్రస్తుతం డీసీఎంఎస్ చైర్మన్. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈమె గతంలో గ్రూపు–1 పరీక్షల్లో ఇంటర్వ్యూ వరకూ వెళ్లి విఫలమయ్యారు. అయితే పట్టు వదలకుండా రెండో సారి ప్రయత్నించి విజయం సాధించారు.

'ఓంకార'నాదం

డీఎస్పీగా ఓంకార వెంకట నాగేశ్వరరావు

తెనాలి: తెనాలి నాజరుపేటకు చెందిన అడపాల ఓంకార వెంకట నాగేశ్వరరావు గ్రూప్–1లో సత్తాచాటారు. డీఎస్పీగా ఎంపికయ్యారు. నాగేశ్వరరావు తండ్రి కూరగాయల వ్యాపారి. తల్లి గృహిణి. 2010–14లో నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చేసిన నాగేశ్వరరావు సివిల్స్ లక్ష్యంతో ఢిల్లీ వెళ్లాడు. పోటీపరీక్షలకు తయారయ్యాడు. 2019లో సచివాలయ పరీక్షలు రాసి పంచాయతీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ప్రస్తుతం కొల్లిపర మండల గ్రామం కుంచవరంలో పనిచేస్తున్నారు. అయినా రాజీపడక గ్రూప్–1 పరీక్షలు రాశారు. డీఎస్పీగా ఎంపికయ్యారు.

రాజకీయ దురుద్దేశంతో చంద్రబాబు మహాపాతకం

సీబీఐ చార్జిషీట్‌తో వాస్తవాలు బట్టబయలు

- తిరుమల లడ్డూ తయారీకి వినియోగించిన నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందన్న చంద్రబాబు ఆరోపణలు పచ్చి అబద్ధమని తేలిపోయింది
- ప్రతిష్టాత్మక లేబొరేటరీల నివేదికలూ ఇదే విషయం స్పష్టం చేశాయి
- కోట్లాది హిందువుల మనోభావాలు దెబ్బతీసిన సీఎం
- తక్షణమే భక్తులకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి
- వైఎస్సార్‌సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: 'తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వు కలిసిన నెయ్యిని వాడారంటూ సీఎం చంద్రబాబు చెప్పిన మాటల్లో వీసమెత్తు నిజం లేదు. అవన్నీ పచ్చి అబద్ధాలేనని సీబీఐ సిట్ చార్జిషీట్ తేల్చింది. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్‌ఐ లేబొరేటరీలు పరీక్షించి ఇచ్చిన నివేదికల సాక్షిగా ఈ విషయం తేటతెల్లమైంది. రాజకీయ దురుద్దేశంతోనే శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు మహాపాతకానికి ఒడిగట్టారు' అని వైఎస్సార్‌సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం సజ్జల మీడియాతో మాట్లాడుతూ.. ఆయన చేసిన వ్యాఖ్యలు తప్పని తేలినా భక్తులకు చంద్రబాబు క్షమాపణ చెప్పకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. పైగా సిట్ నివేదికతో ఆయన తప్పిదాన్ని సమర్థించుకోలేక మరింత దిగజారి లడ్డూపై మళ్లీ దుష్ప్రచారం చేయడాన్ని ఖండించారు. ఈ అంశంపై చంద్రబాబును ప్రజాక్షేత్రంలో బోనులో నిలబెట్టాల్సిందేనని తేల్చి చెప్పారు. గతంలో చంద్రబాబు బోలేబాబా డెయిరీని ప్రోత్సహిస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బ్లాక్ లిస్టులో పెట్టిన విషయాన్ని సజ్జల గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు వ్యాఖ్యలను సుప్రీంకోర్టు కూడా తప్పుపట్టిందని చెప్పారు. ఇలాంటి ప్రవర్తన ఉన్న వాళ్లను రాక్షస తెగ అనడంలో తప్పులేదని సజ్జల మండిపడ్డారు. నిస్సిగ్గుగా అబద్ధపు వ్యాఖ్యలు చేసిన బాబును మీడియా ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ''పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసేలా చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నారా? లేదంటే శ్రీవారి భక్తులకు తక్షణమే క్షమాపణ చెబుతారా? తేల్చిచెప్పాలి' అని చంద్రబాబును సజ్జల డిమాండ్ చేశారు. సజ్జల రామకృష్ణారెడ్డి ఇంకా ఏమన్నారంటే..

అబద్ధాల అడ్డుగోడలు బద్దలు

2024 సెప్టెంబరులో తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందన్న సీఎం చంద్రబాబు వ్యాఖ్యలతోనే వివాదం మొదలైంది. దీనిపై టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక లేబొరేటరీలు రెండు.. నెయ్యి కల్తీ కాలేదని, జంతు కొవ్వు కలవలేదని కుండబద్దలు కొట్టాయి. దీంతో చంద్రబాబు కట్టిన అబద్ధాల అడ్డుగోడలు బద్ధలయ్యాయి.

ఫ్లెక్సీలతో మరింత విషప్రచారం

సీబీఐ సిట్ నెయ్యి కల్తీ కాలేదని తేల్చినా ఇప్పుడు చంద్రబాబు మరో నాటకం మొదలు పెట్టారు. అసలు నెయ్యే సరఫరా చేయలేదని, కెమికల్స్ కలిసిన నెయ్యిని వాడారని ఆరోపిస్తున్నారు. ఇవే ఫ్లెక్సీలను రాష్ట్రమంతా కట్టి విషప్రచారానికి పూనుకున్నారు. తాను చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపలేని పరిస్థితుల్లో చంద్రబాబు మరింత దిగజారి గత ప్రభుత్వంపై నిందలు మోపుతున్నారు. ఫ్లెక్సీలతో నీచ రాజకీయానికి ఒడిగడుతున్నారు.

రాక్షస తెగ మాదిరి దుష్ప్రచారం

చంద్రబాబు, కూటమి నేతలు రాక్షస తెగ మాదిరి వ్యవహరిస్తున్నారు. వైవీ సుబ్బారెడ్డి పీఏ అని చెబుతున్న అప్పన్న ఖాతాల్లో నగదు లావాదేవీలపై మాట్లాడుతున్నారు. అతను వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పీఏగా ఉన్నారన్న విషయం కానీ, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి భార్య అప్పటి టీటీడీ పర్చేజింగ్ కమిటీలో సభ్యురాలుగా ఉన్నారన్న విషయం గానీ ప్రస్తావించడం లేదు. కేవలం సుబ్బారెడ్డి పీఏ అని చెప్పడం ద్వారా నీచమైన రాజకీయాలకు తెరతీశారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పటిష్ట చర్యలు

వైఎస్సార్‌సీపీ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి పటిష్ట చర్యలు చేపట్టాం. నెయ్యి నాణ్యత నిర్ధారణ కోసం గతంలో కంటే మెరుగైన టెక్నాలజీని వైఎస్ జగన్ అందుబాటులోకి తీసుకొచ్చారు. పరకామణి కోసం కూడా కొత్త భవనాన్ని నిర్మించి, మరింత మెరుగైన సాంకేతికతను తీసుకొచ్చారు.

డెయిరీని బ్లాక్ లిస్టులో పెట్టాం

వాస్తవానికి ఎల్లో మీడియాలో చెబుతున్నట్టు మా హయాంలో బోలేబాబా అనే సంస్థ లేదు. 2019 సెప్టెంబరులో ఒకసారి టెండర్‌కు వస్తే.. దానిపై అనర్హత వేటు వేసి, బ్లాక్ లిస్ట్‌లో పెట్టాం. అదే చంద్రబాబు హయాంలో హర్ష డెయిరీ పేరుతో ఉన్న బోలేబాబా సంస్థకు సాంకేతికంగా తనిఖీ చేసి మరీ నెయ్యి ఆర్డర్ చేశారు. ఇప్పుడు ఈ బోలేబాబా పరోక్షంగా ఇతర సంస్థల ద్వారా టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తోందని చెబుతున్నారు. అది కోర్టులో తేలుతుంది. ఒకవేళ టీటీడీ వ్యవహారాల్లో ప్రభుత్వానికి బాధ్యత ఉంటుందనుకుంటే.. ఇప్పుడున్నది చంద్రబాబు ప్రభుత్వం కనుక ఆయనకే బాధ్యత ఉంటుంది.

బాబు, పవన్‌లలో పశ్చాత్తాపమేదీ?

పూర్తిగా అవాస్తవ వ్యాఖ్యలు చేసి కోట్లాది భక్తుల విశ్వాసాలతో ఆడుకున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లలో సీబీఐ సిట్ చార్జిషీట్ తర్వాతైనా పశ్చాత్తాపం కనపడడం లేదు. తప్పుగా మాట్లాడామన్న భావన వారిలో లేదు. ఇప్పటికైనా చేసిన తప్పు తెలుసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి.

హిందువుల మనోభావాలను దెబ్బతీసిన బాబు, పవన్

వైఎస్సార్‌సీపీ నేతలు భరత్‌రామ్, శ్రీనివాస్

మాట్లాడుతున్న మార్గాని భరత్‌రామ్. పక్కన డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందంటూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్ కలియుగ ప్రత్యక్షదైవాన్ని రాజకీయాల్లోకి లాగి కోట్లాది హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశారని వైఎస్సార్‌సీపీ జాతీయ అధికార ప్రతినిధి మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, వైఎస్సార్‌సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ లబ్ధికోసమే తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిలో ఆవు, పంది, చేప కొవ్వు వాడారంటూ చంద్రబాబు అండ్ కో పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. కోర్టుకు సీబీఐ సమర్పించిన చార్జిషీట్ ద్వారా ప్రసాదంలో జంతువుల కొవ్వులు వాడలేదని స్పష్టమైందని చెప్పారు. తప్పుడు ప్రచారం చేసిన సీఎం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేశ్‌పై హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలని కోరారు. చంద్రబాబు ఇప్పటికైనా తప్పు ఒప్పుకోవాలన్నారు. ఇలాంటి తప్పుడు మాటలు మాట్లాడుతున్నవారిని బీజేపీ, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్, హిందూ సమాజం ఎందుకు ఉపేక్షిస్తున్నాయో అర్థం కావడం లేదని చెప్పారు. లైంగిక వేధింపుల వ్యవహారంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అసెంబ్లీ నుంచి అరవ శ్రీధర్ వీడియోకాల్, చాటింగ్

నిబంధనలు ఉల్లంఘించి మరీ వీడియో కాల్

సోషల్ మీడియాలో మరో వీడియో విడుదల చేసిన బాధితురాలు

అసెంబ్లీ నుంచి బాధితురాలితో వీడియోకాల్ మాట్లాడుతున్న శ్రీధర్

ఓబులవారిపల్లె(తిరుపతి జిల్లా) : రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ నిబంధనలు ఉల్లంఘించి మరీ వీడియోకాల్, చాటింగ్ చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టిస్తోంది. ఎమ్మెల్యే తనపై లైంగిక దాడి చేసి మోసం చేశాడని ఆరోపిస్తున్న బాధితురాలు శుక్రవారం మరో వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. ప్రజాస్వామ్యానికి దేవాలయంలాంటి శాసనసభ నుంచి నిబంధనలు ఉల్లంఘించి అరవ శ్రీధర్ ఆ మహిళతో వీడియోకాల్, చాటింగ్ చేయడం అందరినీ విస్తుగొలుపుతోంది. తాను అమాయకుడినని, తనపై మహిళా ఉద్యోగిని ఫేక్ వీడియోలు విడుదల చేసి ఇబ్బంది పెడుతోందని ఇటీవలే ఒక వీడియోలో పేర్కొన్న ఎమ్మెల్యే ప్రస్తుతం అసెంబ్లీ సాక్షిగా సభాపతికి, సభ్యులకు నమస్కారం చేస్తున్న దృశ్యాలు, వీడియో చాటింగ్ ద్వారా బాధితురాలికి చూపిస్తున్న వీడియోకు ఏం సమాధానం చెబుతారో వేచి చూడాలి.

అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యే శ్రీధర్ వీడియో కోసం క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఎమ్మెల్యే శ్రీధర్ బాధితురాలి హత్యకూ వెనుకాడరు!

బాధితురాలిపైనే నిందలు మోపడం అన్యాయం

గతంలో తనను చంపేందుకు కిరాయి రౌడీలతో యత్నం

కూటమి నేత హరిరాయల్ వీడియో విడుదల

కొనిశెట్టి హరిరాయల్

ఓబులవారిపల్లె: రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధితురాలిని కూటమి పార్టీ నాయకులు చంపడానికీ వెనకాడరని, తాను అదే కూటమికి చెందినప్పటికీ తననూ చంపేందుకు గతంలో కిరాయి రౌడీలను తీసుకువచ్చారని రాజంపేట కూటమినాయకుడు కొనిశెట్టి హరిరాయల్ శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియో విడుదల చేశారు. బాధిత మహిళపైనే నిందలు మోపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ మహిళ బరితెగించిందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం తగదని హితవు పలికారు. ఆడవారి జోలికి ఎవరు వెళ్లినా బాగుపడ్డట్టు చరిత్రలో లేదని పేర్కొన్నారు. ''అరవ శ్రీధర్ నువ్వు ఎమ్మెల్యే కాబట్టే ప్రభుత్వ ఉద్యోగిని బదిలీ కాకుండా ఇక్కడే ఉంచావు. నీవు ఎమ్మెల్యే కాకపోతే ఆమెకు, నీకు ఏం సంబంధం ఉంది? ఆమె కోసం చేయి కూడా కోసుకున్నావు. ఎమ్మెల్యే వల్లే మహిళకు అన్యాయం జరిగిందని, ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అబార్షన్ చేయించారని చెబితే.. మీరు పార్టీ నాయకులు పోయి ఆసుపత్రి వారితో మేము ఆపరేషన్ చేయలేదని చెప్పిస్తారా? ఎవరికైనా తెలివి ఉంటే ఆపరేషన్ చేశామని చెబితే కేసు పెట్టి లోపల వేస్తారు. ఈ విషయం కూడా తెలియకుండా ఏ విధంగా మాట్లాడతారు'' అంటూ హరిరాయల్ ప్రశ్నించారు. ''నువ్వు ఆమె వద్దకు వెళ్లకుంటే ఆ వీడియోలు ఎట్లా వస్తాయి. నువ్వు తప్పు చేశావా లేదా చెప్పు. అధికారం చేతిలో ఉంది. పోలీసులు చేతిలో ఉన్నారు. ఆమెను చంపడానికి కూడా వెనుకాడరు. ఇలాంటి కామిస్టులను.. రేపిస్టులను అసెంబ్లీలో చూద్దామా..? ఎమ్మెల్యేగా ఉండి ప్రజలకు మేలు చెయ్యకుండా కాటేస్తారా..? వీడియోలు ఆడియోలు అన్నీ ఉన్నాయి కదా.. ఇలాంటి వ్యక్తిని సస్పెండ్ చెయ్యకుండా.. విచారణ ఎందుకు'' అంటూ హరిరాయల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

హరిరాయల్ వ్యాఖ్యల కోసం ఈ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయండి

రాష్ట్ర చరిత్రలో భారీ కుతంత్రం భగ్నం

చంద్రబాబు కుట్రను బయటపెట్టిన సీబీఐ నివేదిక

మాజీమంత్రి అంబటి రాంబాబు ఫైర్

సాక్షి, అమరావతి: రాష్ట్ర రాజకీయ చరిత్రలో భగవంతుడిని అడ్డుపెట్టుకుని చేసిన భారీ కుట్ర బట్టబయలైందని.. ప్రతిపక్షం మీద బురదజల్లి కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి ద్వారా రాజకీయంగా లబ్ధి పొందాలని చేసిన కుతంత్రాన్ని సీబీఐ సిట్ నివేదిక భగ్నంచేసిందని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబు చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే.. అబద్ధాల పునాదుల మీద అసత్యాలు పోగేసి జగన్ మీద, వైఎస్సార్‌సీపీ మీద బురదజల్లాలని చేసిన కుట్ర పటాపంచలైంది. ఇది భరించలేక చంద్రబాబు, కూటమి నేతలు ఇంకా దుష్ప్రచారం చేస్తున్నారు. సీబీఐ దర్యాప్తులో భాగంగా నెయ్యి నమూనాలను ప్రతిష్టాత్మక ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ పరిశీలించి అందులో ఎలాంటి జంతు కొవ్వు లేదని తేల్చిచెప్పినా కూటమి నేతలు అధికార బలంతో వైఎస్సార్‌సీపీ నేతల ఫొటోలతో దారుణంగా ఫ్లెక్సీలు పెట్టడం సిగ్గుచేటు. చంద్రబాబు 2024లో అధికారంలోకి వచ్చాక జూన్ 12, జూన్ 25, జూలై 6, జూలై 12 తేదీల్లో వీఆర్ డెయిరీకి చెందిన నెయ్యి శాంపిళ్లను తీసుకున్నారు. వాటికి పూర్తిగా పరీక్షలు చేయకుండా, సెకండ్ ఒపీనియన్ లేకుండా నెయ్యి కల్తీ జరిగిందని ఇష్టారాజ్యంగా ప్రచారం చేయటం మొదలుపెట్టారు. అనంతరం చంద్రబాబు, పవన్ నానా రాద్ధాంతం చేసి కలియుగ దైవం ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత సీబీఐ నేతృత్వంలో సిట్ విచారణ జరిపి ఏ కొవ్వులేదని తేల్చిచెప్పింది. ఇప్పుడు బాబు, పవన్ సీబీఐ సిట్ చార్జిషీట్‌పై నోరు విప్పడంలేదు. నిజానికి.. టెండర్లు దక్కించుకున్న ఏఆర్ డెయిరీ నెయ్యి పంపిణీ మొదలుపెట్టింది చంద్రబాబు హయాంలోనే. మీ పాలనలో సరఫరా అయిన నెయ్యికి కూడా మేమెలా బాధ్యత వహిస్తాం? భోలేబాబాకు తొలుత అనుమతిచ్చింది చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే. ముందు హర్ష్‌ఫైన్ డెయిరీగా పేరు పెట్టుకుని, ఆ తర్వాత పేరు మార్చుకున్నారు. భోలేబాబా డెయిరీకి పాలు లేవని ఇవాళ పచ్చమీడియాలో రాస్తున్నారు. అటువంటి డెయిరీకి మీరెలా అనుమతిచ్చారు?

ఇలా ఉన్నాం.. ఇలా చేయాలి...

ఎకనామిక్ సర్వే అంటే అంకెలు, సంఖ్యల విశ్వరూపం కాదు. రిపోర్ట్ రూపంలోని మన శ్రేయోభిలాషి. విలువైన సూచనలు ఇచ్చే మేధో విశ్లేషకురాలు. 'ఫలానా విషయంలో మనం ఇలా ఉన్నాం. ఒకప్పుడు అలా ఉన్నాం' అని గత, వర్తమానాలను కలుపుతూ విశ్లేషిస్తుంది. 'ఈ పొరపాట్లు చేస్తున్నాం. వాటిని సవరించుకోవాలంటే' అంటూ విలువైన సూచనలు ఇస్తుంది. డిజిటల్ వ్యసనం నుంచి ఊబకాయ సమస్య వరకు, స్క్రీన్ టైమ్ నుండి మహిళా శ్రామికశక్తి వరకు ఎన్నో అంశాలను విశ్లేషించి, సూచనలిచ్చింది ఎకనామిక్ సర్వే.

40 రెట్లు పెరిగింది!

'మన దేశంలో ఊబకాయ సమస్య ఆందోళనకరమైన స్థాయిలో పెరుగుతోంది. జీవనశైలిలో మార్పులు, అనారోగ్యకరమైన ఆహారాలవాట్లు. అల్ట్రా–ప్రాసెస్డ్ ఆహార పదార్థాల వినియోగం (యూపీఎఫ్) పెరగడం దీనికి కారణం' అని నివేదిక పేర్కొంది. బర్గర్, పిజ్జా, నూడుల్స్, శీతల పానియాలు...మొదలైనవి జంక్ ఫుడ్‌గా పిలిచే అల్ట్రా–ప్రాసెస్డ్ ఫుడ్స్. ప్రపంచవ్యాప్తంగా దీర్ఘకాలిక వ్యాధులకు, ఆరోగ్య సమస్యల పెరుగుదలకు 'యూపీఎఫ్' కారణం అవుతోంది.

మన దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌లలో యూపీఎఫ్ ఒకటి. 2009 నుండి 2023 వరకు యూపీఎఫ్‌ల వినియోగం 150 శాతానికి పైగా పెరిగిందని నివేదిక తెలియజేసింది. మన దేశంలో యూపీఎఫ్‌ల రిటైల్ అమ్మకాలు 2006లో 0.9 బిలియన్ డాలర్లు ఉండగా 2019 నాటికి దాదాపు 38 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఇది 40 రేట్ల పెరుగుదల.

41.7% మహిళా శక్తి

ఇటీవల కాలంలో మహిళా శ్రామిక శక్తిలోని సానుకూల ధోరణిని నివేదిక హైలెట్ చేసింది. డేటా ప్రకారం... ఫిమేల్ లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ (ఎఫ్ఎల్ఎఫ్‌పీఆర్) 2017–18లో 23.3 శాతం ఉంటే 2023–24లో 41.7 శాతానికి పెరిగింది. మహిళల్లో నిరుద్యోగం తగ్గింది. మహిళల నిరుద్యోగిత రేటు 2017–18లో 5.6 శాతం ఉండగా 2023–24లో 3.2 శాతానికి తగ్గింది.

'ఇది గణనీయమైన మెరుగుదలను సూచిస్తున్నప్పటికీ మహిళల మొత్తం భాగస్వామ్యం పురుషుల కంటే తక్కువగా ఉంది' అని నివేదిక పేర్కొంది. 'ఇ–శ్రమ్' పోర్టల్‌ను నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. అసంఘటిత కార్మికుల పేర్లను నమోదు చేయడానికి, వారిని ఉపాధి సేవలు, సామాజిక భద్రతతో అనుసంధానించడానికి ఈ పోర్టల్‌ను రూపొందించారు. జనవరి 2026 నాటికి ఈ పోర్టల్‌లో 31 కోట్లకుపైగా అసంఘటిత కార్మికుల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి.

'మహిళలు ప్రతిరోజూ వేతనం లేని పనులపై 363 నిమిషాలు గడుపుతుండగా, పురుషులు 123 నిమిషాలు గడుపుతున్నారు. వేతనంతో కూడిన పనులలో పాల్గొనే మహిళలు ఎక్కువ సమయాన్నే వెచ్చిస్తున్నప్పటికీ , మొత్తం మీద వారి భాగస్వామ్యం పురుషుల కంటే తక్కువగా ఉంది' అని నివేదిక పేర్కొంది.

వేతనంతో కూడిన పనులలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికి మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ సదుపాయాల మెరుగుదల ప్రాముఖ్యత గురించి నివేదిక నొక్కి చెప్పింది.

డిజిటల్ వ్యసనం

డిజిటల్ వ్యసనాన్ని ప్రధాన జాతీయ ప్రజారోగ్య సమస్యగా అధికారికంగా గుర్తించింది ఆర్థిక సర్వే 2025–2026 నివేదిక. అసంక్రమిత వ్యాధుల వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యల వరుసలో డిజిటల్ వ్యసనాన్ని చేర్చింది. స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియా, గేమింగ్‌లపై అధిక సమయాన్ని వెచ్చించడం వల్ల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతింటుందని, పనిగంటలను తగ్గిస్తోందని, డిజిటల్ వ్యసనం అనేది మానవ వనరులపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది. అవగాహన కార్యక్రమాలతో డిజిటల్ వ్యసనాన్ని దూరం చేయవచ్చని సూచించింది.

డిజిటల్... ఏజ్

చిన్న పిల్లలను హానికరమైన డిజిటల్ కంటెంట్‌కు దూరంగా ఉంచడానికి వయసు ఆధారిత యాక్సెస్ విధానాన్ని గట్టిగా అమలు చేయాలని నివేదిక సూచించింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు వయసు ధృవీకరణను అమలు చేయడానికి బాధ్యత వహించాలని చెప్పింది.

'పిల్లలలో ఆరోగ్యకరమైన డిజిటల్ అలవాట్లను పాదుకొల్పడంలో పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయి. స్క్రీన్ టైమ్, సైబర్‌భద్రత, మానసిక ఆరోగ్యానికి సంబంధించి డిజిటల్ వెల్నెస్‌పై పాఠ్యప్రణాళిక ప్రవేశపెట్టాలి. కోవిడ్–19 సమయంలో విస్తరించిన ఆన్‌లైన్ బోధనా సాధనాలపై ఆధారపడడాన్ని తగ్గించి, ఆన్‌లైన్ బోధనకు ప్రాధన్యత ఇవ్వాలి' అని చెప్పింది.

ఆరోగ్యకరమైన డిజిటల్ అలవాట్లకు సంబంధించి కుటుంబాలకు అవగాహన కలిగించడానికి పాఠశాలలో వర్క్‌షాప్‌లు నిర్వహించాలని చెబుతున్న రిపోర్ట్ స్క్రీన్‌టైమ్ పరిమితులు, డివైజ్–ఫ్రీ టైమ్ అమలు అయ్యేలా చేయాలని, ఆఫ్‌లైన్ యాక్టివిటీలను పెంచాలని సూచించింది.

కుటుంబ ఆదాయం పెరగాలి

'గ్రామీణ ప్రాంతాల్లో కేవలం 17 శాతం పాఠశాలలు మాత్రమే మాధ్యమిక విద్యను అందిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో సుమారు 38 శాతం పాఠశాలలు మాధ్యమిక విద్యను అందిస్తున్నాయి' అని నివేదిక తెలియజేసింది. పాఠశాలకు వెళ్లని పిల్లలలో అత్యధిక సంఖ్యలో ఉన్నవారు సెకండరీ పాఠశాల వయస్సు (14 నుండి 18 సంవత్సరాల మధ్య) వారేనని తెలియజేసిన నివేదిక కుటుంబ ఆదాయాన్ని గురించి ప్రస్తావించింది. కుటుంబ ఆదాయాన్ని పెంచాల్సిన అవసరం ఉందని, పేదరికం, ఇంటిపనులు, బాధ్యతలు... మొదలైనవి పాఠశాల విద్యను మానేయడానికి ప్రధాన కారణమని నివేదిక తెలియజేసింది.

ఏఐతో ఒత్తిడి!

'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత పని స్వభావాన్ని మారుస్తోంది. జనరేటివ్ ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఇంజినీరింగ్, సైబర్ సెక్యూరిటీ... మొదలైనవి కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తున్నప్పటికీ, నైపుణ్యం పొందే విషయంలో ఉద్యోగులపై ఒత్తిడి కూడా కలిగిస్తున్నాయి' అని చెబుతోంది నివేదిక.

'ఏఐ నైపుణ్యానికి సంబంధించి ప్రపంచంలో మన దేశం రెండో స్థానంలో ఉంది. ఏఐని స్వీకరించడం అనేది సాంకేతిక సవాలు మాత్రమే కాదు శ్రమతో కూడుకున్నది. బిజినెస్ మోడల్స్ అభివృద్ధి చెందుతున్న కొద్దీ, సంస్థలు, ఉద్యోగులు ఉన్నత స్థాయి నైపుణ్యాలు అవసరమయ్యే కొత్త పాత్రలకు అనుగుణంగా మారాలి' అని సూచిస్తోంది ఈ నివేదిక.

మీకు ప్రీ-డయాబెటిస్ ఉన్నట్లు తెలిందా? అది డయాబెటిస్ దశకు చేరకుండా అక్కడే ఆపేసినా లేదా ఆ ప్రీ-డయాబెటిస్ దశను మీ జీవనశైలి మార్పులతోనూ, ఆహార, ఆరోగ్య సూచనతో రివర్స్ చేసుకున్నా... గుండె జబ్బుల ముప్పును గణనీయంగా తగ్గించవచ్చంటూ ఇటీవలి ఓ అధ్యయనంలో తేలింది.

షుగర్‌ను దారిలో పెట్టడమే... గుండెకు స్వీట్ న్యూస్!



ప్రీ-డయాబెటిస్ దశ అంటే...

ప్రీ–డయాబెటిస్ దశ అంటే... రక్తంలోని చక్కెర మోతాదులు డయాబెటిస్‌ను నిర్ధారణ చేసే కొలతలకు చేరనప్పటికీ... నార్మల్ కంటే కాస్త ఎక్కువగానే ఉండటం. అయితే ఈ ప్రీ–డయాబెటిస్ దశలో డాక్టర్లు మందులను సూచించరు. కాకపోతే కొన్ని ఆరోగ్య నియమాలూ, వ్యాయామాలూ వంటి జీవనశైలి మార్పులు సూచిస్తారు. వాటిని అనుసరిస్తూ... రక్తంలోని చక్కెర మోతాదులను డయాబెటిస్ స్థాయికి చేరనంతవరకు వారిని చక్కెర వ్యాధిగ్రస్తులుగా పరిగణించరు.

గుండెజబ్బుల్లో 58% గుండెపోట్లు 42% తగ్గుదల

ఇలా ప్రీ–డయాబెటిస్ దశలోనే రక్తంలో చక్కెర మోతాదులను అదుపులో పెట్టుకోవడం వల్ల గుండెజబ్బులూ, హార్ట్ ఫెయిల్యూర్స్‌కు గురికావడం, హాస్పిటల్‌కు వెళ్లాల్సిరావడం... ఇవన్నీ సగానికి పడిపోతాయని అంటే... 50% తగ్గుతాయంటూ బ్రిటన్‌కు చెందిన అధ్యయన వేత్తలు తెలిపారు. వాస్తవంగా చెప్పాలంటే గుండెజబ్బులూ (కార్డియో వాస్క్యులార్ డిసీజెస్) లేదా వాటితో కలిగే మరణాలు 58 శాతం తగ్గితే... గుండెపోటూ, పక్షవాతంతో మరణాలు 42 శాతం తగ్గుతాయనీ... అలాగే ఇతరత్రా అనేక ఆరోగ్యసమస్యలతో వచ్చే మరణాలూ బాగా తగ్గుతాయని తేలింది.

100 కోట్లు!



ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 కోట్ల మంది ప్రీ–డయాబెటిస్ కలిగి ఉన్నారనీ, వీరంతా తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్తులో టైప్–2 డయాబెటిస్ బాధితులుగా అయ్యే అవకాశాలున్నాయంటూ ప్రపంచ వైద్య నిపుణులతో పాటు ఈ అధ్యయనంలో పాలుపంచుకున్న అధ్యయనవేత్తలు అంచనా వేస్తున్నారు. ప్రపంచ జనాభా 800 కోట్లు అనుకుంటే... ప్రతి ఎనిమిది మందిలో ఒకరు ప్రీ–డయాబెటిక్. ఈ గణాంకాలు చాలా ఆందోళన గొలిపేవే.

ఈ అధ్యయన ఫలితాలు 'ద లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రైనాలజీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

సాక్షి సినిమా

• వెంకటేశ్

మెట్రో స్టేషన్‌లో ఆదర్శ కుటుంబం

'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్ బస్టర్ మూవీ తర్వాత వెంకటేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆదర్శ కుటుంబం'. 'హౌస్ నెం: 47' (ఏకే 47) అనేది ఉపశీర్షిక. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. సికింద్రాబాద్ సమీపంలోని పరేడ్ గ్రౌండ్స్ మెట్రో స్టేషన్‌లో వెంకటేశ్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ షూటింగ్‌కి సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. ''కుటుంబ కథా చిత్రంగా రూపొందుతోన్న సినిమా 'ఆదర్శ కుటుంబం'. ఈ చిత్రంలో మధ్యతరగతి వ్యక్తి పాత్రలో నటిస్తున్నారు వెంకటేశ్. ఈ మూవీ నుంచి రిలీజ్ చేసిన ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. వెంకటేశ్ హీరోగా నటించిన 'నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ కథ అందించడంతో పాటు డైలాగులు రాశారు. అలాగే 'వాసు' సినిమాకి మాటలు రాశారు. అయితే దర్శకుడిగా మాత్రం వెంకటేశ్‌తో ఆయన తెరకెక్కిస్తున్న తొలి చిత్రం 'ఆదర్శ కుటుంబం'. వినోదం, భావోద్వేగాల కలయికలో రూపొందుతోన్న ఈ సినిమా ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ఉగాదికి వారణాసి ఫిక్స్

• మహేశ్‌బాబు

ప్రపంచవ్యాప్త సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'వారణాసి' సినిమా రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించారు. 'వారణాసి' చిత్రాన్ని 7 ఏప్రిల్ 2027లో రిలీజ్ చేయనున్నట్లుగా ఈ శుక్రవారం మేకర్స్ తెలిపారు. హీరో మహేశ్ బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో రూపొందుతున్న సినిమా ఇది. ఈ చిత్రంలో రుద్ర పాత్రలో మహేశ్‌బాబు, మందాకిని పాత్రలో ప్రియాంకా చోప్రా, కుంభ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తుండగా, ఓ కీలక పాత్రలో ప్రకాశ్‌రాజ్ కనిపిస్తారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. కాశీ నగరాన్ని తలపించేలా హైదరాబాద్ శివార్లలో యూనిట్ ఓ పెద్ద సెట్‌ను క్రియేట్ చేసింది. మహేశ్‌బాబు, ప్రియాంకా చోప్రా పాల్గొంటుండగా ఈ సెట్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కాగా గురువారం వారణాసిలో 'ఇన్ థియేటర్స్... 7 ఏప్రిల్ 2027' అని కనిపించిన హోర్డింగ్స్ చర్చకు దారి తీశాయి. ఇది 'వారణాసి' విడుదల తేదీకి సంబంధించినదే అనే ఊహాగానాలు నెలకొన్నాయి. ఆ ఊహలే నిజం. 'వారణాసి' సినిమాను 7 ఏప్రిల్ 2027న రిలీజ్ చేస్తున్నట్లుగా మహేశ్‌బాబు, రాజమౌళి వారి సోషల్ మీడియా ఖాతాల్లో శుక్రవారం 'వారణాసి' రిలీజ్ డేట్‌ను షేర్ చేశారు. ఇక 7 ఏప్రిల్ 2027 అంటే ఉగాది పర్వదినం (బుధవారం). అలాగే గుడి పడ్వా ఫెస్టివల్. ఏప్రిల్ 15న శ్రీరామ నమమి (గురువారం)... ఇలా ప్రధాన పండగలు, రెండు వారాల వీకెండ్ సౌకర్యంతో సరైన రిలీజ్ డేట్‌ని 'వారణాసి'కి మేకర్స్ ప్లాన్ చేసుకున్నారని ట్రేడ్ విశ్లేషకులు అంటున్నారు. ఎస్ఎస్ కార్తికేయ, కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాకు సంగీతం: కీరవాణి.

వెయ్యేళ్ల కిందటే..!

''నేను ఎక్కువగా అర్బన్ బ్యాక్‌డ్రాప్ మూవీస్ చేస్తుంటాను. అయితే నాకు 'భగవంతుడు' లాంటి రూరల్ బ్యాక్‌డ్రాప్ సినిమాలంటే ఇష్టం. ఈ చిత్రం టీజర్ బాగుంది... సినిమా పెద్ద విజయం సాధించాలి. రవి పనస అన్నకు 'భగవంతుడు' మంచి లాభాలు తీసుకొచ్చి... నా సినిమాకి ఆయన అడ్వాన్స్ ఇవ్వాలి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. తిరువీర్, ఫరియా అబ్దుల్లా జోడీగా, కన్నడ నటుడు రిషి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'భగవంతుడు'. ఈ సినిమాతో జీజీ విహారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఏషియన్ ఫిలిమ్స్ నారాయణ దాస్ నారంగ్, పనస శంకరయ్య గౌడ్ సమర్పణలో రవి పనస ఫిలిం కార్పొరేషన్‌పై రవి పనస నిర్మిస్తున్న ఈ సినిమా వేసవిలో విడుదల కానుంది. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌కి హీరోలు విశ్వక్ సేన్, సందీప్ కిషన్ ముఖ్య అతిథులుగా హాజరై, టీజర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ– ''నాకు ప్రతి విషయంలో రవి పనస సపోర్ట్‌గా ఉండేవారు. ఆయన 'భగవంతుడు' సినిమా నిర్మిస్తుండటం గర్వంగా ఉంది'' అని చెప్పారు. ''మన సమాజంలోని అంతరాలకు వెయ్యేళ్ల కిందటే సమాధానం పల్నాడులో చెప్పారు. అందుకే ఈ సినిమాకి పల్నాడు నేపథ్యం ఎంచుకున్నాను'' అన్నారు జీజీ విహారి. ''కొత్తగా ఏదైనా ప్రయత్నిస్తున్నారా? అని నన్ను అడుగుతుంటారు. ఆ ప్రశ్నకు సమాధానంగా 'భగవంతుడు' నిలుస్తుంది'' అని ఫరియా అబ్దుల్లా పేర్కొన్నారు. ''ఏప్రిల్‌లో మా మూవీని రిలీజ్ చేయాలనే ప్లానింగ్‌లో ఉన్నాం'' అని రవి పనస చెప్పారు. ''నన్ను నమ్మండి... 'భగవంతుడు' చాలా గొప్ప సినిమా అవుతుంది'' అని తిరువీర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు కేపీ, నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్, దర్శక–నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి, డైరెక్టర్ వేణు ఊడుగుల, నటులు క్రిష్, జబర్దస్త్ అభి, రవీందర్ విజయ్, మైమ్ మధు, రిషి మాట్లాడారు.

• విహారి, విశ్వక్, ఫరియా, తిరువీర్, రవి పనస, సందీప్, నారాయణదాస్

ఇది మన కథే అనిపిస్తోంది

- రానా దగ్గుబాటి

''విత్ లవ్' మూవీ ట్రైలర్ బాగుంది. ఇది మన కథే అనిపిస్తోంది. ట్రైలర్ చూసిన వారందరూ చాలా కనెక్ట్ అయ్యారు. అందరూ కనెక్ట్ అయ్యే ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్ ఇది. సౌందర్యగారు తెలుగులో మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. యూనిట్‌కి ఆల్ ది బెస్ట్'' అని హీరో రానా దగ్గుబాటి చెప్పారు. అభిషన్ జీవింత్, అనస్వరా రాజన్ ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'విత్ లవ్'. మదన్ రచన, దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని సౌందర్య రజనీకాంత్‌తో కలిసి ఎంఆర్‌పీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నజరత్ పసిలియన్, మహేశ్ రాజ్ పసిలియన్ సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ఫిబ్రవరి 6న విడుదల కానుంది. తెలుగులో సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ విడుదల చేస్తోంది. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సౌందర్య రజనీకాంత్ మాట్లాడుతూ– ''నా చిన్నప్పటి ఫ్రెండ్ రానా. తనతో నాకు ఎన్నో బాల్య జ్ఞాపకాలున్నాయి. 'విత్ లవ్'ని తను రిలీజ్ చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాని అందరూ థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నాను'' అని తెలిపారు. ''మా 'టూరిస్ట్ ఫ్యామిలీ'కి మీరందరూ గొప్ప ఆదరణ ఇచ్చారు. 'విత్ లవ్' కూడా అద్భుతమైన భావోద్వేగాలున్న సినిమా. మన జ్ఞాపకాలని నెమరువేసుకునేలా ఉంటుంది'' అన్నారు అభిషన్ జీవింత్. ''విత్ లవ్' క్యూట్ సినిమా. చాలా ప్రేమతో ఈ చిత్రం చేశాం. తప్పకుండా అందర్నీ అలరిస్తుంది'' అని పేర్కొన్నారు అనస్వరా రాజన్. మహేశ్ రాజ్ మాట్లాడుతూ– ''టూరిస్ట్ ఫ్యామిలీ'లానే ఈ సినిమాని కూడా ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు.

• మహేశ్ రాజ్, అనస్వరా రాజన్, రానా, సౌందర్య, అభిషన్ జీవింత్

మిస్ మంగ

మంగగా తెలుగు చిత్రపరిశ్రమకు వస్తున్నారు హీరోయిన్ రాషా తడానీ. ఘట్టమనేని జయకృష్ణ హీరోగా పరిచయం అవుతున్న సినిమా 'శ్రీనివాస మంగాపురం'. సి. అశ్వినీదత్ సమర్పణలో అజయ్ భూపతి దర్శకత్వంలో చందమామ కథలు పతాకంపై పి. కిరణ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ పీరియాడికల్ లవ్‌స్టోరీ సినిమాలో శ్రీను పాత్రలో జయకృష్ణ నటిస్తున్నారని తెలిసింది. ఇక ఈ చిత్రంలోని మంగ పాత్రలో రాషా తడానీ నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఆమె ఫస్ట్ లుక్‌ను శుక్రవారం విడుదల చేశారు మేకర్స్. రాషాకు తెలుగులో ఇదే తొలి చిత్రం కావడం విశేషం. ''ఇటీవల 30 రోజుల పాటు ఈ సినిమా తొలి షెడ్యూల్ జరిగింది. రెండవ షెడ్యూల్‌లోకి ఎంటర్ అయ్యాం. హీరో హీరోయిన్ల కెరీర్స్‌లో ఈ సినిమా ఓ మైల్ స్టోన్‌గా ఉండటంతో పాటు ప్రపంచ వ్యాప్త ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.

• రాషా తడానీ

స్టాక్ మార్కెట్లు
(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
297	98
82,270	25,321

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	23,515	▽	169
డోజోన్స్	48,611	▽	460
ఎఫ్‌టీఎస్ఈ 100	10,208	△	36
డాక్స్	24,575	△	265
షాంఘై	4,118	▽	40
నికాయ్	53,326	▽	53

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	90.15	93.17
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	124.16	128.62
€	యూరో	థామస్‌కుక్	107.47	111.49
¥	జపాన్ యెన్ (100)	థామస్‌కుక్	48.00	61.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	62.07	66.00
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	70.23	73.99
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.63	25.14
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	24.15	25.42
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.36	14.18

వృద్ధి జోరు..అయినా
ఇన్వెస్టర్లు పరార్

- పెట్టుబడులకు దూరంగా ప్రైవేటురంగం
- భారత మార్కెట్లో చిత్రమైన పరిస్థితి
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్

న్యూఢిల్లీ: దేశీయంగా ప్రైవేట్ పెట్టుబడులు గణనీయంగా పెరిగితేనే భారత్ ఆశించిన స్థాయిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) ఆకర్షించడం సాధ్యపడుతుందని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ చెప్పారు. కార్పొరేట్ రంగం నిలకడగా పెట్టుబడులు పెంచడం దేశీయంగా కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు. 50 శాతం టారిఫ్‌ల భారంతో అమెరికా–భారత్ బంధంపై అనిశ్చితి నెలకొనడం కూడా పెట్టుబడుల రాకకు కొంత ప్రతిబంధకంగా ఉండొచ్చని చెప్పారు. అది తొలగిపోతే అంతర్జాతీయ సరఫరా వ్యవస్థల్లో చురుగ్గా పాలుపంచుకునేందుకు వీలవుతుందని, భారత్‌కి కూడా ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. గత కొన్నాళ్లుగా భారత మార్కెట్ కొంత పటిష్ఠంగా మారిందని చెప్పారు. ప్రపంచంలోనే అత్యధిక వృద్ధి రేటు సాధిస్తున్న భారత్ నుంచి విదేశీ పెట్టుబడులు తరలిపోతున్న చిత్రమైన పరిస్థితిపై స్పందిస్తూ, ''ప్రైవేట్ రంగం కూడా పెట్టుబడులు పెడుతుంటే ఎఫ్‌డీఐలు వస్తాయి. కానీ ప్రైవేట్ రంగం ఇన్వెస్ట్ చేయడం లేదు. అంటే ఇక్కడ పరిస్థితి ఏదో సరిగ్గా లేదు. పాలసీపరమైన అనిశ్చితి కూడా కారణమనేది కొందరి అభిప్రాయం '' అని రాజన్ చెప్పారు. గతేడాది వరుసగా నాలుగో నెల నవంబర్‌లో కూడా ఎఫ్‌డీఐ గణాంకాలు ప్రతికూలంగా నమోదయ్యాయి. ఆర్‌బీఐ డేటా ప్రకారం ఆ నెలలో వచ్చిన ఎఫ్‌డీఐల కన్నా అధికంగా 446 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వెళ్లిపోయాయి. ఈ నేపథ్యంలో రాజన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తమిళనాడులాంటి రాష్ట్రాలు ఎఫ్‌డీఐలను ఆకర్షించగలుగుతున్నప్పటికీ విస్తృత స్థాయిలో పెట్టుబడులు తరలిపోతుండటానికి కారణాలేమిటనేది పరిశీలించుకోవాల్సిన అవసరం ఉందని రాజన్ పేర్కొన్నారు.

యూఎస్ ట్రెజరీలను తగ్గించుకుంటున్నది అందుకే..

సర్వత్రా అనిశ్చితి నెలకొనడం, కొన్ని విధానాలను ఉల్లంఘించేందుకు అమెరికా సంసిద్ధంగా ఉండటం లాంటి అంశాల వల్ల చాలా దేశాలు అమెరికా ట్రెజరీల్లో తమ పెట్టుబడులను తగ్గించుకుని, డైవర్సిఫికేషన్ వైపు మొగ్గు చూపుతున్నాయని రాజన్ చెప్పారు. అమెరికా ట్రెజరీల్లో భారత్ హోల్డింగ్స్ అయిదేళ్ల కనిష్టానికి పడిపోవడానికి ఇది కూడా ఒక కారణమన్నారు. సాధారణంగా ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా సులభంగా మార్చుకునేందుకు వీలుంటుందనే నమ్మకం వల్లే డాలరు రిజర్వ్ కరెన్సీగా చెలామణీ అవుతోందని, కానీ ప్రస్తుతం ఆ నమ్మకం సడలుతోందని రాజన్ పేర్కొన్నారు. కానీ, బ్రిటన్, చైనా, జపాన్, రష్యాలాంటి దేశాలు సొంత సమస్యలతో సతమతమవుతున్న నేపథ్యంలో డాలరుకు దీటైన ప్రత్యామ్నాయం కనిపించడం లేదన్నారు. సెంట్రల్ బ్యాంకులు బంగారాన్ని భారీగా కొంటున్నప్పటికీ, అది బబుల్ స్థాయికి చేరిందేమోనన్న సందేహాలు తలెత్తుతున్నాయని రాజన్ చెప్పారు. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో భారత్ రిజర్వుల్లో ఎక్కువభాగం డాలర్ బాండ్లే ఉంటాయని రాజన్ తెలిపారు.

మెటల్స్ క్రాష్

- స్పాట్ మార్కెట్‌లో రూ. 20,000 పతనమైన సిల్వర్
- ఫ్యూచర్స్‌లో రూ. 1,07,971 డౌన్
- రూ 14,000 తగ్గిన బంగారం

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా బలహీన ట్రెండ్స్ మధ్య ఇన్వెస్టర్లు భారీగా లాభాల స్వీకరణకు దిగడం, అమెరికా డాలరు పుంజుకోవడం తదితర అంశాల నేపథ్యంలో శుక్రవారం బంగారం, వెండి ధరలు గణనీయంగా పతనమయ్యాయి. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత గల పసిడి 10 గ్రాముల రేటు ఏకంగా రూ. 14,000 క్షీణించి రూ. 1,69,000కు తగ్గింది. అటు వెండి సైతం కేజీకి రూ. 20,000 తగ్గి రూ. 3,84,500కి క్షీణించింది. దేశీయంగా ఫ్యూచర్స్ మార్కెట్ ఎంసీఎక్స్‌లో బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు 8% క్షీణించి రూ. 1,68,750 వద్ద ట్రేడయ్యింది. సిల్వర్ మార్చ్ కాంట్రాక్టు ఒక దశలో క్రితం ముగింపు రూ. 4,20,048తో పోలిస్తే ఏకంగా రూ. 1,07,971 మేర పతనమైంది. దాదాపు 27% పడిపోయి రూ. 2,91,922 వద్ద ట్రేడయ్యింది. రికార్డు బ్రేకింగ్ ర్యాలీ అనంతరం లాభాల స్వీకరణ జరగడంతో పసిడి, వెండి ధరలు కరెక్షన్‌కి లోనైనట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో బంగారం ధర ఔన్సుకి (31.1 గ్రాములు) 285.30 డాలర్లు తగ్గి 5,087.73 డాలర్లకు క్షీణించింది. ఒక దశలో 425.86 డాలర్లు క్షీణించి 4,945.26 డాలర్లకు పతనమైంది. ఇక వెండి కూడా ఇంట్రాడేలో 17.5 శాతం పడి 95.26 డాలర్లను కూడా తాకింది. చివరికి 12% (14 డాలర్లు) తగ్గి 101.47 డాలర్ల వద్ద ముగిసింది. ఫ్యూచర్స్ మార్కెట్ కామెక్స్‌లో పుత్తడి ఏప్రిల్ కాంట్రాక్టు 273 డాలర్లు తగ్గి 5,085 డాలర్ల దగ్గర ట్రేడయ్యింది. వెండి దాదాపు 16 డాలర్లు క్షీణించి 98.70 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది.

ద్రవ్యలోటు రూ.8.55 లక్షల కోట్లు

- వార్షిక లక్ష్యంలో 54.5 శాతం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025–26) 2025 డిసెంబర్ చివరికి రూ.8.55 లక్షల కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద ద్రవ్యలోటు జీడీపీలో 4.4 శాతంగా ఉంటుందన్నది (రూ.15.69 లక్షల కోట్లు) అంచనా. డిసెంబర్ చివరికి 9 నెలల్లో ద్రవ్యలోటు లక్ష్యంలో 54.5 శాతానికి చేరింది. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) విడుదల చేసిన డేటా ప్రకారం.. పూర్తి ఏడాదిలో ప్రభుత్వ ఆదాయ లక్ష్యంలో 72.2 శాతం మేర (రూ.25.25 లక్షల కోట్లు) డిసెంబర్ చివరికి సమకూరింది. ఇందులో రూ.19.39 లక్షల కోట్లు పన్నుల రూపంలో, రూ.5.39 లక్షల కోట్లు పన్నేతర మార్గాల్లో, రూ.46,047 కోట్లు రుణేతర స్వీకరణల రూపంలో వచ్చింది.

బడ్జెట్ ముందు అలర్ట్

- మెటల్, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ
- మూడు రోజుల లాభాలకు బ్రేక్

ముంబై: బడ్జెట్‌కు ముందు మెటల్, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణతో దేశీయ స్టాక్ మార్కెట్ శుక్రవారం నష్టంతో ముగిసింది. సెన్సెక్స్ 297 పాయింట్లు తగ్గి 82,270 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98 పాయింట్లు కోల్పోయి 25,321 వద్ద నిలిచింది. దీంతో సూచీల మూడు రోజుల లాభాలకు బ్రేక్ పడినట్లైంది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే బలహీనంగా మొదలయ్యాయి. వచ్చే బడ్జెట్ నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఒక దశలో సెన్సెక్స్ 625 పాయింట్లు క్షీణించి 81,941 వద్ద, నిఫ్టీ 205 పాయింట్లు పతనమై 25,214 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. అయితే ఇండెక్సుల్లో అధిక వెయిటేజీ కలిగిన మారుతీ సుజుకీ(0.70%), మహీంద్రాఅండ్‌మహీంద్రా(1.38%), యాక్సిస్ బ్యాంక్(0.43%), ఎస్‌బీఐ(1.23%) షేర్లు రాణించడంతో సూచీల నష్టాలు కొంతమేర తగ్గాయి. ఆసియా మార్కెట్లలో హాంగ్‌కాంగ్ 2%, చైనా 1%, సింగపూర్ 0.50%, జపాన్ 0.10% నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు 1% లాభపడ్డాయి. అమెరికా స్టాక్ సూచీలు 0.25% నష్టంతో ట్రేడవుతున్నాయి.

మెటల్ షేర్లు క్రాష్: గత వారం రోజులుగా ర్యాలీ చేసిన మెటల్ షేర్లలో భారీగా లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. హిందూస్తాన్ జింక్ 12%, వేదాంత 11%, నాల్కో 10%, హిందాల్కో 6%, టాటా స్టీల్ 4.50% క్షీణించాయి. ఎన్‌ఎండీసీ 4.19%, సెయిల్ 4%, లాయిడ్స్ మెటల్స్ 3% తగ్గాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
చైనా, భారత్ నడిపిస్తాయ్ | బీవోబీ లాభం ఓకే

ఇంట్రాడేలో 92 దిగువకు రూపాయి

డాలర్ మారకంలో ఫారెక్స్ మార్కెట్లో ఉదయం రూపాయి విలువ 91.82 వద్ద మొదలైంది. ఆపై 3 పైసలు బలహీనపడి 92.02 వద్ద ఇంట్రాడే చరిత్రాత్మక కనిష్టాన్ని నమోదు చేసింది. తదుపరి కోలుకుంది. చివరికి రూపాయి విలువ 6 పైసలు బలపడి 91.93 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్, కమోడిటీల ధరల క్షీణత కలిసొచ్చింది. కనిష్ట స్థాయి 92.02 నుంచి రికవరీ అయిన రూపాయి చివరికి 91.93 వద్ద ముగిసింది.

ఆదివారం స్పెషల్ ట్రేడింగ్ ..!

కేంద్ర ప్రభుత్వం 2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఆదివారం(ఫిబ్రవరి 1న) స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ జరగనుంది. సాధారణ పనిదినాల మాదిరిగానే ఉదయం 9.15 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు మార్కెట్ పనిచేస్తుంది. ఎంసీఎక్స్‌లో ఉదయం 9నుంచి 5 గంటల వరకు మొదటి సెషన్‌లో ట్రేడింగ్ జరుగుతుంది.

మార్కెట్లోకి
బిగ్‌బాస్ ఎంట్రీ

ఎన్‌ఎస్ఈ ఐపీఓకి రెడీ
ఏళ్ల నిరీక్షణకు బ్రేక్ ● సెబీ గ్రీన్ ఫ్లాగ్

న్యూఢిల్లీ: దశాబ్దకాలంగా వాయిదా పడుతూ వస్తున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్ఈ) పబ్లిక్ ఇష్యూకి ఎట్టకేలకు మార్గం సుగమమైంది. ఐపీవో విషయంలో ముందుకెళ్లేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) జారీ చేసింది. ఇష్యూకి సెబీ అనుమతి లభించడం తమ సంస్థ ప్రయాణంలో కీలక మైలురాయని ఎన్ఎస్ఈ చైర్‌పర్సన్ శ్రీనివాస్ ఇంజేటి తెలిపారు. భాగస్వాములందరికి మరింత విలువను జోడించేందుకు ఇది తోడ్పడగలదని చెప్పారు. ఎన్‌వోసీ లభించిన తర్వాత ఇష్యూకి రావడానికి ఏడు నుంచి ఎనిమిది నెలలు పట్టొచ్చని ఎన్‌ఎస్ఈ ఎండీ ఆశీష్ కుమార్ చౌహాన్ గతంలో తెలిపారు. సంస్థ ఐపీవో దేశీయంగా అతి పెద్ద పబ్లిక్ ఇష్యూగా నిలుస్తుందనే అంచనాలు నెలకొన్నాయి. ఎన్‌ఎస్ఈలో సుమారు 1.77 లక్షల షేర్‌హోల్డర్లుండగా, అన్‌లిస్టెడ్ గ్రే మార్కెట్లో రూ. 5 లక్షల కోట్ల పైగా విలువ పలుకుతోందని అనలిస్టులు తెలిపారు. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో ప్రస్తుత షేర్‌హోల్డర్ల వాటాల విక్రయం ద్వారా రూ. 10,000 కోట్లు సమీకరించేందుకు 2016లో ఎన్‌ఎస్ఈ మొదటిసారిగా ముసాయిదా ఆఫర్ పత్రాలను సమర్పించింది. అయితే, గవర్నెన్స్ లోపాల ఆరోపణలు, కో–లొకేషన్ కేసు తదితర అంశాల కారణంగా పబ్లిక్ ఇష్యూకి అప్పట్లో సెబీ ఆమోదముద్ర వేయలేదు. ఆ తర్వాత నుంచి ఎన్‌ఎస్ఈ పలుమార్లు సంప్రదింపులు జరుపుతూనే ఉంది. రూ. 1,388 కోట్లు చెల్లించి కో–లొకేషన్ కేసును పరిష్కరించుకునేందుకు ఎన్ఎస్ఈ గతేడాది ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో కంపెనీ లిస్టింగ్ ప్రణాళికలను పరిశీలించేందుకు 2025 మార్చిలో అంతర్గతంగా కమిటీని వేసింది. సెటిల్మెంట్ అభ్యర్థనకు ఆమోదముద్ర వేసినట్లు సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే ఇటీవలే తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్

నేడు ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్
సబలెంకా X రిబాకినా
మధ్యాహ్నం 2 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

చరిత్ర పుటల్లో చోటు కోసం...

ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ కోసం జొకోవిచ్, అల్‌కరాజ్ 'ఢీ'

- సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్‌పై సెర్బియా దిగ్గజం విజయం
- 5 గంటల 27 నిమిషాల పోరులో జ్వెరెవ్‌పై స్పెయిన్ స్టార్ గెలుపు

మెల్‌బోర్న్: ఒక్క విజయం సాధిస్తే... సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్... ప్రపంచ నంబర్‌వన్, స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ చరిత్ర పుటల్లో తమ పేరును లిఖించుకుంటారు. టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జొకోవిచ్ 11వసారి... అల్‌కరాజ్ తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లారు. ఆదివారం జరిగే ఫైనల్లో జొకోవిచ్‌తో అల్‌కరాజ్ తలపడతాడు. తుది పోరులో జొకోవిచ్ గెలిస్తే టెన్నిస్ చరిత్రలోనే అత్యధికంగా 25 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ గెలిచిన ఏకైక ప్లేయర్‌గా అవతరిస్తాడు. అల్‌కరాజ్ నెగ్గితే 'కెరీర్ గ్రాండ్‌స్లామ్' ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడిగా చరిత్ర సృష్టిస్తాడు. శుక్రవారం జరిగిన రెండు అసాధారణ సెమీఫైనల్స్‌లో అద్భుత ఫలితాలు వచ్చాయి. 5 గంటల 27 నిమిషాలపాటు జరిగిన మొదటి సెమీఫైనల్లో అల్‌కరాజ్ 6–4, 7–6 (7/5), 6–7 (3/7), 6–7 (4/7), 7–5తో మూడో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ)పై విజయం సాధించాడు. నిర్ణాయక ఐదో సెట్‌లో 5–4తో ఆధిక్యంలో నిలిచిన జ్వెరెవ్ పదో గేమ్‌లో తన సర్వీస్‌ను నిలబెట్టుకొని ఉంటే గెలిచేవాడు. కానీ పదో గేమ్‌లో జ్వెరెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్‌కరాజ్ స్కోరును 5–5తో సమం చేశాడు. ఆ తర్వాత తన సర్వీస్‌ను కాపాడుకొని 12వ గేమ్‌లో జ్వెరెవ్ సర్వీస్‌ను మరోసారి బ్రేక్ చేసి 7–5తో గెలుపు సొంతం చేసుకున్నాడు.

అల్‌కరాజ్

జొకోవిచ్

అతిపెద్ద వయస్కుడిగా...

డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సినెర్ (ఇటలీ)తో 4 గంటల 9 నిమిషాలపాటు జరిగిన రెండో సెమీఫైనల్లో 10సార్లు విజేత జొకోవిచ్ 3–6, 6–3, 4–6, 6–4, 6–4తో విజయం సాధించాడు. 12 ఏస్‌లు సంధించిన జొకోవిచ్ 46 విన్నర్స్ కొట్టాడు. 16 సార్లు తన సర్వీస్‌లో బ్రేక్ పాయింట్లను కాపాడుకున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఫైనల్ చేరిన 10 సార్లూ టైటిల్ గెలిచిన జొకోవిచ్ ఈ టోర్నీ చరిత్రలో తుది పోరుకు అర్హత పొందిన అతిపెద్ద వయస్కుడిగా (38 ఏళ్ల 241 రోజులు) రికార్డు సృష్టించాడు. కెన్ రోజ్‌వాల్ (37 ఏళ్ల 54 రోజులు –1972లో) పేరిట ఉన్న రికార్డును అతను బద్దలు కొట్టాడు.

అభిరథ్ హిమతేజ

అభిరథ్, హిమతేజ సెంచరీలు

హైదరాబాద్ 415/4

సాక్షి, హైదరాబాద్: ఛత్తీస్‌గఢ్‌తో జింఖానా మైదానంలో జరుగుతున్న రంజీ ట్రోఫీ గ్రూప్ 'డి' మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 56/0తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 105 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 415 పరుగులు చేసింది. ఓపెనర్ అభిరథ్ రెడ్డి (121; 16 ఫోర్లు, 1 సిక్స్), మిడిలార్డర్ బ్యాటర్ కొడిమెల హిమతేజ (125 బ్యాటింగ్; 13 ఫోర్లు) సెంచరీలు సాధించారు. అమన్ రావు (52; 8 ఫోర్లు, 1 సిక్స్)తో తొలి వికెట్‌కు 96 పరుగులు జోడించిన అభిరథ్... మూడో వికెట్‌కు హిమతేజతో 147 పరుగులు జత చేశాడు. ప్రజ్ఞయ్ రెడ్డి (52 బ్యాటింగ్; 8 ఫోర్లు, 1 సిక్స్), హిమతేజ ఐదో వికెట్‌కు అజేయంగా 91 పరుగులు జోడించాడు. ప్రస్తుతం హైదరాబాద్ 132 పరుగుల ఆధిక్యంలో ఉంది.

ఆంధ్ర 267/5


జ్ఞానేశ్వర్

నాగాలాండ్ జట్టుతో సొవిమాలో జరుగుతున్న గ్రూప్ 'ఎ' రంజీ ట్రోఫీ లీగ్ మ్యాచ్‌లో... రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు కోల్పోయి 267 పరుగులు చేసింది. అభిషేక్ రెడ్డి (51; 7 ఫోర్లు), కరణ్ షిండే (51; 5 ఫోర్లు, 1 సిక్స్), సీఆర్ జ్ఞానేశ్వర్ (87 బ్యాటింగ్; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. ప్రస్తుతం నాగాలాండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 366కు ఆంధ్ర మరో 99 పరుగుల దూరంలో ఉంది. జ్ఞానేశ్వర్‌తో కలిసి శశికాంత్ (31 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు.

మరిన్ని క్రీడా వార్తలు
సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ప్రపంచ కప్‌కు ముందు
ఆఖరి పోరు

- నేడు భారత్, న్యూజిలాండ్ ఐదో టి20
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

తిరువనంతపురం: టి20 ప్రపంచ కప్‌కు ముందు ఆడుతున్న ఆఖరి సిరీస్‌లో భారత్ ఇప్పటికే తమ అస్త్రశస్త్రాలు అన్నింటినీ పరీక్షించుకుంది. న్యూజిలాండ్‌పై తొలి మూడు మ్యాచ్‌లలో అద్భుత ప్రదర్శన కనబర్చిన జట్టు 3–0తో సిరీస్‌ను గెలుచుకుంది. విశాఖపట్నంలో జరిగిన గత మ్యాచ్‌లో అనూహ్యంగా ఓడినా...ఆందోళన చెందాల్సిన పరిస్థితేమీ లేదు. అయితే మెగా పోరుకు ముందు మిగిలిన ఒక మ్యాచ్‌లో మళ్లీ చెలరేగాలని జట్టు పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో నేడు గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ మధ్య చివరిదైన ఐదో టి20కి రంగం సిద్ధమైంది. మరోవైపు సిరీస్ కోల్పోయిన తర్వాత గత మ్యాచ్‌లో రాణించిన క్లీన్ స్వీప్ నుంచి తప్పించుకున్న కివీస్ కూడా విజయంతో ముగించాలని భావిస్తోంది. భారత్‌లోనే జరిగే వరల్డ్ కప్‌కు ముందు ఈ గెలుపు ఆ టీమ్‌లో ఆత్మ విశ్వాసాన్ని పెంచడం ఖాయం.

సిరీస్‌లో జట్టు ప్రదర్శనను బట్టి చూస్తే ఒక్క సంజు సామ్సన్ ఫామ్ విషయంలోనే మేనేజ్‌మెంట్ కొంత ఇబ్బంది పడుతోంది. తన సొంత మైదానంలో అశేష అభిమానుల మధ్య బరిలోకి దిగనున్న సామ్సన్ ఒక మంచి ఇన్నింగ్స్ ఆడేందుకు ఇంతకంటే సరైన వేదిక, సమయం ఉండదు. తొలి టి20 ఆడుతూ గాయంతో తప్పుకున్న అక్షర్ పటేల్ తర్వాతి మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అతను పూర్తిగా కోలుకుంటే ఆడతాడు. స్వల్ప గాయంతో వైజాగ్ మ్యాచ్ ఆడని ఇషాన్ కిషన్ కూడా ఫిట్‌గా ఉంటే మళ్లీ తుది జట్టులోకి రావచ్చు. మరోవైపు కివీస్ కూడా ఒక మార్పుతో ఆడే అవకాశం ఉంది. ఓపెనర్, వికెట్ కీపర్ ఫిన్ అలెన్ అందుబాటులో రావడంతో సీఫెర్ట్‌ను విశ్రాంతినిచ్చి అతడిని ఆడించే అవకాశం ఉంది. తిరువనంతపురంలో పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. కాబట్టి భారీ స్కోర్లకు అవకాశం ఉంది. ఇక్కడా మంచు ప్రభావం ఉంది. గతంలో ఈ మైదానంలో 4 టి20లు ఆడిన భారత్ 3 గెలిచి, ఒక మ్యాచ్‌లో ఓడింది. చివరిసారిగా 2023 నవంబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన పోరులో భారత్ 235 పరుగులు నమోదు చేసింది.

సంజు సామ్సన్

'ఎలిమినేటర్'కు గుజరాత్

11 పరుగులతో ముంబైపై విజయం ● హర్మన్‌ప్రీత్ పోరాటం వృథా

వడోదర: ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ జెయింట్స్ 'ఎలిమినేటర్'కు అర్హత సాధించింది. శుక్రవారం జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ 11 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌పై నెగ్గింది. లీగ్ చరిత్రలో ముంబైతో తలపడిన ఎనిమిది సార్లూ ఓటమి చవి చూసిన గుజరాత్ 9వ ప్రయత్నంలో తొలిసారి గెలుపు రుచి చూసింది. ఆడిన 8 మ్యాచ్‌ల్లో 5 గెలిచి, 3 ఓడిన గుజరాత్ 10 పాయింట్లతో రెండో స్థానాన్ని ఖాయం చేసుకుంది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. యాష్లీ గార్డ్‌నర్ (28 బంతుల్లో 46; 7 ఫోర్లు, 1 సిక్స్), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జార్జ్ వేర్‌హామ్ (26 బంతుల్లో 44 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) జట్టు స్కోరులో కీలక పాత్ర పోషించగా... అనుష్క శర్మ (31 బంతుల్లో 33; 4 ఫోర్లు, 1 సిక్స్), సోఫీ డివైన్ (21 బంతుల్లో 25; 3 ఫోర్లు) రాణించారు. అమేలియా కెర్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం ముంబై 20 ఓవర్లలో 7 వికెట్లకు 156 పరుగులే చేయగలిగింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (48 బంతుల్లో 82 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) చివరి వరకు పోరాడినా... విజయం మాత్రం దక్కలేదు. ఆఖరి 2 ఓవర్లలో 37 పరుగులు చేయాల్సి ఉండగా, హర్మన్ 2 ఫోర్లు, 2 సిక్స్‌ల సహాయంతో 24 పరుగులు రాబట్టగలిగింది. ఈ మ్యాచ్‌లో ఓడినా... ఎలిమినేటర్‌కు క్వాలిఫై అయ్యే అవకాశాలు ముంబైకి ఇంకా ఉన్నాయి. **నేడు విశ్రాంతి దినం. ఆదివారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో ఢిల్లీ కచ్చితంగా గెలవడంతోపాటు రన్‌రేట్‌లో ప్రస్తుతం తమకంటే (–0.164) ఎంతో ముందున్న ముంబైను (+0.059) కూడా దాటాల్సి ఉంటుంది.**

స్కోరు వివరాలు

గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్: మూనీ (సి) సజన (బి) షబ్నిమ్ 5; సోఫీ డివైన్ (సి) కెర్ (బి) సివర్ బ్రంట్ 25; అనుష్క (సి) షబ్నిమ్ (బి) కెర్ 33; గార్డ్‌నర్ (స్టంప్డ్) ఫిర్దోస్ (బి) కెర్ 46; వేర్‌హామ్ (నాటౌట్) 44; భారతి (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (20 ఓవర్లలో 4 వికెట్లకు) 167. **వికెట్ల పతనం:** 1–21, 2–69, 3–71, 4–142. **బౌలింగ్:** షబ్నిమ్ 4–0–29–1, సివర్ బ్రంట్ 4–0–36–1, వైష్ణవి 2–0–21–0, అమన్‌జోత్ 2–0–13–0, అమేలియా కెర్ 4–0–26–2, మాథ్యూస్ 4–0–40–0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: సజన (సి) భారతి (బి) కాశ్వీ 26; మాథ్యూస్ (బి) డివైన్ 6; సివర్ బ్రంట్ (సి) అనుష్క (బి) డివైన్ 2; హర్మన్‌ప్రీత్ (నాటౌట్) 82; అమేలియా కెర్ (సి) మూనీ (బి) వేర్‌హామ్ 20; అమన్‌జోత్ (స్టంప్డ్) మూనీ (బి) రాజేశ్వరి 13; సంస్కృతి (ఎల్బీ) (బి) వేర్‌హామ్ 0; పూనమ్ (సి అండ్ బి) గార్డ్‌నర్ 2; ఫిర్దోస్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం** (20 ఓవర్లలో 7 వికెట్లకు) 156. **వికెట్ల పతనం:** 1–23, 2–33, 3–37, 4–82, 5–126, 6–127, 7–155. **బౌలింగ్:** రేణుక సింగ్ 2–0–11–0, కాశ్వీ గౌతమ్ 2–0–12–1, రాజేశ్వరి గైక్వాడ్ 4–0–46–1, సోఫీ డివైన్ 4–1–23–2, జార్జియా వేర్‌హామ్ 4–0–26–2, యాష్లీ గార్డ్‌నర్ 3–0–26–1, తనూజ 1–0–11–0.

హర్మన్‌ప్రీత్, గార్డ్‌నర్

జ్యోతి యర్రాజీకి క్రీడా ప్రోత్సాహకాలు విడుదల

జ్యోతి యర్రాజీ

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ అథ్లెట్, ఒలింపియన్ జ్యోతి యర్రాజీకి క్రీడా ప్రోత్సాహకాలు విడుదల చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌జైన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సాధించిన పతకాలకు నగదు ప్రోత్సాహకాలతో పాటు గ్రూప్–1(డిప్యూటీ కలెక్టర్) ఉద్యోగం, విశాఖలో 500 చదరపు గజాల ఇంటి స్థలాన్ని మంజూరు చేశారు. శాప్ అధికారులు జ్యోతి యర్రాజీకి వెయ్యి చదరపు గజాల స్థలాన్ని ఇవ్వాలని ప్రతిపాదించినప్పటికీ ప్రభుత్వం అందులో సగం కోతపెట్టింది.

అమరావతిలో బిట్స్ పిలానీ క్యాంపస్

తాడికొండ: ప్రముఖ యూనివర్సిటీ బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (బిట్స్) అమరావతిలో 70.011 ఎకరాలలో క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. బిట్స్ సంస్థకు తుళ్లూరు మండలంలోని మందడం, వెంకటపాలెంలో ప్రభుత్వం భూమిని కేటాయించింది. ఈ మేరకు సీఆర్డీఏతో శుక్రవారం బిట్స్ సంస్థ ప్రతినిధులు భూ విక్రయ ఒప్పందం కుదుర్చుకున్నారు. బిట్స్ అమరావతి క్యాంపస్‌ను మూడు దశలుగా అభివృద్ధి చేయనున్నట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. మొదటి దశలో రూ.1,000 కోట్ల పెట్టుబడితో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. 2027 నుంచి విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

భారత్ పర్వ్‌లో అలరించిన కూచిపూడి

సాక్షి, న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర సాంస్కృతిక శాఖ ఎర్రకోట వద్ద నిర్వహిస్తున్న ‘భారత్ పర్వ్–2026’ వేడుకల్లో తెలుగు రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ నెల 26న ప్రారంభమైన ఈ వేడుకలు శనివారంతో ముగియనున్నాయి. ముగింపు వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. భారత్ పర్వ్‌లో భాగంగా శుక్రవారం 46 మంది కళాకారులతో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ భవన్ స్పెషల్ కమిషనర్ డా. అర్జా శ్రీకాంత్ కళాకారులను సన్మానించారు. రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ ప్రచారం చేస్తున్న కూచిపూడి కళాకారుల కృషిని కొనియాడారు.

కిచిడీ తిని విద్యార్థులకు అస్వస్థత

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏడుగురు బాలురు

మాడుగుల(అనకాపల్లి): అనకాపల్లి జిల్లా మాడుగులలోని బీసీ వసతి గృహంలో శుక్రవారం కిచిడీ తిన్న ఏడుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ వసతి గృహంలో మొత్తం 45 మంది విద్యార్థులున్నారు. స్థానిక బాలుర జిల్లాపరిషత్ హైస్కూల్‌లో చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నారు. గురువారం రాత్రి కోడి గుడ్లు కూర తినగా, శుక్రవారం ఉదయం పెసర పప్పుతో చేసిన కిచిడీ, చట్నీ, మిలెట్స్‌తో చేసిన చిక్కీ తిని స్కూల్‌కు వెళ్లారు. ఉదయం స్కూల్‌లో ప్రార్థన సమయంలో జి.ఈశ్వర రావు, ఎస్.విజయకుమార్, ఎం.సుశాంత్, జి.వెంకరమణ, వి.దిలీప్, ఎస్.ప్రశాంత్, ఎస్.ప్రసాద్ కళ్లు తిరుగుతున్నాయని ఉపాధ్యాయులకు చెప్పారు. దీంతో వారిని నీడలో కూర్చోబెట్టారు. కొంతసేపటి తరువాత వాంతులు, విరేచనాలు కావడంతో వసతి గృహ వార్డెన్‌కు సమాచారమిచ్చారు. స్కూల్‌కు వచ్చిన వార్డెన్ ఆ ఏడుగురిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై వైద్యాధికారి నరేశ్‌ను సంప్రదించగా అస్వస్థతకు గురైన ఏడుగురికి రక్త పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. వాంతులు, విరేచనాలు తగ్గాయని, ఫుడ్ పాయిజన్ కాలేదని చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి ప్రాణభయం లేదని, అజీర్తి కారణంగా ఇలా జరిగి ఉంటుందని తెలిపారు.

మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

వందేమాతరం శకటానికి ప్రథమ బహుమతి

కీరవాణి సంగీతం సమకూర్చిన గేయ ప్రదర్శనకు ప్రత్యేక అవార్డు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర సాంస్కృతిక శాఖ డబుల్ ధమాకా కొట్టింది. గణతంత్ర వేడుకల్లో భాగంగా ఆ శాఖ ప్రదర్శించిన ‘వందేమాతరం’ శకటానికి ప్రథమ బహుమతి లభించింది. ఆస్కార్ అవార్డు గ్రహీత, తెలుగు సినీ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి సంగీతం సమకూర్చిన వందేమాతరం గేయ ప్రదర్శన ప్రత్యేక బహుమతి దక్కినట్లు.. శుక్రవారం కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ‘వందేమాతరం– 150 ఏళ్ల ప్రయాణం’ పేరిట రూపొందించిన శకటానికి కేంద్ర మంత్రిత్వ శాఖల విభాగంలో ప్రథమ బహుమతి లభించింది. ‘వందేమాతరం: భారత్ శాశ్వత ప్రతిధ్వని’ అనే సాంస్కృతిక నృత్య ప్రదర్శనకు ప్రత్యేక బహుమతి దక్కిందని పేర్కొంది. వందేమాతరం గేయం పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు సాగిన 150 ఏళ్ల ప్రయాణాన్ని కళ్లకు కట్టినట్లు శకటం చూపింది. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఈ గీతం ప్రజలను ఎలా చైతన్య పరిచిందో, జాతీయ సమగ్రతకు ఎలా చిహ్నంగా నిలిచిందో ప్రదర్శనలో అద్భుతంగా ఆవిష్కరించారు. భారతీయ నాగరికత, జాతీయ అస్తిత్వంలో ఈ గీతానికి ఉన్న ప్రాధాన్యాన్ని శకటం ప్రతిబింబించింది. ప్రత్యేక బహుమతి పొందిన సాంస్కృతిక ప్రదర్శనను సంగీత నాటక అకాడమీ, ఉత్తర మండల సాంస్కృతిక కేంద్రం (పాటియాలా) సంయుక్తంగా నిర్వహించాయి. తెలంగాణకు చెందిన ఒగ్గడోలు కళాకారులు సహా.. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 2,500 మంది కళాకారులు ఇందులో పాల్గొన్నారు. శాస్త్రీయ, జానపద, గిరిజన నృత్య రూపాల ద్వారా భారతదేశ వైవిధ్యభరితమైన సంస్కృతిని చాటిచెప్పారు. ఆధ్యాత్మికత నుంచి సాయుధ దళాల ధైర్యసాహసాల వరకు తమ నృత్యం ద్వారా ప్రదర్శించారని కేంద్ర సాంస్కృతిక శాఖ పేర్కొంది.

సిద్ధమవుతోన్న ‘మల్లన్న’ తలపాగా

మామిడికుదురు: మహా శివరాత్రి రోజున శ్రీశైలం మల్లికార్జున స్వామికి అలంకరించే చేనేత తలపాగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం మొగలికుదురు గ్రామంలో సిద్ధమవుతోంది. శ్రీ చౌడేశ్వరి సేవా సమితి ద్వారా సమర్పించే ఈ చేనేత వస్త్రాన్ని అత్యంత నియమనిష్ఠలతో జగ్గన్నపేట చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు కాశిన మల్లికార్జునరావు మగ్గంపై తయారు చేస్తున్నారు. శ్రీశైలం మల్లికార్జునస్వామికి తలపాగాగా 193 మీటర్ల ఏకవస్త్రాన్ని మగ్గంపై నెల రోజులుగా తయారు చేస్తున్నారు. దీంతో పాటు శనగల బసవన్నగా పిలిచే నందీశ్వరునికి మూడున్నర మీటర్లు వస్త్రం, మల్లికార్జునస్వామికి సమర్పించేందుకు మరో మూడున్నర మీటర్ల మధుపర్కం మగ్గంపై తయారవుతున్నాయి. వీటిని ఫిబ్రవరి 12న గ్రామంలో ఊరేగించి, 14న శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆలయంలో అధికారులకు సమర్పిస్తామని మల్లికార్జునరావు చెప్పారు. ఈ వస్త్రాలను 15వ తేదీ మహా శివరాత్రి రోజు రాత్రి స్వామి వారికి సమర్పిస్తారన్నారు. ఐదేళ్లుగా స్వామి వారికి తానే స్వయంగా మగ్గంపై చేనేత వస్త్రం తయారు చేసి అందజేస్తున్నానని మల్లికార్జునరావు చెప్పారు. ఈ అదృష్టం తనకు దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

మగ్గంపై తలపాగా, మధుపర్కం తయారు చేస్తున్న మల్లికార్జునస్వామి

జననాయకన్‌పై సుప్రీంలో కెవియట్ పిటిషన్

తమిళసినిమా (చెన్నై): విజయ్ నటించిన చిత్రం జననాయకన్ విడుదలపై కొద్ది రోజులుగా తీవ్ర అయోమయం నెలకొంది. అయితే, సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి సర్టిఫికెట్ అందించే విషయంలో ఇప్పటికే ప్రత్యేక కమిటీ పరిశీలనకు పంపింది. ఈ నేపథ్యంలో చిత్ర వర్గాలు సెన్సార్ సర్టిఫికెట్ కోరుతూ మరోసారి పిటిషన్ దాఖలు చేస్తే తమ వాదనలూ వినాలంటూ సెన్సార్ బోర్డు సుప్రీంకోర్టులో కెవియట్ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో అసలు సెన్సార్ బోర్డు నిబంధనలకు అనుగుణంగా ప్రవర్తిస్తుందా, లేదా కక్షపూరితంగా వ్యవహరిస్తుందా అనే చర్చ సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

హైకోర్టు ఉద్యోగుల నివాసాల్లో తనిఖీలు

- ఆరోపణలు రావడంతో అవినీతి నిరోధక శాఖ దర్యాప్తు
- ఏకకాలంలో మూడు జిల్లాల్లోని ఐదు ప్రాంతాల్లో తనిఖీలు

తాడేపల్లి రూరల్: అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు రావడంతో శుక్రవారం ఏకకాలంలో మూడు జిల్లాల్లోని ఐదు ప్రాంతాల్లో తనిఖీలు చేసినట్లు అవినీతి నిరోధక శాఖాధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరి కోర్టులో మార్షల్‌గా పనిచేస్తున్న జి. విజయలక్ష్మి జుడీషియల్ అకాడమిలో పనిచేస్తున్నారు. హైకోర్టులో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా జి. ప్రశాంతి చౌదరి, వై. వెంకటశశితోపాటు విచారణలో ప్రైవేటు వ్యక్తులు కొల్లి శశిధర్‌రెడ్డి, గరికపత్తి రవికుమార్‌లను విచారించారు. వారు నివాసం ఉంటున్న కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబరు 1064, మొబైల్ నెం.9440440057, ఈ–మెయిల్ ఐడీ కంప్లయింట్–ఏసీబీ–ఏపీ.జీఓవీ.ఇన్‌కు తెలియజేయాలన్నారు.

గొంతులో అన్నం ముద్ద అడ్డుపడి చిన్నారి మృతి

మృతురాలు జెస్సీ

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో శుక్రవారం గొంతులో అన్నం ముద్ద అడ్డుపడి రెండేళ్ల చిన్నారి మృతి చెందింది. పట్టణంలోని మార్కండేయపురం జగనన్న ఎల్–3 లేఅవుట్ కాలనీలో ర్యాలీ ఆంజనేయకుమార్, భాను శిరీష దంపతులు. వారికి జెస్సీ (2) అనే కుమార్తె ఉంది. శుక్రవారం జెస్సీ తల్లి భాను శిరీష, నాన్నమ్మ వెంకట రమణ పనిమీద పట్టణానికి వచ్చారు. మధ్యాహ్నం కావడంతో జెస్సీ తండ్రి ఆంజనేయకుమార్ అన్నం కలిపి చిన్నారికి తినిపిస్తున్నాడు. ఆ సమయంలో చిన్నారికి అన్నం ముద్ద గొంతు నుంచి దిగక ఉక్కిరిబిక్కిరైంది. దీంతో తండ్రి పక్కనే నివసిస్తున్న వరాల దుర్గను పిలిచాడు. ఆమె వచ్చి చిన్నారికి సపర్యలు చేసింది. అయినా బాలిక స్పృహ కోల్పోయింది. వెంటనే ఆంజనేయకుమార్ అక్కంపేటలో ఉంటున్న తన అక్క మాటూరి పద్మావతి, బావ రాంబాబులకు ఫోన్ చేశాడు. వారు వచ్చి చిన్నారిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చిన్నారి మృతిచెందినట్టు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ పంజా విసిరిన పెద్ద పులి

ఆవు మృతి

బుట్టాయగూడెం: రెండు రోజులుగా పులి సమాచారం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు, అటవీ అధికారులను మరోసారి పెద్ద పులి ఉలికిపాటుకు గురి చేసింది. ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలోని గుమ్ములూరు అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన ఓ ఆవుపై దాడి చేసి చంపేసింది. ఈ నెల 29న అమ్మపాలెం, కండ్రికగూడెం గ్రామాల్లో ఒక గేదె, దూడపై దాడి చేసి చంపిన పెద్ద పులి లంకపల్లి మీదుగా గుమ్ములూరుకు చేరుకుంది. అడవిలోకి ప్రవేశించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈసారి అడవిలో మాటేసిన పెద్ద పులి అక్కడికి వచ్చిన ఆవులపై దాడి చేసి హతమార్చడంతో పాత గుమ్ములూరు, కొత్త గుమ్ములూరు, లంకపల్లి పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ప్రస్తుతం పులి ఉన్న ప్రాంతం దట్టమైన అరణ్యమేనని అటవీ అధికారులు చెబుతున్నారు. ఆ పరిసర ప్రాంతంలో పులి తిరుగుతున్నందున గిరిజనులు పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఈ ఘటనతో జిల్లాలో పెద్ద పులి దాడిలో మృతిచెందిన పశువుల సంఖ్య 11కు చేరింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



● మహనీయులు

తెలుగువారి కీర్తిపతాక... కట్టమంచి రామలింగారెడ్డి

తెలుగు జాతికి ఎంతో మంది సేవలందించారు. వారిలో విశిష్ట స్థానం కలిగినవారు డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి. ఆయన సాహితీవేత్త, విద్యావేత్త, పండితుడు. సి.ఆర్.రెడ్డిగా పేరొందిన కట్టమంచి రామలింగారెడ్డి చిత్తూరు జిల్లా కట్టమంచి గ్రామంలో 1880 డిసెంబరు 10న జన్మించారు. 1890లో చిత్తూరు బోర్డు ఉన్నత పాఠశాలలో మొదటిఫారంలో చదివి చెన్నై వెళ్ళి క్రైస్తవ కళాశాలలో ఉన్నత విద్య పూర్తి చేశారు. 19వ ఏటే 'ముసలమ్మ మరణము' అనే లఘు కావ్యాన్ని రాసి బహుమతి పొందారు. ప్రభుత్వ ఉపకారవేతనంతో ఇంగ్లాండులోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి చదువుకునేందుకు వెళ్ళారు.

ఇంగ్లాండ్ నుంచి తిరిగి వచ్చాక 1908లో తన 28వ ఏట బరోడా కళాశాలలో ఆచార్యునిగా తొలి ఉద్యోగం ప్రారంభించారు. విద్యా వ్యవస్థను మరింత అధ్యయనం చేయడానికి అమెరికా, ఫిలిప్పీన్స్, జపాన్ దేశాలలో పర్యటించారు. ఆ తర్వాత మైసూరు మహారాజా కళాశాలలో ఆచార్యుడిగా మారారు. ఆయన ప్రణాళిక ఆధారంగా 1916లో మైసూర్ విశ్వవిద్యాలయం ప్రారంభమయ్యింది. 1921 తరువాత రాజకీయాల్లో పాల్గొని చిత్తూరు నుండి అత్యధిక మెజారిటీతో శాసనసభకు ఎన్నికయ్యారు. 1926 నుంచి ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. 1951 ఫిబ్రవరి 24న అనారోగ్యంతో మరణించారు.

● తెలుసుకోండి

మంచు తింటే ఏమవుతుంది?

ప్రపంచ దేశాల్లో భారీ మంచు కురుస్తోంది. తెల్లారి లేస్తే ఇళ్ల ఎదురుగా, బజారుల్లో తెల్లటి మంచు ముద్దలు. గడ్డ కడుతున్న సరస్సులు. మూసుకు పోతున్న దారులు. మంచును చూస్తే మీకు ఎన్నో డౌట్స్ రావాలి. మీకు మీరు ఆన్సర్స్ కనుక్కుంటే ఇంకా బాగుంటుంది. ఇక్కడ వివిధ దేశాల్లో మంచు ఎలా ఉందో చూడండి. ఆ తర్వాత మంచు గురించి మీకు రావాల్సిన డౌట్స్‌కు సమాధానాలు వెతకండి. మీ డౌట్స్ ఇవి కూడా కావచ్చు.

1. మంచు ఎందుకు కురుస్తుంది?
2. మంచు తెల్లగా ఎందుకు ఉంటుంది?
3. మంచు కురిసే దేశాల్లో అగ్రస్థానం ఏ దేశానిది?
4. అంటార్కిటికాలో మంచు ఎంత లోతు వరకూ ఉంటుంది?
5. మంచు తింటే ఏమవుతుంది?
6. క్లయిమేట్ చేంజ్ అంటే ఏమిటి?

గ్రీన్‌ల్యాండ్

జర్మనీ

హడ్సన్ – న్యూయార్క్

జపాన్

మాస్కో

(ఇక్కడ ఉన్నవన్నీ జనవరి 29 గురువారం తీసిన ఫోటోలు)

● వింత లోకం

బాబోయ్... ఏందిది?

ప్లాటిపస్

ప్లాటిపస్ అనే జంతువు ప్రపంచంలోనే అత్యంత విచిత్రమైన జంతువుల్లో ఒకటి. ఇది గుడ్లు పెడుతుంది, తన పిల్లల కోసం పాలు ఉత్పత్తి చేస్తుంది, నీటిలో విద్యుత్ సంకేతాలను గుర్తించగలదు. ఆశ్చర్యంగా అనిపిస్తుందా? అంతే కాదు, అల్ట్రావయలెట్ కాంతిలో ఇది వెలుగుతుంది కూడా!

ప్లాటిపస్‌లు ఆస్ట్రేలియాలోని తూర్పు ప్రాంతాల్లో ఉన్న నదులు, వాగుల్లో నివసిస్తాయి. వీటిలో అత్యంత ప్రత్యేకమైన విషయం ఏమిటంటే ఇవి విషం కలిగిన స్తన్యజంతువులు కావడం. సాధారణంగా మనం విషం అంటే పాములు, తేళ్లను గుర్తుకు తెచ్చుకుంటాం. కానీ మగ ప్లాటిపస్ కూడా విషాన్ని కలిగి ఉంటుంది.

మగ ప్లాటిపస్‌ల వెనుక కాళ్ల దగ్గర పదునైన ముళ్లు ఉంటాయి. ఆడవాటితో జతకట్టే కాలంలో, ఈ ముళ్లు విష గ్రంథులతో కలుస్తాయి. అప్పుడు అవి చాలా శక్తివంతమైన విషాన్ని విడుదల చేస్తాయి.

శాస్త్రవేత్తలు ఈ విషంలో కనీసం 19 రకాల ప్రత్యేక రసాయనాలు (పెప్టైడ్లు) ఉన్నాయని కనుగొన్నారు. కొన్ని రసాయనాలైతే ప్రపంచంలో మరే జంతువులోనూ లేవు. ఈ విషం మనుషులకు ప్రాణాంతకం కాదు. కానీ చాలా తీవ్రమైన నొప్పిని కలిగిస్తుంది. ప్లాటిపస్ విషానికి గురైనవారు 'ఎముక విరిగిన దానికంటే కంటే ఎక్కువ నొప్పి' అని చెబుతారు. కొన్నిసార్లు ఆ నొప్పి వారాల పాటు లేదా నెలల పాటు కొనసాగుతుంది. దీనికి ఇప్పటివరకు ప్రత్యేక విరుగుడు మందు (యాంటీ వెనమ్) లేదు. ఈ విషం భవిష్యత్తులో మనుషులకు ఉపయోగపడే అవకాశం కూడా ఉంది. శాస్త్రవేత్తలు దీని ద్వారా కొత్త నొప్పి నివారణ మందులు, డయాబెటిస్ మందుల తయారీకి సంబంధించిన పరిశోధనలు చేస్తున్నారు.

● కథ

గురువు విలువ

ఓ ఊరిలో ఆనందుడు అనే గురువు ఉండేవారు. ఆయన వద్ద అనేకమంది శిష్యులు విద్యలు నేర్చుకునేవారు. కాలక్రమేణా ఆయనకు వయసు మీదపడింది. విద్యలు నేర్పలేని స్థితి వచ్చింది. అందరు శిష్యులు విద్య పూర్తి చేసుకొని వెళ్లిపోయారు. చివరగా వర్ధనుడనే యువకుడు ఆయన వద్ద మిగిలాడు. విద్య పూర్తయినా ఆనందుడి వద్దే ఉంటూ, ఆయనకు సేవలు చేస్తూ గడిపేవాడు.

ఒకనాడు ఆనందుడు అత్యవసర పని మీద పక్క ఊరికి వెళ్లాల్సి వచ్చింది. ఆయన వెళ్లేందుకు బండి ఏదీ సిద్ధంగా లేదు. నడిచే వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అయితే వయసు మీద పడటంతో నడక ఇబ్బందిగా మారింది. వర్ధనుడు ఆయన చేతులు పట్టుకొని నడిపిస్తూ ముందుకు కదిలాడు. అలా వారిద్దరూ మధ్యాహ్నానికి ఓ వాగు వద్దకు చేరుకున్నారు. వాగు దాటే సమయంలో ఆనందుడు తన శిష్యుడి చేతులు పట్టుకుని ముందుకు కదిలాడు. వాగు దాటి ఇవతలికి రాగానే ఆయన చేతులు వదిలేశాడు.

గురువు చేసిన ఈ చర్య వర్ధనుడికి వింతగా తోచింది. 'గురువుగారూ! దారంతా నేను మీ చేయి పట్టుకొని నడిపించాను. వాగు దాటే సమయంలోనూ నేను మీ చేయి పట్టుకునేవాణ్ని కదా? నా చేయి విడిపించుకొని మీరెందుకు నా చేతిని పట్టుకున్నారు?' అని అడిగాడు. దానికి ఆనందుడు నవ్వుతూ 'వర్ధనా! వాగు చాలా ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ ప్రవాహంలో నువ్వు నా చేయి పట్టుకుంటే పట్టు విడిపోయే ప్రమాదం ఉంది. నా ఈత వచ్చు కాబట్టి నేను ఒడ్డుకు చేరుకోగలను. కానీ శిష్యుడిగా నిన్ను కాపాడటం నా బాధ్యత. అందుకే దారంతా నువ్వు నా చేయి పట్టుకున్నా వాగు దాటేటప్పుడు నేను నీ చేయి పట్టుకున్నాను' అన్నాడు.

గురువు చేతిని శిష్యుడు వదిలినా, గురువు తన శిష్యుడి చేయి వదలడనే విషయం గ్రహించిన వర్ధనుడి గురువు చేసిన పనికి నమస్కరించాడు.

● భలే భలే

స్కూల్లోనే నకిలీ వార్తలు కనిపెట్టే చదువు!

'ఊళ్లోకి పులి వచ్చింది' అనే వార్త మీరు ఫోన్‌లో వీడియోతో సహా చూశారనుకోండి.. భయపడరూ? కాని అది నకిలీ వార్త అని తెలిస్తే? అరె... మోసపోయానే అనుకుంటారు. మీరు ఆ నకిలీ వార్తను నమ్మి అందరికీ చెప్తే వారిని కూడా తప్పుదారి పట్టించినవారు అవుతారు. అందుకే కంటికి కనిపించే వార్తలన్నీ నమ్మకూడదు. నిర్ధారణ చేసుకోవాలి. ఎలా? ఫిన్లాండ్ దేశంలో ఒక ప్రయత్నం జరుగుతోంది. నకిలీ వార్తలను కనిపెట్టడం అక్కడ ప్రీస్కూల్ తరగతి గదుల్లోనే నేర్పిస్తున్నారు.

1990ల నుండి 'మీడియా అక్షరాస్యత' ఫిన్లాండ్ బడులలో పాఠ్యాంశంగా ఉంది. తప్పుడు సమాచారానికి గురయ్యే అవకాశం ఉన్న వృద్ధుల కోసం అక్కడ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై దాడి తర్వాత రష్యా యూరప్ అంతటా నకిలీ వార్తలు ప్రచారం చేసిందనే వాదన వచ్చింది.

అందుల్ల అసలు ఏది నిజం ఏది అబద్ధం తెలుసుకోవడానికి వీలుగా ఫిన్లాండ్‌లోని హెల్సింకికి పరిసరాల్లో ఉన్న టపానిలా ప్రాథమిక పాఠశాలలో మొదటిసారిగా నకిలీ వార్తలను ఎలా గుర్తించాలో నేర్పించారు. దాంతో అబద్ధపు ప్రచారం, తప్పుడు వార్తలను గుర్తించేలా ఫిన్లాండ్ పాఠశాలల్లో కొత్త పద్ధతిని ప్రవేశపెట్టింది. ఉపాధ్యాయులు తమ పాఠ్యాంశాల్లో ఏఐ అక్షరాస్యతను జోడించారు. అక్కడున్న విద్యార్థులు ఆన్‌లైన్ వార్తల్లో ఏవి నిజం, ఏవి అబద్ధం అనే గుర్తించేలా శిక్షణ ఇస్తున్నారు. వారు ఏటా 'వార్తాపత్రికల వారం' నిర్వహిస్తారు. ఇందులో పత్రికలు, ఇతర వార్తలను యువత చదివేందుకు పంపిస్తారు.

ఒక వార్త నిజంగా జరిగిందా, లేక ఎవరైనా పుకారు సృష్టించారా అని తెలుసుకోవడంతో పాటు అక్కడ కనిపించే ఫొటోలు నిజమైనవా లేక ఏఐ సృష్టించినవా అనేది విద్యార్థులు గుర్తిస్తారు. తప్పుడు సమాచారం ద్వారా ప్రజాస్వామ్యానికి సవాళ్లు ఎదురవుతాయని, అందుకే తాము ఈ విధానం పట్ల ఆసక్తిగా ఉన్నామని విద్యార్థులు అంటున్నారు. ఈ విషయలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మరింత బాగా నేర్పించడానికి విద్యావేత్తలు, నిపుణులు మరిన్ని ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

● మీకు తెలుసా?

నురగ సబ్బు సంగతులు

స్నానం చేయాలన్నా, ముఖం కడుక్కోవాలన్నా సబ్బు వాడటం తప్పనిసరి. బట్టలుతకడానికి, గిన్నెల తోమడానికి కూడా సబ్బు వాడుతుంటారు. ఈ సబ్బు చరిత్రేమిటో మీకు తెలుసా?

కొన్ని కొవ్వులు, నూనెలను ఒక బేస్‌తో కలపడం ద్వారా సబ్బులు తయారవుతాయి. మనుషులు వేల సంవత్సరాలుగా సబ్బును ఉపయోగిస్తున్నారని చరిత్రకారులు అంటున్నారు. సబ్బుల గురించి సుమేరియన్, బాబిలోనియన్, ఈజిప్షియన్ గ్రంథాలలో మొదటిసారి ప్రస్తావించారు. ఇప్పుడు మనం చూసే సబ్బులకు గతంలోని సబ్బులకు చాలా తేడా ఉండేది. క్రీ.పూ 2800 ప్రాంతంలో పురాతన బాబిలోన్‌లో సబ్బు లాంటి పదార్థాల ఉత్పత్తికి ఆధారాలు ఉన్నాయి. ఆ రోజుల్లో నూనె, చెక్క బూడిద మిశ్రమాన్ని వేడి చేయడం ద్వారా సబ్బులు తయారు చేసేవారు. వీటిని ఉన్ని దుస్తులను ఉతకడానికి ఉపయోగించారు. పురాతన ఈజిప్షియన్లు సబ్బును ఔషధంగా కూడా ఉపయోగించారు. జంతువుల కొవ్వులు లేదా కూరగాయల నూనెలను ట్రోనా అనే సోడా యాష్ పదార్థంతో కలపడం ద్వారా వీటిని తయారు చేసేవారు. 17వ శతాబ్దం నుండి యూరప్‌లో జంతువుల కొవ్వులకు బదులుగా కూరగాయల నూనెలను వాడి సబ్బులు తయారు చేయడం ప్రారంభించారు. 1800 నుంచి సబ్బు ధనవంతులకు తప్పనిసరి వస్తువుగా మారింది. 1853లో సబ్బుల వ్యాపారం ఊపందుకుంది. ఆపై బార్ సబ్బులు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం రకరకాల ఆకృతుల్లో సబ్బులు మార్కెట్లోకి వస్తున్నాయి.



● మన పుస్తకాలు

మాయా అల్మారాలో ఏం జరిగింది?

బ్రిటిష్ రచయిత్రి లిన్ రీడ్ బ్యాంక్స్ రాసిన ఒక ఫాంటసీ పిల్లల నవల ఇది. తర్వాత ఇదే పేరుతో 1995లో ఒక పిల్లల సినిమా కూడా వచ్చింది. ఓమ్రీ అనే చిన్న పిల్లవాడి చుట్టూ తిరిగే కథ ఇది. అతనొక మాయా అల్మారా ద్వారా శక్తులను కనుగొంటాడు. ప్లాస్టిక్ బొమ్మలను ఆ అల్మారాలో ఉంచితే అవి నిజమైన జీవులుగా మారుతాయి. ఆ తర్వాత ఏం జరిగిందనేది మిగిలిన కథ.

నీతిని బోధించే కథలు



ఒకప్పుడు ఇళ్లల్లో అమ్మమ్మలు, నానమ్మలు పిల్లలకు కమ్మని కథలు చెప్పేవారు. తద్వారా నీతిని బోధించేవారు. ఇప్పుడు అమ్మమ్మలు, తాతయ్యలు ఉన్నా కథలు చెప్పే ఓపిక తగ్గిపోయింది. ఆ కొరత తీర్చాలన్న ప్రయత్నంతో తీసుకొచ్చిన పుస్తకం ఇది. 'పాలబుగ్గలు–పసిడిమొగ్గలు' సంపుటిలోని కథలన్నీ పిల్లలకు నీతిని బోధిస్తూ వారికి మంచి విషయాలు నేర్పుతాయి.

బిజినెస్ రీల్

జియో-బీపీ నుంచి యాక్టివ్ టెక్నాలజీ పెట్రోల్

ఏడాదికి 100 కి.మీ. అదనంగా మైలేజీ

గోవా: ఇంధన రిటైలింగ్, మొబిలిటీ సంస్థ జియో–బీపీ తాజాగా ఇండియా ఎనర్జీ వీక్ సందర్భంగా వినూత్నమైన 'యాక్టివ్' టెక్నాలజీ పెట్రోల్‌ని ఆవిష్కరించింది. కీలకమైన ఇంజిన్ విడిభాగాలను శుభ్రంగా ఉంచుతూ, పనితీరును మెరుగుపరుస్తూ, మెయింటెనెన్స్ వ్యయాలను తగ్గిస్తూ, అదనంగా ఖర్చులేమీ లేకుండా వాహనం ఏటా మరో 100 కి.మీ. ఎక్కువ దూరం ప్రయాణించేందుకు ఉపయోగపడేలా ఈ ఇంధనం ఉంటుందని సంస్థ తెలిపింది. మోటర్‌సైకిల్‌లో నింపి, కోయంబత్తూరులోని టెస్ట్ ట్రాక్‌లో 4,000కు పైగా కి.మీ. మేర దీని సామర్థ్యాలను ప్రయోగాత్మకంగా పరీక్షించినట్లు సంస్థ చైర్మన్ సార్థక్ బెహూరియా తెలిపారు. దేశీయంగా వాహనదారులు సాఫీగా నడిచే, విశ్వసనీయమైన, తక్కువ మెయింటెనెన్స్ ఉంటూ ఇంధనంపై అదనంగా వెచ్చించకుండా ఎక్కువ మైలేజీ ఉండాలని కోరుకుంటారని ఆయన పేర్కొన్నారు. దీనికి అనుగుణంగానే జియో–బీపీ యాక్టివ్ టెక్నాలజీ పెట్రోల్‌ని రూపొందించినట్లు వివరించారు. దేశీ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్రిటన్ దిగ్గజం బీపీ కలిసి జియో–బీపీని జాయింట్ వెంచరుగా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

భారత్‌లో యమహా కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణ

న్యూఢిల్లీ: జపాన్‌కి చెందిన ద్విచక్ర వాహనాల దిగ్గజం యమహా మోటర్స్ తమ భారత విభాగ కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు తెలిపింది. సేల్స్, మార్కెటింగ్, కార్పొరేట్, అడ్మినిస్ట్రేటివ్ వ్యవహారాలతో పాటు తయారీ కార్యకలాపాలను ఒకే గొడుగు కిందకి తెస్తున్నట్లు వివరించింది. కార్పొరేట్ స్వరూపాన్ని, గవర్నెన్స్‌ని పటిష్టం చేసుకునేందుకు, నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకునేందుకు ఇది ఉపయోగపడనుందని పే ర్కొంది. యమహా మోటర్స్ ప్రస్తుతం భారత్‌లో నాలుగు సంస్థలుగా కార్యకలాపాలు సాగిస్తోంది. ఇండియా యమహా మోటర్ (ఐవైఎం) , యమహా మోటర్ ఇండియా సేల్స్ (వైఎంఐఎస్), యమహా మోటర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా (వైఎంఆర్ఐ), యమహా మోటర్ ఇండియా వీటిలో ఉన్నా యి. పునర్వ్యవస్థీకరణలో భాగంగా వైఎంఐఎస్, వైఎంఐలను ఐవైఎంగా కన్సాలిడేట్ చేయనున్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

31-1-2026

విశాఖ	515-00
చిత్తూరు	575-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	75.00
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.75

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
NESTLEIND	1,332.50	3.46
TATACONSUM	1,132.00	2.24
APOLLOHOSP	6,950.00	2.19
M&M	3,444.30	1.77
ITC	322.3	1.16

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HINDALCO	962.8	-5.98
TATASTEEL	192.58	-4.81
COALINDIA	440	-3.46
ONGC	268.06	-2.66
ICICIBANK	1,357.00	-1.92

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,543
ఎన్ఎస్ఈ	1,72,680
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,08,062
ఎఫ్ఐఐ	+ 2,251
డీఐఐ	- 601

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	64.74 (రాత్రి 11.30కు)	$ 65.42 (క్రితం ముగింపు)
బ్రెంట్	68.96 (రాత్రి 11.30కు)	$ 69.59 (క్రితం ముగింపు)

ఎన్‌బీఎఫ్‌సీ బంగారం
రుణాలు రూ.4 లక్షల కోట్లు

- 2027 మార్చి నాటికి చేరుకుంటాయ్
- ఏడాది కాలంలో 40% పెరుగుతాయి
- క్రిసిల్ రేటింగ్స్ అంచనా

న్యూఢిల్లీ: బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల నిర్వహణలోని బంగారం రుణ ఆస్తులు (గోల్డ్ లోన్ ఏయూఎం) 207 మార్చి నాటికి రూ.4 లక్షల కోట్లకు చేరుకుంటాయని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరం మధ్య 40 శాతం వృద్ధి చెందనున్నట్టు పేర్కొంది. 2023 నుంచి 2025 మధ్య వార్షిక రుణ వృద్ధి 27 శాతం కంటే అధికమని తెలిపింది. బంగారం ధరలు గణనీయంగా పెరగడం వాటిపై రుణ వితరణను వృద్ధి చేయనున్నట్టు పేర్కొంది. ''ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో బంగారం ధరలు 68 శాతం పెరిగి ఆల్‌టైమ్ గరిష్టానికి చేరాయి. దీంతో బంగారం తనఖా విలువ పెరిగింది. రుణదాతలు మరింత మొత్తంలో రుణ పంపిణీకి అవకాశం ఏర్పడింది. అన్‌సెక్యూర్డ్ తదితర విభాగాల్లో రుణ లభ్యతకు పరిమిత అవకాశాల నేపథ్యంలో రుణ గ్రహీతలు.. ఇతర మార్గాల్లో రుణాలపై దృష్టి సారించారు. ఈ పరిస్థితుల్లో బంగారం రుణ సేవల్లోని ఎన్‌బీఎఫ్‌సీలు బ్యాంకుల నుంచి గట్టి పోటీ నెలకొన్నప్పటికీ తమ మార్కెట్ వాటాను విస్తరించుకుంటున్నాయి'' అని క్రిసిల్ రేటింగ్స్ తన నివేదికలో వివరించింది.

బడా ఎన్‌బీఎఫ్‌సీల విస్తరణ..

బంగారం రుణాల్లోని బడా ఎన్‌బీఎఫ్‌సీలకు బ్రాండ్ గుర్తింపు ఉందని.. ఇవి తమ శాఖల వారీ పోర్ట్‌ఫోలియోని పెంచుకుంటున్నట్టు క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ అపర్ణ కిరుబకరణ్ తెలిపారు. మధ్యస్థాయి ఎన్‌బీఎఫ్‌సీలు ఒకవైపు తమ శాఖలను విస్తరిస్తూనే.. మరోవైపు ఎన్‌బీఎఫ్‌సీలు, బ్యాంకుల తరఫున భాగస్వాములుగా వ్యవహరిస్తున్నట్టు చెప్పారు. తక్కువ స్థాయి బంగారం రుణాలకు అధిక రుణాన్నిచ్చే (ఎల్‌టీవీ) నిబంధనలు 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నందున.. రుణ వితరణకు ఎన్‌బీఎఫ్‌సీలకు మరింత వెసులుబాటు లభిస్తుందన్నారు. కాకపోతే ఎన్‌బీఎఫ్‌సీలు రిస్క్ మదింపు, నిర్వహణ ప్రక్రియలపై కఠిన నియంత్రణ కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా బంగారం స్వచ్ఛత, బరువు, కచ్చితమైన విలువ మదింపు అవసరమన్నారు. శాఖల స్థాయిలో నిర్ణీత కాలానికోసారి ఆడిట్ చేపట్టడమూ అవసరమని పేర్కొన్నారు.

జీఆర్‌టీ జ్యువెలర్స్ దాతృత్వం

ఆనందం ట్రస్ట్‌కు రూ.77.50 లక్షలు విరాళం

ముంబై: సామాజిక బాధ్యత నిర్వహణలో జీఆర్‌టీ జ్యువెలర్స్ మరో ముందడుగు వేసింది. చెన్నై అంబత్తూరులో పాలియేటివ్ కేర్ సెంటర్ నిర్మాణం కోసం ఆనందం ట్రస్ట్‌కు రూ.77.50 లక్షల ఆర్థిక సహాయం అందజేసింది. అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు సరైన వైద్య సంరక్షణ కల్పించాలనే లక్ష్యంతో ఈ విరాళం ఇచ్చినట్లు సంస్థ తెలిపింది. సానుభూతి, గౌరవం, మానవతా విలువలతో

కూడిన వైద్య సేవలు అందించే కేంద్రంగా 'పాలియేటివ్ కేర్ సెంటర్' అభివృద్ధి చేస్తామని పేర్కొంది. ఈ సందర్భంగా జీఆర్‌టీ జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ జి.ఆర్. ఆనంద్ అనంత పద్మనాభన్ మాట్లాడుతూ.., వ్యాపారం ద్వారా లాభాలతో పాటు సమాజానికి సేవ చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. కష్టకాలంలో ఉన్న ప్రజలకు అండగా నిలవడమే నిజమైన సేవ అని తెలిపారు.

గూగుల్ ఇండియా లాభం ఫ్లాట్

- 2024–25లో రూ. 1,437 కోట్లు

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం గూగుల్ ఇండియా గతేడాది(2024–25)లో రూ. 1,437 కోట్ల స్టాండెలోన్ నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది(2023–24)లో ప్రకటించిన రూ. 1,425 కోట్ల లాభంతో పోలిస్తే నామమాత్ర వృద్ధిని అందుకుంది. మార్కెట్ ఇంటెలిజెన్స్ సంస్థ టోఫ్లర్ వివరాల ప్రకారం ఉద్యోగ, పన్ను వ్యయాలు పెరగడం, ఆదాయం నీరసించడం ప్రభావం చూపింది. మొత్తం ఆదాయం మాత్రం 3 శాతం క్షీణించి రూ. 5,340 కోట్లకు పరిమితమైంది. 2024లో రూ. 5,518 కోట్ల టర్నోవర్ సాధించింది. కాగా.. ఇతర ఆదాయం రూ. 776 కోట్లతో కలిపి మొత్తం ఆదాయం 3 శాతం పుంజుకుని రూ. 6,116 కోట్లను తాకింది. నికర మార్జిన్లు 24.06 శాతం నుంచి 23.49 శాతానికి బలహీనపడగా.. మొత్తం వ్యయాలు రూ. 4,136 కోట్లకు చేరాయి. ఉద్యోగ లబ్ధి వ్యయాలు రూ. 1,989 కోట్ల నుంచి రూ. 2,146 కోట్లకు ఎగశాయి. ఇక పన్ను వ్యయాలు సైతం 23 శాతం పెరిగి రూ. 543 కోట్లను తాకాయి. 2024లో ఇవి రూ. 442 కోట్లుగా నమోదయ్యాయి.

బీమాతోనే డిజిటల్ రక్షణ

ఎస్‌బీఐ జనరల్ సైబర్ వోల్ట్‌ఎడ్జ్ పాలసీ

ముంబై: నేటి రోజువారీ జీవనంలో ఇంటర్నెట్ వినియోగం (ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు/డిజిటల్ సేవలు) గణనీయంగా పెరిగిపోయిన నేపథ్యంలో సమగ్రమైన సైబర్ బీమా ఎంతో అవసరమని ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ పేర్కొంది. డేటా గోప్యత దినోత్సవం సందర్భంగా.. వ్యక్తిగత డేటాకు భద్రత కల్పించుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది. సైబర్ దాడులు, దోపిడీల కారణంగా ఏర్పడిన ఆర్థిక నష్టాన్ని భర్తీ చేసుకోవడానికే పరిమితం కాకుండా, బాధిత కటుంబాలకు తగిన సహకారాన్ని 'ఎస్‌బీఐ సైబర్ వోల్ట్ ఎడ్జ్' సైబర్ ఇన్సూరెన్స్ అందిస్తుందని తెలిపింది. గుర్తింపు చోరీ, ఆర్థిక నష్టం, డేటా రికవరీ, ఐటీ నిపుణుల సాయం కోసం చేసే వ్యయాలను దీని కింద పొందొచ్చని వివరించింది. 2025

ఒక్క డిసెంబర్‌లోనే 27.97 లక్షల కోట్ల విలువ చేసే 2163 కోట్ల లావాదేవీలు జరిగాయని నేషనల్ పేమెంట్స్ కార్పొరేట్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) డేటా ఆధారంగా వెల్లడించింది. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ప్రకారం.. 2024లో సైబర్ మోసాల కారణంగా ఏర్పడిన నష్టం రూ.22,845 కోట్లుగా కాగా, 2023లో రూ.7,465 కోట్లకు పెరిగినట్టు పేర్కొంది.

ఫేస్‌బుక్ ఇండియా లాభం జూమ్

2024–25లో రూ. 647 కోట్లు

న్యూఢిల్లీ: సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ ఇండియా ఆన్‌లైన్ సర్వీసెస్ గత ఆర్థిక సంవత్సరం(2024–25) పటిష్ట ఫలితాలు సాధించింది. స్టాండెలోన్ నికర లాభం 28 శాతం జంప్‌చేసి రూ. 647 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2023–24) రూ. 505 కోట్లు మాత్రమే ఆర్జించింది. మార్కెట్ ఇంటెలిజెన్స్ సంస్థ టోఫ్లర్ వివరాల ప్రకారం మొత్తం ఆదాయం సైతం 25 శాతం ఎగసి రూ. 3,793 కోట్లకు చేరింది. 2023–24లో రూ. 3,035 కోట్ల టర్నోవర్ సాధించింది. అయితే మొత్తం వ్యయాలు 46 శాతం పెరిగి రూ. 2,881 కోట్లకు చేరాయి. ఉద్యోగ వ్యయాలు 36 శాతం అధికమై రూ. 649 కోట్లకు చేరగా.. పన్ను వ్యయాలు 46 శాతం ఎగసి రూ. 305 కోట్లను దాటాయి. నిర్వహణ మార్జిన్లు నామమాత్రంగా తగ్గినప్పటికీ నికర మార్జిన్లు స్వల్పంగా మెరుగుపడి 16.9 శాతానికి చేరాయి.

మెప్పించిన నెస్లే ఇండియా

క్యూ3లో లాభం రూ.998 కోట్లు
షేరుకు రూ.7 డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ నెస్లే ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో (రూ.3) పనితీరు పరంగా ఇన్వెస్టర్లను మెప్పించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే 45 శాతం జంప్ చేసి రూ.998 కోట్లకు చేరింది. 2024 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో లాభం రూ.688 కోట్లుగా ఉంది. అమ్మకాల ఆదాయం సైతం 18.5 శాతం దూసుకువెళ్లి రూ.5,643 కోట్లకు చేరింది. దేశీ విక్రయాలు 18 శాతం పెరిగి రూ.5,402 కోట్లుగా ఉన్నాయి. ఎగుమతుల ఆదాయం 23 శాతం జంప్ చేసి రూ.241 కోట్లుగా నమోదైంది. జీఎస్‌టీ రేట్ల క్రమబద్ధీకరణకుతోడు కంపెనీ తీసుకున్న వేగవంతమైన, చురుకైన నిర్ణయాలు బలమైన వృద్ధికి కారణమని సంస్థ పేర్కొంది.

చైనా, భారత్ నడిపిస్తాయ్

- ప్రపంచ సరఫరా చైన్‌లో కీలక పాత్ర
- కుమార మంగళం బిర్లా

న్యూఢిల్లీ: రానున్న దశాబ్ద కాలంలో ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్ కీలకంగా మారుతుందని ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా అభిప్రాయపడ్డారు. ఆర్థికంగా భారత్ స్థానం మరింత బలోపేతం కావడం అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ తీరుతెన్నులను మార్చివేయనుందని చెప్పారు. ఈ దశాబ్దం చివరికి అంతర్జాతీయ తయారీ అన్నది ఏ ఒక్క దేశం చుట్టూనే కేంద్రీకృతం కాదంటూ.. భారత్, చైనా కీలకంగా వ్యవహరిస్తాయన్నారు. ఐసీఏఐ వరల్డ్ ఫోరమ్ ఆఫ్ అకౌంటెంట్స్ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలు అస్థిరంగా ఉన్నాయంటూ.. టారిఫ్‌లు పెంచడం కారణంగా 400 బిలియన్ డాలర్ల వాణిజ్యంలో మార్పులు చోటుచేసుకున్నాయన్న ప్రపంచ ఆర్థిక వేదిక డేటాను ప్రస్తావించారు. తయారీపై పెట్టుబడులు అన్నవి ఇప్పుడు షాక్‌లను తట్టుకోగల, రిస్కులను సమర్థంగా నిర్వహించగల, విశ్వసనీయమైన ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థల్లోకే వెళుతున్నట్టు చెప్పారు. ఈ విషయంలో భారత్ సుముచిత స్థానంలో ఉన్నట్టు బిర్లా చెప్పారు. దేశీ మార్కెట్ విస్తరణకుతోడు పారిశ్రామిక బేస్, ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండడం దీర్ఘకాల పెట్టుబడులకు నమ్మకాన్ని కలిగిస్తున్నట్టు పేర్కొన్నారు. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా కార్మిక శక్తి తగ్గే సమయానికి.. అదనపు



శ్రామిక శక్తిలో భారత్ పావు వంతు వాటా కలిగి ఉంటుందన్నారు.

భారత్‌లో 3 టెలికం సంస్థలు ఉండాల్సిందే

సర్దుబాటు చేసిన స్థూల ఆదాయం (ఏజీఆర్)కు సంబంధించి ఇటీవల వెలువడిన పరిష్కారం వొడాఫోన్ ఐడియాకి నిర్ణయాత్మక మలుపు వంటిదని కుమారమంగళం బిర్లా అన్నారు. సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు, ప్రభుత్వ జోక్యంతో దీర్ఘకాలంపాటు నెలకొన్న అనిశ్చితి తొలగిపోయిందన్నారు. మనుగడ కోసం కాకుండా ఇకపై స్థిరమైన వృద్ధిపై దృష్టి పెట్టేందుకు అవకాశం కల్పించిందన్నారు. వొడాఫోన్ ఐడియాకు ఆదిత్య బిర్లా గ్రూప్ సైతం ఒక ప్రమోటర్ కావడం తెలిసిందే. భారత మార్కెట్‌కు మూడు టెలికం సంస్థలు ఉండడం సముచితమేనని కుమారమంగళం బిర్లా అన్నారు. అస్థిరమైన ప్రపంచంలో భారత వృద్ధి స్థిరమైన అంశంగా మారినట్టు చెప్పారు. భారత దేశ వృద్ధిలో తమ గ్రూప్ చురుకైన పాత్ర పోషిస్తున్నట్టు తెలిపారు. ''భారత్ వృద్ధితోపాటే ఆదిత్య బిర్లా గ్రూప్ కూడా ఎదుగుతుంది. ఎన్నో రంగాల్లో భౌతిక, డిజిటల్ సంస్థాగత సామర్థ్యాన్ని నిర్మిస్తున్నాం. తద్వారా దేశంతో పాటుగా ఎదుగుతాం. దేశ పురోగతి నుంచి ప్రయోజనం పొందుతూనే, సుస్థిరతకు కూడా తోడ్పడతాం'' అని కుమారమంగళం బిర్లా పేర్కొన్నారు. 'కష్టకాలాలు ఎప్పటికీ ఉండవు. కానీ, దృఢమైన కంపెనీలు శాశ్వతం' అన్న తన నమ్మకాన్ని వొడాఫోన్ ఐడియా అనుభవం గుర్తు చేస్తున్నట్టు చెప్పారు. తమ జాయింట్ వెంచర్ వొడాఫోన్ ఐడియా టెలికం రంగ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘ కాలం పాటు అనిశ్చితులు, సవాళ్లను ఎదుర్కొని నిలబడినట్టు పేర్కొన్నారు.

ఎన్నో అనుకూలతలు..

మూడు దశాబ్దాలుగా ప్రపంచ తయారీ కేవలం ఒక భౌగోళిక ప్రదేశం (చైనా)పైనే ఆధారపడి ఉండడాన్ని కుమార మంగళం బిర్లా ప్రస్తావించారు. ఆ నమూనా అసాధారణ ఫలితాలనిచ్చిందంటూ.. ఇకపై ఇదే విధానం కొనసాగబోదన్నారు. చైనా ప్లస్ వన్ నమూనా మరింత బలపడుతుందన్నారు. భారత్‌లో మౌలిక వసతుల అభివృద్ధితో లాజిస్టిక్స్ (రవాణా) వ్యయాలు తగ్గుతాయన్నారు. పట్టణాభివృద్ధితోపాటు తలసరి ఆదాయం 10,000 డాలర్లకు పెరగడం.. ప్రపంచ వాణిజ్యంలో భారత్‌ను బలమైన శక్తిగా ఇతర దేశాలు చూస్తాయన్నారు.

క్యూ3 ఫలితాలు

బీవోబీ లాభం ఓకే

రూ. 5,443 కోట్లు

ముంబై: ప్రభుత్వ రంగ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 4 శాతం వృద్ధితో రూ. 5,443 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. స్టాండెలోన్ నికర లాభం సైతం రూ. 4,837 కోట్ల నుంచి రూ. 5,055 కోట్లకు బలపడింది. నికర వడ్డీ ఆదాయం నామమాత్ర వృద్ధితో రూ. 11,800 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 2.79 శాతంగా నమోదయ్యాయి. వడ్డీయేతర ఆదాయం 6 శాతం ఎగసి రూ. 3,600 కోట్లను తాకింది. ప్రొవిజన్లు 26 శాతం తగ్గి రూ. 799 కోట్లకు పరిమితమయ్యాయి. తాజా స్లిప్పేజీలు రూ. 2,676 కోట్లకు చేరాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 15.29 శాతంగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో బీవోబీ షేరు బీఎస్ఈలో 1 శాతం నష్టంతో రూ. 299 వద్ద ముగిసింది.

ఎన్‌టీపీసీ లాభం ప్లస్

షేరుకి రూ. 2.75 డివిడెండ్

క్యూ3లో రూ. 5,597 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ విద్యుత్ దిగ్గజం ఎన్‌టీపీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 8 శాతం వృద్ధితో రూ. 5,597 కోట్లను అధిగమించింది. విద్యుదుత్పత్తి పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 5,170 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 45,698 కోట్ల నుంచి రూ. 46,305 కోట్లకు బలపడింది. ఆదాయంలో విద్యుదుత్పత్తి విభాగం వాటా రూ. 44,658 కోట్లకు చేరింది. కాగా.. వాటాదారులకు షేరుకి రూ. 2.75 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించేందుకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో ఎన్‌టీపీసీ షేరు బీఎస్ఈలో 0.6 శాతం నీరసించి రూ. 356 వద్ద ముగిసింది.

ఎక్సైడ్ ఇండస్ట్రీస్ లాభం జూమ్

రూ. 195 కోట్లు

న్యూఢిల్లీ: ఆటోమోటివ్ బ్యాటరీల దిగ్గజం ఎక్సైడ్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 23 శాతం ఎగసి రూ. 195 కోట్లను తాకింది. జీఎస్‌టీ రేట్ల కోత ఇందుకు దోహదపడింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 158 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 4,017 కోట్ల నుంచి రూ. 4,201 కోట్లకు స్వల్పంగా(4 శాతం) బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 3,791 కోట్ల నుంచి రూ. 3,923 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో ఎక్సైడ్ షేరు బీఎస్ఈలో 0.3 శాతం పుంజుకుని రూ. 322 వద్ద ముగిసింది.

బజాజ్ ఆటో లాభం అప్

రూ. 2,750 కోట్లు

న్యూఢిల్లీ: ద్విచక్ర, త్రిచక్ర వాహన రంగ దిగ్గజం బజాజ్ ఆటో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 10 శాతం ఎగసి రూ. 2,750 కోట్లను తాకింది. వివిధ మార్కెట్లలో అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 2,196 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 13,169 కోట్ల నుంచి రూ. 16,204 కోట్లకు జంప్‌చేసింది. ఈ కాలంలో వాహన అమ్మకాలు 10 శాతం బలపడి 13,41,252 యూనిట్లను తాకాయి. వీటిలో దేశీయంగా 3 శాతం వృద్ధితో 7,31,037 యూనిట్లు అమ్మగా.. ఎగుమతులు 18 శాతం ఎగసి 6,10,215 యూనిట్లను తాకాయి. గత క్యూ3లో మొత్తం 12,24,472 వాహనాలు విక్రయించింది. వీటిలో దేశీ విక్రయాలు 7,07,105 యూనిట్లుకాగా.. 5,17,367 వాహనాలు ఎగుమతి చేసింది.

ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఆటో షేరు బీఎస్ఈలో 1% బలపడి రూ. 9,593 వద్ద ముగిసింది.

కోరమాండల్ లాభం రూ. 488 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ రూ. 488 కోట్ల నికర లాభం ప్రకటించింది. క్రితం క్యూ3లో ఇది రూ. 508 కోట్లు. ఆదాయం రూ. 7,049 కోట్ల నుంచి రూ. 8,863 కోట్లకు చేరింది. రూ. 1 ముఖవిలువ ఉండే ఒక్కో షేరుపై కంపెనీ రూ. 9 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ముడి వస్తువుల రేట్లు పెరగడం, రూపాయి క్షీణించడంలాంటి అంశాలతో సవాళ్లు నెలకొన్నప్పటికీ మెరుగైన పనితీరు సాధించగలిగినట్లు కంపెనీ ఎండీ ఎస్. శంకరసుబ్రమణియన్ తెలిపారు.

సెయిల్ లాభం రెట్టింపు

రూ. 374 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ మెటల్ దిగ్గజం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(సెయిల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 374 కోట్లను అధిగమించింది. ఆదాయం బలపడటం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 142 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 11 శాతం వృద్ధితో రూ. 27,546 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో సెయిల్ షేరు బీఎస్ఈలో 4 శాతం నష్టంతో రూ. 151 వద్ద ముగిసింది.

ఎంటార్ ఆదాయం ఆదాయం 59 శాతం అప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎంటార్ టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ. 278 కోట్ల ఆదాయం ప్రకటించింది. క్రితం క్యూ3లో నమోదైన రూ. 174.5 కోట్లతో పోలిస్తే ఇది 59 శాతం అధికం. ఒక త్రైమాసికానికి సంబంధించి ఇది అత్యధిక ఆదాయం అని సంస్థ ఎండీ పర్వత్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కంపెనీ లాభం రూ. 16 కోట్ల నుంచి 117 శాతం పెరిగి సుమారు 35 కోట్లకు చేరింది. స్వచ్ఛ ఇంధనం, ఏరోస్పేస్ తదితర రంగాల వృద్ధి ఊతంతో ఆర్డర్ బుక్ పటిష్టంగా ఉందని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

ఎల్‌అండ్‌టీ లాభం డీలా

రూ. 3,215 కోట్లకు

న్యూఢిల్లీ: మౌలిక రంగ దిగ్గజం లార్సెన్ అండ్ టుబ్రో(ఎల్‌అండ్‌టీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం శాతం క్షీణించి రూ. 3,215 కోట్లకు పరిమితమైంది. కొత్త కార్మిక చట్టాల అమలుకు చేపట్టిన రూ. 1,191 కోట్ల వన్ టైమ్ కేటాయింపులు ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 3,359 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 10 శాతం ఎగసి రూ. 71,450 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 64,668 కోట్ల టర్నోవర్ సాధించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 60,303 కోట్ల నుంచి రూ. 65,730 కోట్లకు పెరిగాయి. 2025 డిసెంబర్31కల్లా కన్సాలిడేటెడ్ ఆర్డర్ బుక్ విలువ 30 శాతం జంప్‌చేసి రూ. 7,33,161 కోట్లను తాకింది. వీటిలో అంతర్జాతీయ కాంట్రాక్టులు 49 శాతం వాటాను ఆక్రమిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టులో పూర్తి వాటాను తెలంగాణ ప్రభుత్వానికి విక్రయించే అంశంపై చర్చలు కొనసాగుతున్నట్లు సీఎఫ్‌వో ఆర్.శంకర్ రామన్ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలోగా పూర్తయ్యే వీలున్నట్లు పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌అండ్‌టీ షేరు బీఎస్ఈలో నామమాత్ర లాభంతో రూ. 3,794 వద్ద ముగిసింది.

1989 తర్వాత...

ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ నిలబెట్టుకున్న డిఫెండింగ్ చాంపియన్ జోడీ
వరుసగా రెండో ఏడాది విజేతగా నిలిచిన ఒలివియా-జాన్ పీర్స్ ద్వయం

మెల్‌బోర్న్: టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో అద్భుతం చోటు చేసుకుంది. 37 ఏళ్ల తర్వాత మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ జోడీ టైటిల్‌ను నిలబెట్టుకుంది. గత ఏడాది విజేత ఒలివియా గడెస్కీ-జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా) జంట ఈ సంవత్సరం కూడా అదే ఫలితాన్ని పునరావృతం చేసింది. 93 నిమిషాలపాటు జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ తుది పోరులో ఒలివియా-జాన్ పీర్స్ ద్వయం 4-6, 6-3, 10-8తో 'సూపర్ టైబ్రేక్'లో క్రిస్టినా మ్లాడెనోవిచ్-మాన్యుయెల్ గినార్డ్ (ఫ్రాన్స్) జంటను ఓడించింది. 1988, 1989లో యానా నొవాత్నా (చెక్ రిపబ్లిక్)-జిమ్ పుగ్ (అమెరికా) జోడీ వరుసగా రెండేళ్లు మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ గెలిచింది. 37 ఏళ్ల తర్వాత మళ్లీ ఒలివియా-జాన్ పీర్స్ రూపంలో ఒకే జోడీ వరుసగా రెండేళ్లు మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను అందుకుంది. 1963, 1964లో మార్గరెట్ కోర్ట్-కెన్ ఫ్లెచర్ జోడీ తర్వాత వరుసగా రెండేళ్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ గెలిచిన ఆస్ట్రేలియా జంటగా కూడా ఒలివియా-జాన్ పీర్స్ గుర్తింపు పొందింది. 'వైల్డ్ కార్డు'తో బరిలోకి దిగిన ఒలివియా-జాన్ పీర్స్ జోడీ ఆరు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సర్వీస్‌లో 31 పాయింట్లకు 20... రెండో సర్వీస్‌లో 31 పాయింట్లకు 17 పాయింట్లు సంపాదించింది. 15 విన్నర్స్ కొట్టిన ఈ ఆసీస్ ద్వయం తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. విజేతగా నిలిచిన ఒలివియా-జాన్ పీర్స్‌లకు 1,75,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 1 కోటీ 12 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

తరుణ్ పరాజయం

బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లి పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 43వ ర్యాంకర్ తరుణ్ 11-21, 17-21తో ప్రపంచ 69వ ర్యాంకర్ జు జువాన్ చెన్ (చైనా) చేతిలో ఓడిపోయాడు. మహిళల సింగిల్స్‌లో భారత రైజింగ్ స్టార్ దేవిక సిహాగ్ సంచలనం సృష్టించింది. ప్రపంచ 16వ ర్యాంకర్, టాప్ సీడ్ సుపనిద కటెథోంగ్ (థాయ్‌లాండ్)ను బోల్తా కొట్టించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. 40 నిమిషాలపాటు జరిగిన క్వార్టర్ ఫైనల్లో దేవిక 21-19, 21-18తో సుపనిదపై గెలిచింది. మరో క్వార్టర్ ఫైనల్లో ఇషారాణి బారువా (భారత్) 21-18, 16-21, 13-21తో వోంగ్ లింగ్ చింగ్ (మలేసియా) చేతిలో పోరాడి ఓడిపోయింది.

క్రమశిక్షణ తప్పినందుకే...

మన్‌ప్రీత్‌సింగ్‌పై వేటు వేసిన హాకీ ఇండియా

న్యూఢిల్లీ: ప్రొ లీగ్ టోర్నీ కోసం గురువారం 33 మంది ప్రాబబుల్స్‌తో ప్రకటించిన భారత హాకీ జట్టులో స్టార్ ప్లేయర్ మన్‌ప్రీత్ సింగ్‌కు చోటు దక్కకపోవడం చర్చకు దారి తీసింది. మన్‌ప్రీత్‌తో పాటు మరో ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు దిల్‌ప్రీత్ సింగ్, కృషన్ బహదూర్ పాఠక్‌లను టీమ్ నుంచి తప్పించారు. అయితే వీరంతా తీవ్ర క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడినందుకు ఈ చర్య తీసుకున్నట్లు హాకీ ఇండియా (హెచ్‌ఐ) వర్గాలు వెల్లడించాయి. ఇటీవల డిసెంబరులో భారత జట్టు దక్షిణాఫ్రికాలో పర్యటించినప్పుడు వారు నిబంధనలు ఉల్లంఘించారని హెచ్‌ఐ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఈ టూర్‌లో 3 మ్యాచ్‌లు ఆడిన భారత్ 2 ఓడి, ఒక మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. 'జట్టు సమావేశానికి ఒక ఆటగాడు గైర్హాజరు కావడంతో వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించాం. అప్పుడు మరింత తీవ్రమైన అంశాలు బయటకు వచ్చాయి. మన్‌ప్రీత్, దిల్‌ప్రీత్, కృషన్ కలిసి ఆ ఆటగాడికి నిషేధిత ఉత్ప్రేరకం కలిపిన చూయింగ్ గమ్‌ను ఇచ్చారు. దానిని వాడిన అతను స్పృహ కోల్పోయి టీమ్ మీటింగ్‌కు దూరమయ్యాడు. దాని ప్రభావం రాత్రంతా ఉండటంతో పాటు తర్వాతి ఉదయం కూడా సాధారణ స్థితికి రాలేకపోయాడు. విచారణ చేస్తే ఆ ముగ్గురి పాత్ర ఉన్నట్లు తేలింది. వీరంతా ఆ తర్వాత క్షమాపణలు చెప్పినా... వచ్చే టోర్నీ కోసం జరిగే శిబిరానికి వీరిని ఎంపిక చేయరాదనే నిర్ణయం అప్పుడే జరిగిపోయింది' అని ఆయన వివరించారు. అయితే దీనిపై కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ హాకీ ఇండియాకు ఎలాంటి రాత పూర్వక ఫిర్యాదు మాత్రం చేయలేదు. పైగా మన్‌ప్రీత్‌కు మద్దతు పలుకుతూ జట్టు నుంచి తప్పించరాదని కూడా ఫుల్టన్ డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఎన్నో కీలక టోర్నీలు ఉన్న నేపథ్యంలో ఎంతో అనుభవం ఉన్న మన్‌ప్రీత్ అవసరం జట్టుకు ఉందని... అతడిని తొలగిస్తే తానూ రాజీనామా చేస్తానని కూడా కోచ్ హెచ్చరించినట్లు తెలిసింది. అయితే హాకీ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్ తిర్కీ, భోలానాథ్ సింగ్, చీఫ్ సెలక్టర్ ఆర్పీ సింగ్ చివరకు కోచ్‌ను ఒప్పించడంలో సఫలమయ్యారు.

పీటీ ఉష ఇంట్లో విషాదం

భర్త శ్రీనివాసన్ కన్నుమూత

కోజికోడ్: దిగ్గజ అథ్లెట్, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. ఆమె భర్త వి.శ్రీనివాసన్ శుక్రవారం ఉదయం కన్నుమూశారు. ఆయన వయసు 67 సంవత్సరాలు. తమ నివాసంలో అనూహ్యంగా కుప్పకూలిన శ్రీనివాసన్‌ను సన్నిహితులు ఆస్పత్రికి తీసుకెళ్లినా... అప్పటికే ఆయన మరణించారు. స్వతహాగా కబడ్డీ క్రీడాకారుడు అయిన శ్రీనివాసన్ సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్‌ఎఫ్)లో డిప్యూటీ ఎస్పీగా పని చేసి రిటైరయ్యారు. ఉష కెరీర్‌లో అన్ని విధాలా సహకారం అందిస్తూ ప్రోత్సహించడంతో పాటు ఆమె పురోగతిలో భర్త కీలక పాత్ర పోషించారు. 90వ దశకంలో ఉష రిటైర్మెంట్ ప్రకటించి ఆటకు దూరమైన తర్వాత మళ్లీ 1998 ఆసియా చాంపియన్‌షిప్ ద్వారా ఆమె ట్రాక్‌పైకి పునరాగమనం చేసేందుకు శ్రీనివాసన్ అండగా నిలిచారు. రిటైర్మెంట్ తర్వాత ఆయన ఉష స్కూల్ ఆఫ్ అథ్లెటిక్స్ నిర్వహణా వ్యవహారాలు చూస్తున్నారు. వీరిద్దరికి 'ఉజ్వల్' అనే ఒక కుమారుడు ఉన్నాడు. ఉషతో మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోదీ ఆమె భర్త మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.



అనాహత్ శుభారంభం

వాషింగ్టన్: ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్‌ఏ) టూర్‌లో భాగమైన 'ఫైర్ ఓపెన్' టోర్నమెంట్‌లో భారత రైజింగ్ స్టార్ అనాహత్ సింగ్ శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో అనాహత్ 11-5, 11-8, 12-14, 11-5తో హేలీ వార్డ్ (దక్షిణాఫ్రికా)పై గెలిచింది. పురుషుల సింగిల్స్ విభాగంలో వీర్ చోత్రాని (భారత్) క్వార్టర్ ఫైనల్ చేరగా... జాతీయ చాంపియన్ వెలవన్ సెంథిల్ కుమార్ పోరాటం ముగిసింది. రెండో రౌండ్‌లో వీర్ 11-6, 7-11, 8-11, 11-1, 1-9తో నాలుగో సీడ్ బాప్టిస్ట్ మసోట్టి (ఫ్రాన్స్)ను బోల్తా కొట్టించాడు. సెంథిల్ 11-4, 5-11, 9-11, 11-9, 8-11తో రెండో సీడ్ కార్డెనాస్ (మెక్సికో) చేతిలో ఓడిపోయాడు.

100వ ఇన్నింగ్స్‌లో 100

డికాక్ సూపర్ సెంచరీ • రెండో టి20లోనూ దక్షిణాఫ్రికా గెలుపు

సెంచూరియన్: వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో సొంతం చేసుకుంది. భారత కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి దాటాక ముగిసిన రెండో టి20లో దక్షిణాఫ్రికా 7 వికెట్ల తేడాతో గెలిచింది. 222 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా 17.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 225 పరుగులు చేసి గెలిచింది. కెరీర్‌లో 100వ అంతర్జాతీయ టి20 ఇన్నింగ్స్ ఆడిన ఓపెనర్ క్వింటన్ డికాక్ (49 బంతుల్లో 115; 6 ఫోర్లు, 10 సిక్స్‌లు) అద్భుత సెంచరీతో దక్షిణాఫ్రికా విజయంలో ముఖ్యపాత్ర పోషించాడు. టి20 కెరీర్‌లో 101వ మ్యాచ్ ఆడిన డికాక్ ఈ ఫార్మాట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేశాడు. అతను 43 బంతుల్లోనే సెంచరీని సాధించాడు. డికాక్, రికెల్టన్ (36 బంతుల్లో 77 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో రెండో వికెట్‌కు 11.5 ఓవర్లలో 162 పరుగులు జోడించడం విశేషం. ఇన్నింగ్స్ 15వ ఓవర్లో డికాక్ అవుటైనా... రికెల్టన్ మిగతా లాంఛనాన్ని పూర్తి చేశాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 221 పరుగులు సాధించింది. హెట్‌మైర్ (42 బంతుల్లో 75; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (24 బంతుల్లో 57 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో అర్ధ సెంచరీలు చేశారు. సిరీస్‌లోని చివరిదైన మూడో టి20 నేడు జొహన్నెస్‌బర్గ్‌లో జరుగుతుంది. రాత్రి గం. 9:30 నుంచి మొదలయ్యే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

ముగ్గురు భారత అంపైర్లకు చోటు

టి20 ప్రపంచ కప్ అంపైర్లు, రిఫరీల ప్రకటన

నితిన్ మేనన్

దుబాయ్: ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక వేదికలుగా జరిగే టి20 ప్రపంచ కప్‌లో పని చేయనున్న అంపైర్లు, రిఫరీలను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. 24 మంది అంపైర్లతో పాటు ఆరుగురు మ్యాచ్ రిఫరీలు ఈ జాబితాలో ఉన్నారు. భారత మాజీ పేసర్, సీనియర్లలో ఒకడైన జవగల్ శ్రీనాథ్ రిఫరీగా కొనసాగనుండగా... అతనితో పాటు డీన్ కోస్కర్, డేవిడ్ గిల్‌బర్ట్, రంజన్ మదుగలే, ఆండ్రూ పైక్రాఫ్ట్, రిచీ రిచర్డ్సన్ రిఫరీ బాధ్యతలు నిర్వర్తిస్తారు. అంపైర్లలో భారత్ నుంచి నితిన్ మేనన్, అనంత పద్మనాభన్, జె.మదన్ గోపాల్‌లకు అవకాశం దక్కింది. ఐసీసీ ఎలీట్ ప్యానెల్ అంపైర్ల జాబితాలో ఉన్న ఏకైక భారతీయుడైన నితిన్ మేనన్‌కు ఇది నాలుగో టి20 వరల్డ్ కప్ కానుంది. గతంలో అతను 2021, 2022, 2024లలో కూడా అంపైర్‌గా వ్యవహరించాడు. భారత్, న్యూజిలాండ్ సిరీస్‌లో భాగంగా నేడు జరిగే మ్యాచ్‌లో అంపైర్‌గా బాధ్యతలు నిర్వహించనున్న 42 ఏళ్ల మేనన్‌కు ఇది మూడు ఫార్మాట్‌లలో కలిపి 150 అంతర్జాతీయ (పురుషుల) మ్యాచ్ కానుంది. ఈ ఘనత సాధించిన తొలి భారత అంపైర్‌గా అతను నిలవనున్నాడు. మదన్‌గోపాల్‌కు ఇది రెండో టి20 వరల్డ్ కప్ కాగా, పద్మనాభన్‌కు తొలిసారి ప్రపంచ కప్ చాన్స్ లభించింది. రోలండ్ బ్లాక్, క్రిస్ బ్రౌన్, కుమార్ ధర్మసేన, క్రిసన్ గాఫ్నీ, ఆడ్రియన్ హోల్డ్‌స్టాక్, రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, రిచర్డ్ కెటిల్‌బరో, వేన్ నైట్స్, డొనొవాన్ కాచ్, స్యామన్ నొగాస్కీ, అల్లావుద్దీన్ పలేకర్, అహ్‌సాన్ రజా, లెస్లీ రీఫర్, పాల్ రీఫెల్, లాంగ్టన్ రూసెర్, షర్ఫుద్దౌలా షాహిద్, గాజీ సొహెల్, రాడ్నీ టకర్, అలెక్స్ వార్ఫ్, రవీంద్ర విమలసిరి, ఆసిఫ్ యాఖూబ్ కూడా అంపైర్లుగా టి20 వరల్డ్ కప్‌లో పని చేయనున్నారు.

సహజకు వైల్డ్‌కార్డు

ముంబై: వచ్చే నెలలో భారత్‌లో జరిగే ముంబై ఓపెన్ మహిళల డబ్ల్యూటీఏ-125 టెన్నిస్ టోర్నీ పాల్గొనేందుకు భారత నంబర్‌వన్, తెలంగాణ అమ్మాయి సహజ యామలపల్లికి 'వైల్డ్ కార్డు' కేటాయించారు. గత ఏడాది బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 టోర్నీలో, వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్ మ్యాచ్‌లో సహజ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో సహజ ప్రస్తుతం 370వ స్థానంలో ఉంది. 'ముంబై ఓపెన్ మెయిన్ డ్రాలో ఆడేందుకు మహారాష్ట్ర స్టేట్ లాన్‌టెన్నిస్ సంఘం వైల్డ్ కార్డు కేటాయించినందుకు చాలా ఆనందంగా ఉంది. సొంతగడ్డపై డబ్ల్యూటీఏ టోర్నీ ఆడటం ప్రత్యేకంగా అనిపిస్తుంది. ఈ టోర్నీలో నా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచేందుకు కృషి చేస్తా' అని గత ఏడాది ఇదే టోర్నీలో రెండో రౌండ్‌లో ఓడిపోయిన సహజ వ్యాఖ్యానించింది.

విజేత హరియాణా

సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్ మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో హరియాణా విజేతగా నిలిచింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో హరియాణా 39-37 పాయింట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ రైల్వేస్‌ను ఓడించింది. హరియాణా తరఫున నికిత 17 పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. రుచి 9 పాయింట్లతో అండగా నిలిచింది. రైల్వేస్ జట్టు ప్లేయర్లలో పూజ 11 పాయింట్లు స్కోర్ చేయగా, సొనాలి 6 పాయింట్లు సాధించింది. అంతకు ముందు హరియాణా క్వార్టర్ ఫైనల్లో మధ్యప్రదేశ్‌పై, సెమీఫైనల్లో హిమాచల్‌ప్రదేశ్‌పై గెలుపొందగా... రైల్వేస్ జట్టు క్వార్టర్స్‌లో మహారాష్ట్రను, సెమీస్‌లో తమిళనాడును ఓడించింది.

అలెన్ జూనియర్ 10కే రన్ జెర్సీని ఆవిష్కరించిన గోపీచంద్

సాక్షి, హైదరాబాద్: అలెన్ వరల్డ్ జూనియర్ 10 కిలోమీటర్ల రన్ జెర్సీను జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఆవిష్కరించారు. పిల్లలకు ఫిట్‌నెస్, క్రీడలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి రన్స్ దోహదం చేస్తాయని ఆయన అన్నారు. అండర్-3 నుంచి అండర్-18 వయో విభాగంలో నిర్వహిస్తున్న ఈ రన్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇస్తుండటంపై హర్షం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 1వ తేదీన జరిగే ఈ రన్ గచ్చిబౌలి స్టేడియంలో మొదలై ఐఎస్‌బీ జంక్షన్ మీదగా వెళ్లి, తిరిగి స్టేడియంలో ముగుస్తుందని రన్ నిర్వాహకులు, స్పాట్ ఆన్ స్పోర్ట్స్ సీఈఓ రోహిత్ మిశ్రా తెలిపారు. క్రీడల్లో అందరికి సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో హకీంపేటలోని ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్‌కు చెందిన 300 మంది విద్యార్థులకు ఈ రన్‌లో ఉచితంగా పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నామని రోహిత్ చెప్పారు. రన్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్, మెడల్, టీషర్ట్‌తో పాటు ప్రత్యేక కిట్‌ను, అల్పాహారం కూడా అందిస్తున్నామని తెలిపారు.

మోనాంక్ పటేల్ సారథ్యంలో...

టి20 ప్రపంచకప్ బరిలో అమెరికా జట్టు

దుబాయ్: వచ్చే నెలలో భారత్-శ్రీలంకలలో జరిగే పురుషుల టి20 ప్రపంచకప్‌లో పాల్గొనే అమెరికా జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన అమెరికా జట్టుకు భారత సంతతికి చెందిన మోనాంక్ పటేల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. తెలుగు సంతతి ప్లేయర్ సాయితేజ ముక్కామల కూడా ఈ జట్టులో చోటు సంపాదించాడు. రెండేళ్ల క్రితం జరిగిన టి20 ప్రపంచకప్‌లో పాల్గొన్న 10 మంది ప్లేయర్లు తమ స్థానాన్ని నిలబెట్టుకున్నారు. గ్రూప్ 'ఎ'లో ఉన్న అమెరికా ఫిబ్రవరి 7న ముంబైలో జరిగే తమ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టును 'ఢీ' కొంటుంది. గ్రూప్ 'ఎ'లోనే పాకిస్తాన్, నమీబియా, నెదర్లాండ్స్ జట్లు కూడా ఉన్నాయి. 2024 టి20 ప్రపంచకప్ లీగ్ దశలో పాకిస్తాన్‌ను ఓడించిన అమెరికా 'సూపర్-8' దశకు అర్హత సాధించింది.

అమెరికా టి20 జట్టు: మోనాంక్ పటేల్ (కెప్టెన్), జెస్సీ సింగ్ (వైస్ కెప్టెన్), ఆండ్రీస్ గౌస్, షెహన్ జయసూర్య, మిలింద్, షయాన్ జహంగీర్, సాయితేజ ముక్కామల, సంజయ్ కృష్ణమూర్తి, హర్మీత్ సింగ్, నోస్తుష్ కెంజిగె, షాడ్లీ వాన్ షాల్విక్, సౌరభ్ నేత్రావల్కర్, అలీఖాన్, మోసిన్, శుభం రంజనే.

సాక్షి ప్లస్
శనివారం । 31-1-2026



శుక్రవారం రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, గాంధీస్మృతి భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

మహాత్మునికి రాష్ట్రపతి, ప్రధాని నివాళులు

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహాత్మాగాంధీ 78వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సహా పలువురు కేంద్ర మంత్రులు కూడా గాంధీజీకి నివాళులర్పించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా రాజ్‌ఘాట్‌లో రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. సర్వమత ప్రార్థనలు జరిగాయి. గాంధీజీ ఎంతో ఇష్టమైన 'రఘుపతి రాఘవ రాజారాం' వంటి గీతాలను ఆలపించారు. అనంతరం ప్రధాని మోదీ ఎక్స్‌లో..అభివృద్ధి చెందిన, స్వయం సమృద్ధమైన దేశంగా భారత్ ఎదగాలనే లక్ష్యంతోనే గాంధీజీ 'స్వదేశీ'కి ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారని తెలిపారు. ఆయన వ్యక్తిత్వం, ఆశయాలు రాబోయే తరాల వారికి కూడా ప్రేరణ కలిగిస్తూనే ఉంటాయన్నారు. మహాత్మాగాంధీని 1948 జనవరి 30న నాథూరాం గాడ్సే అనే వ్యక్తి జరిపిన కాల్పులు ప్రాణాలు కోల్పోవడం తెల్సిందే. ఈ నేపథ్యంలోనే గాంధీజీ వర్ధంతి రోజును అమర వీరుల దినోత్సవంగా పాటిస్తున్నారు.

స్థానికులకు మేలు చేసేలా ఉండాలి!

- వారిని బలిచేసి, ఇతరులకు లబ్ధి చేకూరుస్తామంటే ఒప్పుకోం
- శాంతి మండలిలో భారత్ కూడా సభ్యదేశంగా చేరాలి
- గాజా పునర్నిర్మాణంపై పాలస్తీనా మంత్రి వెర్సెన్ షహీన్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసమైన కల్లోలిత గాజాను అందమైన పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలన్న అమెరికా డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదనను తాము స్వాగతిస్తున్నామని పాలస్తీనా విదేశాంగ శాఖ సహాయ మంత్రి వెర్సెన్ అఘాబెకియన్ షహీన్ చెప్పారు. అయితే, అది కేవలం గాజా ప్రజలకు పూర్తిగా లబ్ధి చేకూర్చేలా, వారి జీవితాల్లో మార్పు తెచ్చేలా ఉండాలని స్పష్టంచేశారు. అలాకాకుండా గాజా ప్రజలను బలి చేసి, ఇతరులకు మేలు చేస్తామంటే అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. మంత్రి షహీన్ తాజాగా ఓ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. గాజా శాంతి కోసం జరిగే అన్ని రకాల ప్రయత్నాలను స్వాగతిస్తామని పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటించిన శాంతి మండలి(బోర్డ్ ఆఫ్ పీస్)లో భారతదేశ భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నామని వెల్లడించారు. ట్రంప్ నిర్మించాలంటున్న సుందర నగరంతో గాజా పౌరులు, పాలస్తీనియన్లకు లాభం కలిగితే అంతకంటే కావాల్సింది ఇంకేమీ ఉండదన్నారు. గాజా పునర్నిర్మాణాన్ని పాలస్తీనా రాజకీయ హక్కుల నుంచి ఎట్టిపరిస్థితుల్లోనూ వేరుచేయొద్దని కోరారు. మంత్రి షహీన్ భారత్‌లో పర్యటిస్తున్నారు. ఇండియా–అరబ్ విదేశాంగ మంత్రుల సమావేశం కోసం ఆమె ఇక్కడికి వచ్చారు. ఇండియాలో తాను జరిపే చర్చల్లో పాలస్తీనా అంశమే ప్రథమ స్థానంలో ఉంటుందని వివరించారు.

పాలస్తీనా సంపూర్ణ స్వాతంత్య్రం దిశగా..

గాజా కోసం ట్రంప్ శాంతి మండలిని ప్రకటించిన సంగతి తెలిసిందే. వివిధ దేశాలకు ఇందులో భాగస్వామ్యం కల్పించారు. గాజా పునర్నిర్మాణమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కానీ, ఇంతకంటే పెద్ద కార్యాచరణ, ఆశయాన్ని తాము కోరుకుంటున్నామని మంత్రి షహీన్ ఉద్ఘాటించారు. దశాబ్దాల హింసకు తెరపడాలని, ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవాలని అన్నారు. పాలస్తీనా సంపూర్ణ స్వాతంత్య్రం దిశగా అడుగులు పడాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. ప్రతిపాదిత శాంతి మండలిలో భారత్ కూడా చేరాలని విజ్ఞప్తిచేశారు. ఎందుకంటే భారత భాగస్వామ్యంతో గాజాకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. శాంతి ప్రక్రియతో అంతిమంగా ఎలాంటి ఫలితం వస్తుందన్నది ముందే స్పష్టంగా చెబితే బాగుంటుందని ప్రపంచ దేశాలను కోరారు. పాలస్తీనా, ఇజ్రాయెల్ అనే రెండు స్వతంత్ర దేశాల విధానానికి భారత్ ఎప్పటి నుంచో స్థిరంగా మద్దతు పలుకుతోందని షహీన్ గుర్తుచేశారు. అందుకే శాంతి మండలిలో భారతదేశ భాగస్వామ్యం అవసరమని ఉద్ఘాటించారు.

భారత్ నిర్మాణాత్మక పాత్ర పోషించాలి

శాంతి మండలిలో పాకిస్తాన్‌కు స్థానం కల్పించడాన్ని ఇజ్రాయెల్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దీనిపై షహీన్ స్పందించారు. శాంతి ప్రక్రియ ఎలా ఉండాలన్నది ఏ ఒక్క దేశమూ నిర్దేశించలేరని వ్యాఖ్యానించారు. ఇందులో ఇజ్రాయెల్ పెత్తనం చెల్లదని పరోక్షంగా తేల్చిచెప్పారు. ఏదైనా సరే అంతర్జాతీయ న్యాయ సూత్రాల ప్రకారమే జరగాలన్నారు. గాజాలో క్షేత్రస్థాయి పరిస్థితులు ఇప్పటికీ అల్లకల్లోలంగానే ఉన్నాయని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు. పాక్షికంగా కాల్పుల విరమణ పాటిస్తున్నప్పటికీ పరిస్థితి మాత్రం అంతగా మారలేదన్నారు. గాజా ప్రజలు హాయిగా ఊపిరి పీల్చుకోవాలంటే, పునర్నిర్మాణం ప్రారంభం కావాలంటే శాశ్వత, సుస్థిరమైన కాల్పులు విరమణ అవసరమని పేర్కొన్నారు. ప్రపంచ దేశాల స్థిరమైన మద్దతు ఉంటేనే పునర్నిర్మాణం సజావుగా ముందుకు సాగుతుందన్నారు. శాంతి ప్రణాళికలో భాగంగా ఆయుధాలు వదిలేయడానికి హమాస్ గ్రూప్ ఇప్పటికే అంగీకరించిందని తెలిపారు. శాంతి సాధన విషయంలో నిర్మాణాత్మక పాత్ర పోషించాలని భారత్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే పాలస్తీనా పౌరుల హక్కులను గౌరవించాలని డొనాల్డ్ ట్రంప్‌ను కోరారు. సొంత దేశాన్ని కలిగి ఉంటే హక్కు పాలస్తీనియన్లకు ఉందన్నారు. ఆ హక్కు కార్యరూపం దాల్చే సమయం ఇదేనని వ్యాఖ్యానించారు. మరోవైపు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, అమెరికా–ఇరాన్ మధ్య ఘర్షణపై మంత్రి షహీన్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ప్రాంతంలో అస్థిర పరిస్థితులు అందరినీ ప్రభావితం చేస్తాయని చెప్పారు. వివాదాలు ఏవైనా ఉంటే ఆయుధ బలంతో కాకుండా చర్చలు, దౌత్య మార్గాల్లో పరిష్కరించుకోవాలని సూచించారు.

రాహుల్ నిజాయతీ గల వ్యక్తి

- మతతత్వంపై గట్టిగా గళం వినిపిస్తున్నారు
- కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ప్రశంసలు

తిరువనంతపురం: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఆ పార్టీ సీనియర్ నాయకుడు, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ ప్రశంసల వర్షం కురిపించారు. రాహుల్ చాలా నిజాయతీ కలిగిన వ్యక్తి అని చెప్పారు. దేశంలో మతతత్వానికి వ్యతిరేకంగా గట్టిగా గళం వినిపిస్తున్నారని తెలిపారు. తాను కాంగ్రెస్‌లోనే ఉంటానని, బయటకు వెళ్లాలన్న ఆలోచన లేదని స్పష్టంచేశారు. కేరళలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటానని, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయం కృషి చేస్తానని పేర్కొన్నారు. శశి థరూర్ శుక్రవారం తిరువనంతపురంలో మీడియాతో మాట్లాడారు. తాను మాట్లాడిన మాటలకు పెడర్థాలు తీయొద్దని విలేకరులను కోరారు. కొన్ని కీలక అంశాలపై తాను ఇచ్చిన స్టేట్‌మెంట్లు బీజేపీకి అనుకూలంగా అన్నట్లుగా మీడియా చిత్రీకరించిందని ఆక్షేపించారు. కానీ, ప్రభుత్వానికి, దేశానికి అనుకూలంగా మాట్లాడినట్లు గుర్తించాలని సూచించారు. దేశంలో మతతత్వం, విద్వేషం, విభజనవాద రాజకీయాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న రాహుల్ గాంధీని ప్రజలంతా అభిమానిస్తున్నారని శశి థరూర్ స్పష్టంచేశారు. దానిపై తనకు భిన్నాభిప్రాయాలు లేవన్నారు. రాహుల్ గాంధీపై అనుచితంగా విమర్శలు చేస్తే అంగీకరించబోనని తేల్చిచెప్పారు. ఇదిలా ఉండగా, రాహుల్ గాంధీని శశి థరూర్ ప్రశంసించడం చర్చనీయాంశంగా మారింది. ఇరువురు నేతలు మధ్య విభేదాలు ఉన్నట్లు ఇన్నాళ్లూ ప్రచారం సాగిన సంగతి తెలిసిందే. శశి థరూర్‌ను రాహుల్ పక్కనపెట్టినట్లు వార్తలొచ్చాయి. అలాగే కొన్ని కీలకమైన సమావేశాలకు థరూర్ గైర్హాజరయ్యారు. పార్టీ నాయకత్వంతో అభిప్రాయాలు భేదాలు ఉన్నమాట నిజమేనని ఆయన అంగీకరించారు. పార్టీలో అంతర్గతంగా చర్చించుకొని పరిష్కరించుకుంటామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో శశి థరూర్ ఇటీవల ఢిల్లీలో రాహుల్ గాంధీతోపాటు పార్టీ అధినేత మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాహుల్, థరూర్ మధ్య విభేదాలు సమసిపోయినట్లు తెలుస్తోంది. త్వరలో కేరళ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. థరూర్ సేవలు ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం.

కువైట్–ఢిల్లీ విమానానికి బాంబు బెదిరింపు..

అహ్మదాబాద్‌కు దారి మళ్లింపు

అహ్మదాబాద్: కువైట్– ఢిల్లీ ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో అధికారులు అహ్మదాబాద్‌కు మళ్లించారు. ఆ విమానంలో 180 మంది ప్రయాణికులున్నారు. శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. విమానంలో బాంబు పెట్టామంటూ రాసిన కాగితం ఓ ప్రయాణికుడికి లభ్యమవడంతో దానిని ఆయన పైలట్ దృష్టికి తీసుకెళ్లారు. అప్రమత్తమైన పైలట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు సమాచారమిచ్చారు. ప్రొటోకాల్స్ ప్రకారం విమానాన్ని అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానానికి మళ్లించారు.తుదయం 6.40 గంటల సమయంలో సురక్షితంగా ల్యాండయ్యాక ప్రయాణికులందరినీ కిందికి దించివేసి, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో అణువణువూ శోధించారు. ఎక్కడా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేవని అధికారులు ప్రకటించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

తర్వాతి వంతు సహ చట్టానిదేనా?

కేంద్రం తీరుపై ఖర్గే అనుమానం

న్యూఢిల్లీ: సహచట్టాన్ని మళ్లీ సమీక్షించాలంటూ ఆర్థిక సర్వే పేర్కొనడంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అనుమానం వ్యక్తం చేశారు. ఉపాధి ఉపాధి చట్టాన్ని చంపేశారు కదా, తర్వాతి వంతు సహచట్టానిదేనా అంటూ ఆయన ప్రభుత్వాన్ని శుక్రవారం ఎక్స్‌లో ప్రశ్నించారు. ఒక వైపు సహ చట్టాన్ని క్రమంగా బలహీన పర్చుతున్న కేంద్రం మరోవైపు, నిజాలు వెలికితీసేందుకు యత్నించే వారిని భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. 2014 తర్వాత దేశంలో 100 మందికి పైగా సహ చట్టం ఉద్యమకారులు హత్యకు గురయ్యారని, మరో 26 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని ఖర్గే పేర్కొన్నారు. గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో.. సహచట్టంపై పునఃసమీక్ష చేపట్టాలని, ముఖ్యమైన ప్రభుత్వ రికార్డులను వెల్లడిచేయడంలో మంత్రులకు వీటో అధికారం కల్పించాలని అందులో పేర్కొనడంపై ఖర్గే ఈ మేరకు పలు వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం –2023తో సహచట్టంలోని ప్రజాప్రయోజనమనే నిబంధనకు తూట్లు పొడిచిందని విమర్శించారు. కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన విజిల్ బ్లోయర్స్ ప్రొటెక్షన్ యాక్ట్–2014ను మోదీ ప్రభుత్వం ఇప్పటికీ అమల్లోకి తీసుకురాలేదని ఖర్గే గుర్తుచేశారు. ఇవన్నీ చూస్తే, ఉపాధి హామీ చట్టం తర్వాత ఖూనీ అయ్యేది సహచట్టమేనా అనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

సొంత ఏఎస్సైపైనే సీబీఐ కేసు

న్యూఢిల్లీ: మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్‌కు చెందిన డిస్పాచ్ అధికారి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు తేలడంతో సొంత అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఏఎస్సై)పైనే సీబీఐ కేసు నమోదు చేసింది. మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్‌కు చెందిన ఒడిశాలోని గర్జన్‌భల్ గనుల్లో ఎస్‌పీ సేథి అనే ఆయన డిస్పాచ్ అధికారిగా పనిచేస్తున్నారు. రవాణా సంస్థల నుంచి భారీగా లంచాలు తీసుకుంటూ వాహనాల్లో ఎక్కువ బొగ్గును తరలించేందుకు, ఎక్కువ గ్రేడ్ బొగ్గును తక్కువ గ్రేడ్ కింద చూపిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. సీబీఐ కన్ను తనపై పడకుంటే చూసేందుకు సేథీ ఏడాది కాలంలో ఏఎస్సై ప్రశాంత కుమార్‌కు వివిధ దఫాలుగా లక్షల్లో ముట్టజెప్పారు. ఈ మేరకు సీబీఐ కేసు నమోదు చేసింది.

పాక్‌లో 52 మంది ఉగ్రవాదులు హతం

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లోని మూడు ప్రావిన్స్‌ల పరిధిలో చేపట్టిన మిలటరీ ఆపరేషన్లలో 24 గంటల వ్యవధిలో 52 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. నిఘా వర్గాలు అందించిన సమాచారం మేరకు పంజాబ్ ప్రావిన్స్‌లో శుక్రవారం ఉదయం చేపట్టిన ఆపరేషన్‌లో ఆరుగురు ఉగ్రవాదులు చనిపోయారు. బలూచిస్తాన్‌లో గురువారం చేపట్టిన వేర్వేరు గాలింపు చర్యల్లో మరో 41 మంది హతమయ్యారని అధికారులు తెలిపారు. ఖైబర్ ప్రావిన్స్‌లో తెహ్రీక్–ఇ–తాలిబన్(టీటీపీ)కమాండర్ సహా ఐదుగురు చనిపోయారన్నారు. ఈ సందర్భంగా ముగ్గురు పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. పెద్దమొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రితోపాటు పంజ్‌గురులోని ఓ బ్యాంకులో గతేడాది డిసెంబర్‌లో వారు దోచుకున్న సొత్తును కూడా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

అమెరికాతో చర్చల ఆలోచనేదీ లేదు: ఇరాన్

ఇస్తాంబుల్: శాంతియుత ఆందోళనలను తీవ్రంగా అణచివేయడంతోపాటు మూకుమ్మడి మరణశిక్షలను అమలు చేస్తున్న ఇరాన్‌పై మిలటరీ దాడులు తప్పవంటూ అమెరికా చేస్తున్న హెచ్చరికలను ఆ దేశం బేఖాతరు చేస్తోంది. ఉద్రిక్తతలను సడలించేందుకు అమెరికాతో చర్చలకు సిద్ధంగా ఉన్నామంటున్న ఇరాన్ ప్రభుత్వం..ప్రస్తుతానికి అందుకు సంబంధించిన ప్రణాళికేదీ లేదని మరో వైపు చెబుతోంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి శుక్రవారం తుర్కియే విదేశాంగ మంత్రి హకన్ ఫిదాన్‌తో కలిసి ఇస్తాంబుల్‌లో మీడియాతో మాట్లాడారు. అమెరికాతో నిష్పక్షపాత, సమానత్వంతో కూడిన చర్చలకు సిద్ధమన్నారు. అయితే, ముందుగా ఏ అంశంపై చర్చ జరగాలి, ఎక్కడ కలుసుకోవాలి అనే వాటిపై నిర్ణయం జరగాలని స్పష్టం చేశారు. చర్చలకు, అవసరమైతే యుద్ధానికి కూడా తాము సిద్ధమేనంటూ అరాగ్చి వ్యాఖ్యానించారు.

బుర్కినాఫాసోలో రాజకీయ పార్టీలపై నిషేధం

ఔగాడౌగౌ: ఆఫ్రికా దేశమైన బుర్కినాఫాసోలో మిలటరీ పాలకులు రాజకీయ పార్టీలపై నిషేధం విధించారు. అవసరానికి మించి ఉన్న రాజకీయ పార్టీలు ప్రజల మధ్య విభేదాలను పెంచుతూ సామాజిక నిర్మాణాన్ని బలహీనపరుస్తున్నాయని సైనిక ప్రభుత్వం ఆరోపించింది. నిబంధనలను రాజకీయపార్టీలు అతిక్రమిస్తున్నాయని తప్పుబట్టింది. రాజకీయ పార్టీల ఆస్తులను ప్రభుత్వ పరం చేస్తామంటూ ఈ మేరకు జారీ చేసిన డిక్రీలో పేర్కొంది. కొత్తగా ఏర్పాటయ్యే రాజకీయ పార్టీలు అనుసరించాల్సిన విధివిధానాలను త్వరలోనే జారీ చేస్తామని తెలిపింది. 2022లో తిరుగుబాటు ద్వారా అధికారాన్ని చేబట్టిన సైనిక జుంటా ఎన్నికల కమిషన్‌ను రద్దు చేసింది. రాజకీయ పార్టీలు, వివిధ గ్రూపులపై ఇప్పటికే ఆంక్షలు అమలవుతున్నాయి.

రఫా క్రాసింగ్‌ను ఆదివారం తెరుస్తాం: ఇజ్రాయెల్

జెరూసలేం: గాజా, ఈజిప్టుల మధ్య ఉన్న రఫా క్రాసింగ్‌ను ఆదివారం తిరిగి తెరుస్తామని ఇజ్రాయెల్ ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. రెండు వైపుల నుంచి ప్రజలు రాకపోకలు సాగించేందుకు అనుమతిస్తామంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదిత గాజా కాల్పుల విరమణ ఒప్పందంలో రఫా బోర్డర్ పాయింట్‌ను తిరిగి తెరవడం కూడా ఉంది. దీంతో, ఇజ్రాయెల్ ప్రకటనతో ఈ ఒప్పందం అమలులో మరో అడుగు ముందుకు పడినట్లయింది. ప్రజల రాకపోకలకు మాత్రమే అవకాశం కల్పిస్తామని గాజాలో మానవతా సహాయ కార్యక్రమాలను సమన్వయం చేసే ఇజ్రాయెల్ సైనిక విభాగం కోగట్ స్పష్టతనిచ్చింది. పౌరుల రాకపోకలను ఈయూ సరిహద్దు గస్తీ సిబ్బంది పర్యవేక్షిస్తారని పేర్కొంది. హమాస్ శ్రేణులు ఆయుధాలను దొంగచాటుగా గాజాలోకి తీసుకురాకుండా చేపట్టిన చర్యల్లో భాగంగా ఇజ్రాయెల్ ఆర్మీ 2024 మే నెల నుంచి రఫా క్రాసింగ్‌ను మూసివేసి ఉంచింది. గాజాలో బందీగా ఉన్న చిట్టచివరి వ్యక్తి మృతదేహం ఇటీవల దొరకడంతో రఫా పాయింట్‌ను తిరిగి తెరిచేందుకు ఇజ్రాయెల్ అంగీకరించింది.

భారత సంతతి డ్రగ్ డీలర్‌కు 20 ఏళ్ల జైలు

లండన్: ఆయుధాలు, డ్రగ్స్ అక్రమరవాణాకు పాల్పడిన ఆరోపణలు రుజువు కావడంతో భారత సంతతికి చెందిన డ్రగ్ డీలర్‌కు ఇంగ్లండ్‌లోని కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. నాగిందర్ గిల్(47) అనే వ్యక్తి ఎన్‌క్రోచాట్‌లో 'ఇండియన్ ఓషన్'పేరుతో ఓ గ్రూప్ ఏర్పాటు చేసి దందా నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇతడికి కార్ల్ ఇయాన్ జోన్స్, హార్లీ వైజ్ అనే వారు సహకరిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు నేరారోపణలు రుజువు కావడంతో బోల్టన్ క్రౌన్ కోర్టు గురువారం జోన్స్‌కు 30 ఏళ్లు, వైజ్‌కు 25 ఏళ్ల జైలు శిక్షలు విధిస్తూ తీర్పు వెలువరించింది. 'ఏఆర్ 15 అస్సాల్ట్ రైఫిల్, ఏకే47, ఉజి సబ్‌మెషీన్ గన్ వంటి అత్యాధునిక ఆయుధాలను సేకరించడంపై వీరు తమ ఇండియన్‌ఓషన్ గ్రూప్‌లో చర్చించుకున్నారు. డ్రగ్స్ సరఫరా, లావాదేవీలు, కిడ్నాల గురించి కూడా వీరు సంప్రదింపులు జరిపారు. ప్రమాదకరమైన నేరస్తులు. వీరు జైల్లో ఉండటమే మేలు'అని కోర్టు వ్యాఖ్యానించింది. వీరిలో జోన్స్ గ్రేటర్ మాంఛెస్టర్‌కు, గిల్ వెస్ట్ మిడ్ల్యాండ్స్‌కు, వైజ్ లండన్‌కు చెందిన వారు.

అమెరికాలో భారతీయుడి అరెస్ట్

న్యూయార్క్: కెనడా ఉత్తర సరిహద్దుల నుంచి అమెరికాలోకి పలువురు భారతీయులను దొంగచాటుగా తరలించిన ఆరోపణలపై శివం అనే భారతీయుడిని అధికారులు పట్టుకున్నారు. న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టులో బుధవారం ఈ మేరకు శివంపై అభియోగాలు మోపారు. ఎలాంటి పత్రాలు లేని వ్యక్తులను ఇతడు అక్రమంగా దేశంలోకి తీసుకువచ్చేందుకు కుట్ర పన్నినట్లు ఆరోపిస్తున్నారు. 2025 జనవరి–జూన్ నెలల మధ్య కాలంలో ఇతడు పలువురు వ్యక్తులను న్యూయార్క్‌లోని క్లింటన్ కౌంటీ ప్రాంతంలోకి చట్టవిరుద్ధంగా తీసుకువచ్చాడని తెలిపారు. 2025 జనవరిలో రెండు వాహనాల్లో కెనడా భూభాగం నుంచి అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన 12 మందిని బోర్డర్ పెట్రోల్ ఏజెంట్లు పట్టుకున్నారని వెల్లడించారు. ఈ వ్యవహారం వెనుక శివం హస్తమున్నట్లు ఆధారాలు దొరికాయన్నారు. ఇలా తరలించిన వారికి ఇతడు న్యూయార్క్‌లోని పలు ప్రాంతాల్లో ఆశ్రయం కల్పించాడని ఆరోపించారు. ఇవి రుజువైన పక్షంలో శివంకు పదిహేనేళ్ల జైలు శిక్ష పడే అవకాశముంది.

ఉక్రెయిన్‌పై దాడులకు విరామం!

పుతిన్‌తో మాట్లాడి ఒప్పించా: ట్రంప్

కీవ్: ఉక్రెయిన్‌లో తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆ దేశంపై దాడులకు రష్యా విరామం ఇచ్చినట్టు కనిపిస్తోంది. శుక్రవారం దేశంలో పరిస్థితులు ప్రశాంతంగా కన్పించాయి. కొన్నేళ్లలో కనీవినీ ఎరగనంతటి అతి శీతల పరిస్థితులతో ఉక్రెయిన్ అతలాకుతలం అవుతోంది. దేశంలో చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మైనస్ 30 డిగ్రీలకు పడిపోతున్నాయి! అయితే దాడుల నిలుపుదల విషయమై రష్యా నుంచి ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. తమ పవర్ గ్రిడ్ తదితరాలపై రష్యా దాడులు ఆపితే ఆ దేశ ఇంధన, విద్యుత్ మౌలిక సదుపాయాలపై తామూ దాడులు చేయబోమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. కానీ యుద్ధాన్ని ముగించే ఉద్దేశం రష్యాకు లేదంటూ మండిపడ్డారు. ఉక్రెయిన్‌పై వారం పాటు రష్యా దాడులు చేయబోదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించడం తెలిసిందే. ఈ మేరకు తాను చేసిన విజ్ఞప్తికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అంగీకరించారని ఆయన అన్నారు.

సొంత శాఖలనే కోర్టుకీడ్చిన ట్రంప్!

1,000 కోట్ల డాలర్లకు దావా

వాషింగ్టన్: అమెరికా ప్రభుత్వంలో కీలక విభాగాలైన అంతర్గత రెవెన్యూ సేవలు, ట్రెజరీ విభాగాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కన్నెర్రజేశారు. తన పన్నులకు సంబంధించిన రహస్య సమాచారాన్ని వార్తా సంస్థలకు లీక్ చేశాయంటూ వాటిపై ఏకంగా 1,000 కోట్ల డాలర్ల మేరకు పరువు నష్టం దావా వేశారు! ఈ మేరకు ఫ్లోరియా ఫెడరల్ కోర్టులో గురువారం ఆయన పిటిషన్ దాఖలు చేశారు. కుమారులు ఎరిక్, ట్రంప్ జూనియర్‌తో పాటు తన సంస్థలను కూడా సహ పిటిషన్‌దార్లుగా పేర్కొన్నారు. ఐఆర్ఎస్ కాంట్రాక్టర్ చార్లెస్ ఎడ్వర్డ్ లిటిల్‌జాన్ 2018, 2020ల్లో ట్రంప్ తదితరుల పన్నుల సమాచారాన్ని న్యూయార్క్ టైమ్స్ తదితర వార్తా సంస్థలకు లీక్ చేసినట్టు తేలింది. ఆ కేసులో అతనికి 2024లో ఐదేళ్ల జైలుశిక్ష పడింది. ఈ ఉదంతం తన సంస్థల పేరు ప్రఖ్యాతులనే గాక 2020 అధ్యక్ష ఎన్నికల్లో ఓటర్లలో తనకున్న మద్దతును కూడా బాగా దెబ్బ తీసిందని తాజా పిటిషన్‌లో ట్రంప్ ఆరోపించారు.

1,600 కెమెరాలు.. 500 కిలోమీటర్ల వేట

ముంబ్రా పసికందు కిడ్నాప్.. పోలీసుల 'మెరుపు' ఆపరేషన్!

ఆ తల్లి గుండె ముక్కలైంది.. చేతిలో ఉండాల్సిన మూడు నెలల పసిపాప మాయమైపోయింది. కిడ్నాపర్ బురఖా మాటున అదృశ్యమైతే.. థానే పోలీసులు మాత్రం డేగ కళ్లతో గాలించారు. ఆ పసికందును మళ్లీ తల్లి ఒడికి చేర్చారు. ఇది ఒక రియల్ లైఫ్ థ్రిల్లర్..

నమ్మించి.. నడిరోడ్డుపైనే మాయం

జనవరి 22 సాయంత్రం.. ముంబ్రాలోని రద్దీగా ఉండే ఖాదీ మెషీన్ రోడ్డు. ఫర్హానా మన్సూరి తన 3 నెలల చిన్నారి ఆఫియాను ఎత్తుకుని వెళ్తోంది. అప్పుడే ఒక బురఖా ధరించిన మహిళ.. సాయం చేస్తానంటూ పాపను ఎత్తుకుంది. కనురెప్ప మూసి తెరిచేలోపు ఆమె జన సమూహంలో మాయమైపోయింది. ఫర్హానా హాహాకారాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది..

నాలుగు ప్రత్యేక బృందాలతో వేట

కేసును సవాల్‌గా తీసుకున్న థానే పోలీస్ కమిషనర్ అశుతోష్ డుంబ్రే, 4 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. కిడ్నాపర్ తెలివిగా బట్టలు మారుస్తూ పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. కానీ ఖాకీలు వదల్లేదు. ముంబ్రా నుంచి ముంబైలోని సీఎస్ఎంటీ వరకు, అటు టిట్వాలా వరకు ఉన్న 1600కు పైగా సీసీటీవీ కెమెరాలను జల్లెడ పట్టారు. రోజూ 18 గంటల పాటు అవిశ్రాంతంగా శ్రమించి, కిడ్నాపర్ కదలికలను ట్రాక్ చేశారు.

500 కిలోమీటర్ల అవతల.. బిడ్డ క్షేమం

చిన్న క్లూ దొరకగానే థానే పోలీసులు ముంబ్రాలోని నస్రీన్ అనే మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమె ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఏకంగా 500 కిలోమీటర్ల దూరంలోని అకోలాకు పరుగు తీశారు. అక్కడ హాజీ నగర్‌లోని ఒక ఇంట్లో దాచిపెట్టిన చిన్నారి ఆఫియాను క్షేమంగా రక్షించారు. నిందితులు మహమ్మద్ ముజీబ్, అతని భార్య తాల్నిసాను అరెస్ట్ చేశారు.

అమ్మ ఒడికి ఆఫియా

పసిపాప ఆఫియాను అక్కున చేర్చుకున్న తల్లి ఫర్హానా మన్సూరి కళ్లల్లో నుంచి ఆనందభాష్పాలు సుడిగుండాలయ్యాయి. కిడ్నాపర్ల కుట్రల మధ్య, 500 కిలోమీటర్ల సుదూర ప్రాంతంలో బిడ్డ పడుతున్న నరకాన్ని తుడిచివేస్తూ పోలీసులు చేసిన ఈ ఆపరేషన్ ఒక అద్భుతం. ఈ కిడ్నాప్ వెనుక చైల్డ్ ట్రాఫికింగ్ మాఫియా నీడలు ఉన్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు. 'మా బృందం రేయింబవళ్లు కష్టపడింది.. ఎందుకంటే ఆ మూడు నెలల చిన్నారికి గడిచే ప్రతి గంటా కీలకమని మాకు తెలుసు. ఇది కేవలం దర్యాప్తు కాదు.. ఒక తల్లికి తన ప్రపంచాన్ని తిరిగి అప్పగించే పవిత్రమైన పోరాటం' అంటూ కమిషనర్ డుంబ్రే సగర్వంగా ప్రకటించారు. ఎంతటి చీకటి కుట్రలైనా, ఖాకీల నిబద్ధత ముందు తలవంచాల్సిందే. ఆ పసిపాప ప్రాణం.. అక్షరాలా పోలీసుల విజయం.

– సాక్షి, నేషనల్ డెస్క్

400 మీటర్లకు రూ. 18 వేల బిల్లు!

ముంబై ట్యాక్సీడ్రైవర్‌కు బేడీలు

మనం 'అతిథి దేవో భవ'అంటాం.. కానీ ఆ ట్యాక్సీ డ్రైవర్ మాత్రం అతిథి 'దోపిడీ'భవ అనుకున్నాడు. వేల మైళ్ల దూరం నుంచి వచ్చిన ఒక అతిథిని, అడుగు దూరంలో ఉన్న హోటల్‌కు చేర్చడానికి అక్షరాలా పద్దెనిమిది వేల రూపాయలు పిండేశాడు. అమెరికా నుంచి ముంబై ఎయిర్‌పోర్ట్‌లో దిగిన ఒక మహిళకు ఎదురైన చేదు అనుభవమిది.

ఆ 20 నిమిషాల ఉత్కంఠ

జనవరి 12 అర్ధరాత్రి సమయం.. అమెరికా నుంచి ముంబైలో అడుగుపెట్టిన ఆ మహిళ ఒక ట్యాక్సీ ఎక్కింది. ఆమె వెళ్లాల్సిన ఫైవ్ స్టార్ హోటల్ ఎయిర్‌పోర్ట్‌కు కేవలం 400 మీటర్ల దూరంలోనే ఉంది. కానీ, ట్యాక్సీ డ్రైవర్ దేశ్‌రాజ్ యాదవ్ కన్ను ఆమె పర్సుపై పడింది. నేరుగా హోటల్‌కు తీసుకెళ్లకుండా, ఆమెకు దారి తెలియదు కదా.. అని అంధేరీ వీధుల్లో 20 నిమిషాల పాటు 'చక్రం'తిప్పాడు. కారులో డ్రైవర్ పక్కన మరో అపరిచిత వ్యక్తి.. చుట్టూ చీకటి.. ఆమెకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు..

చెక్ ఇన్ అవ్వకముందే.. భారీ చెక్!

చివరికి హోటల్ ముందు కారు ఆపిన ఆ డ్రైవర్, బాంబు పేల్చాడు. బిల్లు ఎంతో తెలుసా? అక్షరాలా 18,000 రూపాయలు! అంటే కిలోమీటర్‌కు కూడా సరిపోని దూరానికి దాదాపు 200 డాలర్లు వసూలు చేశాడు. కొత్త దేశం, ఒంటరి మహిళ.. వాళ్లతో వాదించలేక, భయంతో ఆ డబ్బు చెల్లించి హోటల్‌లోకి పరుగులు తీసింది.

ట్విట్టర్‌లో పోస్టు.. ఖాకీల వేట

అమెరికా చేరుకున్నాక ఆ బాధితురాలు జనవరి 26న ఎక్స్ వేదికగా తన గోడు వెళ్లగక్కింది. ఆమె కథనం ప్రకారం.. ట్యాక్సీ డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి బాధితురాలిని ఒక గుర్తు తెలియని ప్రాంతానికి తీసుకెళ్లారు. డబ్బులు ఇవ్వాలని బెదిరించి, ఆ తర్వాతే హోటల్ దగ్గర వదిలిపెట్టారు. ఆ పోస్ట్ చూసి నెటిజన్లు రగిలిపోయారు. ముంబై పోలీసులు వెంటనే స్పందించారు. ఎఫ్ఐఆర్ నమోదైన కేవలం 3 గంటల్లోనే ఆ కేటుగాడిని పట్టుకుని బేడీలు వేశారు. డ్రైవర్ లైసెన్స్‌ను రద్దు చేయడమే కాకుండా, అతని ట్యాక్సీని కూడా సీజ్ చేశారు. ఎక్కడైనా, ఎప్పుడైనా ఇలాంటి మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా 112 కి కాల్ చేయండని డీసీపీ మనీష్ కల్వానియా విజ్ఞప్తి చేశారు. డబ్బు మీద ఆశతో దేశ గౌరవాన్ని తాకట్టు పెట్టిన ఆ మాయగాడికి, ముంబై పోలీసులు సరైన రీతిలో 'మర్యాద'చేశారు!

– సాక్షి, నేషనల్ డెస్క్

‘ఘటికేశ్వర్’ విద్యాకేంద్రాన్ని ఎవరు స్థాపించారు..?

జైన, బౌద్ధ మతాలు ఏకకాలంలో జన్మించి భారతదేశ చరిత్రలో నూతన అధ్యాయాన్ని లిఖించాయి. భారతీయ సంస్కృతిలో గణనీయ మార్పులకు కారణమయ్యాయి. భారతీయ ఆధ్యాత్మికతత్వాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చడానికి దోహదపడ్డాయి. ఇవి భారతీయ సాహిత్య, శిల్ప కళలను అభివృద్ధి చేశాయి. జైనమతం ఆవిర్భవించిన కాలంలో తెలంగాణలో బృహత్ శిలాయుగ నాగరికత వర్ధిల్లుతోంది. భారతదేశంలో హిందూమతం తర్వాత అతి ప్రాచీన మతం జైనమతమే. దేశంలో చివరగా ఏర్పడింది సిక్కుమతం.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర

విష్ణుకుండినులు

పరిపాలనా విధానం

విష్ణుకుండినుల కాలంలో పరిపాలనా సౌలభ్యం కోసం రాజ్యాన్ని రాష్ట్రాలు, విషయాలుగా విభజించారు. రాష్ట్రానికి అధిపతి రాష్ట్రికుడు, విషయానికి అధిపతి విషయాధిపతి. రాజాజ్ఞలకు లోబడి వీరు పాలన సాగించేవారు. వీరి కాలంలో భూమిని వివర్తనంలో కొలిచేవారు. విష్ణుకుండిన ప్రభువులు వారి వంశాభివృద్ధి కోసం దేవాలయాలు, వేద పండితులకు భూములు, అగ్రహారాలను దానం ఇచ్చేవారు.

ముఖ్యంగా విజయయాత్రలకు బయలుదేరేటప్పుడు, యుద్ధ విజయానంతరం, సూర్య, చంద్ర, గ్రహణ సమయాల్లో బ్రాహ్మణులకు భూమి, సువర్ణం, అగ్రహారాలను దానం చేసేవారు. మాధవవర్మ గోదావరి నదిని దాటి తూర్పు తీర ప్రాంతాన్ని జయించే సందర్భంలో చంద్రగ్రహణ నిమిత్తం కున్నూరు గ్రామానికి చెందిన శివవర్మకు భూమిని దానం చేశాడు.

మత విధానం

విష్ణుకుండినుల కాలంలో బౌద్ధమతంలో వజ్రయాన శాఖ కృష్ణానదికి దక్షిణాన ఏర్పడింది. ఈ శాఖ ప్రచారం వల్ల బౌద్ధమతానికి ఉన్న కీర్తి, ప్రతిష్ఠలు, ప్రజాభిమానం నశించాయి. బౌద్ధులు అహింస పరమ ధర్మంగా భావించేవారు. కానీ ఈ వజ్రయాన శాఖకు చెందిన కొంత మంది వ్యక్తులు శక్తి పూజలు, తాంత్రిక పూజలు, రహస్య కలసాలు, మధుమాంస వినియోగం లాంటివాటిని ఆచరించారు. బౌద్ధ సంఘారామ విహారాలు (విశ్రాంతి మందిరాలు) నీతి బాహ్యమైన చర్యలకు నిలయం అయ్యాయి. దీంతో బౌద్ధమతం క్రమంగా ఆదరణ కోల్పోయింది. ఈ సమయంలో విష్ణుకుండిన పాలకులు బౌద్ధాన్ని ఆదరించి పోషించారు.

ఇక్ష్వాకు వంశం అంతరించిన తర్వాత పల్లవులు ఆంధ్రదేశాన్ని ఆక్రమించి వైదిక మత విస్తరణకు కారణమయ్యారు. బౌద్ధం రాజాదరణ కోల్పోయింది. బౌద్ధ సన్యాసులు ప్రజలను ఆకర్షించడానికి ఊరేగింపులు, సేవలు, పూజలు, ఆరాధనలు ప్రవేశపెట్టినా అంతగా ప్రభావం చూపలేదు. బౌద్ధారామ విహారాలు విలాస గృహాలుగా మారాయి. స్వదేశంలో ఆదరణలేకపోయినా బౌద్ధమతం ఖండాంతరాల్లో వ్యాపించింది.

విష్ణుకుండినుల్లో మొదటి మాధవవర్మ, మొదటి గోవిందుడు బౌద్ధమతాన్ని ఆదరించారు. ‘ఇంద్రపాలనగర’ తామ్ర శాసనాల ద్వారా విష్ణుకుండినులు బౌద్ధమతం అనుసరించారని తెలుస్తోంది. గోవిందవర్మ బౌద్ధాన్ని ఆదరించాడని, బౌద్ధ సంఘాలకు అగ్రహారాలు ఇచ్చాడని, తన పట్టమహిషి మహాదేవి పేరుతో ‘విహారం’ నిర్మించాడని ఈ శాసనాల్లో పేర్కొన్నారు.

శైవం: రెండో మాధవ వర్మ బలపరాక్రమ సంపన్నుడు. ఇతడు మొదట బౌద్ధ మతాన్ని అనుసరించాడు. వాకాటక మహాదేవిని వివాహం చేసుకున్న తర్వాత వైదిక మతాన్ని స్వీకరించాడు. కీసరలో రామలింగేశ్వరాలయం నిర్మించాడు. యజ్ఞ యాగాదులు నిర్వహించాడు. విష్ణుకుండినుల కాలంలో శైవ మతానికి మంచి ఆదరణ లభించింది. వీరి కాలంలో కీసర, కోటప్పకొండ, ఇంద్రపాలనగరం తదితర ప్రాంతాల్లో శైవ దేవాలయాలు నిర్మించారు. ముఖ్యంగా శ్రీశైల మల్లికార్జునుడిని ఎక్కువగా ఆరాధించారు.

జైనం: విష్ణుకుండినుల కాలంలో జైనమతం క్షీణ దశలో ఉంది. జైనుల్లో దిగంబరులు, శ్వేతాంబరులు అని రెండు వర్గాలు ఉండేవి. తెలంగాణలో జైనమతం క్షీణించడానికి ‘కాపాలిక’ జైనులు కారకులు. పల్లవులు వైదిక మతాన్ని ఉద్ధరించి జైన మతానికి నీడ లేకుండా చేశారు. జైనాలయాలు, బౌద్ధరామ విహారాలు రాజుల ప్రోత్సాహంతో శైవక్షేత్రాలుగా రూపుదిద్దుకున్నాయి.

విద్య, సాహిత్యం

విష్ణుకుండినులు మొదట ‘ప్రాకృత’ భాషను ఆదరించారు. గోవిందుడు తన పాలనా కాలంలో సంస్కృతాన్ని రాజభాషగా ప్రవేశపెట్టాడు. విక్రమేంద్ర భట్టారక వర్మ మహాకవి, పండిత పోషకుడు. విష్ణుకుండినులు సంస్కృతాంధ్ర భాషలను ప్రోత్సహించారు. తెలుగులో చంధోగ్రంథం ‘జనాశ్రయచ్ఛంధో విచ్ఛిత్తి’ వీరి కాలంలోనే వెలువడింది.

‘ఘటికలు’ పేరుతో బ్రాహ్మణ విద్యాసంస్థలను ప్రారంభించారు. ఈ కాలం నాటి ప్రసిద్ధ విద్యాకేంద్రం ‘ఘటికేశ్వర్’. ఈ విద్యాకేంద్రాన్ని ఇంద్రభట్టారక వర్మ స్థాపించాడు. గోవిందరాజు విహార (చైతన్యపురి) శాసనంలో ప్రాకృత భాషను ఉపయోగించారు. వీరి శాసనాల్లో తెలంగాణా పదాలు కనిపిస్తాయి.

బౌద్ధ పండితుల్లో ‘దశబలబలి’ సర్వశాస్త్ర పారంగతుడని గోవింద వర్మ వేయించిన ఇంద్రపాలనగర తామ్రశాసనంలో పేర్కొన్నారు.

జనాశ్రయచ్ఛంధో విచ్ఛిత్తి: ఇది శాస్త్ర గ్రంథం. తెలంగాణ తొలి లక్షణ గ్రంథం ఇదే. కానీ ఇది అసంపూర్ణంగా ఉంది. అవతారిక పద్యాలు లేవు. దీన్ని ‘గుణస్వామి’ రచించి మాధవవర్మ పేరుతో ప్రకటించినట్లుగా చరిత్రకారులు భావిస్తున్నారు. జనాశ్రయుని కాలంలో వ్యాప్తిలో ఉన్న కవితలకు, పద్యాలకు వివరణ గ్రంథం ఇది. మాధవవర్మకు తప్ప ఆ కాలంలో ఏ రాజుకు ‘జనాశ్రయ’ అనే బిరుదు లేదు. ఈ గ్రంథంలోని ముఖ్యాంశాలు.

1) వివిధ జాతుల పద్యాలున్నాయి.
2) శీర్షికను ఏడు విధాలుగా పేర్కొన్నారు.
3) శీర్షిక అంటే ‘సీసం’. పద్యాంతంలో ‘గీత’ పద్యం ఉంది.
4) ‘ద్విపద’, ‘త్రిపదలు’ కూడా ఉన్నాయి.

న్యాయపాలన

మాధవవర్మ వేయించిన ‘పాలమూరు’ శాసనంలో న్యాయపాలనకు సంబంధించిన ప్రస్తావన ఉంది. న్యాయ శాస్త్రాలను అధ్యయనం చేసి దివ్య మార్గాలను అనుసరించిన విష్ణుకుండిన రాజు మూడో మాధవవర్మ. రాజే న్యాయపాలనకు ‘అత్యున్నత అధికారి’.

శిల్పకళ

ఉండవల్లి గుహాలయాలు: ఇవి నాలుగు అంతస్తుల్లో ఉన్నాయి. వీటిని గోవిందవర్మ నిర్మించాడు. ఇందులో మొత్తం 64 గుహలు ఉన్నాయి. మొదటి అంతస్తులో త్రిమూర్తుల విగ్రహాలు ఉన్నాయి. రెండో అంతస్తులో ‘అనంతశయన’ విష్ణువు దేవాలయం, మూడో అంతస్తులో ‘త్రికూట ఆలయం’ ఉన్నాయి. నాలుగో అంతస్తులో సన్యాసుల విశ్రాంతి మందిరాలు ఉన్నాయి. ఈ గుహల్లో ‘పూర్ణకుంభం’ ఉంది.

భైరవ కొండ: ఇది ఎనిమిది గుహలతో కూడిన సముదాయం. దీన్ని శివుడికి అంకితం చేశారు. ఇందులో కుంభ శీర్షం ఉన్న సింహపాద స్తంభాలు ఉన్నాయి.

విష్ణుకుండినుల కాలంలో నూతన వాస్తుశిల్ప రీతి వృద్ధి చెందింది. ఉండవల్లి, మొగల్రాజపురం, ఇంద్రకీలాద్రి (విజయవాడ), అక్కన్న, మాదన్న గుహలు, భైరవకొండ గుహల్లో వాస్తు, శిల్పకళకు సంబంధించిన ఆధారాలు లభించాయి. 2015 మే 6న నల్గొండ జిల్లాలోని ఇంద్రపాలనగరంలో ప్రాచీన కాలం నాటి బుద్ధుడి శిల్పకళకు చెందిన విగ్రహాలు బయటపడ్డాయి. ఇవి 2000 ఏళ్ల కిందటివిగా చరిత్రకారులు భావిస్తున్నారు..

జైనమత అభివృద్ధి..

జైనంలో నాలుగు ప్రధాన సిద్ధాంతాలను 24వ తీర్థంకరుడైన పార్శ్వనాథుడు ప్రవేశపెట్టాడు. అవి.. అహింస, అసత్య, ఆస్తేయం (దొంగతనం చేయరాదు), అపరిగ్రహం (ఆస్తిపాస్తులు ఉండకూడదు). క్రీ.పూ. 6వ శతాబ్దంలో వర్ధమానుడు బ్రహ్మచర్యం అనే అయిదో సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. ఆ తర్వాత ఇతడు మహావీరుడిగా మారాడు. వర్ధమానుడు ఉత్తరభారతదేశంలో జైనమతాన్ని స్థాపించాడు. ఇది కుల వ్యవస్థ, యజ్ఞయాగాదులు, బలి, హింసలతో కూడిన వైదిక మతాన్ని ఖండించి, శాంతి, అహింస, సర్వసమానత్వాన్ని బోధించింది.

ఇటీవల జరుగుతున్న పరిశోధనల ఆధారంగా అతి ప్రాచీన కాలం నుంచే తెలంగాణలో జైనమతం ఉన్నట్లు తెలుస్తోంది. మహావీరుడి తండ్రి కళింగరాజుకు మిత్రుడని, అతడి ఆహ్వానం మేరకు మహావీరుడు కళింగ రాజధాని బాదలపురం (నేటి భద్రాచలం) సందర్శించాడని, ఆ సందర్భంలోనే జైనమతం తెలంగాణలోకి ప్రవేశించిందని చరిత్రకారులు భావిస్తున్నారు. 10వ జైన తీర్థంకరుడైన సీతలనాథుడు భద్రాచలవాసిగా గుర్తించారు. అంటే మహావీరుడి కంటే కొన్ని వందల ఏళ్ల కిందటే తెలంగాణలో జైనమతం ఉందని విశ్లేషకుల అభిప్రాయం. మహావీరుడు భద్రాచలాన్ని సందర్శించినట్లుగా ‘ఎర్లీ హిస్టరీ ఆఫ్ దెక్కన్ అండ్ ప్రాబ్లమ్స్’ గ్రంథంలో ఆధారాలు ఉన్నాయి.

నైనసేనుడు రాసిన ‘ధర్మామృతం’ కావ్యంలో, హరిసేనుడు రాసిన బృహత్‌కథాకోశం గ్రంథంలో తెలంగాణలో జైనం, బౌద్ధం రెండూ వ్యాప్తి చెందాయని పేర్కొన్నారు. క్రీ.పూ. 4వ శతాబ్దంలో మహాపద్మనందుడు (రెండో పరశురాముడిగా ప్రసిద్ధి) తెలంగాణ ప్రాంతాన్ని మగధ రాజ్యంలో విలీనం చేశాడు. ఇతడు జైన మతస్థుడు. భారత దేశాన్ని సందర్శించిన తొలి గ్రీకు రాయబారి. మెగస్తనీస్ తన రచనల్లో తెలంగాణ ప్రాంతంలో నగ్న జైన సన్యాసులను ఎంతో మందిని చూశానని పేర్కొన్నాడు. మెగస్తనీస్ గ్రంథాన్ని ఆంగ్లంలోకి అనువదించిన ‘మాక్ క్రిండాల్’ ద్వారా ఈ విషయం తెలిసింది.

మహాపద్మనందుడు తెలంగాణలోని సీతలనాథుని విగ్రహాన్ని మగధకు తరలించాడు. తర్వాత కళింగరాజు ఖారవేలుడు పాటలీపుత్రంపై దండెత్తి సీతలనాథుని విగ్రహాన్ని తిరిగి తెచ్చి ఆయనకు జైన దేవాలయం నిర్మించాడని ‘ది హిస్టరీ అండ్ ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ ది శాతవాహనాస్’ గ్రంథంలో ఉంది.

తొలి శాతవాహనులు జైనమతాన్ని ఆదరించారు. శ్రీముఖుడు జైనమతాన్ని స్వీకరించినట్లుగా కాలకసూరి ‘తంత్ర’ అనే జైన గ్రంథంలో పేర్కొన్నాడు.

తెలంగాణలో ముఖ్యమైన జైన కేంద్రాలు

1. కొలనుపాక (నల్గొండ జిల్లా)
2. మునులగుట్ట (కరీంనగర్)
3. బోధన్ (నిజామాబాద్)

తెలంగాణలో వేములవాడ, ముదిగొండ చాళుక్య రాజుల కాలంలో, తొలి కాకతీయుల కాలంలోనూ జైనమతం వర్ధిల్లింది. వేములవాడ చాళుక్యులు జైన పండితులను పోషించారు. రాష్ట్రకూట రాజు మూడో కృష్ణుడి ఆస్థానానికి తెలంగాణ నుంచి కొంతమంది కవులు వలస వెళ్లారు. ‘శాంతిపురాణం’ గ్రంథాన్ని రచించిన ‘పొన్న’ మూడో కృష్ణుడి ఆస్థానంలో ఉన్నాడు. వేమలవాడ రాజైన రెండో హరికేసరి కన్నడంలో ప్రసిద్ధ కవి అయిన ‘పంప’ను పోషించాడు. ఇతడు రాష్ట్రకూట రాజు ధ్రువుడి ఆస్థానంలోకి వలస వెళ్లాడు. పంప కన్నడంలో జైనభారతం రచించాడు. తర్వాతి కాలంలో జైనమతం బాగా ప్రజాదరణ పొందింది. పటాన్‌చెరువులో 500 జైన బసదులు (జైన విశ్రాంతి మందిరాలు), విగ్రహాలు ఉన్నాయి. ఈ విగ్రహాలను హైదరాబాద్ మ్యూజియంలో భద్రపరిచారు. పశ్చిమ చాళుక్య రాజులు కూడా జైనమతాన్ని పోషించారు. బోధన్, కొనకొండ్ల జైన తీర్థాలుగా వర్ధిల్లాయి. తొలి కాకతీయ రాజులు జైనమతాన్ని అవలంబించారు. హన్మకొండ జైనమతానికి కేంద్రమైంది. రుద్రుడి కాలం నుంచి జైనులకు వ్యతిరేకంగా ప్రచారం జరిగింది. చివరి కాకతీయ రాజైన రెండో ప్రతాపరుద్రుడు హన్మకొండను జైనులకు కేంద్రంగా మార్చాడు. చివరికి ఇస్లాం మత వ్యాప్తితో తెలంగాణలో జైనం తన ఉనికిని కోల్పోయింది.

బాహుబలి..

మహావీరుడి కంటే ముందే తెలంగాణలో జైన సిద్ధాంతాలు ప్రవేశించినట్లు మరికొన్ని ముఖ్య ఆధారాలు ఉన్నాయి. మొదటి తీర్థంకరుడైన వృషభనాథుడికి భరతుడు, బాహుబలి అనే ఇద్దరు కుమారులు ఉండేవారు. వీరిలో బాహుబలి పోతన నగరం (నేటి బోధన్, నిజామాబాద్ జిల్లా) రాజధానిగా ‘అస్మక’ రాజ్యాన్ని పాలించాడు. ఇక్కడ 525 ధనస్సుల ఎత్తు ఉన్న బాహుబలి విగ్రహం ఉండేదని, దట్టమైన అడవుల్లో ఉండటం వల్ల సామాన్యులెవరికీ దీన్ని దర్శించే భాగ్యం లభించేది కాదని, అందువల్ల శ్రావణబెళగొళలోని ఇంద్రగిరి పర్వతంపై బాహుబలి విగ్రహాన్ని ప్రతిష్ఠించానని చాళుక్యుల మంత్రి చాముండ రాయుడు తాను వేయించిన శ్రావణబెళగొళ శాసనంలో పేర్కొన్నాడు. పంపకవి (కన్నడ ఆదికవి) కూడా బోధన్‌లోని బాహుబలి విగ్రహం గురించి ప్రస్తావించాడు. ఈ బాహుబలినే ‘గోమతేశ్వరుడు’ అని పిలుస్తారు. కుమార వ్యాసుడు కూడా దీని గురించి వివరించాడు. ఈ విషయాల ఆధారంగా మొదటి తీర్థంకరుడి కాలంలోనే జైనమతం తెలంగాణలో ప్రవేశించిందని చెప్పవచ్చు. బోధన్ పరిసర ప్రాంతాల్లో జైనమతానికి సంబంధించిన శిథిలాలు అనేకం ఉన్నాయి.

సబాయి, సలాయి గడ్డి ఏ ప్రాంత అరణ్యాల్లో పెరుగుతున్నది?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
భూగోళశాస్త్రం

భారతదేశ సహజ ఉద్భిజ్జ సంపద ఎంతో వైవిధ్యభరితంగా ఉంటుంది. వివిధ శీతోష్ణస్థితులు, నైసర్గిక స్వరూపం దీనికి కారణం. దట్టమైన అరణ్యాలు మొదలుకొని చిట్టడవులు, పొదలు, తుప్పలు కూడా భారతదేశంలో కనిపిస్తాయి. ఉష్ణమండల అరణ్యాలే కాకుండా సమశీతోష్ణ, ఆల్ఫైన్ అరణ్యాలు కూడా భారతదేశంలో పెరుగుతున్నాయి. హిమాలయ ప్రాంతం మినహాయిస్తే భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో పెరిగే అరణ్య జాతులు ఆయా ప్రాంతాలు పొందే వర్షపాతంపై ఆధారపడి ఉంటాయి. అత్యధిక వర్షపాతం పొందే ప్రాంతాల్లో సతతహరిత అరణ్యాలు పెరుగుతాయి. అత్యల్ప వర్షపాత ప్రాంతాల్లో పొదలు, తుప్పలు మాత్రమే ఉంటాయి. హిమాలయాల్లో ఎత్తును బట్టి అరణ్యాల జాతులు మారతాయి. ఎక్కువ ఎత్తులో కోనిఫెరస్ అరణ్యాలు, ఆల్ఫైన్ వృక్షజాతులు దర్శనమిస్తాయి.

సతత హరిత అరణ్యాలు

అత్యధిక వర్షపాతాన్ని పొందే మలబార్ తీరం, కేరళ, కర్ణాటకలోని పశ్చిమ కనుమల్లోని పశ్చిమ వాలులు, అండమాన్-నికోబార్, మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాల్లోని ఆయనరేఖా ప్రాంతాల్లో సతతహరితారణ్యాలు విస్తరించి ఉన్నాయి. ఈ అరణ్యాల్లో మహాగని, ఎబోని, రోజ్‌వుడ్ ముఖ్య వృక్షజాతులు. ప్రవేశసౌలభ్యత లేకపోవటంతో ఈ అరణ్యాల్లో వాణిజ్య కలపను ఉత్పత్తి చేయటం కష్టం. ఈ అరణ్యాలు విస్తారమైన జీవవైవిధ్యాన్ని కలిగి ఉన్నాయి. ఈ కోవకు చెందిన కేరళలోని సైలెంట్‌వ్యాలీ ప్రాంతంలో సింహపుతోక లాంటి అందమైన కోతుల జాతి నివసిస్తోంది. పశ్చిమ కనుమల్లోని ఈ అరణ్య ప్రాంతాన్ని ప్రపంచంలోని 14 జీవ వైవిధ్య మండలాల్లో ఒకటిగా గుర్తించారు. అధిక వర్షపాతాన్ని పొందే తెరాయి ప్రాంతం, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తూర్పు మధ్యప్రదేశ్, ఈశాన్య భారతంలోని కొండ ప్రాంతాల్లో ఆర్ద్ర ఆకురాల్చే అడవులు విస్తరించి ఉన్నాయి. వీటిని ‘రుతుపవన అరణ్యాలు’గా పిలుస్తారు. టేకు, సాల్, గుర్జన్, మహువా ముఖ్యమైన వృక్షజాతులు. వెదురు, సబాయి, సలాయి గడ్డిజాతులు కూడా ఈ అరణ్యాల్లో పెరుగుతాయి. దేశంలో వాణిజ్య కలపను ఉత్పత్తి చేసే ముఖ్యమైన అరణ్యాలు ఇవి.

60-100 సెం.మీ. మధ్యస్థ వర్షపాతాన్ని పొందే ప్రాంతాల్లో అనార్ద్ర ఆకురాల్చే అరణ్యాలు పెరుగుతున్నాయి. ఈ అరణ్యాల్లో టేకు, మద్ది, అడవిచింత, అడవి వేప ముఖ్య వృక్షజాతులు ఇక్కడ పెరుగుతాయి. వెదురు కూడా విస్తారంగా లభిస్తుంది. ఇవి పశ్చిమ మధ్యప్రదేశ్, గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లోని నల్లమలై, ఎర్రమలై కొండ ప్రాంతాల్లో విస్తరించాయి. వ్యవసాయం విస్తరించడంతో ఈ అరణ్యాలు ఎక్కువగా కుచించుకపోతున్నాయి. ఈ అరణ్యాల్లో వాణిజ్య కలప ఉత్పాదకత తక్కువ.

చిట్టడవులు

చిట్టడవులు 40-60 సెం.మీ. అల్ప వర్షపాతాన్ని పొందే సహ్యాద్రి కొండల వర్షచ్ఛాయా ప్రాంతం, వాయవ్య భారతదేశంలో పెరుగుతాయి. పశ్చిమ తెలంగాణ, రాయలసీమ, ఉత్తర కర్ణాటక, మరఠ్వాడా, పంజాబ్, హర్యానా, ఉత్తర రాజస్థాన్ ప్రాంతాల్లో ఈ అరణ్యాలు విస్తరించి ఉన్నాయి. ముళ్లతో కూడిన తుమ్మ లాంటి అకేషియా జాతికి చెందిన తక్కువ ఎత్తు వృక్షజాతులు మాత్రమే ఇక్కడ ఉంటాయి. ఈ అరణ్యాల్లో వంటచెరకు మాత్రమే ఉత్పత్తి అవుతుంది. వాణిజ్య కలప లభించదు. అత్యల్ప వర్షపాతాన్ని పొందే ఉత్తర గుజరాత్(కచ్), పశ్చిమ రాజస్థాన్(థార్ ఎడారి) ప్రాంతాల్లో వృక్షాలు పెరగటానికి కావలసిన తేమ లభించదు. శుష్క, అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోగలిగే మెగాథర్మ్, జెరోఫైట్ తరానికి చెందిన కాక్టస్‌లాంటి పొదలు, తుప్పలు మాత్రమే పెరుగుతాయి. ద్వీపకల్ప భారతదేశంలోని పర్వత శిఖర భాగాల్లో ఉప ఆయనరేఖ అనార్ద్ర సతతహరిత అరణ్యాలు పెరుగుతాయి. మధ్యప్రదేశ్‌లోని మహదేవ కొండలు, అమర్‌కాంత్ ప్రాంతం, కేరళలోని పళని కొండలు, తమిళనాడులోని నీలగిరి, అన్నామలై కొండలు, కర్ణాటకలోని కూర్గ్ ప్రాంతాల్లోని అరణ్యాలు ఈ కోవకు చెందుతాయి. దక్షిణ భారతదేశంలో వీటిని ‘షోలా’ అరణ్యాలు అని పిలుస్తారు. ఇందులో యూకలిప్టస్, ఓక్, చెస్ట్‌నట్, మాపుల్ ముఖ్య వృక్షజాతులు.

ఎత్తును బట్టి వృక్ష జాతులు

హిమాలయ పర్వతాల్లో 2000 మీ. ఎత్తులో సమశీతోష్ణ మండల జాతులైన ఓక్, చెస్ట్‌నట్, వాల్‌నట్, మాపుల్, బీచ్ లాంటి వృక్షాలు ఉంటాయి. సుమారు 3000-3500 మీటర్ల ఎత్తులో కోనిఫెరస్ జాతికి చెందిన పైన్, ఫర్, స్ప్రూస్, సెడార్‌లాంటి వృక్షాలతో కూడిన టైగా అరణ్యాలు పెరుగుతాయి. 4500 మీటర్ల ఎత్తులో విల్లో జాతి వృక్షాలు, రోడోడెండ్రాన్ జాతికి చెందిన పుష్పజాతులు, పచ్చిక బయళ్లు విస్తారంగా పెరుగుతాయి. ఈ ప్రాంతం సహజసిద్ధ ఉద్యానవనంగా కనిపిస్తుంది.



మడ అడవులు

తీర ప్రాంతాల్లోని నదీ ముఖద్వారాలు, డెల్టాలు, ఉప్పునీటి కయ్యల వద్ద ప్రత్యేక రకమైన అరణ్యాలు పెరుగుతాయి. వీటిని ‘మడ అడవులు’ లేదా ‘మాన్‌గ్రూవ్ అరణ్యాలు’గా పిలుస్తారు. లవణీయతను తట్టుకొని నీటిలో తేలియాడే వృక్షజాతులు ఇక్కడ పెరుగుతాయి. సుందరి, రైజోఫెరా, సూల్పాకేన్ మొదలైనవి ముఖ్య వృక్షజాతులు. ఈ మడ అడవులు సముద్ర ఉప్పునీరు తీరమైదానాల్లోని వ్యవసాయ భూముల్లోకి ప్రవేశించకుండా నిరోధిస్తాయి. ఎత్తయిన వేలా తరంగాలు, సునామీ తరంగాలు, చక్రవాతాలు తీరాన్ని దాటేటప్పుడు తీర ప్రాంతాల్లో ఎక్కువ నష్టం జరగకుండా ఈ అరణ్యాలు అడ్డుకుంటాయి. ఇవి జీవ వైవిధ్యానికి కూడా ప్రసిద్ధి. ఇటీవలి కాలంలో పర్యాటక కేంద్రాలు (రిసార్టులు, హోటల్స్) ఏర్పరచటానికి, వ్యవసాయాన్ని విస్తరించటానికి మడ అడవులను విచక్షణారహితంగా నరికివేస్తున్నారు. అందువల్ల భారత ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన మాన్‌గ్రూ ప్రాంతాలను రక్షిత మండలాలుగా ప్రకటించింది. అందులో ముఖ్యమైనవి సుందరవనాలు (పశ్చిమ బెంగాల్), భిత్తర్ కనికా (ఒడిశా), కొరింగ(ఆంధ్రప్రదేశ్), పిచ్చవరం, పాయింట్ కాలిమోర్(తమిళనాడు), వెంబనాడు(కేరళ), కొండాపూర్ (కర్ణాటక), అచ్రా (మహారాష్ట్ర). భారతదేశంలో సగటున 23 శాతం భౌగోళిక ప్రాంతంలో మాత్రమే అరణ్యాలు విస్తరించి ఉన్నాయి.

ఇందులో 16 శాతం మాత్రమే దట్టమైన అరణ్యాల కోవకు చెందుతాయి. భౌగోళిక ప్రాంతంలో కనీసం 33 శాతం అరణ్యాలు ఉండాలని జాతీయ అటవీ విధానం నిర్దేశిస్తోంది. కొండలు ఎత్తయిన పీఠభూముల్లో కనీసం 60 శాతం, మైదాన ప్రాంతాల్లో కనీసం 20 శాతం అరణ్యాలు ఉండాలని కూడా జాతీయ అటవీ విధానం సూచిస్తోంది. కేవలం ఈశాన్య భారతదేశం, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్, అండమాన్-నికోబార్ అరణ్య ప్రాంతాలు మాత్రమే జాతీయ అటవీ విధాన లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయి. ముఖ్యంగా ఉత్తరభారత మైదాన ప్రాంతాల్లో అరణ్యాల శాతం 10 కంటే తక్కువగా ఉంది. పర్యావరణాన్ని పరిరక్షించటానికి భారత ప్రభుత్వం కొన్ని అరణ్య ప్రాంతాలను జాతీయ ఉద్యానవనాలు, అభయారణ్యాలు, జీవావరణ మండలాలుగా ప్రకటించింది. దండేలి, భద్ర(కర్ణాటక) పెంచ్(మహారాష్ట్ర) బోరి, సాత్పుర (మధ్యప్రదేశ్), పాకీబామేరా (అరుణాచల్ ప్రదేశ్) అరణ్య ప్రాంతాలను ‘పులుల అభయారణ్యాలు’గా భారత ప్రభుత్వం ప్రకటించింది. దీంతో 1973లో ప్రారంభించిన ప్రాజెక్టు టైగర్ పథకం కింద స్థాపించిన పులుల అభయారణ్యాల సంఖ్య 29కి చేరింది. ‘మ్యాన్ అండ్ బయోస్ఫియర్’ పథకం కింద ఇప్పటి వరకు 14 రక్షిత జీవావరణ మండలాలను ఏర్పరిచారు.

	రక్షిత జీవావరణ మండలం	రాష్ట్రం (ఉనికి)
1.	అచనాకర్-అమర్‌కాంతక్	మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్
2.	అగస్త్యమలై	కేరళ
3.	దేహాంగ్-దిబాంగ్	అరుణాచల్ ప్రదేశ్
4.	దిబ్రూ-సాయికోవా	అసోం
5.	గ్రేట్ నికోబార్	అండమాన్-నికోబార్
6.	మన్నార్ సింధు శాఖ	తమిళనాడు
7.	కాంచనజంగ	సిక్కిం
8.	మానస్	అసోం
9.	నందాదేవి	ఉత్తరాంచల్
10.	నీలగిరి	కేరళ, తమిళనాడు, కర్ణాటక
11.	నాక్రిక్	మేఘాలయ
12.	పచ్‌మాడి	మధ్యప్రదేశ్
13.	సిమ్లిపాల్	ఒడిశా
14.	సుందరవనాలు	పశ్చిమ బెంగాల్

అరణ్య సంపద.. జీవవైవిధ్యత, పర్యావరణానికి సంబంధించిన అంశం కావటంతో ప్రతి పోటీ పరీక్షలో ఈ అంశానికి సంబంధించి ప్రశ్నలు తప్పనిసరిగా ఉంటాయి. ప్రశ్నలు సాధారణంగా కింది ఉప అంశాల నుంచి ఇచ్చే అవకాశం ఉంది.

- అరణ్యాల రకాలు – విస్తరణ
- అరణ్యాలు – ప్రధాన వృక్ష జాతులు
- జాతీయ ఉద్యానవనాలు, వన్య, మృగ సంరక్షణా కేంద్రాలు – ఉనికి, సంరక్షణ పొందుతున్న జంతుజాలం.
- జీవావరణ మండలాలు – ఉనికి
- పరిరక్షణ చట్టాలు – ఇతర చర్యలు

సాధారణంగా విద్యార్థులు భారతదేశంలో అరణ్యాలు అంశాల్లో అత్యధిక, అత్యల్ప శాతం అడవులు విస్తరించిన రాష్ట్రాలను, దేశంలో సగటు అరణ్య శాతాన్ని గుర్తుంచుకోవటంలో తమ ప్రిపరేషన్ ముగిసిందని భావిస్తుంటారు. కానీ విద్యార్థులను వడపోతకు అవసరమైన ఎగ్జామినర్స్ అనేక ఇతర కొత్త ఉప అంశాల మీద కొత్త తరహా ప్రశ్నలు రూపొందిస్తున్నారు. ఒక్కోసారి రాష్ట్రాలవారీగా అరణ్యశాతం విస్తరణ అంశంలోనే భిన్నంగా ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.

ఉదాహరణకు:

1. ఈశాన్య భారతదేశంలో అత్యధిక శాతం అరణ్య ప్రాంతం ఉన్న రాష్ట్రం ఏది?
 1) మేఘాలయ 2) మిజోరాం
 3) నాగాలాండ్ 4) మణిపూర్
2. ఈశాన్య భారతదేశంలో అత్యల్ప శాతం అరణ్య ప్రాంతం ఉన్న రాష్ట్రం ఏది?
 1) అసోం 2) త్రిపుర
 3) సిక్కిం 4) అరుణాచల్ ప్రదేశ్
3. దక్షిణ భారతదేశంలో అత్యధిక శాతం అరణ్య ప్రాంతం ఉన్న రాష్ట్రం ఏది?
 1) తమిళనాడు 2) కర్ణాటక
 3) కేరళ 4) ఆంధ్రప్రదేశ్
4. దక్షిణ భారతదేశంలో అత్యల్ప శాతం అరణ్య ప్రాంతం ఉన్న రాష్ట్రం ఏది?
 1) తమిళనాడు 2) కర్నాటక
 3) కేరళ 4) ఆంధ్రప్రదేశ్
5. భారతదేశంలో అరణ్య ప్రాంతం శూన్యంగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలు?
 ఎ) లక్షదీవులు
 బి) డామన్-డయ్యు
 సి) పాండిచ్చేరి డి) ఛండీగఢ్
 1) ఎ, బి 2) బి, సి
 3) ఎ, డి 4) ఎ, సి

సమాధానాలు
1) 2; 2) 1; 3) 3; 4) 1; 5) 4.

రాష్ట్రాలవారీగా అరణ్య ప్రాంతాల వివరాలను పరిశీలించేటప్పుడు కేవలం అత్యధిక, అత్యల్ప శాతం అరణ్య ప్రాంతం ఉన్న రాష్ట్రాల వివరాలే కాకుండా, పైన సూచించినట్లు వివిధ కోణాల్లో చదవాలి.

నమూనా ప్రశ్నలు

1. భారతదేశంలో సుమారుగా ఎంత శాతం అరణ్య ప్రాంతాన్ని ‘రిజర్వ్ ప్రాంతం’గా గుర్తించారు?
 1) 30 2) 40 3) 50 4) 60
2. భారతదేశంలో అరణ్య ప్రాంతం ప్రధానంగా కింది నైసర్గిక విభాగంలో కేంద్రీకృతమై ఉంది?
 1) హిమాలయాలు
 2) ద్వీపకల్ప కొండలు – పీఠభూములు
 3) పశ్చిమ కనుమలు – పశ్చిమ తీర మైదానాలు
 4) తూర్పు కనుమలు – తూర్పు తీర మైదానాలు
3. శృంగాకార అరణ్యాలు మొత్తం భారతదేశ అరణ్య ప్రాంతంలో ఎంత శాతం వాటాను కలిసి ఉన్నాయి?
 1) 6 2) 15 3) 25 4) 35
4. శృంగాకార అరణ్యాలు భారతదేశంలో ఏ ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్నాయి?
 1) సహ్యాద్రి కొండలు
 2) జార్ఖండ్ 3) ఈశాన్య భారతదేశం
 4) హిమాలయ పర్వతాలు
5. సబాయి, సలాయి గడ్డి ఏ ప్రాంత అరణ్యాల్లో పెరుగుతున్నది?
 1) ఛోటా నాగపూర్
 2) పూర్వాంచల్ కొండలు
 3) తెరాయి ప్రాంతం
 4) మల్వా పీఠభూమి

సమాధానాలు
1) 3; 2) 2 ; 3) 1; 4) 4; 5) 3.

గినీ గుణకం విలువ 'ఒకటి' కావడం దేన్ని సూచిస్తుంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

సుస్థిర, విధాన నిర్ణయాల ఫలితంగా సాధించే ఆర్థికాభివృద్ధి ఒక ప్రత్యేక ప్రదేశంలోని ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తుంది. దీంతో పాటు ఆరోగ్యవంతమైన ఆర్థిక వాతావరణాన్ని కల్పిస్తుంది. ఆర్థికాభివృద్ధిని ఆర్థిక వ్యవస్థలో పరిమాణాత్మక, గుణాత్మక మార్పుగా పేర్కొనవచ్చు. మానవ మూలధనం, మౌలిక సౌకర్యాలు, ప్రాంతీయ పోటీతత్వం, భద్రత, అక్షరాస్యత, ఆరోగ్య ప్రమాణాలు లాంటి బహుళ అంశాల్లో అభివృద్ధి సాధించడం ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో భాగంగా ఉంటుంది.

ఆర్థికాభివృద్ధి

ఆర్థికాభివృద్ధి, ఆర్థికవృద్ధి మధ్య స్పష్టమైన వ్యత్యాసాలున్నాయి. ఆర్థిక, సాంఘిక శ్రేయస్సులో భాగంగా ఆర్థికాభివృద్ధి మొదటి దశలో ప్రభుత్వ జోక్యం అవసరమవుతుంది. ఆర్థిక వృద్ధి ప్రక్రియ అనేది మార్కెట్ ఉత్పాదకత, స్థూల దేశీయోత్పత్తి పెరుగుదలకు సంబంధించింది. ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త అమర్త్యసేన్ ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో ఆర్థికవృద్ధిని ఒక అంశంగా పేర్కొన్నారు.

ఆర్థికాభివృద్ధి విధానాలు

1. ధరల స్థిరత్వం, అధిక ఉద్యోగిత, సుస్థిర వృద్ధి సాధన మొదలైనవి ప్రభుత్వ ఆర్థిక లక్ష్యాల్లో భాగంగా ఉంటాయి. వీటి సాధనలో ద్రవ్య విధానం, కోశ విధానం, విత్త సంస్థల నియంత్రణ, వాణిజ్యం, పన్నుల విధానం ప్రధాన పాత్ర పోషిస్తాయి.
2. అవస్థాపనా సౌకర్యాలైన హైవేస్, పార్కులు, గృహ వసతి, విద్య తదితర సదుపాయాల కల్పనతో పాటు నేరాలను నిర్మూలించడానికి అవసరమైన కార్యక్రమాలు చేపట్టడం కూడా ఆర్థికాభివృద్ధి విధానాల్లో భాగం.
3. ఉపాధి కల్పన, శ్రామిక శక్తి అభివృద్ధి, చిన్న వ్యాపారాల అభివృద్ధి, వ్యాపార విస్తరణ, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ చేసుకోవడం, రియల్ ఎస్టేట్ అభివృద్ధి కోసం అవలంబించే విధానాలు ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి.

అంతర్జాతీయ వాణిజ్యం, వినిమయ రేటు అనేవి ఆర్థికాభివృద్ధిలో ప్రధానమైన అంశాలు. కరెన్సీ విలువలు తరచుగా ఒడుదొడుకులకు గురవడం వల్ల ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు వాణిజ్య మిగులు లేదా లోటును ఎదుర్కొంటున్నాయి. ఈ స్థితి ఆర్థికాభివృద్ధిపై ప్రభావం చూపుతోంది. ఆర్థిక కోణంలో చూసినప్పుడు ప్రపంచవ్యాప్తంగా నిర్దిష్ట ప్రదేశానికి ప్రాధాన్యం ఉంది. ఒక దేశం లేదా అందులోని ప్రత్యేక ప్రదేశం కాంపిటీటివ్ అడ్వాంటేజ్‌కు ఒక ముఖ్య సాధనంగా నిలిచిన పరిస్థితులు ఉండటమే దీనికి కారణం. మూడో ప్రపంచ దేశాలు ఆర్థికాభివృద్ధి ప్రక్రియ వేగవంతంపై దృష్టి సారించాయి.

ఒక దేశ స్థూల జాతీయోత్పత్తి అధిక రేటులో పెరిగినప్పటికీ అంటే అధిక ఆర్థికవృద్ధి సాధించినప్పటికీ దాని ఫలితాలు దేశంలో తక్కువ మందికి మాత్రమే అందవచ్చు. ఫలితంగా మిగిలిన ప్రజలు పేదరికంలో ఉంటారు. స్థూల జాతీయోత్పత్తి పెరుగుదల వల్ల ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధి సాధ్యం కాకపోవచ్చు. కొన్ని దేశాల్లో గ్రామీణ - పట్టణ ప్రాంతాలు, వివిధ సామాజిక వర్గాల మధ్య అసమానతలు పెరగవచ్చు. దీంతో ప్రజల ఆదాయంలో వ్యత్యాసాలు అధికమవుతాయి. ఈ కారణంగా అన్ని వర్గాల శ్రేయస్సు మెరుగుపడదు. ఈ విధమైన స్థితిని ఆర్థికాభివృద్ధిగా పరిగణించలేం. ఆదాయ అసమానతల నిర్మూలన; పేదరికం, నిరుద్యోగం తగ్గింపు; విద్య, ఆరోగ్య ప్రమాణాల మెరుగుదల; అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధితో పాటు అధిక పారిశ్రామికీకరణ లాంటి అంశాలను ఆర్థికాభివృద్ధిలో భాగంగా పరిగణనలోకి తీసుకుంటారు.

ఆర్థిక వృద్ధి జాతీయోత్పత్తిలో పరిమాణాత్మక మార్పును మాత్రమే తెలుపుతుంది. ఆర్థిక వ్యవస్థలో జాతీయాదాయ పెరుగుదలతో పాటు సంస్థా పూర్వక, సాంకేతిక మార్పులతో కూడిన గుణాత్మక మార్పును ఆర్థికాభివృద్ధి వెల్లడిస్తుంది.

నిర్దిష్ట ప్రాంతం లేదా ఒక దేశంలో సాపేక్ష ఆర్థిక పురోగతిని పరిశీలించడానికి ఆర్థికవేత్తలు అనేక స్థూల ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక సూచీలను ఉపయోగించారు. **అవి:**

1. తలసరి స్థూల దేశీయోత్పత్తి
2. ఆదాయ పంపిణీ
3. అక్షరాస్యత, విద్య
4. ఆరోగ్య సంరక్షణ అందుబాటు
5. సామాజిక భద్రత, పింఛన్లు
6. ఆధునిక రవాణా వ్యవస్థ

గ్రాస్ నేషనల్ హ్యాపీనెస్ ఇండెక్స్ (జీఎన్‌హెచ్‌ఐ)

ఒక దేశ ప్రగతిని కొలవడానికి స్థూల దేశీయోత్పత్తికి ప్రత్యామ్నాయంగా 'గ్రాస్ నేషనల్ హ్యాపీనెస్ ఇండెక్స్'ను తీసుకోవచ్చు. దేశ పురోగతిని అంచనా వేయడంలో జీడీపీ లాంటి ఒకే కొలమానంపై ఆధారపడటానికి బదులుగా జీఎన్‌హెచ్‌ఐని పరిగణనలోకి తీసుకోవడం కొంతవరకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో ప్రజల ఆధ్యాత్మిక, భౌతిక, సాంఘిక, పర్యావరణ అంశాలతో పాటు ఆరోగ్యం తదితరాలు ఇమిడి ఉంటాయి. జీఎన్‌హెచ్‌ఐ కొలమానంలో పర్యావరణం ఒక ముఖ్య కారకంగా ఉంటుంది. 'గ్రాస్ నేషనల్ హ్యాపీనెస్ ఇండెక్స్' అనేది ఆర్థిక వ్యవస్థలోని ఆర్థిక ఉత్పత్తి విలువను మాత్రమే కాకుండా నికర పర్యావరణ ప్రభావం; పౌరుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రగతి; ప్రజల మానసిక, భౌతిక ఆరోగ్యం; కార్పొరెట్ల బలం; రాజకీయ వ్యవస్థ మొదలైనవాటి గురించి వెల్లడిస్తుంది. గ్రాస్ నేషనల్ హ్యాపీనెస్ ఇండెక్స్ ఆధారంగా సుస్థిర అభివృద్ధిలో భాగంగా ప్రగతికి సంబంధించిన అన్ని అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తూ ఆర్థికేతర అంశమైన శ్రేయస్సుకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని 'సెంటర్ ఫర్ భూటాన్ స్టడీస్' అభిప్రాయపడింది.

జీఎన్‌హెచ్‌ఐలో ఉండే ముఖ్యమైన అంశాలు (Domains):

1. ఆరోగ్యం
2. పర్యావరణ వైవిధ్యం, సామర్థ్యం
3. మానసిక శ్రేయస్సు
4. సామాజిక ప్రగతి
5. జీవన ప్రమాణాలు
6. కాలం వినియోగం
7. సాంస్కృతిక వైవిధ్యం, సామర్థ్యం
8. సుపరిపాలన 9. విద్య

1972లో జిగ్మే సింఘే వాంగ్‌చుక్ జీఎన్‌హెచ్ సూచీని ప్రతిపాదించారు. భూటాన్ ప్రగతికి ప్రామాణికంగా స్థూల దేశీయోత్పత్తికి బదులు గ్రాస్ నేషనల్ హ్యాపీనెస్ కొలమానాన్ని ఉపయోగించడం ప్రయోజనకరమని ఆయన సూచించారు. 33 సూచీలను 9 డొమైన్ల కింద విభజించి ఈ సూచీని రూపొందించారు. ఈ ఇండెక్స్‌ను రూపొందించడంలో ఆల్కైరా-ఫోస్టర్ పద్ధతిని వినియోగించారు. అన్ని డొమైన్లకు ఒకేవిధమైన వెయిటేజీ ఇచ్చారు. ప్రతి డొమైన్‌లోనూ లక్షిత సూచీలకు అధిక వెయిటేజీ, సెల్ఫ్ రిపోర్టెడ్ సూచీలకు తక్కువ వెయిటేజీ ఇచ్చారు.

జీఎన్‌హెచ్‌ఐ ప్రధానంగా నాలుగు అంశాలపై ఆధారపడి ఉంటుంది. **అవి:**

1. సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించడం
2. సాంస్కృతిక విలువలను కాపాడుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడం
3. సహజ పర్యావరణాన్ని పరిరక్షించడం
4. సుపరిపాలన స్థాపన

'సెంటర్ ఫర్ భూటాన్ స్టడీస్' సర్వేకు అవసరమైన ప్రశ్నావళిని మెరుగుపరుచుకొని గ్రాస్ నేషనల్ హ్యాపీనెస్ సర్వేను మొదటిసారిగా 2007 డిసెంబర్‌లో నిర్వహించింది. సర్వే బడ్జెట్‌లో వ్యయ పరిమితి దృష్ట్యా 12 జిల్లాల్లో మాత్రమే ఈ సర్వే నిర్వహించారు. ఇందులో శాంపుల్ పరిమాణాన్ని 950కి పరిమితం చేశారు. రెండో సర్వే ఏప్రిల్ 2010లో ప్రారంభమై డిసెంబర్ 2010లో ముగిసింది. అన్ని ప్రాంతాల్లో సర్వే నిర్వహించడం ద్వారా ఇందులో 7142 శాంపుల్స్ తీసుకున్నారు.

మాదిరి ప్రశ్నలు

వృద్ధి - వ్యూహాలు

1. కొనుగోలు శక్తి సమానత సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారెవరు?
ఎ) షుంపీటర్ బి) గుస్తావ్‌కాసల్
సి) మిస్సెస్ జోన్‌రాబిన్‌సన్
డి) మిర్డాల్
2. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగిత, అల్ప ఉద్యోగిత పక్కపక్కనే ఉంటాయని ఎన్నో ప్రణాళిక డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు?
ఎ) 3 బి) 5
సి) 8 డి) 10
3. మార్కిషియన్ నిరుద్యోగిత (బహిరంగ నిరుద్యోగిత) అనే పదాన్ని ఉపయోగించినవారెవరు?
ఎ) లూయిస్ బి) అమర్త్యసేన్
సి) మాల్థస్ డి) మిస్సెస్ జోన్ రాబిన్‌సన్
4. వృద్ధి - సంక్షేమం మధ్య ఉన్న సంబంధం విషయంలో కింది ఏ అంశాన్ని పరిమితిగా పేర్కొనలేం?
ఎ) అధిక ధరలు
బి) జనాభా పెరుగుదల
సి) అధిక శ్రామిక పనిగంటలు
డి) తక్కువ అనుత్పాదక వ్యయం
5. శ్రామిక దోపిడీ లేదా మిగులు విలువ రేటును ఏవిధంగా కనుగొనవచ్చు?
ఎ) మిగులు విలువ ÷ వేతనాలు (చర మూలధనం)
బి) మిగులు విలువ ÷ యంత్రాలపై వ్యయం (స్థిర మూలధనం)
సి) అవకాశ వ్యయం ÷ ద్రవ్య వ్యయం
డి) ఏదీకాదు
6. మార్క్స్ ఆర్థికాభివృద్ధి సిద్ధాంతాన్ని ఏ విధంగా చర్చించవచ్చు?
ఎ) మిగులు విలువ సిద్ధాంతం
బి) మూలధన కల్పన
సి) మూలధన సంక్షోభం
డి) పైవన్నీ
7. రోస్టోవ్ అభిప్రాయంలో జాతీయాదాయంలో నికర పెట్టుబడి 10 శాతానికి మించి ఉండే దశ దేన్ని సూచిస్తుంది?
ఎ) సాంప్రదాయ సమాజం
బి) పరిపక్వ దశకు గమనం
సి) ప్లవన దశ
డి) సామూహిక వినియోగం
8. భూమిపై పుట్టే ప్రతి బిడ్డ నరకానికి దారి తీస్తాడు అని ఎవరు పేర్కొన్నారు?
ఎ) రోస్టోవ్ బి) మిర్డాల్
సి) మాల్థస్ డి) ఎవరూ కాదు
9. 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనమిక్ రీసెర్చ్' ఆర్థికాభివృద్ధి సూచీ నిర్మాణంలో కింద పేర్కొన్న ఏ సూచీని పరిగణనలోకి తీసుకోలేదు?
ఎ) విద్యాస్థాయి
బి) సాంకేతిక విజ్ఞానం
సి) ఆరోగ్య వృద్ధి
డి) తలసరి స్థూల జాతీయోత్పత్తి
10. గినీ గుణకం విలువ 'ఒకటి' కావడం దేన్ని సూచిస్తుంది?
ఎ) సంపూర్ణ అసమానత్వం
బి) సంపూర్ణ సమానత్వం
సి) సంపద సమానత్వం
డి) తక్కువ నిరుద్యోగం
11. స్థూల దేశీయ పొదుపులో అధిక వాటాను కలిగిన రంగం ఏది?
ఎ) ప్రభుత్వ రంగం
బి) కార్పొరేట్ రంగం
సి) గృహ రంగం డి) విదేశీ వాణిజ్యం
12. హారడ్-డోమార్ ఆర్థికాభివృద్ధి నమూనాలో మూలధన కల్పన కింది ఏ దశను కలిగి ఉంటుంది?
ఎ) నిజ పొదుపు స్థాయిలో పెరుగుదల
బి) పరపతి సంస్థల ద్వారా పొదుపు సమీకరించడం
సి) పొదుపు మొత్తాన్ని పెట్టుబడిగా మార్చడం
డి) పైవన్నీ
13. ప్రచ్ఛన్న నిరుద్యోగితపై అంచనాలను రూపొందించినవారు?
ఎ) శకుంతల మెహ్రా
బి) అమర్త్యసేన్
సి) మార్షల్
డి) జె.బి. సే
14. మార్కెట్ వ్యవస్థ ద్వారా అభివృద్ధి చెందిన దేశాలేవి?
ఎ) మొదటి ప్రపంచ దేశాలు
బి) రెండో ప్రపంచ దేశాలు
సి) మూడో ప్రపంచ దేశాలు
డి) నాలుగో ప్రపంచ దేశాలు
15. 'గ్రామీణ ప్రాంతాల్లోని ప్రచ్ఛన్న నిరుద్యోగులను ఇతర రంగాలకు తరలిస్తే జాతీయాదాయం పెరుగుతుంది' అని పేర్కొన్నది?
ఎ) మాల్థస్ బి) రాగ్నార్ నర్క్స్
సి) జె.బి. సే డి) ఆడమ్ స్మిత్
16. వ్యవస్థాపకుల కొరత వల్ల కూడా పెట్టుబడి స్థాయి తక్కువగా ఉంటుందని పేర్కొన్నవారెవరు?
ఎ) షుంపీటర్ బి) రాగ్నార్ నర్క్స్
సి) లెబన్‌స్టీన్ డి) డోమార్
17. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడిదారీ వర్గం, కార్మిక వర్గం అనే రెండు వర్గాలుంటాయని పేర్కొన్నవారెవరు?
ఎ) లూయిస్ బి) నెల్సన్
సి) కార్ల్ మార్క్స్ డి) హారడ్

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) డి; 4) డి; 5) ఎ; 6) డి; 7) బి; 8) సి; 9) బి; 10) ఎ; 11) సి; 12) డి; 13) ఎ; 14) ఎ; 15) బి; 16) ఎ; 17) సి.

Fire wire is usually used for...

BANK EXAMS
COMPUTER AWARENESS

1. The primary job of an operating system is to manage:
a) Commands b) Users
c) Programmes d) Resources
e) Process
2. Short cut key for Page Break in Ms Word?
a) Ctrl + Enter b) Ctrl + B
c) Alt + Enter d) Alt + B
e) None of these
3. What is Cache RAM?
a) Extra memory used for overflow from your Hard Disk
b) A place to store secret information like passwords
c) It's the same as your Hard Disk Drive
d) Fast memory used for data that is accessed often
e) None of these
4. Fire wire is same as:
a) IEEE 1394 b) 56K Modem
c) Roadrunner d) DVD
e) All of the above
5. What are the limitations of the local user account?
a) Their passwords cannot be synchronized
b) They cannot be used to access resources across domains
c) They do not support the interactive logon process
d) All of the above
e) None of these
6. Which of the following are objects in an access data base?
a) Table, Form
b) Queries, Reports
c) Macros, Modules
d) All the above
e) None of these
7. Changing an existing document is called _____ the document
a) creating b) deleting
c) editing d) adjusting
e) None of these
8. In HTML document the tags:
a) Should be written in upper case
b) Should be written in lower case
c) Should be written in proper case
d) Can be written in both upper case or lower case
e) None of the above
9. The database language that allows you to access or maintain data in a database:
a) DCL b) DML c) DDL
d) DKL e) None of these
10. Which option enables automatic updates in destination documents?
a) Embedding b) Objects
c) Links d) Relationships
e) None of these
11. Which type of template provides a design concept, fonts & colour scheme for presentation?
a) Format b) Design
c) Content d) Normal
e) None of these
12. The two basic types of record access methods are _____ and _____.
a) sequential, random
b) direct, immediate
c) sequential, indexed
d) on-line, real-time
e) None of these
13. In Ms Word by default setting of Line spacing is?
a) 1 b) 1.15 c) 1.5
d) 2 e) 2.5
14. What technology of memory is Cache RAM usually?
a) DRAM b) SRAM
c) Flash d) EEROM
e) ESRAM
15. Fire wire is usually used for:
a) Connecting to the internet
b) Downloading Digital Camera pictures
c) Connecting to the printer
d) Interfacing to a Digital Camcorder
e) All of the above
16. What is the most common type of digital line used in most networks today?
a) 56 kbps b) T1 c) T3
d) E1 e) Asynchronous modems
17. The particular field of a record that uniquely identifies each record is called the
a) Key field b) Primary field
c) Master field d) Order field
e) None of these
18. Why has RAM been named like this?
a) Because it is read and write memory
b) Because it is volatile memory
c) Because any of the locations in chip can directly be selected for storing and retrieving data and instructions
d) Because it is non-volatile memory
e) None of these
19. What is a search engine?
a) A program that searches engines
b) A website that searches anything
c) A hardware component
d) A machinery engine that search data
e) None of these
20. The basic elements of a form or a report are called:
a) Controls b) Objects
c) Windows d) Properties
e) Icons
21. In Word, the mailing list is known as the _________.
a) data sheet b) source
c) data source d) sheet
e) work sheet
22. Gutter margin is _____ in Ms Word.
a) Bottom Margin
b) Top Margin c) Left Margin
d) Binding Margin
e) Right Margin
23. In Ms Word we can create same letter or mail etc., to many people with different address. This option is called?
a) Format painter b) Macro
c) Mail merge d) All of these
e) None of these
24. BIOS is stored in _______
a) DRAM b) SDRAM
c) Flash d) Hard Disk
e) None of these
25. What is USB?
a) A new Hard Disk standard
b) A new CD-ROM specification
c) A high-speed serial connection
d) A high-speed video connection
e) None of these
26. Which of the following is used for dial-up data communications protocols?
a) FTP b) TCP c) SLIP
d) PPP e) ATM
27. The _______ is a device that connects inputs to outputs.
a) Cross point b) Cross bar
c) Modem d) RAM
e) None of these
28. What does v link attribute mean?
a) visited link b) virtual link
c) very good link
d) active link e) None of these
29. Which of the following data type allows alphanumeric characters and special symbols?
a) Text b) Memo
c) Auto number
d) All of the above e) None
30. Which of the following is word processing software?
a) Word Perfect b) Easy Word
c) MS Word
d) All of the above e) None
31. Which is the shortcut key to jump to the first slide of the presentation?
a) Home b) Alt + Home
c) Ctrl + Home d) Shift + Home
e) None of these
32. To increase font size from the Keyboard we can use?
a) Alt + C b) Ctrl +Shift+ <
c) Ctrl+Shift+ > d) Ctrl+Pageup
e) None of these
33. What is the use of Track changes in Ms Word?
a) We can accept or Reject Changes doing by others
b) We can protect our file by password
c) We can protect our content from the formatting
d) All of the above e) None
34. Where does the PC store the programs when the power is off?
a) DRAM b) Cache
c) Hard Disk Drive
d) Monitor e) None of these
35. What does DDR stand for?
a) DRAM Double Rate
b) Data DRAM Rate
c) Double Data Rate
d) Double DRAM Rate
e) None of these
36. Translating the data format is the responsibility of which layer of the OSI model?
a) Application b) Physical
c) Data Link
d) Communication
e) Presentation
37. In _____ each packet of a message follows the same path from sender to receiver.
a) Circuit switching
b) Message switching
c) The virtual approach to packet switching
d) The datagram approach to packet switching
e) None of these
38. Data that is copied from an application is stored in the ___
a) Driver b) Terminal
c) Prompt d) Clipboard
e) None of these
39. HTML documents are saved in
a) Special binary format
b) Machine language codes
c) ASCII text
d) All of the above e) None
40. The command centre of access file that appears when you create or open the MS Access database file.
a) Database Window
b) Query Window
c) Design View Window
d) Switchboard e) None

KEY

1) d; 2) a; 3) d; 4) a; 5) d; 6) c; 7) d; 8) d; 9) c; 10) c; 11) b; 12) a; 13) b; 14) b; 15) d; 16) b; 17) a; 18) c; 19) b; 20) a; 21) c; 22) d; 23) c; 24) b; 25) c; 26) d; 27) c; 28) a; 29) a; 30) d; 31) c; 32) c; 33) d; 34) c; 35) c; 36) e; 37) c; 38) d; 39) c; 40) a..